ఈనాడు


విజయవాడ 26-12-2025 శుక్రవారం సిటీ సంపుటి 52 . సంచిక 136

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 14 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru




దిల్లీలో సదైవ్ అటల్ వద్ద వాజ్‌పేయీకి నివాళులర్పిస్తున్న మోదీ

ఆర్టికల్ 370 గోడను కూల్చేయడం గర్వకారణం

ప్రధాని నరేంద్ర మోదీ

లఖ్‌నవూలో 'ప్రేరణా స్థల్' ప్రారంభం

లఖ్‌నవూ: జమ్మూ కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్ 370 అనే గోడను కూల్చేయడాన్ని భాజపా గర్వకారణంగా భావిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. వారసత్వ రాజకీయాలు చేసే కాంగ్రెస్ పార్టీలో ఒక కుటుంబాన్నే కీర్తించడం దారుణమని వ్యాఖ్యానించారు. మాజీ ప్రధాని వాజ్‌పేయీ 101వ (మిగతా 11లో)

జన హృదయనేత.. వాజ్‌పేయీ

అటల్, ఎన్టీఆర్ సేవలు గుర్తుండిపోయేలా అమరావతిలో స్మృతివనాలు

దేశం కోసం మోదీ.. తెలుగు ప్రజల కోసం నేను ఆలోచిస్తున్నాం

చిల్లర వ్యక్తులతో రాజకీయాలు చేయాల్సి రావడం బాధగా ఉంది

సుపరిపాలన దినోత్సవ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు, అమరావతి: 'భారతదేశం గర్వించే నాయకుడు, యుగ పురుషుడు అటల్ బిహారీ వాజ్‌పేయీ. ప్రజారాజధాని అమరావతిలో ఆయన జయంతి ఉత్సవాలు జరపడం సంతోషంగా ఉంది. భారతదేశం ఉన్నంతవరకు భారతీయుల గుండెల్లో వాజ్‌పేయీ చిరస్థాయిగా నిలిచిపోతారు' అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. సుపరిపాలన దినోత్సవం, అటల్-మోదీ సుపరిపాలన యాత్ర ముగింపు సందర్భంగా అమరావతిలోని వెంకటాయపాలెంలో నూతనంగా నిర్మిస్తున్న అటల్‌జీ స్మృతివనంలో 15 అడుగుల వాజ్‌పేయీ విగ్రహాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ గురువారం ఆవిష్కరించారు. మొక్కలు నాటి, వాజ్‌పేయీ జీవిత చరిత్ర చిత్రప్రదర్శన తిలకించి.. పోస్టల్ స్టాంపు ఆవిష్కరించారు. బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడారు. 'వాజ్‌పేయీ, ఎన్టీఆర్ నాకు స్ఫూర్తి.. వీరిద్దరి చరిత్ర, చేసిన పనులు ప్రజలకు శాశ్వతంగా గుర్తుండేలా అమరావతిలో స్మృతివనాలు తీర్చిదిద్దుతాం. దేశ ప్రగతికి గట్టి పునాది వేసిన వ్యక్తి, దేశానికి సుపరిపాలనను పరిచయం చేసిన నాయకుడు వాజ్‌పేయీ. ఆయన నాయకత్వం కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా (మిగతా 10లో)

> వాజ్‌పేయీ పాలనలో దేశం కొత్త యుగంలోకి అడుగు పెట్టింది. పోఖ్రాన్ అణుపరీక్షల ద్వారా భారత్‌ను అణ్వాయుధ శక్తి ఉన్న దేశంగా నిలబెట్టారు.
> – శివరాజ్‌సింగ్ చౌహాన్, కేంద్రమంత్రి

> 60ఏళ్ల రాజకీయ జీవితంలో అవినీతి మచ్చ, శత్రువులు లేని ఏకైక వ్యక్తి వాజ్‌పేయీ. అటల్-మోదీ సుపరిపాలన యాత్ర విజయవంతం కావడంలో సీఎం చంద్రబాబు సహకారం మరువలేనిది.
> – పీవీఎన్ మాధవ్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు


వాజ్‌పేయీ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్, సీఎం చంద్రబాబు, కేంద్రమంత్రులు శ్రీనివాసవర్మ, పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రి నారాయణ, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఎమ్మెల్యేలు తదితరులు



మావోయిస్టు కేంద్రకమిటీ సభ్యుడు

గణేష్ ఎన్‌కౌంటర్

కొంధమాల్‌లో ఎదురుకాల్పులు.. ఆరుగురి మృతి

గణేష్ ఎలియాస్ హనుమంతుది నల్గొండ జిల్లా

ఈనాడు, నల్గొండ - న్యూస్‌టుడే, బ్రహ్మపుర నగరం, చండూరు: ఒడిశాలోని కొంధమాల్ జిల్లాలో జరిగిన ఎదురు కాల్పుల్లో ఆరుగురు మావోయిస్టులు చనిపోయారు. మృతుల్లో ఒకర్ని మావోయిస్టు కీలకనేత, కేంద్ర కమిటీ సభ్యుడు గణేష్ ఉయికే ఎలియాస్ హనుమంతు(69)గా గుర్తించారు. ఆయన స్వస్థలం తెలంగాణలోని నల్గొండ జిల్లా చండూరు మండలం పుల్లెంల. కొంధమాల్ జిల్లా చకాపద పోలీసుస్టేషన్ పరిధిలోని అడవుల్లో మావోయిస్టుల కదలికలపై నిఘావర్గాల సమాచారంతో సంయుక్త భద్రతా బలగాలు (ఎస్‌ఓజీ, సీఆర్పీఎఫ్, బీఎస్ఎఫ్) మొత్తం 23 బృందాలుగా అడవుల్లో గాలింపు చేపట్టాయి. గురువారం ఉదయం గంజాం జిల్లా సరిహద్దులోని గస్మా అడవుల్లో ఎస్‌ఓజీ బలగాలు, మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. కాసేపటికి ఆ ప్రాంతంలో గాలించి.. ఆరుగురు మావోయిస్టుల మృతదేహాలను గుర్తించారు. వీరిలో ఇద్దరు బుధవారమే మృతి చెందినట్లు చెబుతున్నారు. ఘటనా స్థలంలో రెండు ఇన్సాస్ రైఫిళ్లు, ఒక 303 రైఫిల్ స్వాధీనం చేసుకున్నారు. గణేష్ మినహా మిగిలిన వారి వివరాలు తెలియలేదు. అడవుల్లో మిగిలిన మావోయిస్టుల ఆచూకీ కోసం జల్లెడ పడుతున్నారు. ఎన్‌కౌంటర్‌లో ఆరుగురు మావోయిస్టులు మృతి చెందారని, వీరిలో ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు గణేష్ ఉయికే ఉన్నారని ఒడిశా డీజీపీ యోగేష్ బహదూర్ ఖురానియా చెప్పారు. అంతకుముందు బుధవారం రాత్రి గుమ్మా అడవుల్లో జరిగిన ఎదురుకాల్పుల్లో ఛత్తీస్‌గఢ్‌కు చెందిన (మిగతా 11లో)

కర్ణాటకలో ఘోర ప్రమాదం

ట్రావెల్స్ బస్సును ఢీకొన్న లారీ 10లో

అర్ధరాత్రి వేళ మంటల్లో చిక్కుకున్న ప్రయాణికులు

బస్సులో ఐదుగురితో పాటు లారీ డ్రైవర్ సజీవ దహనం

28 మందికి గాయాలు, ముగ్గురి పరిస్థితి విషమం


భూదేవీ కాంప్లెక్స్ క్యూలైన్‌లో టోకెన్ల కోసం ఇనుప గ్రిల్స్‌ను దూకి మరీ వెళ్తున్న భక్తులు

తిరుమల కిటకిట

వరుస సెలవులతో పోటెత్తిన భక్తులు

తిరుమల, తిరుపతి (తితిదే), న్యూస్‌టుడే: తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి సర్వదర్శనానికి భక్తుల రద్దీ గురువారం భారీగా పెరిగింది. వరుస సెలవులతో తిరుమలలో ఎక్కడ చూసినా పెద్దసంఖ్యలో భక్తులు కనిపించారు. సర్వదర్శన భక్తులు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2, నారాయణగిరి షెడ్లు నిండిపోయి.. క్యూలైన్‌లో శిలాతోరణం వరకూ వేచి ఉన్నారు. వీరికి 16 గంటల్లో, రూ.300 టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో శ్రీవారి దర్శనం (మిగతా 3లో)







MRP ₹ 4,490
COMBO PRICE ₹2026
Induction Prime 1800W + Stainless Steel Cooker 3 Ltr Cute
MRP ₹ 5,720
COMBO PRICE ₹2026
Swifty 550W Mixer Grinder 3 Jar + 3 Ltr Smart Cooker Outer Lid
MRP ₹ 4,215
COMBO PRICE ₹2026
Fav Tawa 280 + Favorite Pressure Cooker 3 Ltr Outer Lid Induction Base + Favorite Pressure Cooker 5 Ltr Outer Lid Induction Base
Pigeon®
MRP ₹ 5,954
COMBO PRICE ₹2026
Cast Iron Flat Tawa 280 + Ayush 2 Burner Black
MRP ₹ 3,725
COMBO PRICE ₹2026
Inox Pressure Cooker 3.5 Ltr + 5 Ltr Outer Lid Induction Base Stainless Steel
MRP ₹ 4,650
COMBO PRICE ₹2026
Electric Rice Cooker 1.8 Ltr Single Pot + Wonder Cast 280 Tawa
India's Choice Sale
MRP ₹ 3,990
COMBO PRICE ₹2026
EVA Infrared Cooktop 2000W
MRP ₹ 4,715
COMBO PRICE ₹2026
1.5 Ltr Swift Plus Multi-Cook Kettle - Blue + Popup Toaster + Inox Hydra Water Bottle 900 ml
ఫ్లాట్ ధర @ ₹2026*
*T&C Apply
MRP ₹ 4,695
COMBO PRICE ₹2026
Electric Rice Cooker Inox Pro With Steamer 1.8LDX
MRP ₹ 5,995
COMBO PRICE ₹2026
OTG 14 Ltr
Black Diamond Chimney 60cm + Glasstop Sleek 4 Burner Gas Stove
MRP ₹ 29,989
COMBO PRICE ₹14,995
MRP ₹ 4,990
COMBO PRICE ₹2026
Idiyappam Maker/Noodle Maker + CerraSteel Forged Ceramic Tawa 280
MRP ₹ 4,770
COMBO PRICE ₹2026
Nutri Blender 400W 2 Jar + 1.2 Ltr Multipurpose Kettle
STOVEKRAFT®
Central Andhra: Vijayawada: Sakti Enterprises: 9700755950 Shree Lakshmi Sai Enterprises: 9963675725
Sales: West Godavari: 9985264716 Krishna Dist: 9963455502 Guntur, Prakasham, Nellore: 9550866753 State Head: 9885733308
For Corporate and Bulk Enquiry: 9949242359
Pigeon Exclusive Stores: Fortune MG Road: 8664066099 Besent Road: 8664065611 Ramavarappadu: 8664060497
Machavaram: 8663533396 Satyanaraynapuram: 8663501253 Nellore: GNT Road: 8614014897 Mogalrajupuram: 8663500757
Satyanaraynapuram: 8663501253 Mogalrajupuram: 8663500757 Guntur: Broadaipeta: 8633501418
Open your own Pigeon Exclusive Store, call: 9959011896
Locate your nearest Pigeon Exclusive Store
For any service related queries, please contact: 6364914202

శ్రీవాణి కోటా ఇక ఆన్‌లైన్‌లోనే?

- జీపీఎస్ ఆధారంగా భక్తుల సెల్‌ఫోన్ల నుంచే రోజువారీ బుకింగ్
- జనవరి నుంచి అమలుచేసే యోచనలో తితిదే

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమలలో ఆఫ్‌లైన్ విధానంలో జారీచేస్తున్న శ్రీవాణి దర్శన టికెట్ల కోటాను త్వరలో ఆన్‌లైన్‌లోకి మార్చేందుకు తితిదే ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. సిఫార్సు లేఖలకు విపరీతమైన డిమాండ్ ఉండటంతో భక్తులు రూ.10,500 శ్రీవాణి దర్శన టికెట్ల కోసం పోటీపడుతున్నారు. మూడునెలల ముందుగా ఆన్‌లైన్‌లో రోజుకు 500 టికెట్ల చొప్పున అందుబాటులో ఉంచుతుండగా క్షణాల్లో బుక్ చేసుకుంటున్నారు. మరోవైపు ఆఫ్‌లైన్‌లో ఏరోజుకారోజు తిరుమలలో 800, తిరుపతి విమానాశ్రయంలో మరో 200 టికెట్లను జారీ చేస్తున్నారు.

శ్రీవాణి దర్శన టికెట్ల కోసం నేరుగా తిరుమలకు వచ్చే భక్తుల సంఖ్య క్రమేణా పెరుగుతోంది. అన్నమయ్య భవనం ఎదుట ఉన్న ఆఫ్‌లైన్ జారీ కేంద్రం వద్ద ఉదయం ఆరు గంటలకు టికెట్లు ఇస్తుండగా భక్తులు ముందురోజు రాత్రి ఏడు గంటల నుంచే వేచి ఉంటున్నారు. అప్పటివరకు గదులు దొరక్క కుటుంబ సభ్యులందరూ ఆరుబయట వేచిఉంటూ ఇబ్బంది పడుతున్నారు. మరోవైపు ఈ కోటా పరిమితంగా ఉండటంతో టికెట్లు రాని భక్తులు ఆందోళనకు దిగడం పరిపాటిగా మారింది. ఎయిర్‌పోర్ట్‌లోనూ భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తితిదే అధికారులు గుర్తించారు.

★ శ్రీవాణి టికెట్ల జారీలో నెలకొంటున్న ఇబ్బందులపై తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడితోపాటు ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈవో వెంకయ్యచౌదరిలకు తరచూ ఫిర్యాదులు అందుతున్నాయి. ఈ నేపథ్యంలో సమస్య పరిష్కారం కోసం ఓ అధ్యయన కమిటీని నియమించి నివేదిక తీసుకున్నారు. ఆఫ్‌లైన్‌లో శ్రీవాణి దర్శన టికెట్ల జారీతో ఇబ్బందులు కొనసాగే అవకాశం ఉందని కమిటీ స్పష్టం చేసిన నేపథ్యంలో ఈ విధానం రద్దు చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది.

జీపీఎస్ ఆధారంగా కేటాయింపు

ఆఫ్‌లైన్ విధానాన్ని రద్దు చేస్తే ఆ టికెట్లను భక్తులకు ఏవిధంగా కేటాయించాలనే దానిపై నిపుణులతో మరో కమిటీని నియమించారు. దాని సిఫార్సుల మేరకు ఏరోజుకారోజు తిరుమలకు వచ్చినవారు మాత్రమే ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసేలా వినూత్న సాంకేతిక విధానం అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తున్నారు. ఇందులో భాగంగా భక్తులు నేరుగా సెల్‌ఫోన్ నుంచే కొనుగోలు చేసే అవకాశం కల్పించనున్నారు. భక్తుడు తిరుమలలో ఉన్నట్లు జీపీఎస్ నిర్ధారించాకే, శ్రీవాణి టికెట్ ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసేందుకు అనుమతి లభిస్తుంది. ఇతర ప్రాంతాల నుంచి ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసేందుకు వీలు పడదు. దీంతో భక్తులు క్యూలైన్‌లో వేచి ఉండకుండానే టికెట్లను కొనుగోలు చేయవచ్చు. ఈ విధానంలో ఎదురయ్యే లోటుపాట్లను పూర్తిస్థాయిలో పరిశీలించిన అనంతరం జనవరి నుంచి అమలు చేయాలని తితిదే ఉన్నతాధికారులు భావిస్తున్నట్లు సమాచారం.

టికెట్ల జారీ కేంద్రం వద్ద భక్తుల ఆందోళన

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమలలోని శ్రీవాణి దర్శన టికెట్ల జారీ కేంద్రం వద్ద భక్తులు గురువారం తెల్లవారుజామున ఆందోళన చేపట్టారు. అన్నమయ్య భవనం ఎదురుగా ఉన్న ఈ కేంద్రం వద్ద రాత్రి నుంచే భక్తులు వేచిఉన్నారు. తెల్లవారుజామున రెండుకల్లా రద్దీ పెరిగిపోవడంతో కౌంటర్ సిబ్బంది 800 టోకెన్లను నిర్దేశిత సమయంకన్నా ముందుగానే జారీచేశారు. దీంతో టికెట్లు అందని భక్తులు రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు. తిరుమల టూటౌన్ సీఐ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని చెప్పి సముదాయించడంతో గొడవ సద్దుమణిగింది.


శ్రీవాణి టికెట్ల జారీ కేంద్రం వద్ద భక్తులతో మాట్లాడుతున్న సీఐ శ్రీరాముడు తదితరులు

3 రోజులపాటు శ్రీవాణి టికెట్ల జారీ రద్దు

తిరుమలలో నెలకొన్న అనూహ్య రద్దీ కారణంగా ఈనెల 27, 28, 29వ తేదీలకు సంబంధించి శ్రీవాణి ఆఫ్‌లైన్ టికెట్ల జారీని తితిదే రద్దు చేసింది. తిరుమలతో పాటు రేణిగుంట విమానాశ్రయంలో శ్రీవాణి ఆఫ్‌లైన్ టికెట్లు జారీ చేయబోమని, ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని దర్శన ప్రణాళికలు రూపొందించుకోవాలని భక్తులకు తితిదే విజ్ఞప్తి చేసింది.


తిరుపతిలోని భూదేవి కాంప్లెక్స్ ప్రత్యేక కౌంటర్లలో సర్వదర్శన టోకెన్ల కోసం భారీగా విచ్చేసిన శ్రీవారి భక్తులు

తిరుమల కిటకిట

(మొదటి పేజీ తరువాయి)

లభిస్తోంది. తాగునీరు, అన్నప్రసాదాలు, పాలు, టీలను శ్రీవారి సేవకులు నిరంతరాయంగా సరఫరా చేస్తున్నారు. తితిదే అధికారులు ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. క్యూలైన్లు నిండిపోవడంతో భక్తులు శుక్రవారం ఉదయం రావాలంటూ తితిదే సూచిస్తోంది. గదుల కోసం రద్దీ కొనసాగుతోంది. వసతి దొరకనివారు యాత్రికుల సముదాయాలు, శ్రీవారి ఆలయం, ఇతర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సాధారణ షెడ్లలో సేద తీరుతున్నారు.

★ బుధవారం 73,524 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా రూ.4.88 కోట్ల కానుకలు వచ్చాయి.

స్వల్ప తోపులాటలు: తిరుపతిలో సర్వదర్శన టోకెన్ల కోసం భక్తులు ఉదయం నుంచే బారులు తీరారు. శ్రీనివాసం, భూదేవి కాంప్లెక్స్, విష్ణునివాసం వద్ద 10 వేల సర్వదర్శన టోకెన్లు ఇవ్వగా భక్తులు 40 వేలకు వచ్చినట్లు అంచనా. భూదేవి కాంప్లెక్స్ వద్ద భక్తుల తాకిడి ఎక్కువగా కనిపించింది. శ్రీవారి మెట్టు మార్గంలో కాలినడక వెళ్లే భక్తులకు జారీచేసే టోకెన్లు అయిపోగానే సర్వదర్శన టోకెన్ల కేంద్రాలవైపు దూసుకొచ్చారు. దీంతో తోపులాట చోటు చేసుకొని, భక్తులు ఇబ్బందులు పడ్డారు. చంటిపిల్లల తల్లులు, వృద్ధులు, మహిళలకు కాసేపు ఊపిరాడని పరిస్థితులు ఎదురయ్యాయి. మరోవైపు అలిపిరి తనిఖీ కేంద్రం నుంచి నంది కూడలి వరకు భక్తుల వాహనాలు స్తంభించాయి.

శ్రీవారిని దర్శించుకున్న ఏపీ హైకోర్టు న్యాయమూర్తి


ఆలయం ఎదుట కుటుంబ సభ్యులతో జస్టిస్ ఎన్.హరినాథ్

తిరుమల, న్యూస్‌టుడే: ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.హరినాథ్ గురువారం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్‌లో కుటుంబ సభ్యులతో కలిసి మూలమూర్తిని దర్శించుకోగా.. రంగనాయకుల మండపంలో వేదపండితులు ఆశీర్వచనం, అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.

వైకుంఠ ద్వార దర్శనాలకు అదనపు లడ్డూల తయారీ


కౌంటర్లలోని లడ్డూలను పరిశీలిస్తున్న తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు. చిత్రంలో పోటు పేష్కార్ మునిరత్నం

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 30 నుంచి జనవరి 8వరకు జరగనున్న వైకుంఠ ద్వార దర్శనాలకు తరలివచ్చే భక్తుల కోసం అదనపు లడ్డూలు సిద్ధం చేస్తున్నట్లు తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. గురువారం లడ్డూ ప్రసాదాల విక్రయ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. లడ్డూల బరువు చూసి, కౌంటర్‌లోని కియోస్క్‌ను పరిశీలించారు. ఆధార్ ద్వారా యూపీఐ చెల్లింపులు చేసి లడ్డూలు పొందే విధానం పరిశీలించి, భక్తుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. అనంతరం బూందీ పోటుకు వెళ్లి అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ.. లడ్డూల నాణ్యత, రుచి, క్యూలైన్లలో వేచి ఉండే సమయం తగ్గించడంపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేసినట్లు చెప్పారు. రాబోయే రోజుల్లో లడ్డూల తయారీని పెంచి, భక్తులు వాటిని వేగంగా పొందే ఏర్పాట్లు చేస్తామన్నారు. తనిఖీల్లో శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, పోటు పేష్కార్ మునిరత్నం, ఇతర అధికారులు పాల్గొన్నారు.


గ్రేటర్ విజయవాడతోనే భవిష్యత్తు

- ముఖ్యమంత్రికి ఎంపీ శివనాథ్, ఎమ్మెల్యే గద్దె విజ్ఞప్తి
- సానుకూలంగా స్పందించిన చంద్రబాబు

ఈనాడు, అమరావతి: గ్రేటర్ విజయవాడను ఏర్పాటుచేసి ఈ ప్రాంత ప్రజల దశాబ్దాల కలను సాకారం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబుకు.. ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ విజ్ఞప్తి చేశారు. సచివాలయంలో ముఖ్యమంత్రిని గురువారం కలిసి గ్రేటర్ విజయవాడపై నివేదిక సమర్పించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న గ్రేటర్ విజయవాడ ప్రతిపాదనపై చర్యలు తీసుకోవాలని కోరారు. పెనమలూరు, మైలవరం, గన్నవరం నియోజకవర్గాల పరిధిలోని 75 గ్రామాల్లో చాలావరకూ ఇప్పటికే అనధికారికంగా నగరంతో కలిసే ఉన్నాయంటూ.. ఆ వివరాలను ముఖ్యమంత్రికి ఎంపీ శివనాథ్ చూపించారు.

మహానగరంతో ప్రయోజనాలెన్నో

గ్రేటర్ విజయవాడ సాకారంతో అనేక సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని ముఖ్యమంత్రికి సమర్పించిన నివేదికలో పేర్కొన్నారు.


గ్రేటర్ విజయవాడ గురించి ముఖ్యమంత్రితో మాట్లాడుతున్న ఎంపీ శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

★ విజయవాడను ఆనుకుని ఉన్న గ్రామీణ ప్రాంతాలు, మున్సిపాలిటీల్లో.. చెత్త నిర్వహణ దారుణంగా ఉంది. డ్రైనేజీ కాలువలు, మురుగునీటి వ్యవస్థ, వర్షపు నీటి డ్రెయిన్లు లేవు.

★ శివార్లలో జనాభా పెరుగుతున్నా సరైన తాగునీటిని అందించే పరిస్థితి లేదు.

★ సరైన రహదారులు, వీధిదీపాలు, ఆధునిక మౌలిక వసతులు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

★ ప్రస్తుతం శివార్లలో అనధికార లేఔట్లు, రియల్ కార్యకలాపాలపై నియంత్రణ లేదు. అక్రమ నిర్మాణాలు పెరుగుతున్నాయి. గ్రేటర్‌తో.. సరైన నిబంధనలు, మాస్టర్ ప్లాన్‌తో నగరాభివృద్ధి చేసుకునే వీలు కలుగుతుంది.

★ గ్రేటర్‌గా మారిస్తే.. పారిశ్రామిక కారిడార్లు, ఐటీ పార్కులు, లాజిస్టిక్ హబ్‌లు, పర్యాటక పెట్టుబడులకు భారీగా అవకాశాలు పెరుగుతాయి. ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి.

★ ప్రస్తుతం ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల మధ్య ఉన్న పరిపాలనా విభజన వల్ల పోలీసు, రవాణా, శాంతి భద్రతలు, విమానాశ్రయ నిర్వహణ వంటి అంశాల్లో ప్రొటోకాల్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వీటన్నింటికీ పరిష్కారం దొరుకుతుంది.

ముఖ్యమంత్రి స్పందన

గ్రేటర్ విజయవాడ ఏర్పాటుపై ముఖ్యమంత్రి చంద్రబాబు సానుకూలంగా స్పందించారని ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ 'ఈనాడు'కు తెలిపారు. వెంటనే గ్రేటర్ ప్రతిపాదనలపై దృష్టి సారించాలంటూ సీఎంఓ సిబ్బందిని ఆదేశించారన్నారు.

'ఉపాధ్యాయ సంఘాలను చర్చలకు ఆహ్వానించాలి'

ఈనాడు, అమరావతి: ఉపాధ్యాయుల సమస్యలపై సంఘాలను విద్యాశాఖ మంత్రి లోకేశ్ చర్చలకు పిలవాలని ఎస్టీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రఘునాథరెడ్డి, సాయిశ్రీనివాస్ కోరారు. "విద్యాశాఖలో రోజుకో ఉత్తర్వు, పూటకో నిర్ణయం వల్ల ఉపాధ్యాయులపై తీవ్రమైన ఒత్తిడి నెలకొంది. ఈ సమస్యలపై ఉపాధ్యాయ సంఘాలతో మంత్రి తక్షణమే చర్చించాలి" అని పేర్కొన్నారు.

నేటి నుంచి తిరుపతిలో 'భారతీయ విజ్ఞాన సమ్మేళనం'

- హాజరుకానున్న చంద్రబాబు, మోహన్ భాగవత్

ఈనాడు డిజిటల్, తిరుపతి; తిరుపతి (విద్య), న్యూస్‌టుడే: 'విజ్ఞాన భారతి' ఆధ్వర్యంలో కేంద్రం సహకారంతో నిర్వహిస్తున్న 'భారతీయ విజ్ఞాన సమ్మేళనం (బీవీఎస్)-2025' ఈ నెల 26 నుంచి 29 వరకు తిరుపతిలోని సంస్కృత విశ్వ విద్యాలయంలో అట్టహాసంగా జరగనుంది. మన పూర్వీకులు అందించిన శాస్త్ర విజ్ఞానాన్ని నేటి ఆధునిక అవసరాలకు తగినట్లుగా మలచుకోవడమే ఈ సమ్మేళనం ప్రధాన ఉద్దేశం. శాస్త్రీయ అంశాలను ఆంగ్ల భాషకే పరిమితం చేయకుండా మాతృభాషల్లోనూ విస్తరింపజేయడం మరో ముఖ్య లక్ష్యం. సదస్సులో వివిధ విభాగాలకు సంబంధించి పత్ర సమర్పణలు, చర్చలు జరగనున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భాగవత్, కేంద్ర మంత్రులు గజేంద్రసింగ్ షెకావత్, భూపతిరాజు శ్రీనివాస వర్మ, ఇస్రో మాజీ ఛైర్మన్ డా.ఎస్.సోమనాథ్ వంటి ప్రముఖులు హాజరుకానున్నారు. దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాలకు చెందిన 1,216 మంది ప్రతినిధులు పాల్గొననున్నారు.


అన్నప్రసాదం స్వీకరిస్తున్న బీఆర్ నాయుడు, మోహన్ భాగవత్, వెంకయ్యచౌదరి

తిరుమల చేరుకున్న మోహన్ భాగవత్


శ్రీవారి దర్శనార్థం ఆర్‌ఎస్‌ఎస్ అధినేత మోహన్ భాగవత్ గురువారం తిరుమలకు చేరుకున్నారు. స్థానిక అతిథిగృహం వద్ద తితిదే అధికారులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఆర్‌ఎస్‌ఎస్ అధినేత.. శ్రీభూవరాహ స్వామివారిని దర్శించుకున్నారు. తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు, అదనపు ఈవో వెంకయ్య చౌదరితో కలిసి మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ కేంద్రంలో అన్నప్రసాదం స్వీకరించి నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. మోహన్ భాగవత్ శుక్రవారం శ్రీవారిని దర్శించుకోనున్నారు.

వీఆర్‌ఎస్ నిర్ణయం వెనక్కి తీసుకుంటే తీవ్ర చర్యలుంటాయని బెదిరించారు

- మాజీ ఐఏఎస్ ప్రవీణ్ ప్రకాశ్ వెల్లడి

ఈనాడు, అమరావతి: స్వచ్ఛంద పదవీ విరమణ (వీఆర్‌ఎస్) దరఖాస్తు వెనక్కి తీసుకుంటే తీవ్ర పరిణామాలుంటాయని అప్పట్లో తనను కొందరు బెదిరించారని మాజీ ఐఏఎస్ అధికారి ప్రవీణ్ ప్రకాశ్ తెలిపారు. ఒక యూట్యూబ్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ విషయం చెప్పారు. "సర్వీసు నుంచి వెళ్లిపోయావు. అదే నీకు శిక్ష. మళ్లీ సర్వీసులోకి వస్తానని డ్రామాలు చేస్తే.. తీసుకుంటాం. కానీ, ఆ తర్వాత తీవ్రమైన చర్యలుంటాయి" అని కొందరు తనకు బెదిరింపు సందేశాలు పంపినట్టు ప్రవీణ్ ప్రకాశ్ పేర్కొన్నారు. అయితే వారి పేర్లను ఆయన వెల్లడించలేదు. బెదిరింపులు వచ్చిన తర్వాత కూడా తాను అప్పటి సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్‌ను కలిసి తన మనసులో మాట చెప్పానని, ఆయన కూడా వద్దని సలహా ఇచ్చారని తెలిపారు. నువ్వు దరఖాస్తు చేసినా ప్రభుత్వం తిరస్కరిస్తుందని నీరబ్‌కుమార్ తనతో చెప్పినట్లు ప్రవీణ్ ప్రకాశ్ పేర్కొన్నారు. "2024లో కూటమి అధికారంలోకి వచ్చాక నాకు పోస్టింగ్ ఇవ్వలేదు. 21 రోజుల్లోనే వీఆర్‌ఎస్‌కి దరఖాస్తు చేశాను. నా నిర్ణయం మా ఇంట్లో ఎవరికీ ఇష్టం లేదు. నా తల్లి దండ్రులు తీవ్ర ఒత్తిడికి లోనయ్యారు. అది చూడలేక వీఆర్‌ఎస్ నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని ప్రభుత్వాన్ని కోరాలనుకున్నాను" అని తెలిపారు.

మంచు గుప్పిట్లో మన్యం


కించాయిపుట్టులో దట్టంగా కమ్ముకున్న పొగమంచు

చింతపల్లి, న్యూస్‌టుడే: అల్లూరి సీతారామరాజు జిల్లాలో చలి తీవ్రత కొనసాగుతోంది. జి.మాడుగులలో గురువారం ఉదయం 5.2 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ అప్పలస్వామి తెలిపారు. అరకులోయలో 5.9, చింతపల్లిలో 7, ముంచంగిపుట్టులో 7.7, పాడేరులో 8.7, పెదబయలులో 9.6, హకుంపేటలో 10.1 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని చెప్పారు. మరోవైపు ముంచంగిపుట్టు మండలం కించాయిపుట్టు, గుమ్మాఘాటీ రోడ్డు ప్రాంతంలో దట్టమైన పొగమంచు కమ్ముకోవడంతో వాహన రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి.



ఇంట్లో ఉండే క్యాన్సర్ కారక వస్తువులు

మనఇళ్లలో మనకు తెలియకుండానే క్యాన్సర్ కారకమయ్యే పలు వస్తువులను వినియోగిస్తుంటాం. అటువంటి వాటిలో కొన్ని.. నాన్‌స్టిక్ పాన్‌లు, సువాసనలు వెదజల్లే కొవ్వొత్తులు, సీల్డ్ డబ్బాల్లోని ఆహారాలు, పానీయాలు, కూరగాయలు కత్తిరించుకోవడానికి వాడే ప్లాస్టిక్ బోర్డులు, ప్లాస్టిక్ నీళ్ల సీసాలు, అల్యూమినియం ఫాయిల్, అతిగా శుద్ధి చేసిన ఆహారపదార్థాలు, ప్లాస్టిక్ డబ్బాలు, అతిగా శుద్ధి చేసిన వంటనూనెలు.

– డేవిడ్ వోల్ఫ్, ఇన్‌ఫ్లుయెన్సర్

గ్రహం అనుగ్రహం

26–12–2025 శుక్రవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం; హేమంత రుతువు, పుష్య మాసం, శుక్లపక్షం

షష్ఠి: ఉ. 10-05 తదుపరి సప్తమి
పూర్వాభాద్ర: తె. 5-35 తదుపరి ఉత్తరాభాద్ర
వర్జ్యం: మ. 12-36 నుంచి 2-11 వరకు
అమృత ఘడియలు: రా. 10-03 నుంచి 11-37 వరకు
దుర్ముహూర్తం: ఉ. 8-43 నుంచి 9-26 వరకు తిరిగి మ. 12-21 నుంచి 1-05 వరకు
రాహుకాలం: ఉ. 10-30 నుంచి 12-00 వరకు
సూర్యోదయం: ఉ.6.32; సూర్యాస్తమయం: సా.5.28

చలి - పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
ఆదిలాబాద్	8.2	28.3
మెదక్	8.8	30.0
హైదరాబాద్	13.5	28.0
విజయనగరం	16.0	27.0
కర్నూలు	16.3	31.6
అనంతపురం	16.5	29.7
శ్రీకాకుళం	17.0	27.0
రాజమహేంద్రవరం	17.0	33.0
విశాఖపట్నం	17.6	27.8
కడప	18.0	28.0
విజయవాడ	18.0	29.4
నరసాపురం	19.6	31.6
గుంటూరు	20.0	30.0
ఒంగోలు	20.4	30.3
నెల్లూరు	20.8	29.0
తాడేపల్లిగూడెం	26.6	29.0


ఈనాడు

పసిబిడ్డలతో అమానుష వ్యాపారం!

దేశీయంగా పలు ప్రాంతాల్లో తిష్ఠవేసిన నేర ముఠాలు... తల్లి పొత్తిళ్లలో కేరింతలు కొట్టాల్సిన చిన్నారులను అంగడి సరకులుగా మారుస్తున్నాయి. నిరుపేద కుటుంబాల దయనీయ పరిస్థితులను ఆసరా చేసుకుని పదోపరకో ఇచ్చి వారి పిల్లలను అవి తన్నుకుపోతున్నాయి. అమాయక చిన్నారులను అపహరిస్తున్నాయి. ఒకవేళ పట్టుబడినా బెయిలుపై బయటికొచ్చి తిరిగి అదే దందాను యథేచ్ఛగా కొనసాగిస్తున్నాయి. ఉత్తరాది నుంచి బాలలను తెచ్చి బేరం పెడుతున్న పన్నెండు మందిని విజయవాడ పోలీసులు కొద్ది రోజుల కిందట అరెస్టు చేశారు. ఏడాదిన్నరలో ఆ దుర్మార్గులు 28మంది పిల్లలను అమ్మినట్లు తేలింది. హైదరాబాద్‌లోనూ ఇలాంటి బృందమొకటి తాజాగా పోలీసులకు చిక్కింది. ఈ రెండింటిలో ప్రధాన సూత్రధారులు గతంలో రెండు మూడుసార్లు జైలుకెళ్లినా బుద్ధి మార్చుకోనివాళ్లే. అంతకుముందు హైదరాబాద్‌లో దొరికిన ముఠా ఒకటి రెండుమూడేళ్లలో 60 మంది పసివారిని విక్రయించినట్లు తెలిసింది. తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్, పశ్చిమ్ బెంగాల్, రాజస్థాన్, ఒడిశా వంటి చోట్లా ఇలాంటి అమానుష ఉదంతాలెన్నో వెలుగు చూశాయి. అభంశుభం తెలియని పిల్లలను అపహరించి సొమ్ముచేసుకుంటూ కన్నవారికి గర్భశోకం మిగుల్చుతున్నారీ కిరాతకులు. కటకటాల వెనక్కి వెళ్లొచ్చినా వాళ్లు మళ్లీ మళ్లీ అవే పాడుపనులకు తెగబడుతున్నారంటే- నేరగాళ్ల బారినుంచి బాలభారతానికి భద్రత కల్పించడంలో వ్యవస్థ ఎంతగా అసమర్థమవుతోందో అర్థమవుతోంది!

ఇండియాలో ప్రతి ఎనిమిది నిమిషాలకు ఒక చిన్నారి తప్పిపోతున్నట్లు అంచనా. ఆ అభాగ్యుల్లో చాలామంది ఆచూకీ ఎప్పటికీ తెలియట్లేదు. బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, ఆసుపత్రులు, మురికివాడలు, ఇతర జనసమ్మర్ద ప్రాంతాల్లో మాటువేస్తున్న రాక్షస మూకలు అదనుచూసుకుని పిల్లలను ఎత్తుకుపోతున్నాయి. అన్నెంపున్నెం ఎరగని ఆ బాలలతో కొన్నిచోట్ల భిక్షాటన చేయిస్తుంటే- మరికొన్ని ప్రాంతాల్లో వారిని మత్తుమందులూ ఆయుధాల రవాణాకు, హేయనేరాలకు వాడుకుంటున్నాయి. పిల్లల అవయవాలనూ కాజేస్తున్నాయి. అమ్మాయిలను బలవంతంగా పడుపువృత్తిలోకి దింపుతున్నాయి. ఈ రాకాసిగణాల ఆగడాలపై సుప్రీంకోర్టు మొన్న మార్చిలో తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. చిన్నారుల అక్రమ రవాణా కేసులను త్వరగా కొలిక్కి తేవాలని హైకోర్టులను ఆదేశించింది. దత్తత ప్రక్రియలో లోపాల వల్ల పిల్లలులేనివారు దొడ్డిదారిని ఆశ్రయిస్తున్నారని వ్యాఖ్యానించిన న్యాయపాలిక- సంబంధిత విధానాన్ని సరళీకరించాల్సిన ఆవశ్యకతనూ ఇటీవల గుర్తుచేసింది. ఆ మేరకు చట్టపరంగా తగిన సంస్కరణలకు చొరవ తీసుకోవడం ప్రభుత్వాల వంతు!

అధికారిక ప్రక్రియల్లో జాప్యం, సంక్లిష్ట నిబంధనల కారణంగా చాలామంది అనాథ బాలబాలికలు ఒకపట్టాన దత్తతకు అందుబాటులోకి రావట్లేదు. దాంతో పెంచుకోవడానికి పిల్లల కోసం అభ్యర్థించే జంటలు సగటున మూడున్నరేళ్లు వేచి చూడాల్సి వస్తోంది. పైగా కొందరు దంపతులు ఒకటి రెండేళ్ల లోపు పిల్లల వైపే మొగ్గుచూపుతున్నారు. వారి ఆశలను పెట్టుబడిగా మార్చుకుంటున్న నేర మూకలు- పేద లోగిళ్ల నుంచి కొనుక్కువచ్చిన, అపహరించి తెచ్చిన పసిబిడ్డలతో అమానవీయ వ్యాపారం చేస్తున్నాయి. చిన్నారుల అక్రమ రవాణా అనేది నాగరిక సమాజంలో సహించరానిది. దానికి పాల్పడే ప్రబుద్ధుల పీచమణచడం ప్రభుత్వాల ప్రాథమిక కర్తవ్యం. ఆయా ముఠాల ఆనుపానులను వేగంగా గుర్తించి, వాటికి అరదండాలేసి, వెంటనే శిక్షలుపడేలా చూడటమెంత అవసరమో- ఎన్నో సామాజిక సమస్యలకు కారణమవుతున్న పేదరికాన్ని పారదోలడమూ అంతే ప్రధానం!



నిజమైన దేశభక్తి అనేది చాలా ఉన్నతమైన భావన. అది మనిషిని నిస్వార్థమైన చర్యలకు ప్రేరేపిస్తుంది. స్వేచ్ఛ అంటే నిర్భయంగా ఉండటమే. అలా ఉండగలిగినప్పుడే న్యాయం కోసం పోరాడగలం.

– పండిత్ మదన్ మోహన్ మాలవీయ

కృతజ్ఞత... యోగమార్గం

మనిషి జీవితంలో భావోద్వేగాలకు కీలకమైన స్థానం ఉంది. వాటిలో కృతజ్ఞత అనేది అత్యంత ఉన్నతమైన భావన. కృతజ్ఞతలు... హృదయపూర్వకంగా చెప్పే ధన్యవాదాలు. మనకు ఉపకారం చేసినవారికి మనసారా ధన్యవాదాలు చెప్పడమే కాకుండా, వారు చేసిన మేలును గుర్తుంచుకుని జీవితంలో ప్రతిఫలించడం. అదే అసలైన కృతజ్ఞత రూపం. మానవసంబంధాలు, పరస్పర గౌరవం, దయా మమతలు అన్నీ దాని ద్వారా స్థిరపడతాయి.

విద్యార్థులు గురువుల పట్ల, పిల్లలు తల్లిదండ్రుల పట్ల, భక్తులు భగవంతుడి పట్ల చూపే కృతజ్ఞత భావన వల్ల జీవితం ధర్మమార్గంలో నడుస్తుంది. ధన్యవాదమనేది ఒక ఆధ్యాత్మిక సాధన. ఇది మనిషిని సానుకూల దృక్పథంతో నింపుతుంది. సంతోషం, శాంతి, దైవసాన్నిధ్యాల వైపు నడిపిస్తుంది. దానివల్ల అసంతృప్తి, అసూయ వంటి ప్రతికూల భావనలు తొలగిపోతాయి. పురాణ ఇతిహాసాల్లో కృతజ్ఞతను ఒక ధర్మంగా, జీవనవిలువగా వర్ణించారు. ఇది మనిషి హృదయాన్ని స్వచ్ఛంచేసి, సంబంధాలను మెరుగు పరుస్తుంది. కృతజ్ఞత లేని జీవితం అసంపూర్ణం. కృతజ్ఞత అత్యున్నత పరమార్థాన్ని బోధిస్తుంది. భగవద్గీతలో శ్రీకృష్ణుడు అర్జునుడికి ధర్మం, కర్మ, సమర్పణ గురించి బోధిస్తూ దైవభక్తి, సమర్పణభావం, కృతజ్ఞత ఉండాలని సూచిస్తాడు. చేసిన మేలును గుర్తుంచుకోవడం మనిషిని వినమ్రుడిగా నిలుపుతుంది. ఆధ్యాత్మిక దృక్కోణంలో కృతజ్ఞత ఒక దైవమైన మనోవైఖరి. ఇది మనిషి ఎదుగుదలకు పునాది వేస్తుంది. మనసును శాంతిమయం చేస్తుంది. చిన్న చిన్న విషయాలకు కృతజ్ఞత చూపడం అలవరచుకుంటే ఆ ఆనందాన్ని అనుభూతి చెందవచ్చు. రాముడు హనుమంతుణ్ని ఆత్మీయుడిగా, స్నేహితుడిగా గౌరవించాడు. హనుమంతుడు శ్రీరాముడి పట్ల అపారమైన కృతజ్ఞతను, భక్తిని చూపించాడు. సీతమ్మని వెతకడం, లంకను దహించడం, రాముడి కోసం ప్రాణాన్నైనా అర్పించడానికి సిద్ధపడటం వంటివి హనుమంతుడి కృతజ్ఞతకు నిదర్శనాలు. కృష్ణార్జునుల అనుబంధం, కృష్ణ సుదాముల మైత్రి కథలూ ఇందుకు ఉదాహరణలు. కృష్ణుడు అర్జునుడికి గీతోపదేశం చేసి అతణ్ని ధర్మమార్గంలో నడిపించాడు. దానికి ప్రతిగా అర్జునుడు కృష్ణుణ్ని గురువుగా, స్నేహితుడిగా గౌరవించాడు. సుదాముడు బీదవాడైనప్పటికీ కృష్ణుడితో ఉన్న స్నేహబంధాన్ని గౌరవిస్తూ కానుకగా అటుకులు తీసుకెళ్లాడు. కృష్ణుడు ఆ అటుకులను అత్యంత ప్రేమతో స్వీకరించి సుదాముడికి అపారమైన సంపదను ప్రసాదించాడు. ఈ కథలు కృతజ్ఞత శక్తిని, అది ఎలా దైవానుగ్రహాన్ని తెస్తుందో చూపిస్తాయి.



అంతర్యామి

కృతజ్ఞత ఒక యోగమార్గం. మనసును అహంకారం నుంచి విముక్తంచేసి, దైవంతో ఐక్యం కావడానికి సహాయపడుతుంది. ప్రతి వ్యక్తీ తన కర్తవ్యాలను నిస్వార్థంగా నిర్వహించి ఫలితాల పట్ల కృతజ్ఞతగా ఉండాలి. ప్రకృతి పట్ల కృతజ్ఞత చూపడం ఒక ధర్మమని సనాతన పురాణాలు చెప్పాయి. అది మనిషిని అజ్ఞానం నుంచి జ్ఞానం వైపు, సందిగ్ధం నుంచి స్పష్టత వైపు నడిపిస్తుంది. కాబట్టి, కృతజ్ఞతను జీవన విధానంగా మార్చుకోవడం ద్వారా శాంతి, సంతృప్తి, దైవ సాన్నిహిత్యాలను పొందవచ్చు.

– తల్లాప్రగడ గోపాలకృష్ణ

రక్షా కవచం... ఆరావళి!

ఆరావళి పర్వత శ్రేణుల్లో గనుల తవ్వకాలపై కొన్నాళ్లుగా ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో అక్కడ కొత్తగా మైనింగ్ లీజులను మంజూరు చేయవద్దని సంబంధిత రాష్ట్రాలను కేంద్రం ఆదేశించింది. అదే సమయంలో ప్రకృతికి నష్టంచేయకుండా ఆరావళి ప్రాంతాల్లో తవ్వకాలు చేపట్టేందుకు సమగ్ర, శాస్త్రీయ నిర్వహణ ప్రణాళికను రూపొందించాలని భారత అటవీ పరిశోధన, విద్యా మండలిని కోరింది. ఆరావళిలో ఎలాంటి తవ్వకాల మూలంగానైనా పర్యావరణానికి నష్టం తప్పదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

దిల్లీ, హరియాణా, రాజస్థాన్, గుజరాత్‌ల గుండా విస్తరించిన ఆరావళి పర్వత శ్రేణి ప్రపంచంలోనే అత్యంత పురాతనమైనది. ఈ పర్వతాలు థార్ ఎడారి నుంచి వచ్చే ఇసుక మేఘాలు దిల్లీని కమ్మేయకుండా అడ్డుకుంటాయి. దిల్లీతోపాటు నాలుగు రాష్ట్రాల్లో భూగర్భ జలమట్టాలను కాపాడతాయి. వాతావరణ మార్పులను తట్టుకునే సామర్థ్యాన్ని ఇస్తాయి. జీవవైవిధ్యాన్ని రక్షిస్తాయి. అంతటి ప్రాముఖ్యత కలిగిన ఈ పర్వతాలలో అడ్డూఆపూ లేకుండా గనుల తవ్వకం కొనసాగుతూ మొత్తం పర్వతశ్రేణికి ముప్పుతెస్తోంది.

తప్పిపారేస్తే వినాశనమే

ఆరావళి పర్వతాలను రక్షించుకోవాలనే ఉద్యమం సుప్రీంకోర్టు వరకు చేరింది. ఆరావళి శ్రేణిలో కొండ అంటే ఏమిటో కేంద్ర పర్యావరణ అటవీ మంత్రిత్వ శాఖ నేతృత్వంలోని కమిటీ ఇచ్చిన నిర్వచనాన్ని ఆమోదించింది. చుట్టూ ఉన్న ప్రదేశంకన్నా కనీసం 100 మీటర్ల ఎత్తయిన ప్రాకృతిక స్వరూపాన్ని కొండగా పేర్కొంది. 500 మీటర్ల పరిధిలో అలాంటి కొండలు రెండు ఉంటే అది పర్వత శ్రేణి అవుతుందని నిర్వచించింది. ఇలాంటి కొలతలు ఆరావళి పర్వతాలకు, అక్కడి జీవావరణానికీ ముప్పుతెస్తాయని దిల్లీ, ఉదయ్‌పూర్ తదితర చోట్ల నిరసనలు చెలరేగాయి. అయితే, గతంలో పొంతనలేని నిర్వచనాల వల్ల ఆరావళిలో గనుల తవ్వకం యథేచ్ఛగా సాగిందనీ, అంతూపొంతూ లేకుండా కోర్టు వ్యాజ్యాలు జరిగాయనీ, ఇప్పటికైనా సుప్రీంకోర్టు స్పష్టమైన నిర్వచనమివ్వడం స్వాగతించాల్సిన అంశమని కొన్ని వర్గాలు వాదిస్తున్నాయి. అదే సమయంలో జీవావరణానికి చట్టపరమైన నిర్వచనం పేరిట పరిమితులు విధించరాదనే వాదమూ బలంగా వినిపిస్తోంది.



భూవినియోగానికి సంబంధించి నియమ నిబంధనలను రూపొందించడానికి ప్రభుత్వం శాస్త్రీయ మ్యాపింగ్‌ను చేపడుతుంది. దీనికి జీఐఎస్, భౌగోళిక స్థానాల ఎత్తుకు సంబంధించిన డిజిటల్ నమూనాలను, కొండలు, లోయల కాంటూర్ సర్వేలను ఉపయోగిస్తారు. ఈ మ్యాపింగ్ ద్వారా సంరక్షించుకోవాల్సిన స్థలాలను గుర్తించి, అక్కడ గనుల తవ్వకం జరగకుండా నివారించవచ్చు. కానీ, ఫలానా ఎత్తులో ఉన్న ప్రాకృతిక ప్రదేశాలను మాత్రమే కాపాడుకోవాలనే భావన తాజా నిర్వచనంతో వ్యక్తమవుతోందని పర్యావరణ సంరక్షకులు నిరసిస్తున్నారు. ఆరావళి శ్రేణిలో 100 మీటర్లకన్న తక్కువ ఎత్తున్న గుట్టలు, కొండవాలులు కూడా వర్షపు నీటిని ఒడిసిపట్టి భూమిలోకి ఇంకింపజేస్తాయి, భూసారాన్ని, జంతువృక్ష జాతులను రక్షిస్తాయి. ఉష్ణోగ్రత సమతుల్యతను కాపాడతాయి. యావత్ ఆరావళి శ్రేణిలోని చిన్నాపెద్ద కొండలు, గుట్టలు, లోయలు ఉమ్మడిగా సంరక్షణ బాధ్యత నిర్వహిస్తాయి. ఆరావళి పర్వతాలు హిమాలయాలకన్నా పురాతనమైనవి. లక్షల సంవత్సరాలుగా గాలీవానల కోత వల్ల అవి చిన్నచిన్న కొండలు, గుట్టలు, లోయలుగా మిగిలాయి. ఈ కొండల్లోని పగుళ్ల ద్వారా వాన నీరు కిందకు ఇంకి చుట్టుపక్కల బావులకు జలధారను అందిస్తోంది. ఈ పర్వతాలలో పుట్టే సెలయేళ్లు, భూగర్భ వాహినులు రాజస్థాన్, హరియాణా ప్రజలకు వేసవిలోనూ తాగు, సాగు నీటిని అందిస్తున్నాయి. ఈ లక్షణాలను గుర్తించకుండా ఆరావళిలో ఫలానా ఎత్తుకే చట్టపరమైన సంరక్షణను పరిమితం చేయడం సబబు కాదు. వాతావరణ మార్పుల నుంచి భూమిని రక్షించుకోవాల్సిన ఈ సమయంలో ఇలాంటి అరకొర నిర్వచనాలు మంచికన్నా చెడునే ఎక్కువ చేస్తాయి. తక్కువ ఎత్తు ఉన్న కొండలు, గుట్టలు వర్షపు నీరు వరదెత్తకుండా కాపాడతాయి. నీటిని పల్లపు ప్రాంతాలకు మళ్లించి అక్కడి ప్రజలకు జీవనాధారమవుతాయి. దుమ్మును అడ్డుకుని స్థానికంగా వాతావరణాన్ని చల్లబరుస్తాయి. 100 మీటర్లకన్నా తక్కువ ఎత్తున్న కొండలు, గుట్టలను తవ్వేయడానికి తాజా నిర్వచనాన్ని ఉపయోగించుకుంటే స్థానిక జన సమూహాలకు, జంతు, వృక్షజాతులకు తీరని హాని తప్పదు. వర్షాభావ పరిస్థితుల్లో తాగు నీటి కొరత ఏర్పడుతుంది, అతివృష్టి సమయాల్లో వరద ముంపు వచ్చిపడుతుంది.

దిల్లీకే నష్టం ఎక్కువ!

పద్నాలుగు లక్షల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలోని ఆరావళి పర్వత శ్రేణిలో 0.2 శాతం భూభాగం మాత్రమే గనుల తవ్వకం వల్ల ప్రభావితమవుతుందనే వాదన ఒకటి వినవస్తోంది. శాస్త్రీయ మదింపు లేకుండా మరే కొత్త మైనింగ్ లీజులు ఇవ్వబోమని హామీలూ వినిపిస్తున్నాయి. కానీ, చట్టపరమైన రక్షణను నిర్దిష్ట ఎత్తులో ఉన్న పర్వత ప్రాంతాలకు మాత్రమే వర్తింపజేయడం వల్ల మిగతా చోట్ల పర్యావరణ విధ్వంసం జరిగిపోవచ్చని ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రస్తుతం ఒక్క రాజస్థాన్‌లోని ఆరావళి పర్వతాల్లోనే వెయ్యికి పైగా గనుల్లో తవ్వకాలు సాగుతున్నాయి. ఆరావళిలో ప్రకృతి సమతుల్యత దెబ్బతింటే, అన్నింటికన్నా ముందు భారీ నష్టం చవిచూసేది దిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతమే. ఆరావళి పర్వతాలు గాలి నాణ్యతను, గాలులు వీచే దిశను, భూగర్భ జల మట్టాలను ప్రభావితం చేస్తున్నాయి. ఈ విధంగా దేశ రాజధాని ప్రాంతానికి గొప్ప మేలు చేస్తున్నాయి. ఆరావళిలో పుట్టే బనస్, సాహిబి నదులు యమునా నదిలో కలుస్తాయి. సబర్మతి గుజరాత్ గుండా ప్రవహిస్తుంది. చట్టపరమైన సడలింపులు లభిస్తే ఆరావళి పర్వత పాదాలలో భవన నిర్మాణం ఊపందుకుని చెట్టూచేమ అదృశ్యమవుతాయి. భూగర్భ జలమట్టాలు దెబ్బతింటాయి. ఇది పట్టణ ప్రాంతాలకు తాగు నీటినీ, గ్రామాలకు సాగునీటినీ హరించేస్తుంది. ఇప్పటికే వాతావరణ మార్పుల దుష్పరిణామాలను అనుభవిస్తున్న ఆరావళి పరిసర రాష్ట్రాలకు ఇది మరింత దారుణమైన నష్టం కలిగిస్తుంది. నీటిని పీల్చుకుని నిల్వజేసి ఏరులు, నదులుగా, భూగర్భ జలంగా అందించే సహజ స్పాంజిలైన ఆరావళిలో విధ్వంసం జనసమూహాలకు వినాశంగా పరిణమిస్తుంది. కాబట్టి ఆరావళికి సంబంధించి ఈ పర్యావరణ, జీవావరణ అంశాలను సమగ్రంగా పరిగణనలోకి తీసుకోవాలి. ఒక ప్రదేశం ఎత్తుతోపాటు ఆ ప్రదేశం తన పరిసరాల్లోని జన సమూహాలకు ఎంతగా ఆధారమవుతోందనే అంశానికీ ప్రాధాన్యమివ్వాలి.



అపర్ణా రాయ్
పర్యావరణ, ఇంధన రంగ నిపుణులు, అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్

ఓ చల్లటి మధ్యాహ్నం న్యూయార్క్ సిటీలోని వాషింగ్టన్ స్క్వేర్‌లో టీ తాగుతున్నారు ఫ్రాన్సిస్ పెర్కిన్స్. హఠాత్తుగా ఫైరింజిన్ల గంటలు, హాహాకారాలు వినిపించాయి. పదంతస్తుల భవనంలో ఉన్న ట్రయాంగిల్ షర్ట్‌వెయిస్ట్ ఫ్యాక్టరీలో మంటలు. చూస్తుండగానే నిప్పుల బంతుల్లా మండుతూ తొమ్మిదో అంతస్తు కిటికీల నుంచి కిందికి దూకేస్తున్నారు మహిళలు. ఒకరూ ఇద్దరూ కాదు, 146 మంది. ఆ దృశ్యం చూసి కొయ్యబారిపోయారామె.

ఆరోజు మార్చి 25, 1911. ఫ్రాన్సిస్ పెర్కిన్స్ మహిళలకు ఓటుహక్కు కోసం ఉద్యమిస్తున్న సామాజిక కార్యకర్త. అప్పటికే ఫ్యాక్టరీల గురించి కాస్త అవగాహన ఉన్న ఆమె అగ్నిప్రమాదం వివరాలు తెలుసుకుని మండిపోయారు.

ఈ హక్కులు ఆమె చలవే!



నిజానికి మంటలు వ్యాపించగానే అక్కడివాళ్లంతా క్షేమంగా బయటపడే వీలుంది. కానీ కార్మికులు వాష్‌రూమ్ పేరుతో బయటికెళ్లి సమయం వృథా చేస్తారేమోనని, బట్టల ముక్కలను దొంగిలిస్తారేమోనని... ఫ్యాక్టరీ యాజమాన్యం తలుపులన్నీ తాళాలేసిందట. దాంతో బయటపడే దారిలేక కొందరు అక్కడే మాడి మసైపోతే మరికొందరు కిందికి దూకి చనిపోయారు. వారి చావులు వృథా కాకూడదనుకున్నారు ఫ్రాన్సిస్.

సంపన్న కుటుంబానికి చెందిన ఫ్రాన్సిస్ కాలేజీ నుంచి ఫ్యాక్టరీ టూర్‌కి వెళ్లినప్పుడు తనకన్నా చిన్న అమ్మాయిలు ఇరుకు గదుల్లో పన్నెండు గంటల షిఫ్టులు పనిచేయడం, మెషీన్లలో వాళ్ల వేళ్లు కోసుకుపోవడం, దుమ్మూధూళీ మధ్య శ్వాస సమస్యలతో బాధపడటం చూశారు. అప్పటినుంచి ఆమె ఆలోచనాధోరణి మారిపోయింది. ఆర్థికశాస్త్రం చదివారు. మురికివాడల్లో ఉంటూ ఫ్యాక్టరీల పనితీరుపై ఇన్వెస్టిగేషన్ చేసి సాక్ష్యాధారాలు సేకరించారు. కొద్దిమంది లాభాలు ఆర్జించడానికి ఎన్ని వేల ప్రాణాలను పణంగా పెడతారంటూ చట్టసభ సభ్యులను నిలదీశారు. ఇంతలోనే ఈ అగ్నిప్రమాదం. కొద్ది వారాలు తిరిగేసరికల్లా న్యూయార్క్ లేబర్ లాస్ రాస్తూ ఉన్నారు ఫ్రాన్సిస్. ఫ్యాక్టరీలు చేపట్టాల్సిన సురక్షిత చర్యల జాబితా రూపొందించారు. కళ్లెదురుగా ఆమె చూపించిన సాక్ష్యాలు కనబడుతుంటే చేసేది లేక అన్నిటినీ రాష్ట్రప్రభుత్వం అంగీకరించింది. ఫ్యాక్టరీ యాజమాన్యాలు గగ్గోలు పెట్టినా వినకుండా చట్టాలు చేసింది. ఇతర రాష్ట్రాలూ అనుసరించాయి. ఫ్రాన్సిస్ కారణంగా పారిశ్రామిక రంగంలో ఊహించని మార్పులు మొదలయ్యాయి. 1933లో ప్రెసిడెంట్ రూజ్‌వెల్ట్ ఆమెను పిలిచి కార్మికశాఖ మంత్రిగా చేరమన్నారు. ఫ్రాన్సిస్ తన షరతులతో పెద్ద జాబితా ఆయన ముందు పెట్టారు. అది చూసి 'అసాధ్యం' అన్నారాయన. అయితే ఇంకెవరినైనా చూసుకోమన్నారు ఫ్రాన్సిస్. చివరికి ఒప్పందం కుదిరింది. అమెరికా ప్రభుత్వంలో తొలి మహిళామంత్రిగా పన్నెండేళ్ల కాలంలో ఆమె 'అసాధ్యం' అన్న అంశాలన్నింటినీ ఆచరణలో పెట్టి చూపించారు.

ఈరోజు ఫ్యాక్టరీల్లో ఫైర్ ఎగ్జిట్‌లు, కార్మికులకు వారాంత సెలవు, ఓవర్‌టైమ్‌కి పేమెంట్, బాలకార్మిక వ్యవస్థ రద్దు... ఇలాంటివన్నీ మనం చూస్తున్నామంటే అది ఫ్రాన్సిస్ చలవే. ఎనభై అయిదేళ్లకు చనిపోయేవరకూ కార్నెల్ యూనివర్సిటీలో లేబర్ హిస్టరీ బోధించారామె. వ్యక్తుల చేతకానితనమే పేదరికానికి కారణమన్న తండ్రి మాటలు తప్పనీ, విధాన వైఫల్యమే అందుకు కారణమని రుజువు చేసిన ఫ్రాన్సిస్... విధానాలను మార్చుకోవచ్చని ప్రపంచానికి చాటిన ధీర!

– విస్మయ



పొగాకు వినియోగం వల్ల దాదాపు 16 రకాల క్యాన్సర్లు కోరచాస్తున్నాయి. గుండె, శ్వాసకోశ వ్యాధులు, బీపీ వంటివి పంజా విసురుతున్నాయి. ధూమపానంతో పాటు గుట్కా, ఖైనీ, జర్దా వంటి నమిలే పొగాకు ఉత్పత్తుల వినియోగం వల్ల నోటి క్యాన్సర్ విజృంభిస్తోంది. గత పరిశీలనల ప్రకారం దేశీయంగా 15 ఏళ్లు అంతకు పైబడిన వారిలో 28.6శాతం మంది ఏదో ఒక రకంగా పొగాకు వినియోగిస్తున్నారు. అలాంటి వారు ఏపీలో 20శాతం, తెలంగాణలో 17.8శాతం ఉన్నారు. ఈశాన్యంతో పాటు కొన్ని చోట్ల జాతీయ సగటును మించి పొగాకుకు అలవాటు పడ్డారు. ఆ రాష్ట్రాలు, పొగాకు వినియోగిస్తున్న వారి శాతం...

రాష్ట్రం	శాతం
త్రిపుర	64.5
మిజోరం	58.7
మణిపుర్	55
ఒడిశా	45.6
అరుణాచల్ ప్రదేశ్	45.5
నాగాలాండ్	43.3
ఛత్తీస్‌గఢ్	39
ఝార్ఖండ్	38.9
ఉత్తర్ ప్రదేశ్	35.5
మధ్యప్రదేశ్	34.2

(ఆధారం: లోక్‌సభలో కేంద్రం వెల్లడించిన వివరాలు)

రద్దీ నియంత్రణలో నిర్లక్ష్యం ప్రాణాంతకం!

తొక్కిసలాటల్లో జనం మరణిస్తున్న ఘటనలు తరచూ చోటుచేసుకుంటున్నాయి. పండుగలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు, రాజకీయ సభలు, క్రీడా పోటీల సందర్భంగా తొక్కిసలాటలు పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. మితిమీరిన రద్దీ, ఇరుకైన దారులు తదితర కారణాలతో ఇలాంటి ఘటనలు తలెత్తుతున్నాయి. ముందుజాగ్రత్త చర్యలతో వీటిని పరిహరించాలి.

కిందటి నెలలో ఏపీలోని కాశీబుగ్గ వేంకటేశ్వరస్వామి ఆలయం తొక్కిసలాటలో తొమ్మిదిమంది మరణించగా, పలువురు గాయపడ్డారు. ఏకాదశికి పెద్దసంఖ్యలో భక్తులు వస్తారని తెలిసినా నిర్వాహకులు పోలీసులకు సమాచారం ఇవ్వలేదు, సాయం కోరలేదు. అధికారులు కూడా చొరవ చూపి ఎందుకు చర్యలు తీసుకోలేదనే ప్రశ్న వస్తోంది. సెప్టెంబరులో తమిళనాడులోని కరూరులో సినీ నటుడు విజయ్‌కు చెందిన టీవీకే పార్టీ ర్యాలీలో జరిగిన తొక్కిసలాట 40 మందిని బలిగొంది. జూన్‌లో బెంగళూరులో ఐపీఎల్ జట్టు రాయల్ ఛాలెంజర్స్ విజయోత్సవం తొక్కిసలాటకు దారితీసి, 11 మంది మరణానికి కారణమైంది. జనవరిలో కుంభమేళాలో తొక్కిసలాట వల్ల 30 మంది మరణించారు. ఫిబ్రవరిలో దిల్లీ రైల్వేస్టేషన్‌లో తొక్కిసలాట 18మంది ప్రాణాలు తీసింది. నిరుడు జులైలో యూపీలోని హథ్రాస్‌లో ఓ ఆధ్యాత్మిక కార్యక్రమంలో జరిగిన తొక్కిసలాట వందమందికిపైగా భక్తుల మృతికి కారణమైంది. 2011లో శబరిమల తొక్కిసలాటలో వంద మందికిపైగానే మరణించారు. భారతదేశంలో 2001-2022 మధ్య తొక్కిసలాటల వల్ల మూడువేల మందికిపైగా మరణించారని జాతీయ నేరగణాంకాల బ్యూరో వెల్లడించింది. జనం గుమికూడటం అనేది అనుకోకుండా జరగవచ్చు లేదా ఏదైనా కార్యక్రమం కోసం ఒక్కచోట చేరవచ్చు. ఇలాంటి ప్రణాళికాబద్ధ రద్దీని నిభాయించడం తేలికే. కానీ, అనుకోకుండా వచ్చిపడే జన సమూహాన్ని నియంత్రించడం మాత్రం కష్టమే. ఇలాంటి అవాంఛనీయ ఘటనలను నివారించడానికి పటిష్ఠమైన విధానాలు, ముందుజాగ్రత్త చర్యలు చేపట్టాలి.



ప్రమాదాలకు మూలకారణాలివీ...

ప్రపంచంలో 1883-2017 మధ్య సంభవించిన 137 తొక్కిసలాట ఉదంతాలపై దిల్లీ ఐఐటీ సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఒక అధ్యయన పత్రాన్ని వెలువరించింది. వీటిలో 64 శాతం మరణాలు, 51 శాతం గాయాలు మతపరమైన కార్యక్రమాల్లోనే సంభవించాయి. వదంతులు, నిప్పు అంటుకోవడం, వేదిక కూలడం, ఇరుకైన ప్రవేశ, నిష్క్రమణ దారులు, మితిమీరిన రద్దీ ఈ ప్రమాదాలకు మూలకారణాలు. తొక్కిసలాట ఉదంతాల్లో నష్టం, వాటి నివారణపై ప్రత్యేక చట్టాలేమీ లేవు. కానీ, నిర్లక్ష్యం వల్ల సంభవించే మరణాల గురించి భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని 106వ సెక్షన్ పేర్కొంటోంది. బీఎన్ఎస్ 125వ సెక్షన్ మనుషుల ప్రాణాలు పోవడానికి కారణమయ్యే నిర్లక్ష్యానికి శిక్షలు నిర్దేశిస్తోంది. 1861నాటి పోలీసు చట్టంలో జన సమూహాల భద్రతకు సంబంధించి పలు నిబంధనలు ఉన్నాయి. 2005నాటి ప్రకృతి విపత్తుల నిభాయింపు చట్టంలో మానవ ప్రేరిత విపత్తుల విభాగంలో తొక్కిసలాట మరణాలను చేర్చారు. సామూహిక కార్యక్రమాల్లో గుంపులను నిభాయించడానికి పలు మార్గనిర్దేశకాలు ఉన్నాయి.

ముందస్తు ప్రణాళికలు అవసరం

పెద్ద సంఖ్యలో జనం చేరేచోట తొక్కిసలాటల నివారణకు ముందస్తు ప్రణాళికలు అవసరం. నిర్వాహకుల సామర్థ్యాన్నీ, వారి ప్రచార కార్యక్రమాన్ని పోలీసులు, ఇతర అధికార యంత్రాంగం సరిగ్గా అంచనా వేయాలి. జన సమూహాల రాక గురించి ఇంటెలిజెన్స్ అంచనాలను సిద్ధం చేయాలి. మత, రాజకీయపరమైన సభలు, ఆటల పోటీలకు వచ్చే జనసమూహాలు తీవ్ర భావోద్వేగంతో ఉంటాయని గ్రహించి, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సరైన ప్రణాళికను చేపట్టాలి. కృత్రిమ మేధ, సీసీటీవీలు, డ్రోన్లతో అధికారులు సర్వసన్నద్ధంగా ఉండాలి. అగ్నిమాపక యంత్రాలు, అంబులెన్సులను సిద్ధంగా ఉంచాలి. గాలీ వెలుతురూ సక్రమంగా వచ్చే ఏర్పాట్లు చేయాలి. సాధారణ ప్రజలకు పత్రికలు, టీవీ ఛానళ్లు, సామాజిక మాధ్యమాల ద్వారా అవగాహన కల్పించాలి. పోలీసులు సైతం శాంతి భద్రతలతోపాటు ప్రజారక్షణకూ ప్రాధాన్యం ఇవ్వాలి. నీరు, ఆహారం, పారిశుద్ధ్య వసతులు తగినంతగా కల్పించాలి. సాధారణంగా తొక్కిసలాటల్లో ఎక్కువగా మరణించేది మహిళలు, పిల్లలు, వృద్ధులే. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని అప్రమత్తంగా మెలగాలి. నిర్వాహకులు, అధికారులు, సమాచార సాధనాలు అందరూ చేయి కలిపి ఈ తరహా విపత్తుల్ని నివారించాలి.

– డాక్టర్ కంచర్ల వాలెంటీనా
దిల్లీలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో సహాయ ఆచార్యులు

దిక్సూచి కథ తెలుసా..!

హాయ్ నేస్తాలూ..! మనం ఏదైనా కొత్త ప్రదేశానికి వెళ్లాలి అనుకుంటాం కానీ ఎలా వెళ్లాలో తెలియదు.. అప్పుడేం చేయాలి? 'ఏముంది గూగుల్ మ్యాప్ ఓపెన్ చేస్తే సరి! అదే దారి చూపిస్తుంది కదా!' అంటారా. అవును నిజమే. అది భూమి మీద దారులు చూపిస్తుంది. మరి గాలిలో, నీటి మీద ప్రయాణాలకు ఎలా దారి తెలుస్తుంది?

దీనికి ఒకే జవాబు కంపాస్(దిక్సూచి). నీటి మీద నడిచే షిప్‌లు, క్రూజ్‌లకూ గాలిలో ఎగిరే విమానాలకు ఇదే దిశలను చూపిస్తుంది. కంపాస్‌ని క్రీస్తు పూర్వం చైనాలో కనిపెట్టారు. నిజానికి మొదట్లో కంపాస్‌ని ప్రయాణాల కోసం కనిపెట్టలేదట. ఇళ్లు సరైన దిశలో నిర్మించడానికి.. భవిష్యవాణి పరంగా మంచీచెడులు తెలుసుకోవడానికి ఉపయోగించేవారట. తరవాత చైనీయులు దాన్ని ఉపయోగించి సముద్ర ప్రయాణాలు చేయడం మొదలుపెట్టారు. అలా మెల్లమెల్లగా దిక్సూచి ఇతర దేశాలకూ పరిచయమైంది. మొట్టమొదటి దిక్సూచిని లోడ్‌స్టోన్‌తో తయారుచేశారు.. ఇది చాలా ప్రత్యేకమైన రాయి తెలుసా! దీన్ని మ్యాగ్నటైట్ అని కూడా పిలుస్తారు. సహజంగానే అయస్కాంత లక్షణాలను కలిగి ఉంటుంది. అంటే.. ఇనుము వంటి వస్తువులను ఆకర్షిస్తుందన్నమాట. అంతేకాకుండా దాన్ని గాలిలో వేలాడదీస్తే, ఉత్తర-దక్షిణ ధృవాలనే చూపిస్తుంది. మరో విషయం ఏంటంటే మొదటి కంపాస్ స్పూన్ ఆకారంలో ఉండేదట. అందుకే చైనాలో దీన్ని 'సౌత్ పాయింట్ స్పూన్' అని పిలిచేవారు. అంటే అది దిక్సూచి మొదటి పేరన్నమాట. ముందు మనం చెప్పుకొన్నట్లు షిప్‌లూ, విమానాల ప్రయాణాలతో పాటుగా ట్రెక్కింగ్, శాస్త్ర పరిశోధనలు, నిర్మాణాల్లో ఉపయోగపడుతుంది. ★



హాయ్! బుజ్జీ!!

చెప్పుకోండి చూద్దాం!

ఇక్కడ ఆంగ్లంలో ఒకే అక్షరంతో ప్రారంభమయ్యే అంశాల పేర్లు తెలుగులో ఉన్నాయి. కానీ అందులో కొన్ని వేరేవి కలిసిపోయాయి. అవేంటో చెప్పుకోండి చూద్దాం.

నెమలి	గుర్రం	గుమ్మడికాయ
తేలు	ఆలుగడ్డ	రామచిలుక
కళ్లజోడు	పంది	మల్లెపువ్వు

ఈనాడు
అమరావతి
ఎన్టీఆర్
శుక్రవారం డిసెంబరు 26, 2025

28న.. 'ఈనాడు 50, ఈటీవీ 30' వసంతాల వేడుకలు



ఈనాడు - అమరావతి: తెలుగువారి ప్రియపత్రిక ఈనాడు దినపత్రిక 50 వసంతాలు పూర్తిచేసుకుంది. తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచింది. 'ఈటీవీ.. మీటీవీ' అనగానే మూడు దశాబ్దాలుగా తెలుగు ప్రజలు అక్కున చేర్చుకున్నారు. ✦ ఈ సందర్భంగా ఈనాడు 50, ఈటీవీ 30 వసంతాల వేడుకలకు విజయవాడ వేదిక కాబోతోంది. ఈనెల 28న నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో వేడుకలు సాయంత్రం 6 గంటల నుంచి అంగరంగ వైభవంగా జరగబోతున్నాయి. ✦ సినీ గీతాలు, కడుపుబ్బ నవ్వించే హాస్యం, డ్యాన్స్ పెర్‌ఫార్మెన్స్‌లతో ఉర్రూతలూగించేలా పలు కార్యక్రమాలు ఈ వేడుకల్లో ఉంటాయి. ✦ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాస్యబ్రహ్మ బ్రహ్మానందం హాజరవుతున్నారు. ప్రముఖ సినీ నేపథ్య గాయనీ గాయకులు విజయ్‌ప్రకాష్, నేహా, సమీరా భరద్వాజ్, మంగ్లీ, రిషిల్, దినకర్, హరిప్రియ, రేవంత్ తదితరులు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నారు. ✦ సినీ నటి మానసచౌదరి, బొమ్మరిల్లు శిరీష డ్యాన్స్‌లతో అలరిస్తారు. బుల్లితెర నటి, ప్రయోక్త సుమ యాంకర్‌గా వ్యవహరిస్తారు. ✦ ఆద్యంతం వినోద భరితంగా సాగే ఈ కార్యక్రమంలో పాల్గొనాలంటే.. పాస్‌లు తప్పనిసరి.

రేపు పాస్‌ల పంపిణీ...

✦ డిసెంబర్ 27న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ ఇందిరాగాంధీ మున్సిపల్ మైదానం వద్ద పాస్‌లు పంపిణీ చేస్తారు.
✦ పాస్‌తోపాటు ప్రత్యేక ఆకర్షణగా ఇచ్చే రిస్ట్ బ్యాండ్‌లను ధరించిన వారికి మాత్రమే ప్రవేశం ఉంటుంది.

ఆన్‌లైన్ టికెట్ల విక్రయాల్లో ప్రథమం

ఇంద్రకీలాద్రి: ఆన్‌లైన్లో దర్శనం టిక్కెట్ల విక్రయాల్లో దుర్గగుడి ప్రథమ స్థానంలో నిలిచింది. గురువారం సెలవు కావడంతో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు ఆన్‌లైన్ సేవలను వినియోగించుకున్నారు. శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం 4218 టికెట్లు విక్రయించి ప్రథమస్థానంలో.. శ్రీశైలంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్ల దేవస్థానం 3,835 టికెట్లు, అన్నవరం సత్యనారాయణ స్వామి దేవస్థానం 2410 టికెట్లతో వరుసగా ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయని దేవస్థానం అధికారులు తెలిపారు.


విజయవాడ సెయింట్ పాల్స్ కెథెడ్రల్ చర్చిలో..


దివ్య పూజాబలి సమర్పిస్తున్న మతపెద్ద

కరుణ కాంతులు


గుణదల చర్చిలో ప్రార్థనలు...

నగరంలోని పలు చర్చిల్లో క్రిస్మస్ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసును కీర్తిస్తూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పవిత్ర పాఠాలు ఏర్పాటు చేసి, క్రీస్తు జనన ఘట్టాన్ని వివరించారు. అధిక సంఖ్యలో విశ్వాసులు పాల్గొన్నారు.

-ఈనాడు, అమరావతి

వేదన తీర్చేలా.. వెలుగు నింపేలా!

శరవేగంగా కృష్ణా జలాల ట్రయల్‌రన్... జనవరిలో ప్రాజెక్టు ఆరంభానికి అడుగు

ఈనాడు, అమరావతి

"స్వచ్ఛ జలాల కోసం దశాబ్దాలుగా తపిస్తున్న ఎ.కొండూరు కల సాకారం కానుంది. రూ.50 కోట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో నిర్మిస్తున్న కృష్ణా జలాల ప్రాజెక్టు పనులు పూర్తయ్యాయి.

21 పంచాయతీల్లో 38 తండాలు, గ్రామాలకు నీరివ్వాలనేది లక్ష్యం. వీటికి 30 ప్రాంతాలకు ట్రయల్‌రన్‌లో భాగంగా కుదప సంపు నుంచి పైప్‌లైన్ల ద్వారా 15 లక్షల లీటర్ల నీరిస్తున్నారు.

కేవలం రెండు సంపుల పరిధిలో ఎనిమిది తండాలకు అందడం లేదు. ఈ సంపుల నిర్మాణమూ పూర్తయింది. మోటార్లను బిగించే పనులు చేపడుతున్నారు. వీటికి నెలాఖరులోగా నీరివ్వనున్నారు.

ఎ.కొండూరు పరిధిలో కిడ్నీ వ్యాధులతో పదేళ్లలో 300 మందికిపైగా గిరిజనులు చనిపోయారు. తమకు స్వచ్ఛజలాలు అందించమని వీరు పోరాడారు. తాగునీరే బలిగొంటోందని వేడుకున్నా.. వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక.. యుద్ధప్రాతిపదికన పనులు పట్టాలెక్కించింది. నిర్దేశిత లక్ష్యం ప్రకారం.. 2025 జూన్ లోపే పనులవ్వాలి. జాతీయ రహదారి, అటవీ, ఇతర కేంద్ర ప్రభుత్వ సంస్థల నుంచి అనుమతుల్లో జాప్యం జరిగింది. ఎట్టకేలకు అడ్డంకులను దాటి.. పైప్ లైన్ పనులు పూర్తిచేశారు.

ప్రయోజనమిదీ..

- లక్ష్యం: రోజుకు 32 లక్షల లీటర్లు
- ట్రయల్‌రన్‌లో ఇస్తోంది: 15 లక్షల లీటర్లు
- లబ్ధిపొందే పంచాయతీలు: 21
- తండాలు, ప్రాంతాలు: 38
- మేలు పొందే జనాభా: 50 వేలు
- పంపిణీ లక్ష్యం: జనవరి 2026


కుదపలో కృష్ణా జలాల సంపు వద్ద పంపింగ్ హౌస్, కొండపై ప్రధాన ట్యాంకు

రెండుచోట్లా పూర్తయితే..

గోపాలపురం, లక్ష్మీపురంలో సంపులు కట్టేసి.. నీటితో నింపుతున్నారు. మోటార్లు బిగిస్తున్నారు. ఇక్కడ 8 తండాలు, గ్రామాలున్నాయి. వీటికి కూడా 1,2 రోజుల్లో మోటార్లు బిగించి ట్రయల్‌రన్ వేయనున్నారు. తర్వాత.. మొత్తం ప్రాజెక్టు జనవరిలో ఆరంభించేలా సన్నాహాలు చేస్తున్నారు. ★ ట్రయల్‌రన్‌లో అక్కడక్కడా పైప్‌లైన్ల లీకేజీ, నీళ్ల రంగు మారుతున్నాయి. ఒక్కొక్కటిగా పరిష్కరించి.. జనవరిలో ప్రాజెక్టును ఆరంభించి.. రోజుకు 32 లక్షల లీటర్ల స్వచ్ఛజలాలు 50 వేల మందికి ఇవ్వనున్నారు.

వ్యాసుడి తపస్సు ఫలం..
లక్ష్మీపతి క్షేత్రం!

మొవ్వ మండలం పెదముత్తేవిలో వ్యాస భగవానుడు ప్రతిష్ఠించిన పుణ్యక్షేత్రం శ్రీలక్ష్మీపతిస్వామి ఆలయం. శ్రీమన్నారాయణుడి సాక్షాత్కారాన్ని కోరుతూ అప్పట్లో వ్యాసుడు ఘోర తపస్సు చేశారు. ప్రత్యక్షమైన స్వామిని ఈ ప్రాంతమంతా సుభిక్షంగా ఉండేలా లక్ష్మీదేవి సమేతంగా కొలువై ఉండాలని కోరడంతో స్వామి స్వయంభువుగా ఆవిర్భవించినట్లు స్థలపురాణం చెబుతోంది. కాలగర్భంలో కలిసిపోయిన ఈ స్వామి వారిని 16వ శతాబ్దంలో ముత్తేవి వంశస్థుల మూలపురుషుడైన పేరరాజు స్వప్న సాక్షాత్కారంతో తిరిగి ప్రతిష్ఠించారు.


పెదముత్తేవి శ్రీలక్ష్మీపతి స్వామి ఆలయం

ప్రాచీన లక్ష్మీనారాయణుల క్షేత్రాల్లో ఇది ఒకటిగా విలసిల్లుతోంది. మిగిలిన నాలుగు క్షేత్రాలు నల్లూరు, రామాపురం, ఉదయగిరి, నడకుదురులో కనిపిస్తాయి. లక్ష్మీసమేతుడై స్వామివారి ఎడమ తొడ మీద కూర్చుని రాజ్యలక్ష్మీదేవిగా అమ్మ అనుగ్రహిస్తుండగా చతుర్భుజుడైన స్వామివారి దివ్యమంగళ స్వరూపాన్ని వీక్షించేందుకు రెండు కళ్లు చాలవు. ముక్తిని ప్రసాదించే క్షేత్రం కావడం వలన ముక్తేవి(పెదముత్తేవి)గా పేరు వచ్చింది. ఈ క్షేత్రానికి క్షేత్రపాలకుడు వినాయకుడు. ప్రతి సంవత్సరం కల్యాణ బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. ముత్తేవి వంశం వ్యవస్థాపక ధర్మకర్తలు కాగా, ప్రస్తుతం ఆ వంశానికి చెందిన ముముక్షుజన మహా పీఠాధిపతిగా, ముత్తేవి సీతారామ్ గురుదేవుల కుమారుడు గౌరకృష్ణ ధర్మకర్తగా కొనసాగుతున్నారు.

– న్యూస్‌టుడే, పెదముత్తేవి(కూచిపూడి)

సురక్షిత ప్రయాణం.. ఆనంద విహారం

'ఆంధ్రా ట్యాక్సీ' యాప్ ప్రారంభం

పాయకాపురం: ఆర్థిక వ్యవస్థకు చోదకశక్తి అయిన సేవారంగంలో కీలకమైన పర్యాటకంలో జిల్లాను నంబర్-1గా నిలిపేందుకు ఆంధ్రా ట్యాక్సీ యాప్ ఉపయోగపడుతుందని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లో ఆటో ట్యాక్సీ, యూనియన్‌ల ప్రతినిధులు, రవాణాశాఖ, పర్యాటకశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. 'ఆంధ్రా ట్యాక్సీ' యాప్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ... ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికతకు అనుగుణంగా ప్రభుత్వం పర్యాటకరంగ అభివృద్ధికి విశేష కృషి చేస్తోందని తెలిపారు. జిల్లాలో పర్యాటకులకు అందుబాటు ధరల్లో.. సురక్షితమైన ప్రయాణానికి, సంతోషకరమైన విహార యాత్రలకు ఈ యాప్‌ను తీసుకొస్తున్నట్లు చెప్పారు. ఇందులో పర్యాటక ప్రాంతాలు, వ్యవసాయ డ్రోన్, రవాణా, పోలీస్ స్టేషన్‌కు అనుసంధానమైన ఎస్‌వోఎస్ సేవలు ఉన్నాయని వివరించారు. అలాగే క్యూఆర్‌కోడ్, వాట్సప్, వెబ్‌సైట్ ద్వారా ఆటో, ట్యాక్సీలను బుకింగ్ చేసుకోవచ్చని తెలిపారు. ఒకటి రెండు రోజుల్లో.. పర్యాటక ప్యాకేజీలు అందుబాటులో ఉంటాయన్నారు. ఆటో, ట్యాక్సీలను నడిపే చోదకులు.. జిల్లా పర్యాటక రాయబారులుగా అభివర్ణించారు. కలెక్టర్ ఈ యాప్ ద్వారా ఆటోను బుక్ చేసుకుని కలెక్టరేట్ నుంచి బెంజిసర్కిల్ వరకు అందులో ప్రయాణించారు. జిల్లా పర్యాటక శాఖాధికారి ఎ.శిల్ప, ఇన్‌ఛార్జి ఆర్టీవో కె.వెంకటేశ్వరరావు, విజయవాడ ట్యాక్సీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



చోదకులతో కలిసి యాప్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

రాజధానిలో సుపరిపాలన సంబరం

భారీగా తరలి వచ్చిన కూటమి శ్రేణులు, ప్రజలు


వాజ్‌పేయీ జీవిత విశేషాలతో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, సీఎం చంద్రబాబు, మంత్రి సత్యకుమార్

తుళ్లూరు, న్యూస్‌టుడే: రాజధాని అమరావతి కమలనాథుల కోలాహలంతో కొత్త కళ సంతరించుకుంది. మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయీ శత జయంతి ఉత్సవాల్లో భాగంగా వెంకటపాలెం సమీపంలో గురువారం నిర్వహించిన సుపరిపాలన దినోత్సవం, వాజ్‌పేయీ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భాజపా శ్రేణులతోపాటు కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చారు. సభా ప్రాంగణంలో వాజ్‌పేయీ జీవిత విశేషాలతో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, సీఎం చంద్రబాబు, మంత్రులు, ఎమ్మెల్యేలు తిలకించారు. బహిరంగ సభలో నేతలు మాట్లాడుతూ వాజ్‌పేయీ సేవలను కొనియాడారు. తొలుత వారు ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

డబ్బులు ఆదా.. సౌకర్యవంతం

విజయవాడకు చెందిన ఓ కుటుంబానికి చెందిన యువతికి హైదరాబాద్‌లో పెళ్లి జరిగింది. పెళ్లివారంతా నాలుగు బస్సుల్లో వెళ్లారు. ఇంకా రెండు బస్సుల జనం ఉన్నా కుదరలేదు. అదే రైల్లో అయితే అందరూ కలిసి ఒక బోగీని బుక్ చేసుకొని వెళ్లేవారు. కేవలం బోగీ మాత్రమే కాదు రైలు మొత్తం బుక్ చేసుకునే సౌకర్యం అందుబాటులో ఉంది. దీన్ని ఫుల్ టారిఫ్ రేట్ (ఎఫ్‌టీఆర్) అంటారు. రైలు బోగీ బుక్ చేసుకోవాలనుకునే వారు ఐఆర్‌సీటీసీ ద్వారా ఆన్లైన్‌లో నేరుగా చేసుకోవచ్చు. రైల్లోని అన్ని బోగీలు కావాలంటే కనిష్ఠంగా 18, గరిష్ఠంగా 24 బోగీలు ఎంచుకోవాలి. సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించిన వారం లోపు కన్ఫర్మ్ వస్తుంది. మనం ఎంచుకునే బోగీలను బట్టి డిపాజిట్ చెల్లించాలి. ఒకటి నుంచి 24 బోగీల వరకు బుక్ చేసుకోవచ్చు. ప్రయాణం, దూరం బట్టి ధర నిర్ణయిస్తారు. ఒక్కో బోగీకి డిపాజిట్ రూ.50 వేలు చెల్లించాలి. 18 బోగీలు ఉన్న రైలుకు రూ. 9 లక్షలు చెల్లించాలి. సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించిన మొత్తం ప్రయాణం పూర్తి అయ్యాక అందుతుంది. ఆహారం కూడా ఐఆర్‌సీటీసీ అందిస్తుంది.

బోగీ లేదా రైలు మొత్తాన్ని బుక్ చేసుకోవచ్చు

ఎలా నమోదు చేయాలంటే..

రైలు బోగీ లేదా మొత్తం రైలును బుక్ చేసుకోవడానికి ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్ కి వెళ్లి రిజిస్టర్ లాగిన్ అవ్వాలి. అక్కడ 'ఫుల్ టారిఫ్ రేట్(ఎఫ్ టీ ఆర్) విభాగంలో బోగీ లేదా రైలు కావాలా అని ఎంచుకోవాలి. తేదీలు, స్టేషన్లు, కోచ్ రకం (స్లీపర్ 1, 2, 3 టైర్ ఏసీ మొదలైనవి) వివరాలు ఇవ్వాలి. అనంతరం సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించి బుక్ చేసుకోవచ్చు. గరిష్ఠంగా 6 నెలలు, కనిష్ఠంగా 30 రోజుల ముందు బుక్ చేసుకోవచ్చు. ఈ బుకింగ్‌లకు ప్రయాణికుల రాయితీలు వర్తించవు. ఇతర వివరాలకు రైల్వే అధికారులను సంప్రదించవచ్చు.

-న్యూస్‌టుడే, విజయవాడ రైల్వే

నాటి సాయం.. నిత్య ఆరాధనాభావం

కరోనా విజృంభణ కారణంగా లాక్‌డౌన్ విధించడంతో రవాణా సదుపాయం లేక 2020లో ముంబయిలో తెలుగు రాష్ట్రాల ప్రజలు ఎంతోమంది చిక్కుకుపోయారు. ఆ సమయంలో సినీనటుడు సోనూసూద్ ప్రత్యేకంగా రవాణా సదుపాయాలు ఏర్పాటు చేసి వారిని గమ్యస్థానాలకు చేర్చారు. అలా ఆయన సాయం పొందిన వారిలో విజయవాడ వాంబేకాలనీకి చెందిన పట్టా శ్రీనివాసరావు ఒకరు. ఆ కృతజ్ఞతతో ఆయన లాక్‌డౌన్ అనంతరం బీఆర్‌టీఎస్ రోడ్డులో మొదటగా ఏర్పాటు చేసిన ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ బండికి సోనూసూద్ పేరు పెట్టారు. అలా ఇప్పటివరకు ఐదు దుకాణాలు పెట్టగా.. అన్నింటికీ సోనూసూద్ పేరే పెట్టారు. ఈ విషయం సోనూసూద్‌కు తెలిసి.. ఆయనతో వీడియో కాల్ మాట్లాడారు. విజయవాడకు వచ్చినపుడు కలిస్తే.. ఆర్థిక సాయం కావాలా అని అడిగారని, ఏమీ వద్దని తనకు కరోనాలో మీరు చేసిన సాయానికే జీవితాంతం రుణపడి ఉంటానని బదులిచ్చినట్లు శ్రీనివాసరావు తెలిపారు.

-ఈనాడు, అమరావతి



పనులు పంచుకో.. నిధులు నంజుకో

నగరంలో చేపట్టే అభివృద్ధి, ఇతర పనుల ప్రతిపాదనల అంచనాలను వైకాపా పాలకపక్షం నిబంధనలకు విరుద్ధంగా ముక్కలుగా విభజించి స్థాయీ సంఘంలో ఆమోదించుకుంటోంది. రూ.50లక్షలకు మించి విలువైన పనుల అంచనాలు, ప్రతిపాదనలను కౌన్సిల్లో మాత్రమే ఆమోదించాలి. దీనికి భిన్నంగా అనేక ప్రతిపాదిత అంచనాలను విపక్షాలకు తెలియకుండానే స్థాయీ సంఘం ముందుంచి ఏకపక్షంగా ఆమోదిస్తున్నారు. పాలకుల వైఖరిని కౌన్సిల్లో విపక్షాలు ఎండగట్టినా మార్పు రావడం లేదు.

– న్యూస్‌టుడే, విజయవాడ నగరపాలక సంస్థ

ఇవీ నిబంధనలు.. మొదట చేపట్టాల్సిన పనులు గుర్తించి అంచనాలు రూపొందించాలి. రూ.50లక్షలు దాటితే కౌన్సిల్ ఆమోదానికి పంపాలి. అంతకన్నా తక్కువుంటే స్థాయీ సంఘం ఆమోదానికి పంపాలి. పనులపై సభ్యులు, విపక్షాలు అభ్యంతరాలు వ్యక్తం చేసినా లేదా అవసరం లేదని భావించినా ఆఫీసు రిమార్కులకు పంపాలి. ఆపై అధికారుల నుంచి వచ్చిన అదనపు వివరాలతో తిరిగి కౌన్సిల్లో ఆమోదించుకోవాలి. స్థాయీ సంఘంలో ప్రస్తుతం అందరూ వైకాపా సభ్యులే ఉన్నారు. దీంతో ఎటువంటి చర్చ లేకుండా పనులను విభజించి ఏకపక్షంగా స్థాయీ సంఘం ముందు పెట్టి ఆమోదించుకుంటున్నారు.

తాజాగా విభజించి ఆమోదించినవి..

★ హెడ్‌వాటర్ వర్క్స్‌లోని 16 ఎంజీడీ ప్లాంట్ ఫిల్టర్ మీడియాను తొలగించి, కొత్తవి మార్చాలి. ఇందుకు రూ.1.23కోట్లు అవుతుందని అధికారులు అంచనా వేశారు. ఈ ప్రతిపాదనను కౌన్సిల్‌కు రాకుండా ఉండేలా రూ.40.30 లక్షలు, రూ.39.06లక్షలు, రూ.44.26 లక్షలుగా విభజించి స్థాయీ సంఘం ముందుంచి ఆమోదించారు. ★ 43వ డివిజన్లో రెండు రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేశారు. ఇందుకు రూ.64.5లక్షలు అవుతుందని లెక్కించారు. ఈ ప్రతిపాదనను కౌన్సిల్‌కు రాకుండా ఉండేలా రూ.25లక్షలు, రూ.39.50లక్షలుగా విభజించి స్థాయీ సంఘంలో ఆమోదించుకున్నారు. ★ పశ్చిమలో రెండుచోట్ల సిమెంట్ డ్రెయిన్ల నిర్మాణానికి రూ.92.86లక్షలు అవుతుందని అంచనా వేశారు. ఆయా పనుల అంచనా వ్యయాన్ని రూ.46.36లక్షలు, రూ.46.50లక్షలుగా విభజించారు. ★ 63వ డివిజన్లో పలు రహదార్ల నిర్మాణానికి రూ.86.27లక్షలు అవుతుందని లెక్కించారు. అనంతరం అంచనాలను రూ.49.99 లక్షలు, రూ.36.28లక్షలుగా విభజించారు.

★ నగరంలోని రెండు భూగర్భ డ్రెయినేజీ పంపింగ్ స్టేషన్లలోని సంపుల పునరుద్ధరణ పనులకు రూ.66.30లక్షలు అవుతుందని అంచనా వేశారు. వాటిని రూ.36.30లక్షలు, రూ.30లక్షలుగా విభజించి కౌన్సిల్‌కు పంపకుండా స్థాయీ సంఘంలో ఆమోదించారు.





నవ.. యువ.. రాకెట్లు..!

చిరుతను మించిన వేగం.. మెరుపును తలపించే టైమింగ్‌తో.. బ్యాడ్మింటన్ క్రీడాకారులు అద్భుత ప్రతిభను చాటుతున్నారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన క్రీడాకారుల నైపుణ్య ప్రదర్శనతో మైదానం వెలుగులీనింది. ఈ సంరంభానికి... విజయవాడలో నిర్వహిస్తున్న 87వ సీనియర్ నేషనల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్-2025 వేదికైంది.

- ఈనాడు, అమరావతి

స్పందించు.. సంధించు..

'పురమిత్ర' యాప్‌తో సమస్యల పరిష్కారం

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే

'**పు**రమిత్ర'... సమస్యల పరిష్కారానికి ప్రజల చేతిలో పాశుపతాస్త్రంగా మారింది. నగరపాలక సంస్థలో 3 కేటగిరిల్లో 122 రకాల సేవలను అందిస్తున్నారు. మురుగునీటి సమస్య, తొలగించని చెత్త కుప్పలు, వెలగని వీధి దీపాలు, అక్రమ కట్టడాల నిర్మాణం, పైపులైను లీకేజీలు... వంటి సమస్యలను యాప్‌లో నమోదు చేస్తే.. తక్షణం వాటిని పరిష్కరిస్తారు.

ప్లే స్టోర్ నుంచి... యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని చరవాణి నంబరుతో రిజిస్టర్ చేసుకోవాలి. గ్రీవెన్స్ (ఫిర్యాదులు), సర్వీసెస్ (సేవలు), పేమెంట్స్ 'చెల్లింపులు' అనే మూడు కేటగిరీలు కనిపిస్తాయి. సర్వీసెస్‌లో నగరపాలక సంస్థ సేవలు.. అంటే కొత్త పన్నులు వేయడం, కొత్త వాటర్ కనెక్షన్ ఇవ్వడం వంటివి ఉంటాయి. చెల్లింపులు విభాగంలో.. పన్నులు ఉంటాయి.



సమస్య పరిష్కరించి ఇలా ఫొటోలు పెడతారు

కీలకం.. గ్రీవెన్స్ విభాగం: ఈ యాప్‌లో అత్యంత కీలకమైంది గ్రీవెన్స్. ఇందులో 8 రకాల కేటగిరీలు ఉంటాయి. సమస్య ఫొటో తీసి అప్‌లోడ్ చేయాలి, సమస్య ఏంటో వివరించాలి. వాయిస్ రికార్డ్ ద్వారా కూడా నమోదు చేయవచ్చు. సబ్మిట్ నొక్కితే.. సంబంధిత విభాగానికి వెళుతుంది. సదరు సమస్యను అధికారి పరిష్కరించి దానికి సంబంధించిన ఫొటోను మీకు పంపిస్తారు.

రీ ఓపెన్ చేయచ్చు: సమస్య పరిష్కరించిన తర్వాత మళ్లీ అది పునరావృతమైతే.. 'రీ ఓపెన్' అనే ఆప్షన్ ఉంటుంది. దాన్ని నొక్కితే. మళ్లీ అధికారుల వద్దకు వెళుతుంది. ఇటీవలే దీన్ని కొత్తగా యాడ్ చేశారు. ఒకే ప్రాంతం నుంచి ఒకే సమస్యపై అయిదుగురు మించి ఫిర్యాదు చేస్తే.. సదరు ఫిర్యాదు సరాసరి మున్సిపల్ కమిషనర్ వద్దకు వెళుతుంది.

నిమ్మకూరుకు నారా భువనేశ్వరి రాక నేడు

పామర్రు(గ్రామీణం), న్యూస్‌టుడే: దివంగత ఎన్టీఆర్ కుమార్తె నారా భువనేశ్వరి తన స్వగ్రామమైన నిమ్మకూరుకు శుక్రవారం వస్తున్నారని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా గురువారం తెలిపారు. 'ఉదయం 10.30కి స్థానిక ఎన్టీఆర్, బసవతారకం కాంస్య విగ్రహాలకు నివాళులర్పిస్తారు. అనంతరం శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహించి పక్కనే ఉన్న 30 పడకల సీహెచ్‌సీ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటారు. స్థానిక గురుకుల జూనియర్ కళాశాలకు చెందిన పూర్వ విద్యార్థులు నిర్మించిన బాలుర వసతిగృహానికి ప్రారంభోత్సవం చేసి కల్యాణ మండపంలో గ్రామస్థులతో ఆత్మీయ సమావేశంలో పాల్గొంటారని' ఎమ్మెల్యే పేర్కొన్నారు. మధ్యాహ్నం 12.45కి స్థానిక మహిళా ప్రాంగణాన్ని సందర్శించి, అక్కడి నుంచి శ్రీ గంగాపార్వతి సమేత బుద్దేశ్వర స్వామి ఆలయానికి చేరుకుంటారని తెలిపారు.

అక్రమం జోరు.. అన్నదాత బోరు!

- ★ కనెక్షన్ కావాలంటే సమర్పించాల్సిందే
- ★ వీఆర్వోలు, లైన్‌మెన్ల వసూళ్ల దందా

ఈనాడు, అమరావతి

"వ్యవసాయ బోర్ల అనుమతుల్లో వసూళ్ల దందా పెచ్చుమీరుతోంది. రెవెన్యూ, భూగర్భ జలాలు, విద్యుత్తు శాఖల అధికారులు, సిబ్బంది కుమ్మక్కయి దోచుకుంటున్నారు. సొమ్ములు తీసుకుని నిబంధనలు తుంగలో తొక్కి అడ్డగోలుగా అనుమతులు ఇస్తున్నారు. డబ్బులు ఇవ్వకున్నా.. సిఫార్సులు చేయించినా... కొర్రీలు పెట్టి ముప్పుతిప్పలు పెడుతున్నారు."

నిబంధనలు ఇలా...

● ఉమ్మడి జిల్లాలో 1,49,309 వ్యవసాయ సర్వీసులు ఉన్నాయి. ఈ ఏడాది 3,819 కొత్త సర్వీసులు ఇచ్చారు. 4,348 మంది దరఖాస్తు చేసుకున్నారు. ● వాల్టా చట్టం ప్రకారం బోరు ఉన్న ప్రాంతానికి 250 మీటర్ల దూరంలో మరో బోరు లేకుంటేనే భూగర్భ జలాల శాఖ అనుమతి ఇవ్వాలి. తహసీల్దార్ పొజిషన్ ధ్రువపత్రం ఇవ్వాలి. ఈ రెండు ఉంటేనే విద్యుత్తు శాఖ సర్వీసు ఇవ్వాలి.

ఉల్లంఘనలు అలా... ✪ ఇవన్నీ కాగితాల్లో తప్ప క్షేత్రంలో కనిపించడం లేదు. 100 మీటర్ల దూరంలోనే చాలా ప్రాంతాల్లో 2, 3 విద్యుత్తు సర్వీసులు ఉన్నాయి. మూడు శాఖల్లో సిబ్బందికి సమర్పించుకుంటే చాలు.. ఏ అర్హత లేకున్నా బోరు అనుమతి వస్తుంది. లేకుంటే అన్నీ సవ్యంగా ఉన్నా పట్టించుకోరు. ● తెర ముందు వీఆర్వోలు, లైన్‌మెన్లు కనిపిస్తున్నా తెర వెనుక విద్యుత్తు ఏఈలు, రెవెన్యూ అధికారులు చక్రం తిప్పుతున్నారు.

కలెక్టర్లు ఏమన్నారంటే...

ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల కలెక్టర్లు లక్ష్మీశ, బాలాజీ మాట్లాడుతూ.. నిబంధనల ప్రకారమే బోర్లకు విద్యుత్తు సర్వీసులు ఇవ్వాలి. అతిక్రమించి అనుమతులు ఇచ్చినా.. లంచాలు తీసుకున్నా కఠిన చర్యలు తీసుకుంటాం.. వసూళ్లపై విచారణ చేసి చర్యలు తీసుకుంటాం అని తెలిపారు.

సమర్పిస్తేనే సమ్మతి

☛ మైలవరం మండలంలో ఓ రైతు బోరు కోసం దరఖాస్తు చేశారు. రోజులు గడుస్తున్నా స్పందన లేదు. వీఆర్వోను సంప్రదించగా ఇలా తిరిగితే అనుమతులు రావు.. రూ.30 వేలు చూసుకో. అన్నీ నేనే చూసుకుంటానని బేరం పెట్టాడు. మరో దారి లేక అడిగిందిచ్చి అనుమతులు తెచ్చుకున్నారు. ☛ తిరువూరులో ఓ రైతు తన 3 ఎకరాల పొలానికి విద్యుత్తు కనెక్షన్ కోసం దరఖాస్తు చేసినా అనుమతి రాలేదు. లైన్‌మెన్‌ను అడిగితే రూ.25 వేలు ఇవ్వనిదే ఫలితం లేదన్నారు. సొమ్ము నాకివ్వండి మీకు అనుమతులు రప్పిస్తానన్నారు. అంత ఇచ్చుకోలేనంటే రూ.22 వేలకు బేరం మాట్లాడారు. ☛ బాపులపాడు మండలంలో గతంలో భారీగా వసూళ్లు చేస్తున్న విషయం వెలుగులోకి రావడంతో ఓ విద్యుత్తు శాఖ అధికారి సస్పెండ్ అయ్యారు. వసూళ్లు పూర్తిగా తగ్గలేదు. గతంలో రూ.30 వేలు డిమాండ్ చేసే పరిస్థితి నుంచి రూ.15 వేలకు తగ్గించారు.

బౌలింగ్‌లో శ్రీవిష్ణువర్ధన్ విజృంభణ

ఎస్ఆర్‌కే ఇంజినీరింగ్ కళాశాల జట్టు విజయం



న్యూస్‌టుడే-విజయవాడ క్రీడలు: కానూరులోని కేసీపీ సిద్ధార్థ ఆదర్శ్ రెసిడెన్షియల్ స్కూల్ మైదానంలో జరుగుతున్న ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ 'ఈనాడు' స్పోర్ట్స్ లీగ్(ఈఎస్ఎల్)-2025లో భాగంగా గురువారం జరిగిన సీనియర్స్ విభాగం మ్యాచ్‌ల్లో ఎస్ఆర్‌కే ఇంజినీరింగ్ కళాశాల జట్టుకు చెందిన పి.విష్ణువర్ధన్ తన బౌలింగ్ మాయాజాలంతో ప్రత్యర్థి ఎంఆర్ఆర్ ఫార్మసీ కళాశాల జట్టు బ్యాటింగ్ ఆర్డర్‌ను కుప్పకూల్చాడు. ఫలితంగా ఎస్ఆర్‌కే ఇంజినీరింగ్ కళాశాల జట్టు ఎనిమిది వికెట్ల తేడాతో ఎంఆర్ఆర్ ఫార్మసీ జట్టుపై విజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఎంఆర్ఆర్ ఫార్మసీ జట్టు నిర్ణీత 9.1 ఓవర్లలో 34 పరుగులకు ఆలౌటైంది. ప్రత్యర్థి బౌలర్ పి.శ్రీవిష్ణువర్ధన్ నాలుగు పరుగులు ఇచ్చి నాలుగు(హ్యాట్రిక్) వికెట్లు కూల్చాడు. బదులుగా బ్యాటింగ్‌కు దిగిన ఎస్ఆర్‌కే ఇంజినీరింగ్ కళాశాల జట్టు 5.1 ఓవర్లలో రెండు వికెట్లు నష్టపోయి 35 పరుగులతో విజయకేతనం ఎగురవేసింది. జట్టులో ఎం.చైతన్య 12, సీహెచ్ నాగార్జున నాయుడు పది పరుగులతో రాణించారు. ప్రత్యర్థి బౌలర్ సీహెచ్ ఉదయ్ మూడు పరుగులు ఇచ్చి రెండు వికెట్లు పడగొట్టాడు. ఈ మ్యాచ్‌లో ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా పి.శ్రీవిష్ణువర్ధన్ ఎంపికయ్యాడు.

★ ఉదయం పొట్టి శ్రీరాములు చలువాది మల్లికార్జునరావు ఇంజినీరింగ్ కళాశాల, గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాల జట్ల మధ్య జరగాల్సిన తొలి మ్యాచ్‌లో గుడ్లవల్లేరు జట్టు గైర్హాజరవడంతో ప్రత్యర్థి పొట్టి శ్రీరాములు కళాశాల జట్టును విజేతగా ప్రకటించారు.

★ మధ్యాహ్నం ఎస్సార్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కృష్ణా విశ్వవిద్యాలయం ఫార్మసీ కళాశాల జట్ల మధ్య జరగాల్సిన మరో మ్యాచ్‌లో కృష్ణా వర్సిటీ ఫార్మసీ జట్టు గైర్హాజరవడంతో ప్రత్యర్థి ఎస్సార్ఆర్ జట్టును అంపైర్లు విజేతగా ప్రకటించారు.


విజేతగా నిలిచిన ఎస్ఆర్‌కే ఇంజినీరింగ్ కళాశాల జట్టు

ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్
స్టార్ క్రికెటర్ ఆఫ్ ది మ్యాచ్



శ్రీవిష్ణువర్ధన్

నేటి మ్యాచ్‌ల వివరాలు

- ఆంధ్రా లయోలా జూనియర్ కళాశాల × అవంతి జూనియర్ కళాశాల (జూనియర్స్ ఉదయం 8 గంటలకు).
- ఎల్బీఆర్ ఇంజినీరింగ్ కళాశాల × వాసవి ఇంజినీరింగ్ కళాశాల (సీనియర్స్, ఉదయం 11 గంటలకు).
- అమృత ఇంజినీరింగ్ కళాశాల × ఎస్సార్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (సీనియర్స్ మధ్యాహ్నం ఒంటి గంటకు)

కనకమేడలకు సన్మానం

సూర్యారావుపేట, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వ అదనపు సొలిసిటర్ జనరల్‌గా నియమితులైన కనకమేడల రవీంద్రకుమార్‌ను తెదేపా లీగల్‌సెల్ న్యాయవాదులు గురువారం ఘనంగా సన్మానించారు. తెదేపా ఫ్లోర్‌లీడర్, న్యాయవాది నెల్లిబండ బాలస్వామి, గొట్టిపాటి రామకృష్ణప్రసాద్ తదితరులు వారిని మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు. బాలస్వామి మాట్లాడుతూ.. బెజవాడ బార్ నుంచి న్యాయవాదులుగా ప్రాక్టీస్ ప్రారంభించి, దేశ అత్యున్నత స్థాయికి ఎదిగిన వారు ఇద్దరు ఉన్నారని గుర్తు చేశారు. వారిలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పని చేసిన జస్టిస్ ఎన్.వి.రమణ, కేంద్ర ప్రభుత్వ అదనపు సొలిసిటర్ జనరల్‌గా నియమితులైన కనకమేడల రవీంద్ర కుమార్ అని అన్నారు. విజయవాడ కీర్తిని ప్రపంచానికి చాటారని కొనియాడారు. కార్యక్రమంలో మోటేపల్లి సత్యనారాయణ, వజ్జా రవి, మట్టుపల్లి భాను ప్రసాద్, టీడీపీ ప్రధాన కార్యదర్శి కె.వి.రంగారావు తదితరులు పాల్గొన్నారు.


రవీంద్రకుమార్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందిస్తున్న బాలస్వామి, రామకృష్ణప్రసాద్ తదితరులు

ఇంద్రకీలాద్రికి పోటెత్తిన భక్తులు

దర్శనానికి మూడు గంటలు


కొండ చుట్టూ హెడ్ వాటర్ వర్క్స్ వరకు నిలిపిన వాహనాలు


క్యూలైన్లో కిక్కిరిసి..

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మ దర్శనానికి గురువారం భక్తులు పోటెత్తారు. క్రిస్మస్ సందర్భంగా సెలవులు ప్రకటించడంతో కళాశాల, పాఠశాలల విద్యార్థులు, ఉద్యోగులు దుర్గమ్మ దర్శనానికి తరలివచ్చారు. కుమ్మరిపాలెం సెంటరు నుంచి కెనాల్ రోడ్డు వినాయకుడి గుడి వరకు ఆరు గంటల పాటు వాహనాలు నిలిచి పోయాయి. అమ్మవారిని దర్శనానికి మూడు గంటల సమయం పట్టిందని భక్తులు తెలిపారు. భక్తుల వాహనాలతో ఘాట్‌మార్గం, కనకదుర్గానగర్ నిండిపోయాయి. 80 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని అధికారులు తెలిపారు. క్యూలైన్లో వేచి ఉన్న భక్తులకు తాగునీరు అందించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు.

త్రిసభ్య కమిటీలో చోటు


శ్రీధర్

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: దేశంలో ఫుట్‌బాల్ ఐ-లీగ్ ఏర్పాటుకు అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య నియమించిన త్రిసభ్య కమిటీలో రాష్ట్ర ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షుడు, మాజీ ఎంపీ కోటగిరి శ్రీధర్‌కు స్థానం లభించిందని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.డానియేల్ ప్రదీప్ తెలిపారు. ఒక నూతన వ్యవస్థ ఏర్పాటుకు తీసుకున్న చర్యల్లో భాగంగా ఐ లీగ్ ఫుట్‌బాల్ క్లబ్స్ ప్రతినిధులతో ఈ త్రిసభ్య కమిటీ చర్చలు జరిపి త్వరలోనే ఐ లీగ్ ప్రారంభానికి కృషి చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. త్రిసభ్య కమిటీలో సభ్యుడిగా శ్రీధర్‌కు స్థానం దక్కడంపై జిల్లా ఫుట్‌బాల్ సంఘం అధ్యక్షుడు వై.శేషగిరిరావు, కార్యదర్శి బి.చక్రవర్తి, ఎస్వీఎన్ నివృతరావులు హర్షం వ్యక్తం చేశారు.

ఉత్సాహంగా బ్యాడ్మింటన్ పోటీలు


హోరాహోరీగా తలపడుతున్న షట్లర్లు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: నగరంలో ఓ వైపు క్రిస్మస్ వేడుకలతో సందడి వాతావరణం నెలకొని ఉండగా.. మరో వైపు 87వ జాతీయ సీనియర్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌తో పటమటలోని సీహెచ్ఆర్‌కే ఇండోర్ స్టేడియం, సాయి సందీప్ బ్యాడ్మింటన్ అకాడమీలో పండగ వాతావరణం నెలకొంది. రెండు రోజులుగా జరుగుతున్న ఛాంపియన్‌షిప్‌లో భాగంగా గురువారం సీహెచ్ ఆర్‌కే ఇండోర్ స్టేడియంలో మహిళల సింగిల్స్, డబుల్స్ పోటీలు జరుగుతుండగా.. సాయి సందీప్ బ్యాడ్మింటన్ అకాడమీలో పురుషుల సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ పోటీలు ఆసక్తికరంగా సాగాయి. సీహెచ్ఆర్‌కే ఇండోర్ స్టేడియాన్ని సందర్శించిన పలువురు ప్రేక్షకులు మహిళా మ్యాచ్‌లను తిలకించారు. శుక్రవారం స్త్రీ, పురుషుల వ్యక్తిగత, డబుల్స్ విభాగాలతో పాటు మిక్స్‌డ్ డబుల్స్‌లోనూ క్వార్టర్ ఫైనల్స్ మ్యాచ్‌లు జరగనున్నాయి. పోటీలు ఈ నెల 28వ తేదీన ముగియనున్నాయి.

బ్రాయిలర్ ధరలు

(కిలో /కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -135 రిటైల్ ధర 162 చికెన్ విత్ స్కిన్ - 235, చికెన్ స్కిన్‌లెస్ - 267.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 152, 161, 172 చికెన్ విత్ స్కిన్ - 294 చికెన్ స్కిన్‌లెస్ - 304.

జగన్మాత సేవలో హైకోర్టు న్యాయమూర్తి

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణమోహన్ కుటుంబ సభ్యులతో కలిసి గురువారం దర్శించుకున్నారు. అధికారులు ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం పలికారు. దేవస్థానం ఈవో శీనానాయక్ వారికి అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.


జస్టిస్ కృష్ణమోహన్ దంపతులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో శీనానాయక్

ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

విద్యాధరపురం, న్యూస్‌టుడే: పాతబస్తీలోని ఆర్సీఎం హైస్కూల్‌లో ఉపాధ్యాయ ఖాళీ పోస్టుల భర్తీకి అర్హులైన క్రిస్టియన్ మైనార్టీ మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయిని రత్నకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. సాంఘిక, గణితం, హిందీ సబ్జెక్టులకు ఒక్కొక్కటి, తెలుగు సబ్జెక్ట్-2, ఎస్‌జీటీ-2 పోస్టులకు క్రిస్టియన్ మైనార్టీ మహిళా అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపిక జరుగుతుందని తెలిపారు. దరఖాస్తులు ఆన్‌లైన్లో 2026 జనవరి 4వ తేదీలోపు హైస్కూల్ కరస్పాండెంట్ పేరుతో పంపాలని కోరారు. వివరాలకు ఫోన్ నంబరు 87902 76246లో సంప్రదించాలని తెలిపారు.

స్వామివారికి వెండి కవచం వితరణ

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని ధనశైల సీతారామచంద్రస్వామి దేవస్థానం (పెద్దరామాలయం)లో స్వామి వారికి సుమారు రూ.10 లక్షల విలువ చేసే వెండి కవచాన్ని పలువురు భక్తులు వితరణ చేశారు. గురువారం ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య చేతుల మీదగా ఈ కవచాన్ని దేవస్థానం కమిటీ ప్రతినిధులు ఆలయ ఈవో హరి దుర్గానాగేశ్వరరావుకు అందించారు. పూజల అనంతరం స్వామివారికి కవచాన్ని అలంకరించారు.


కవచం అలంకరించిన ఆలయ అర్చకులు

మ్యాజిక్ డ్రెయిన్ల పరిశీలన

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: నందిగామ మండలం సోమవరం గ్రామంలో పైలెట్ ప్రాజెక్టుగా నిర్మించిన మ్యాజిక్ డ్రెయిన్లను గురువారం కేంద్ర పంచాయతీరాజ్‌శాఖ జాయింట్ సెక్రటరీ రాజేష్‌కుమార్‌సింగ్ పరిశీలించారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో తక్కువ ఖర్చుతో నిర్మించిన ఈ డ్రెయిన్ల ఉపయోగాలను విజయవాడ డీఎల్‌పీవో కేవీ రాఘవన్ వివరించారు. ఈ డ్రెయిన్ల నిర్మాణంతో నీరంతా భూమిలో ఇంకిపోవడంతోపాటు బురద, దోమల సమస్యలేదని చెప్పారు. స్థానికులను ఈ డ్రెయిన్లతో ఎలాంటి మార్పు ఉందని ప్రశ్నించగా. .గతంలో రహదారి వెంట మురుగునీరు నిలిచి దోమలు ఉండేవని, ప్రస్తుతం ఎక్కడా మురుగు నీరు లేదని చెప్పారు. మ్యాజిక్ డ్రెయిన్ల ఫొటో ఎగ్జిబిషన్ పరిశీలించారు. ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సూచనతో ఎన్ఆర్‌జీఎస్ నిధులతో తక్కువ ఖర్చుతో ఈ డ్రెయిన్లు నిర్మించామని అధికారులు ఆయనకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఆర్వీఎస్ ప్రసాదరావు, వీబీ-జీ రామ్‌జీ ఏపీడీ బీఎల్ లక్ష్మీకుమారి, ఏపీవో శరత్‌బాబు, సాంకేతిక సహాయకులు శ్రీనివాస్, నీటి సంఘం అధ్యక్షుడు గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


డ్రెయిన్‌ను పరిశీలిస్తున్న కేంద్ర పంచాయతీరాజ్ శాఖ జాయింట్ సెక్రటరీ రాజేష్‌కుమార్‌సింగ్

లాటరీ పద్ధతిలో భూ విక్రయం

అడ్డుకున్న పోలీసులు

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: మండలంలోని ఓ రైతు తన భూమి అమ్మేందుకు వినూత్న ఆలోచించి.. లాటరీ పద్ధతిలో మునేరు పక్కనున్న 92 సెంట్ల భూమిని అమ్ముకునేందుకు ప్రయత్నాలు చేశారు. దీని కోసం లాటరీ విధానాన్ని ఎన్నుకున్నారు. ఒక్కో టికెట్ రూ.500 చొప్పున 3200 టికెట్లు విక్రయించారు. మొత్తం 15 వేల టికెట్లతో అమ్మి రూ.1.50 కోట్లు పొందేందుకు పథకం వేశారు. సంక్రాంతి పండగ రోజు లాటరీ తీసి విజేతకు భూమిని రిజిస్ట్రార్ చేస్తానని ప్రకటించడంతో ఆశావాహులు కొనుగోలు చేశారు. ఈ విషయం ఎస్సై అర్జున్‌కు తెలియడంతో సదరు రైతును పిలిపించి మాట్లాడారు. లాటరీ విధానంలో భూమి అమ్మకం చట్ట విరుద్ధమని చెప్పారు. వెంటనే నిలిపి వేయాలని, ఇప్పటి వరకు విక్రయించిన టికెట్లు డబ్బులు తిరిగి ఇచ్చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం లాటరీ విధానంతో ప్రజలు మోసపోతున్న తరుణంలో ఎస్సై అప్రమత్తమై అడ్డుకట్ట వేశారు.

27న ఉమ్మడి కృష్ణా జిల్లా రగ్బీ జట్ల ఎంపిక పోటీలు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: ప్రసాదంపాడులోని శ్రీవివేకానంద ఆంగ్ల మాధ్యమ హైస్కూల్‌లో ఈ నెల 27వ తేదీన ఉమ్మడి కృష్ణా జిల్లా సబ్ జూనియర్ బాలబాలికల రగ్బీ జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తామని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బొప్పన గాంధీ, కార్యదర్శి ఎన్.చంద్రకళ తెలిపారు. 2010, 2011, 2012 సంవత్సరాల్లో జన్మించినవారు పోటీలో పాల్గొనేందుకు అర్హులన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు ఆధార్‌కార్డు, పుట్టిన తేదీ ధ్రువపత్రంతో ఉదయం 10 గంటలకు స్కూల్ ప్రాంగణంలో హాజరవ్వాలన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ 78933 22468 నంబరుకు సంప్రదించాలన్నారు.

కాకాని జీవితం ఆదర్శనీయం

బెంజిసర్కిల్(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే: కాకాని వెంకటరత్నం జీవితం నేటి రాజకీయ నాయకులకు ఆదర్శనీయమని మాజీ మంత్రి వసంత నాగేశ్వరరావు అన్నారు. కాకాని ఆశయ సాధన సేవా సమితి అధ్యక్షుడు తరుణ్ కాకాని ఆధ్వర్యంలో ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు కాకాని వెంకటరత్నం వర్ధంతి గురువారం బెంజిసర్కిల్‌లో నిర్వహించారు. కాకాని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా హాజరైన నాగేశ్వరరావు మాట్లాడుతూ జై ఆంధ్ర ఉద్యమంలో కాకాని పాత్ర ఎనలేనిదని కొనియాడారు. ఆయన ఆశయ సాధన కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. తరుణ్ కాకాని మాట్లాడుతూ కృష్ణా నది తీరాన కాకాని వెంకటరత్నం స్మారకవనం ఏర్పాటు చేస్తామని, బెంజిసర్కిల్‌లో విగ్రహాన్ని తొలగించినప్పుడు ఇచ్చిన హామీ అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర చైల్డ్ వెల్ఫేర్ బోర్డు ఛైర్మన్ ఏవీ నాగేశ్వరరావు, భాజపా కిసాన్ మోర్చా అధ్యక్షుడు కొల్లి నాగేశ్వరరావు, ఆచార్య ఎన్జీ రంగా ట్రస్ట్ ఛైర్మన్ గొగినేని ధనశేఖర్, అక్కినేని ఆనంద్, సుధా, వేమూరి నాగేశ్వరరావు, న్యాయవాది ముళ్లపూడి సత్యనారాయణ, స్టార్ మా కామెంటరీ దొడ్డపనేని కల్యాణ్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు. అలాగే మాజీ ఎమ్మెల్యే యలమంచిలి రవి తదితరులు వెంకటరత్నం విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు.


వెంకట రత్నం వర్ధంతి కార్యక్రమంలో వసంత నాగేశ్వరరావు, తరుణ్ కాకాని తదితరులు

బీసీ బిల్లు సాధనకు కృషి చేద్దాం

కరెన్సీనగర్: ప్రధాని మోదీ ముఖ్యఅతిథిగా 5లక్షల మందితో రాష్ట్రంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని భాజపా రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య పేర్కొన్నారు. చట్ట సభల్లో బీసీలకు రిజర్వేషన్లు సాధించే ఉద్యమం దేశవ్యాప్తంగా ఉద్ధృతం చేయాల్సిన సమయం ఆసన్నమైందని, ప్రతి బీసీ తమ ఆత్మగౌరవ పోరాటంగా భావించి బీసీ బిల్లు సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. విజయవాడ గురునానక్ రోడ్డులో రాష్ట్ర బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.మారేష్ అధ్యక్షతన గురువారం సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన కృష్ణయ్య మాట్లాడుతూ ప్రధాని మోదీ బీసీ పక్షపాతి అని ఆయనతోనే బీసీలకు న్యాయం జరుగుతుందన్నారు. త్వరలో విశాఖపట్నం, తిరుపతి, విజయవాడ వేదికలుగా బీసీ కుల సంఘాల సమావేశం ఏర్పాటు చేయబోతున్నామని, త్వరలో జాయింట్ యాక్షన్ కమిటీ ప్రకటించబోతున్నామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుపై బీసీ కుల సంఘాలకు సంపూర్ణ విశ్వాసం ఉందని, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర స్థాయిలో కులగణన ప్రక్రియ ప్రారంభించి బీసీల జనాభా ఆధారంగా బడ్జెట్ కేటాయించాలని, బీసీ కార్పొరేషన్లు ప్రకటించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో 139 పైగా ఉన్న బీసీ కులాల గణన కోసం ఎదురుచూస్తున్నామని, ఆ తేదీని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని పలువురు కుల సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.

తిరువూరు
• తిరువూరు • మైలవరం

గోదా రంగనాయకస్వామికి తిరుప్పావడ సేవ


గంపలగూడెం : పూజలో మహిళలు


తిరువూరు : అలంకరణలో వేంకటాచలస్వామి

గంపలగూడెం, న్యూస్‌టుడే: ధనుర్మాసోత్సవాల్లో భాగంగా గురువారం తిరువూరు, గంపలగూడెం, ఎ.కొండూరు మండలాల్లో వైష్ణవాలయాల్లో గోదా రంగనాయకులకు అర్చకులు విశేష పూజలు చేశారు. తిరువూరు వేంకటాచలస్వామి గుడిలో తిరుప్పావడోత్సవం నిర్వహించారు. భక్తులు గోదాదేవి తిరుప్పావై పాశురాలు ఆలపించారు.

చింతలనర్వలో నేత్రదానం


పూర్ణయ్య (పాతచిత్రం)

చింతలనర్వ (గంపలగూడెం), న్యూస్‌టుడే : మండలంలోని చింతలనర్వకు చెందిన యనమద్ది పూర్ణయ్య (89) గురువారం మృతి చెందారు. ఆయన నేత్రాలను కుమారులు నాగమల్లేశ్వరరావు, శ్రీనివాసరావు ఖమ్మం నేత్ర నిధి ఆసుపత్రికి దానం చేశారు. లయన్స్ క్లబ్ ప్రతినిధి జి.కృష్ణారెడ్డి చొరవతో కుటుంబ సభ్యులు నేత్రదానానికి అంగీకరించారు. నిపుణులు చింతలనర్వ వచ్చి పూర్ణయ్య కళ్లలోని కార్నియా తీసుకెళ్లారు. ఆయన మృతదేహాన్ని నియోజకవర్గంలోని పలు రాజకీయ పార్టీల నాయకులు సందర్శించి నివాళి అర్పించారు.

సత్యాలపాడు నుంచి భద్రాచలానికి పాదయాత్ర


పాదయాత్రగా వెళ్తున్న భక్తులు

సత్యాలపాడు (గంపలగూడెం), న్యూస్‌టుడే : మండలంలోని సత్యాలపాడులోని శ్రీసత్యాంబకేశ్వర్ గురుస్థాన్ నుంచి తెలంగాణ రాష్ట్రంలోని భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయానికి 520 మంది భక్తులు గురువారం కాషాయ జెండాలతో శ్రీరామ నామస్మరణ చేస్తూ పాదయాత్ర చేపట్టారు. గురుస్థాన్ వ్యవస్థాపక అధ్యక్షుడు టి.హనుమంతరాజు, టి.రామరాజు పర్యవేక్షణలో సీతారాముల ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి పాదయాత్ర ప్రారంభించారు. ముక్కోటి ఏకాదశి నాడు భద్రాద్రిలో తెప్పోత్సవం, ఉత్తరద్వారంలో స్వామిని దర్శించుకుని తిరుగు పయనమవుతామని వారు తెలిపారు.

పాఠశాలకు సామగ్రి వితరణ


అందజేసిన సామగ్రితో బ్యాంకు అధికారులు

మైలవరం, న్యూస్‌టుడే : మండలంలోని చంద్రాల ఆదర్శ ప్రాథమిక పాఠశాలకు ఐడీబీఐ నూజివీడు శాఖ ద్వారా సామగ్రి వితరణగా అందజేశారు. రూ.70 వేలతో బీరువా, బల్ల, కుర్చీలను బుధవారం అందజేసినట్లు ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో నూజివీడు, చంద్రాల బ్రాంచి మేనేజర్లు విజయ్ ప్రదీప్, బంగారుబాబు, విశ్రాంత ఉపాధ్యాయుడు పి.గోపాల్, సుధాకర్, సీఆర్‌పీ జమలయ్య పాల్గొన్నారు.

ఆట అటకెక్కింది

★ క్రీడా సామగ్రి ఉన్నా సమయం ఇవ్వరు ★ ఆదేవారు లేక మైదానాలు వెలవెల

మైలవరం, న్యూస్‌టుడే

క్రీడలు శారీరక దారుఢ్యానికి మానసిక ఉల్లాసానికి దోహద పడతాయంటూ.. క్రీడోత్సవాల సందర్భంగా ప్రజాప్రతినిధుల ఉపన్యాసాలు వింటూనే ఉంటాం. అందుకు కావాల్సిన క్రీడా సామగ్రి, ఆట వస్తువులు అందుతూనే ఉన్నాయి. కానీ, పోటీ ప్రపంచంలో సబ్జెక్టుల ఉత్తీర్ణతే ప్రామాణికంగా విద్యావ్యవస్థ మారటంతో ఆటలు ఆడలేక మైదానాలు వెలవెలబోతున్నాయి. అదనపు తరగతులు చదువుకే కేటాయిస్తుంటే ఆటల నిర్వహణ అంతంత మాత్రంగా సాగుతోంది. తాజాగా ప్రతి పాఠశాలకు కావాల్సిన ఆట వస్తువులను ప్రభుత్వం పంపినా ఇంకా ఆటలు మొదలవలేదు.

★ నియోజకవర్గవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలకు క్రీడా సామగ్రి సరఫరా చేశారు. ప్రధానంగా వాలీబాల్, టెన్నికాయిట్, యోగా మ్యాట్లు, క్రికెట్ కిట్లు, నెట్లు అందాయి. వాటితో నిత్యం సాధన చేయిస్తే విద్యార్థులకు శారీరక, మానసిక ఆరోగ్యం చేకూరుతుంది. కానీ.. అందరి దృష్టి మార్కులపై ఉండటంతో, ఎంత సామగ్రి ఉన్నా ఉపయోగం అంతంత మాత్రమేనన్న విమర్శలు వస్తున్నాయి.

సబ్జెక్టులకే అదనపు తరగతులు

ప్రస్తుతం ప్రతి ఉన్నత పాఠశాలలో సాయంత్రం గంట అదనపు తరగతులు నిర్వహిస్తున్నారు. విద్యార్థుల సంఖ్యను బట్టి ఒకరిద్దరు వ్యాయామోపాధ్యాయులు ఉంటున్నారు. కానీ ఆటల్లో శిక్షణకు సమయం కేటాయించడం లేదు. అదనపు సమయం సైతం తరగతుల నిర్వహణకే సరిపోతోంది. దీంతో చాలా పాఠశాలల్లో వ్యాయామోపాధ్యాయులు, ఉదయం ప్రతిజ్ఞ, మధ్యాహ్న భోజనం, క్రమశిక్షణపై పర్యవేక్షణకే పరిమితమవుతున్నారు. చేసేది లేక క్రీడల్లో ప్రతిభ చాటుతున్న విద్యార్థులకే తర్ఫీదు ఇస్తూ, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యేలా ప్రయత్నిస్తున్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోటీల్లోనూ సత్తా చాటే వారి సంఖ్య చాలా స్వల్పంగా ఉంది. దీంతో విలువైన క్రీడా పరికరాలను అందజేసినా, ఆశించిన స్థాయిలో సమయం లేక క్రీడలు ముందుకు సాగటం లేదన్న విమర్శలు వస్తున్నాయి.


ఇటీవల చంద్రాల కాంప్లెక్స్ పరిధిలో పాఠశాలకు క్రీడా సామగ్రిని అందజేస్తున్న ఉపాధ్యాయులు

నియోజకవర్గంలో ఇలా..

మొత్తం ప్రభుత్వ పాఠశాలలు :	147
అందులో ఉన్నత పాఠశాలలు :	42
విద్యార్థుల సంఖ్య	: 14,550

హిందూ సమ్మేళనం జయప్రదానికి సమావేశం

మైలవరం, న్యూస్‌టుడే: మైలవరంలో వచ్చే నెల 3న నిర్వహించనున్న హిందూ సమ్మేళనం విజయవంతం చేయాలని హిందూ ధర్మప్రచార మండలి సభ్యుడు వి.బాలాజీ ప్రసాద్ పేర్కొన్నారు. సమ్మేళనంలో భాగంగా గురువారం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. వివిధ భజన సమాజాలు, కుల సంఘాలు, లయన్స్ క్లబ్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులతో చర్చించారు. కార్యక్రమంలో వెంకటనారాయణ, వెంకటేశ్వరరావు, ఈశ్వర్, మణి, శ్రీను, సుధాకరరెడ్డి పాల్గొన్నారు.

తెదేపా జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శిగా అప్సర్

కొండపల్లి, న్యూస్‌టుడే : కొండపల్లికి చెందిన మైనార్టీ నాయకుడు అప్సర్‌కు తెదేపా జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి పదవి దక్కింది. ఆయన పురపాలిక కో- ఆప్షన్ సభ్యుడి పదవి ఆశించగా పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు పోటీ నుంచి విరమించుకున్నారు. సమర్థంగా బాధ్యతలు నిర్వహిస్తానని ఆయన పేర్కొన్నారు.

అమరేంద్ర ప్రసాద్ సేవలు ఎనలేనివి


విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందజేసిన తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు టీడీ జనార్దన్ తదితరులు

విస్సన్నపేట, న్యూస్‌టుడే : తెదేపా సీనియర్ నాయకుడు, విస్సన్నపేట కాకతీయ కమ్మ సేవా సమితి మాజీ అధ్యక్షుడు, ఉమ్మడి కృష్ణా జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ మాజీ పాలక మండలి సభ్యుడు వీరమాచినేని అమరేంద్ర ప్రసాద్ విగ్రహావిష్కరణ స్థానిక కాకతీయ కమ్మ కల్యాణ మండపంలో తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు తొండెపు దశరథ జనార్దన్ చేతుల మీదుగా నిర్వహించారు. విగ్రహానికి పూలమాలలు వేసి కూటమి పార్టీల నేతలు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో టీడీ జనార్దన్ మాట్లాడుతూ కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్‌గా తనతో పాటు మిత్రుడు ప్రసాద్‌రావు కలిసి పని చేశారని వెల్లడించారు. ఈ ప్రాంత రైతాంగానికి బ్యాంకు రుణాలు ఇప్పించారని.. ఆయన సేవలు ఎనలేనివని పేర్కొన్నారు. తిరువూరు నియోజకవర్గం తెదేపా యువ నాయకుడు, ప్రవాసాంధ్రుడు వల్లభనేని గిరిబాబు వితరణతో ఉన్నత చదువులో ప్రతిభ చూపిన విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందించారు. తెదేపా మండల అధ్యక్షుడు రాయల సుబ్బారావు, సీనియర్ నాయకులు ఎన్‌టీ వెంకటేశ్వరరావు, డాబా శ్రీను, బుద్దయ్య, కవులూరి రాజా, ఆకుల రాధా కృష్ణ, నాగమణి, కాకతీయ కమ్మ సేవా సమితి అధ్యక్షుడు చలసాని వెంకటేశ్వరరావు, కుటుంబ సభ్యులు, బంధువులు పాల్గొన్నారు.

ఎలా పడితే అలా.. ప్రమాదం జరిగితే ఎలా?


ట్రాఫిక్ మధ్యలో పశువులు

పట్టణంలో ప్రధాన రహదారులు, వీధుల్లో ఆవులు తిరుగుతూ వాహనదారులకు ఇబ్బంది కలిగిస్తున్నాయి. కూరగాయల మార్కెట్, బస్టాండ్, పాఠశాలలు, కళాశాలల సమీప ప్రాంతాల్లో ఇవి అకస్మాత్తుగా రోడ్డుపైకి వస్తున్నాయి. దీంతో ద్విచక్ర వాహనదారులు హడలి పోతున్నారు. పశువుల నియంత్రణ బాధ్యత వహించాల్సిన మున్సిపల్ శాఖకు పలుమార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదు. పశు యజమానులపై చర్యలు, గోశాలకు తరలింపు అన్నవి కాగితాలకే పరిమితమవుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు రోడ్లపై పశువుల సంచారాన్ని అరికట్టాలని.. లేకపోతే ఎప్పుడైనా పెద్ద ప్రమాదం జరిగే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, తిరువూరు టౌన్**

కూలితేనే... పట్టించుకుంటారా?



ఏళ్ల కిందట నిర్మించిన మూలపాడు పశు వైద్యశాల భవన నిర్వహణ విస్మరించడంతో శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉంది. భవనం వర్షాలకు ఉరుస్తుండటంతో సిబ్బంది ఇబ్బందుల నడుమ విధులు నిర్వహిస్తున్నారు. పైకప్పు పెచ్చులూడుతుండటంతో బిక్కుబిక్కుమంటూ పని చేస్తున్నామని వాపోతున్నారు. చుట్టుపక్కల ఆరు గ్రామాల నుంచి పాడి రైతులు పశువులను వైద్యం కోసం ఇక్కడికే తీసుకొస్తారు. ఉన్నతాధికారులు కనీసం ప్రభుత్వ ప్రజా భాగస్వామ్యంతో నూతన భవనాలను నిర్మించాలని పశు పోషకులు కోరుతున్నారు. **- ఇబ్రహీంపట్నం (గ్రామీణం), న్యూస్‌టుడే**

పట్టాలు కట్టరు.. జాగ్రత్తలు పాటించరు



జి.కొండూరు లోయ ప్రాంతం నుంచి నిత్యం టిప్పర్ లారీలతో కంకర జిల్లా నలుమూలలకు సరఫరా అవుతోంది. టిప్పర్ లారీలు సామర్థ్యానికి మించి లోడ్ చేసుకుని కంకరను వేరే ప్రాంతాలకు రవాణా చేస్తుంటాయి. కంకర అధికలోడ్ చేసిన పట్టాలు కట్టకుండా.. జాగ్రత్తలు వహించకుండా అలా వెళుతున్నాయి. దీంతో రహదారి వెంబడి కంకర పడుతోంది, ద్విచక్ర వాహనదారులు, పాదచారులు అవస్థలు పడుతున్నారని స్థానికులు వాపోతున్నారు. అధికారులు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. **- జి.కొండూరు, న్యూస్‌టుడే**

వ్యర్థాలు.. నిత్యం ఎన్నో అనర్థాలు



జూపూడి నుంచి కావవరం వరకు జాతీయ రహదారికి ఇరువైపులా నిర్మించిన కాలువల్లో వ్యర్థాలు పేరుకుని అధ్వానంగా ఉన్నాయి. ఫలితంగా మురుగు నిలిచి.. దుర్వాసనతో పాటు దోమలు వ్యాప్తి చెంది వ్యాధుల బారిన పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. మురుగు కాలువ శుభ్రత తమ పరిధిలో లేదని పంచాయతీలు, జాతీయ రహదారి సంస్థ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు చెబుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు. **-ఇబ్రహీంపట్నం (గ్రామీణం), న్యూస్‌టుడే**

ముచ్చనపల్లిలో జూదరుల అరెస్టు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : ముచ్చనపల్లి గ్రామంలో జూదం ఆడుతున్న వారిపై రెడ్డిగూడెం ఎస్సై ఎస్.శ్రీను, సిబ్బంది గురువారం దాడి చేశారు. నలుగురిని అరెస్టు చేసి.. రూ.5,030 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

బౌద్ధ స్తూపం సందర్శన

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని ధనంబోడు బౌద్ధ స్తూపాన్ని కేంద్ర పంచాయతీరాజ్ జాయింట్ సెక్రెటరీ రాజేష్ కుమార్‌సింగ్ గురువారం తహసీల్దార్ మనోహర్, మున్సిపల్ డీఈ శివకోటేశ్వరరావు, ఏఈ హనుమంతరావులతో కలిసి సందర్శించారు. స్తూపం ప్రాముఖ్యత గురించి రాజేష్‌కుమార్‌కు వివరించారు.

రూ. లక్షల వ్యయం.. నిరుపయోగం

ప్రభుత్వ పాఠశాలల్లో పని చేయని శుద్ధజల కేంద్రాలు

నిర్వహణ లేక మూలకు..

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే


చిలుకూరు ఉన్నత పాఠశాలలో నిరుపయోగంగా..

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు తాగునీటి కష్టాలు తీరడం లేదు. వైకాపా ప్రభుత్వ హయాంలో నాడు-నేడు పథకంలో రూ.లక్షలు వెచ్చించి పాఠశాలల్లో నీటి శుద్ధి యంత్రాలను అమర్చినా నిర్వహణ గాలికి వదిలేయడంతో అవి మూలన చేరాయి. దీంతో రూ.లక్షల వ్యయం వృథా అవుతోంది. ఇబ్రహీంపట్నం గ్రామీణ మండలంతో పాటు కొండపల్లి పురపాలికలో 31 ప్రాథమిక ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాలల్లో వీటిని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం రెండు, మూడు పాఠశాలల్లో ఇవి పని చేస్తున్నట్లు ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.

★ నాడు- నేడు పథకంలో భాగంగా రెండు విడతల్లో నీటి శుద్ధి యంత్రాలు ఏర్పాటు చేశారు. ఇవి పనిచేయక విద్యార్థులు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. గుత్తేదారులకు పలుమార్లు సమాచారం ఇచ్చినా పట్టించుకోలేదని ఉపాధ్యాయులు తెలిపారు. దీంతో విద్యార్థులు ఇంటి నుంచి సీసాలతో తాగునీరు తెచ్చుకుంటున్నారు. అవి ఉదయం నుంచి సాయంత్రం వరకు సరిపోక అవస్థలు పడుతున్నారు. మధ్యాహ్న భోజనం సమయంలో మరింత ఇబ్బంది కలుగుతోందని వాపోతున్నారు. వివరాలు ఉన్నతాధికారులకు నివేదించామని, తాగునీటికి ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామని ఉపాధ్యాయులు చెప్పారు.

కరుణామయుడు అరుదెంచిన వేళ..

ఘనంగా క్రిస్మస్ వేడుకలు


మైలవరం ఆర్సీఎం చర్చిలో దివ్యబలి పూజ చేస్తున్న పాస్టర్లు


తిరువూరు : మండలం రోలుపడి చర్చిలో వేడుకలో విశ్వాసులు

న్యూస్‌టుడే, బృందం : జిల్లాలో గురువారం క్రీస్తు జన్మదిన వేడుకలను విశ్వాసులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. క్రైస్తవాలయాల్లో మతబోధకులు క్రీస్తు జన్మ వృత్తాంతం వివరించి, బైబిల్ సందేశం అందించారు. కేకులు కోసి మిఠాయిలు పంచారు. పరస్పరం క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.


రెడ్డిగూడెం ఆర్సీఎం చర్చిలో కేకు కోస్తున్న నాగేశ్వరరెడ్డి, తెదేపా నాయకులు


జి.కొండూరులో ప్రార్థన చేస్తున్న జాన్ కోటేశ్వరరావు తదితరులు


తిరువూరు : నృత్యం చేస్తున్న బాలికలు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

స్పందనకు వందనం : ★ పట్టణంలోని మధిర రోడ్డు ఆర్‌సీఎం చర్చి వద్ద చెత్త పేరుకుని అపరిశుభ్రంగా ఉందని బాబూరావు 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా సమస్యను మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మున్సిపల్ పారిశుద్ధ్య విభాగ అధికారి సిబ్బందిని పంపి చెత్త శుభ్రం చేయించారు. ★ పట్టణంలోని సీఎస్ఐ చర్చి వద్ద కాలువల్లో మురుగు నిలిచి దోమలు పెరుగుతున్నాయని ప్రకాశ్‌రావు 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా మున్సిపల్ అధికారులకు తెలిపారు. మున్సిపల్ పారిశుద్ధ్య విభాగ అధికారి సిబ్బందిని పంపి పూడిక తీయించి.. దోమల మందు పిచికారీ చేయించారు. **-తిరువూరు టౌన్, న్యూస్‌టుడే**

? చెవుటూరు ఎస్సీ కాలనీలో కోతుల బెడద ఎక్కువై స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. త్వరగా వాటిని పట్టించాలి. **-పి.రోహిత్** ✔ సమస్య మా దృష్టికి వచ్చింది. ఉన్నతాధికారులతో చర్చించి.. సిబ్బందితో కోతులను తరిమేసేందుకు చర్యలు చేపడతాం. **-బసవ లింగేశ్వరరావు పంచాయతీ కార్యదర్శి -జి.కొండూరు, న్యూస్‌టుడే**

నిబద్ధతకు దక్కిన గౌరవం


రాధాకృష్ణ, నాగమణిని సన్మానిస్తున్న నాయకులు

విస్సన్నపేట, న్యూస్‌టుడే : విజయవాడ పార్లమెంటు తెదేపా కార్య నిర్వాహక కార్యదర్శిగా నియమితులైన బీసీ నాయకుడు ఆకుల రాధాకృష్ణ, కోశాధికారిగా ఎంపికైన నాదెళ్ల నాగమణిని తాతకుంట్లలో పార్టీ సీనియర్ నాయకుడు నక్కెళపు వెంకటేశ్వరరావు (బద్దె) నివాసంలో సన్మానించారు. ఈ సందర్భంగా బద్దె మాట్లాడుతూ తెదేపాలో నిబద్ధతకు దక్కిన గౌరవం ఈ పదవులు అన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు రాయల సుబ్బారావు, డాబా శ్రీను, ఎన్‌టీ వెంకటేశ్వరరావు వారికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వాజ్‌పేయీ సేవలు మరువలేనివి


గంపలగూడెంలో చిత్రపటానికి నివాళి

గొల్లపూడి, న్యూస్‌టుడే : దేశానికి మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయీ అందించిన సేవలు మరువలేనివని తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవినేని ఉమా మహేశ్వరరావు పేర్కొన్నారు. వాజ్‌పేయీ జయంతిని గొల్లపూడిలోని కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ సాధారణ కుటుంబంలో జన్మించిన వాజ్‌పేయీ కష్టపడి దేశ ప్రధాని అయ్యారని తెలిపారు. దేశంలో సుపరిపాలనకు నాంది పలికారని వెల్లడించారు. వాజ్‌పేయీ చిత్రపటం వద్ద పూలమాల వేసి నివాళి అర్పించారు. తెదేపా నాయకులు పాల్గొన్నారు.


గొల్లపూడిలో వాజ్‌పేయీ చిత్రపటానికి నమస్కరిస్తున్న మాజీ మంత్రి దేవినేని ఉమా

గంపలగూడెం : మండల కేంద్రంలో భాజపా నాయకులు వి.సుజాత, ఎ.క్రాంతికుమార్, ఎన్.యుగంధర్, కె.సూర్యప్రకాశ్ తదితరుల ఆధ్వర్యంలో గురువారం మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయీ జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళి అర్పించి, దేశానికి ఆయన అందించిన సేవలను స్మరించుకున్నారు.

ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నంలో వాజ్‌పేయీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. జిల్లా నాయకుడు రఘునాథరెడ్డి మాట్లాడుతూ వాజ్‌పేయీ పాలన జనరంజకమని, దేశంలో విప్లవాత్మక మార్పులకు ఆయన కృషి చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఆనంద్, బాలకోటేశ్వరరావు, మాధురి, భవాని, యుగంధర్, కీర్తి, నగీన పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో రూ.2 లక్షల ఆస్తి నష్టం


కాలిపోయిన పాక, ద్విచక్ర వాహనం

పోలిశెట్టిపాడు (ఎ.కొండూరు), న్యూస్‌టుడే: మండలంలోని పోలిశెట్టిపాడులో బుధవారం అర్ధరాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో అత్తునూరి కృష్ణారెడ్డికి చెందిన పశువుల పాక కాలిపోయింది. అందులోని మూడు పాడి గేదెల చర్మానికి మంటలు తగిలి తీవ్రంగా గాయపడ్డాయి. ద్విచక్ర వాహనం పూర్తిగా కాలిపోయింది. ప్రమాదంలో రూ.2 లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లింది. ప్రమాదానికి కారణాలు తెలియలేదని కృష్ణారెడ్డి తెలిపారు.

కారు ఢీకొని మహిళ దుర్మరణం

గోపాలపురం (ఎ.కొండూరు), న్యూస్‌టుడే : మండలంలోని గోపాలపురం వద్ద గురువారం రహదారి ప్రమాదంలో గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ భూక్యా శ్రీకమల (38) దుర్మరణం చెందింది. ఎస్సై జి.మహాలక్ష్మణుడు వివరాల మేరకు.. ఉదయం చిక్కుడు తోటలో కాయలు కోసి శ్రీకమల ఇంటికి నడుచుకుంటూ వస్తుండగా కారు ఆమెను ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన ఆమె అక్కడిక్కడే మృతి చెందింది. భర్త శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం తిరువూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కారును పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు.

31న రాత్రి నిబంధనలు పాటించాల్సిందే


మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ సురేష్

గొల్లపూడి, న్యూస్‌టుడే : నూతన సంవత్సరం సమీపిస్తున్న నేపథ్యంలో మద్యం దుకాణాల నిర్వాహకులు నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ సీఐ సురేష్ పేర్కొన్నారు. మద్యం దుకాణాల నిర్వాహకులతో గొల్లపూడిలోని మైలురాయి సెంటర్ వద్ద ఉన్న కార్యాలయంలో సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ సురేష్ మాట్లాడుతూ డిసెంబరు 31న రాత్రి మద్యం దుకాణాల వద్ద మద్యం తాగేందుకు అనుమతించవద్దని పేర్కొన్నారు. మద్యం తాగి వాహనం నడిపితే చర్యలు తీసుకుంటామనే హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. మద్యం తాగి వాహనాలను నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగి.. అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నారని తెలిపారు.

మట్టి అక్రమంగా తరలిస్తున్న లారీలపై కేసు



పోలీస్‌స్టేషన్ వద్ద లారీలు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : మద్దులపర్వ నుంచి మైలవరం మండలంలోని గణపవరంలో ఇటుక బట్టీలకు అక్రమంగా ఐదు లారీల్లో మట్టి తరలిస్తుండగా రెడ్డిగూడెం ఎస్సై ఎస్.శ్రీను, సిబ్బంది బుధవారం గుర్తించారు. లారీలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తమకు అనుమతులు ఉన్నాయని లారీ యజమానులు ముందు చెప్పగా చూపించాలని కోరారు. వారు చూపించక పోవడంతో కేసు నమోదు చేశారు.

అదనంగా మరో రెండు సరకులు

చౌక దుకాణాల్లో వచ్చే ఏడాదిలో జొన్నలు, గోధుమపిండి పంపిణీ

గంపలగూడెం, న్యూస్‌టుడే

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో కొత్త ఏడాది నుంచి రేషన్ కార్డుదారులకు పంచదార, బియ్యంతో పాటు అదనంగా గోధుమపిండి, జొన్నలు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే రాష్ట్ర పౌర సరఫరాల శాఖ నుంచి కార్డుదారులకు దీనిపై మార్గదర్శకాలు జారీ చేశారు. ఐదేళ్ల వైకాపా పాలనలో రేషన్ వ్యవస్థలో అరకొర సేవలతో కార్డుదారులు ఇబ్బందిపడ్డారు. దీంతో రేషన్ వ్యవస్థలో సంస్కరణలకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కొందరు కార్డుదారులకు డిసెంబరు నుంచే గోధుమల సరఫరా చేపట్టారు. తిరువూరు రెవెన్యూ డివిజన్‌లో జొన్నలు, గోధుమపిండి సరఫరాపై డీలర్లకు అధికారుల నుంచి సమాచారం అందింది. పౌర సరఫరాల శాఖ అధికారుల ఆదేశాల మేరకు గ్రామాల్లో చౌక ధరల దుకాణాల నిర్వాహకులు అదనపు సరకులకు డీడీలు తీసుకుని అధికారులకు అందజేయాల్సి ఉంది. మండల స్థాయి నిల్వ కేంద్రాలకు గోధమపిండి, జొన్నలు చేరగానే డీలర్లకు సరఫరా చేస్తారు.

★ తిరువూరు, గంపలగూడెం, విస్సన్నపేట, ఎ.కొండూరు, రెడ్డిగూడెం మండలాల్లో 180 రేషన్ దుకాణాలు ఉండగా 97,339 మంది కార్డుదారులు ఉన్నారు. వయో వృద్ధులకు ఇళ్ల వద్దనే సరకులు అందిస్తున్నారు. మిగిలిన వారు 1 నుంచి చౌక ధరల దుకాణాల్లో తీసుకుంటున్నారు. గోధుమ పిండి బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.62 ఉండగా ప్రభుత్వం కార్డుదారులకు రూ.16కు అందించనుంది. కిలోకు రూ.46 వరకు రాయితీ లభించనుంది. అలాగే చక్కెర వ్యాధి బాధితులకు ఉపయుక్తంగా ఉంటుందని జొన్నలు 3 కిలోలు ఉచితంగా సరఫరా చేస్తున్నారు. వాటి స్థానంలో కోటా బియ్యంలో 3 కిలోలు తగ్గిస్తారు. ఇప్పటికే పంచదార కిలో రూ.17కు, బియ్యం ఉచితంగా అందిస్తున్నారు.

ఛాంపియన్


స్మృతి మంధాన

సిరీస్ పట్టేయాలని..

రాత్రి 7 నుంచి

- జోరుమీదున్న భారత్
- శ్రీలంకతో మూడో టీ20 నేడు

తిరువనంతపురం

బ్యాటింగ్‌లో ఎదురులేదు.. బౌలింగ్‌లో తిరుగులేదు.. వరుసగా రెండు టీ20ల్లో మనమ్మాయిలదే హవా. ప్రత్యర్థి నుంచి కనీస ప్రతిఘటన లేదు. శ్రీలంకతో అయిదు మ్యాచ్‌ల సిరీస్‌లో ఇంకా మూడు మ్యాచ్‌లున్నాయి. కానీ మూడో మ్యాచ్‌లోనే సిరీస్‌ను పట్టేయాలన్న పట్టుదలతో ఉంది టీమ్ ఇండియా. విశాఖలో తొలి రెండు మ్యాచ్‌ల్లో ఘన విజయం సాధించిన హర్మన్‌సేన.. శుక్రవారం తిరువనంతపురంలో మూడో టీ20లో లంకను ఢీకొననుంది. సూపర్ ఫామ్‌లో ఉన్న భారత జట్టును ఎదుర్కోవడం లంకకు సవాలే. తొలి రెండు మ్యాచ్‌ల్లో బ్యాటర్లు, బౌలర్లు సమష్టిగా సత్తా చాటారు. క్రమశిక్షణతో బౌలింగ్ చేస్తున్న స్పిన్నర్లు శ్రీచరణి, వైష్ణవిశర్మ పేసర్ క్రాంతి గౌడ్.. లంక బ్యాటర్లను క్రీజులో నిలబడనీయడం లేదు. ప్రత్యర్థి జట్టును తక్కువ స్కోరుకే కట్టడి చేస్తూ బ్యాటర్ల పనిని తేలిక చేస్తున్నారు. తొలి మ్యాచ్‌లో 121 పరుగులకే పరిమితమైన లంక.. రెండో మ్యాచ్‌లో 128 పరుగులే చేసింది. మూడో మ్యాచ్‌లోనూ బౌలర్ల నుంచి అత్యుత్తమ ప్రదర్శనను టీమ్ మేనేజ్‌మెంట్ ఆశిస్తోంది. అయితే బ్యాటింగ్‌కు అనుకూల తిరువనంతపురం పిచ్‌పై వీరు జోరు కొనసాగిస్తారా అన్నది ఆసక్తికరం. జ్వరం కారణంగా రెండో మ్యాచ్‌కు దూరమైన దీప్తి శర్మ.. మూడో మ్యాచ్ ఆడనుండటం.. జట్టు బౌలింగ్‌ను మరింత బలోపేతం చేయనుంది. మరోవైపు బ్యాటర్లలో స్మృతి మంధాన నుంచి జట్టు పెద్ద ఇన్నింగ్స్ ఆశిస్తోంది. తొలి రెండు మ్యాచ్‌ల్లో ఆమె తక్కువ స్కోరు(25, 14)కే వెనుదిరిగింది. జెమీమా, షెఫాలి వర్మ అర్ధసెంచరీలతో జోరు మీదున్నారు. టాప్ ఆర్డరే విజయాలను అందించడంతో మిగతా బ్యాటర్లకు ఆడే అవకాశమే రాలేదు. మరోవైపు సిరీస్‌లో అవకాశాలను సజీవంగా ఉంచుకోవాలని శ్రీలంక ఆశిస్తోంది. ఆ జట్టు 2024లో చివరగా భారత్‌పై గెలిచింది. ఇప్పటివరకు భారత్‌తో 11 టీ20లు ఆడిన లంక.. 9 మ్యాచ్‌ల్లో ఓడిపోయింది.


శ్రీచరణి

- మరో 4 వికెట్లు పడగొడితే అంతర్జాతీయ టీ20ల్లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా దీప్తి శర్మ (148) రికార్డు సృష్టిస్తుంది.
- గ్రీన్‌ఫీల్డ్ స్టేడియంలో ఇప్పటివరకు జరిగిన నాలుగు అంతర్జాతీయ టీ20ల్లో తొలుత బ్యాటింగ్ చేసిన జట్టు ఒకేసారి గెలిచింది. పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలం. మంచు ప్రభావం చూపే అవకాశమున్న ఈ వేదికలో.. టాస్ గెలిచిన జట్టు తొలుత ఫీల్డింగ్ ఎంచుకోవచ్చు.

వారి కళ్లలో పతకాల వెలుగు

ఆ అమ్మాయిలకు పుట్టుకతో చూపు లేదు. ఎక్కడికి వెళ్లాలన్నా ఎవరో ఒకరు తోడు రావాలి. ఏం చేయాలన్నా ఎవరో ఒకరు సహాయం చేయాలి. ప్రతి క్షణం.. మరొకరిపై ఆధారపడే జీవితం. అయినా వారి తల్లిదండ్రులు పిల్లల్ని భారంగా భావించలేదు. తామే వారికి కళ్లుగా మారారు. వాళ్లలో గుండె ధైర్యం నింపారు. ఈనాడు సీఎస్ఆర్ కార్యక్రమం 'లక్ష్య' కూడా తోడవడంతో ఆ అమ్మాయిలకు కొండంత అండ దొరికినట్లయింది. అంతే.. ఆకాశమే హద్దుగా రాణించిన వారిద్దరు అంతర్జాతీయ స్థాయిలో పతకాలు కొల్లగొట్టారు. దుబాయ్‌లో జరిగిన యూత్ ఆసియా పారా క్రీడల్లో జి.శ్రుతి (1500 మీటర్ల పరుగు), బొర్రా అక్షయ అనురాధ (షాట్‌పుట్) కాంస్య పతకాలతో సత్తాచాటారు.

ఈనాడు డిజిటల్ - హైదరాబాద్

అక్షయ లక్ష్యం


అక్షయ


అక్షయ తండ్రి రమేష్ సెక్యూరిటీ గార్డుగా.. తల్లి దేవి ఓ షాపులో పనిచేస్తుంటారు. ఆమె నేత్ర కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతోంది. 2019లో షాట్‌పుట్, జావెలిన్ త్రోతో పాటు పరుగులో శిక్షణ ప్రారంభించింది. 2020 కాకినాడలో రాష్ట్రస్థాయి పోటీల్లో షాట్‌పుట్‌లో బంగారు పతకం గెలుచుకుంది. 2022 నవంబరులో వైజాగ్‌లో రాష్ట్ర స్థాయి పోటీల్లో మూడు స్వర్ణాలు సాధించింది. అదే ఏడాది గుజరాత్‌లో జాతీయ స్థాయి టోర్నీలో షాట్‌పుట్‌లో స్వర్ణం.. 100 మీటర్ల పరుగులో కాంస్య పతకాలు నెగ్గింది. బెంగళూరులో షాట్‌పుట్‌లో బంగారు, జావెలిన్ త్రోలో కాంస్యాలు సాధించింది. 2024 నవంబర్‌లో అనంతరపురంలో జాతీయ స్థాయి టోర్నీలో షాట్‌పుట్, డిస్కస్ త్రోలో వరుసగా స్వర్ణం, రజతం గెలుచుకుంది. అనంతరం బెంగళూరులో జాతీయ స్థాయి టోర్నీలో షాట్‌పుట్‌లో స్వర్ణం, 100 మీ పరుగులో కాంస్యం సొంతం చేసుకుంది. 'లక్ష్య' సహకారంతో రాష్ట్ర, జాతీయ స్థాయిలో పోటీల్లో అక్షయకు ఎదురులేకుండా పోయింది. ఇటీవలి యూత్ ఆసియా పారా క్రీడల్లో షాట్‌పుట్‌లో ఆమె కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. 2028 పారాలింపిక్స్‌లో దేశానికి బంగారు పతకాన్ని అందించాలన్నది అక్షయ లక్ష్యం.

శ్రుతి ఆశయం


శ్రుతి

కర్నూలు జిల్లాకు చెందిన శ్రుతి తల్లిదండ్రులు వరలక్ష్మి, జయరాములు కూలీ పనులు చేస్తుంటారు. హైదరాబాద్‌లోని నేత్ర కళాశాలలో శ్రుతి ఇంటర్ చదువుతోంది. 2024లో డిస్కస్ త్రో ప్రారంభించింది. మొదట్లో చాలా ఇబ్బందులు పడింది. 'ఆడపిల్లకు ఎందుకు ఇవన్నీ.. ఇంట్లోనే ఉంచండి.. తనకి ఏం కనిపిస్తుంది' అంటూ ఊళ్లో ఇరుగు పొరుగు వాళ్లు అనేవాళ్లు. అమ్మానాన్న మాత్రం అందరి పిల్లల్లా తమ కుమార్తె ఆగిపోకూడదని భావించారు. కుమార్తె పట్టుదలకు మద్దతుగా నిలిచారు. శ్రుతికి ధైర్యాన్ని అందించారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయని శ్రుతి.. 2024లో అనంతపురంలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో డిస్కస్ త్రోలో బంగారు పతకం సాధించింది. అనంతరం రంగారెడ్డి జిల్లాలో జాతీయ టోర్నీలో రజతం గెలుచుకుంది. ఈ ఏడాది మంగళగిరిలో రాష్ట్రస్థాయి టోర్నీలో డిస్కస్ త్రో, జావెలిన్ త్రో, 100 మీటర్ల పరుగులో మూడు బంగారు పతకాలను సొంతం చేసుకుంది. 'లక్ష్య' అండగా నిలవడంతో అక్కడ్నుంచి వెనుదిరిగి చూడలేదు. అప్పటి వరకు ఎన్నో ఆర్థిక ఇబ్బందులతో సతమతమైన శ్రుతి ఆత్మవిశ్వాసం రెట్టింపయింది. విశాఖపట్నం, మధ్యప్రదేశ్‌లలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో షాట్‌పుట్, డిస్కస్ త్రో విభాగాల్లో రజతాలు.. 1500 మీటర్ల పరుగులో బంగారు పతకాలను సాధించింది. ఇటీవల దుబాయ్‌లో యూత్ ఆసియా పారా క్రీడల్లో 1500 మీ పరుగులో కాంస్యంతో మెరిసింది. మొదటిసారి పతకాన్ని ఇంటికి తీసుకెళ్లి అమ్మానాన్నలకు చూపించినప్పుడు వాళ్ల ఆనందానికి అవధుల్లేవు. మరిన్ని అంతర్జాతీయ పతకాలు గెలుచుకుని.. ఉద్యోగం సంపాదించి అమ్మానాన్నలను బాగా చూసుకోవాలన్నది శ్రుతి ఆశయం.

క్రీడల్లో బంధుప్రీతికి తెరపడింది


నరేంద్ర మోదీ

దిల్లీ: క్రీడల్లో, జట్టు ఎంపికలో బంధుప్రీతికి, అవకతవకలకు దశాబ్దం క్రితమే తెరపడిందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఇప్పుడు అత్యంత పేద కుటుంబాలకు చెందిన పిల్లలు కూడా ప్రతిభ, కఠోర శ్రమతో అత్యున్నత స్థాయికి ఎదగొచ్చని 'సంసద్ ఖేల్ మహోత్సవ్' కార్యక్రమంలో ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. "2014కు ముందున్న పద్ధతులకు తెరపడింది. అత్యంత పేద కుటుంబాల పిల్లలు కూడా ఇప్పుడు అత్యున్నత స్థాయికి ఎదగగలరు. ప్రతి ఏడాది క్రీడలకు రూ.3,000 కోట్లకు పైగా బడ్జెట్ కేటాయిస్తున్నాం. 2014కు ముందు రూ.1,200 కోట్లు మాత్రమే క్రీడల బడ్జెట్ ఉండేది. దేశంలోని ప్రతి క్రీడాకారుడికి చెప్పేదొక్కటే.. మీరు ఆడుతున్నది విజయం కోసం కాదు.. దేశం కోసం. త్రివర్ణ పతాకం గౌరవం, ప్రతిష్ఠ కోసం ఆడుతున్నారు. ఆటల్లో అత్యుత్తమ ప్రదర్శన చేసేలా తమ పిల్లలను తల్లిదండ్రులు ప్రోత్సహించాలి" అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

ఇంగ్లాండ్ పుంజుకునేనా?

ఆసీస్‌తో యాషెస్‌తో నాలుగో టెస్టు నేటి నుంచి


స్టోక్స్

మెల్‌బోర్న్: యాషెస్ సిరీస్‌లో మరో సమరానికి వేళైంది. ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ మధ్య నాలుగో టెస్టు శుక్రవారం ఆరంభం కానుంది. ఇప్పటికే 3-0తో సిరీస్‌ను చేజిక్కించుకున్న ఆతిథ్య ఆసీస్ రెట్టించిన ఉత్సాహంతో పోరుకు సిద్ధమైంది. వరుస పరాభవాలతో ఆత్మవిశ్వాసం దెబ్బతిన్న ఇంగ్లాండ్‌కు ఆ జట్టును అడ్డుకోవడం పెద్ద సవాలే. పేస్‌కు అనుకూలిస్తుందని భావిస్తున్న పచ్చిక పిచ్‌పై స్పిన్నర్ లేకుండానే బరిలోకి దిగాలని ఆస్ట్రేలియా నిర్ణయించింది. ఈ మ్యాచ్ కోసం ఆసీస్ ప్రకటించిన 12 మంది సభ్యుల జట్టులో స్పిన్నర్ లేడు. బౌలింగ్ విభాగంలో అందరూ పేసర్లే. గాయపడ్డ స్పిన్నర్ లైయన్ స్థానంలో మర్ఫీ ఆస్ట్రేలియా జట్టులోకి వచ్చాడు. కానీ అతణ్ని పక్కన పెట్టారు. ఇంగ్లాండ్ తన తుది జట్టును బుధవారమే ప్రకటించింది. స్టార్ ఫాస్ట్‌బౌలర్ జోఫ్రా ఆర్చర్ గాయం కారణంగా ఈ మ్యాచ్‌తో పాటు చివరి టెస్టుకు దూరమయ్యాడు.

బీడబ్ల్యూఎఫ్ అథ్లెట్ల కమిషన్ ఛైర్‌పర్సన్‌గా సింధు


సింధు

దిల్లీ: రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత పీవీ సింధు బీడబ్ల్యూఎఫ్ అథ్లెట్ల కమిషన్ ఛైర్‌పర్సన్ (2026-29)గా ఎన్నికైంది. ఆమె బీడబ్ల్యూఎఫ్ కౌన్సిల్ సభ్యురాలిగా కూడా ఉంటుంది. "ఎంతో బాధ్యతతో కొత్త బాధ్యతలు తీసుకుంటున్నా. అథ్లెట్ల కమిషన్ ఛైర్‌పర్సన్‌గా అథ్లెట్ల తరఫున నిలబడతా. అథ్లెట్లు, పాలకులకు మధ్య వారధిలా ఉంటా" అని సింధు చెప్పింది. సింధు 2020 నుంచి బీడబ్ల్యూఎఫ్ ఇంటిగ్రిటీ రాయబారిగా ఉంటోంది.

అందరి దృష్టీ అతడిపైనే. ఎక్కడ చూసినా అతడి గురించి చర్చే! బ్యాటు పట్టాడంటే బాదుడే బాదుడు. క్రీజులో అడుగుపెట్టాడంటే విరుచుకుపడుతున్నాడు. అలవోకగా సిక్స్‌లు, ఫోర్లు దంచేస్తున్నాడు. సునాయాసంగా సెంచరీలు కొడుతున్నాడు. వయసు 14 ఏళ్లే అయినా.. పరిచయం అక్కర్లేని పేరుగా మారిపోయాడు. అతడే దేశవాళీలో ప్రకంపనలు సృష్టిస్తోన్న బిహార్ చిన్నోడు వైభవ్ సూర్యవంశీ. వయసు తక్కువే అయినా.. ఆట చూస్తుంటే అతణ్ని సీనియర్ జట్టుకు ఎంపిక చేయాల్సిన సమయం ఆసన్నమైందా అన్న ప్రశ్న తలెత్తుతోంది!


వైభవ్

టైమొచ్చిందా..?

ఈనాడు క్రీడావిభాగం

అది ఈ ఏడాది ఏప్రిల్ నెల. క్రికెట్ అభిమానులంతా ఐపీఎల్ మ్యాచ్‌లను ఆస్వాదిస్తున్నారు. హఠాత్తుగా ఓ రోజు వైభవ్ పేరు మార్మోగిపోయింది. మ్యాచ్‌లను చూడాలనే ఉత్సాహం చూపే వయసులో ఏకంగా ఆడే అవకాశమే దక్కించుకున్నాడు ఆ బాలుడు. రెండు మ్యాచ్‌ల ముందు మాత్రమే అరంగేట్రం చేసిన ఆ చిన్నోడు రాజస్థాన్ రాయల్స్ ఇచ్చిన అవకాశాన్ని పూర్తిగా అందిపుచ్చుకున్నాడు. తన మూడో మ్యాచ్‌లో అనుభవజ్ఞుడిలా విరుచుకుపడ్డాడు. ప్రత్యర్థి గుజరాత్ టైటాన్స్‌కు షాకిస్తూ.. క్రికెట్ ప్రపంచాన్ని నివ్వెరపరుస్తూ సంచలన రీతిలో 35 బంతుల్లోనే మూడంకెల స్కోరును అందుకున్నాడు. ఐపీఎల్‌లో వేగంగా శతకం సాధించిన భారత బ్యాటర్‌గా రికార్డు సృష్టించాడు. ప్రత్యర్థి జట్టులో సిరాజ్, ఇషాంత్, ప్రసిద్ధ్, సుందర్, రషీద్ ఖాన్ వంటి బౌలర్లు ఉండడం గమనార్హం. వైభవ్ అంతటితో ఆగిపోతే ఇప్పుడీ కథ ఉండేదే కాదు. తన విధ్వంసక శతకం కేవలం గాలివాటం కాదని నిరూపిస్తూ.. వయసు చిన్నదే అయినా అత్యున్నత స్థాయిలో క్రికెట్ ఆడే టెక్నిక్, దృక్పథం తనలో ఉన్నాయని చాటుకుంటూ అదిరే ప్రదర్శను కొనసాగించాడు వైభవ్. బ్యాటింగ్ ఇంత తేలికా అనిపిస్తుంది అతడి నిర్భీతి ఆటను చూస్తుంటే. ఈ ఏడాది నవంబరులో ఆసియాకప్ రైజింగ్‌స్టార్స్ టోర్నమెంట్లో భారత్-ఎ తరఫున వైభవ్ చెలరేగిపోయాడు. 4 మ్యాచ్‌ల్లో 59.75 సగటుతో 239 పరుగులు చేశాడు. స్ట్రైక్‌రేట్ 243.87 అంటే అతడి విధ్వంసం ఎలా సాగిందో అర్థం చేసుకోవచ్చు. ఓ మ్యాచ్‌లో యూఏఈపై 42 బంతుల్లోనే 144 కొట్టాడు. అదే జోరులో ఆసియాకప్-19 వన్డే టోర్నీలోనూ వైభవ్ విరుచుకుపడ్డాడు 5 మ్యాచ్‌ల్లో 52.20 సగటు, 182.52 స్ట్రైక్‌రేట్‌తో 261 పరుగులు చేశాడు. టోర్నీలో అతడు 18 ఫోర్లు, 20 సిక్స్‌లు బాదడం విశేషం. యూఏఈపై అయితే ఆకాశమే హద్దుగా విరుచుకుపడ్డాడు. ప్రత్యర్థి బౌలింగ్‌ను తుత్తునియలు చేసిన అతడు.. 95 బంతుల్లో 14 సిక్స్‌లు, 9 ఫోర్లతో 171 పరుగులు సాధించాడు. యూత్ వన్డేల్లో భారత్ తరఫున రెండో వేగవంతమైన సెంచరీని నమోదు చేశాడు. అత్యధిక స్కోరు సాధించిన అంబటి రాయుడు రికార్డు (177)కు కేవలం ఆరు పరుగుల దూరంలో నిలిచిపోయాడు. ముస్తాక్ అలీ టీ20 టోర్నీలోనూ తనదైన ముద్ర వేసిన వైభవ్.. ఇప్పుడు విజయ్ హజారే వన్డే టోర్నీలో పరుగుల వరద పారిస్తున్నాడు. ఈ టోర్నీతో చిన్నోడి విధ్వంసం పరాకాష్టకు చేరింది. బిహార్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ సంచలనం.. అరుణాచల్ ప్రదేశ్‌పై నిర్దాక్షిణ్యంగా రెచ్చిపోయాడు. కళ్లు చెదిరే స్ట్రోక్‌ప్లేతో 84 బంతుల్లోనే 190 పరుగులు కొట్టాడు. ఈ క్రమంలో 16 ఫోర్లు, 15 సిక్స్‌లతో అలరించాడు. లిస్ట్-ఎ క్రికెట్లో సెంచరీ బాదిన అత్యంత పిన్నవయస్కుడిగా (14 ఏళ్ల 272 రోజులు)గా వైభవ్ రికార్డు సృష్టించాడు. కేవలం 36 బంతుల్లోనే అతడు మూడంకెల స్కోరును అందుకోవడం గమనార్హం. సీనియర్ క్రికెట్లో వన్డే ఫార్మాట్లో అతడికి ఇదే తొలి సెంచరీ. ముందు ముందు అతడి నుంచి మరిన్ని సునామీ ఇన్నింగ్స్‌లను చూస్తామనడంలో సందేహం లేదు.

సీనియర్ జట్టులోకి తీసుకోవాలా?

పరుగుల వరద పారిస్తున్న వైభవ్ సూర్యవంశీ ఏదో ఒక రోజు టీమ్‌ఇండియాలో చోటు సంపాదించడం ఖాయం. అయితే సూపర్ ఫామ్‌లో ఉన్న అతణ్ని సీనియర్ జట్టులోకి తీసుకోవాల్సిన సమయం ఇప్పటికే వచ్చేసిందా అన్నది ఇప్పుడు ఉదయిస్తున్న ప్రశ్న! ప్రతిభావంతుడే అయినా.. వయసు మరీ చిన్నదని, ఫస్ట్‌క్లాస్ క్రికెట్లో అతడు అనుభవం సంపాదించాల్సివుందని చాలా మంది నిపుణుల అభిప్రాయపడుతున్నారు. వైభవ్ అంతర్జాతీయ క్రికెట్లో ఆడడానికి వయసు అడ్డంకి కాదనే వాళ్లూ ఉన్నారు. మాస్టర్ బ్లాస్టర్ సచిన్ తెందుల్కర్ 16 ఏళ్ల వయసులోనే అరంగేట్రం చేశాడు. బహుశా.. వైభవ్ కూడా ఆ వయసు వచ్చేటప్పటికి పిలుపు అందుకునే అవకాశముంది. జనవరి-ఫిబ్రవరిలో జింబాబ్వే, నమీబియాలో జరిగే అండర్-19 ప్రపంచకప్‌నకు వైభవ్ ఎంపిక కావడం ఖాయం. ఆ తర్వాత ఐపీఎల్‌లోనూ నిలకడ కొనసాగిస్తే.. సెలక్షన్ కమిటీ అతడిపై సీరియస్‌గా దృష్టిపెట్టే అవకాశముంది.

జాతీయ సీనియర్ బ్యాడ్మింటన్

క్వార్టర్స్‌లో తన్వీ



దీపిక, స్రవంతి

ఈనాడు, అమరావతి: జాతీయ సీనియర్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో జూనియర్ స్టార్ తన్వీ శర్మ క్వార్టర్స్‌ఫైనల్లో అడుగుపెట్టింది. ప్రిక్వార్టర్స్‌లో ఆమె 21-11, 10-21, 21-10తో దేవిక సిహాగ్‌పై విజయం సాధించింది. టాప్ సీడ్ ఉన్నతి హుడా, రెండో సీడ్ అనుపమ ఉపాధ్యాయ కూడా తుది ఎనిమిదిలో చోటు దక్కించుకున్నారు. ఉన్నతి 19-21, 21-14, 21-12తో మేఘన రెడ్డిని ఓడించగా.. అనుపమ 21-13, 21-15తో అన్వి రాఠోడ్‌పై గెలిచింది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సూర్యచరిష్మ కూడా ముందంజ వేసింది. ఆమె 21-8, 21-10తో జమ్మూకశ్మీర్ షట్లర్ కృషిక మహాజన్‌పై విజయం సాధించింది. మహిళల డబుల్స్‌లో దీపిక- స్రవంతి (ఆంధ్రప్రదేశ్) జంట 21-12, 21-8తో జెస్సికా-యానియా (అరుణాచల్‌ప్రదేశ్) ద్వయంపై నెగ్గింది. పురుషుల డబుల్స్‌లో కార్తికేయ- పూజిత్ రెడ్డి (ఆంధ్రప్రదేశ్) ద్వయం 22-20, 7-21, 22-20తో రోహెన్-ఎలెన్‌సింగ్ (మణిపూర్) జోడీపై గెలిచింది. మరో ఆంధ్ర జోడీ భార్గవ్ రామ్, విశ్వతేజ 21-11, 21-11తో రాజస్థాన్‌కు చెందిన మురళీ శర్మ, ఆర్యన్ త్యాగి జోడీపై నెగ్గారు.

పెద్దగా అంచనాలు లేకుండా..


గుకేశ్

దోహా: ప్రపంచ ర్యాపిడ్, బ్లిట్జ్ చెస్ ఛాంపియన్‌షిప్‌లో తాను పెద్దగా అంచనాలతో బరిలోకి దిగట్లేదని ప్రపంచ ఛాంపియన్ గుకేశ్ అన్నాడు. ప్రయోగాలు చేయడానికి ఈ టోర్నీలో ఆడుతున్నానని చెప్పాడు. "అన్ని ఫార్మాట్లలో బాగా ఆడడం నాకు ముఖ్యం. ఈ ఏడాది ర్యాపిడ్, బ్లిట్జ్ చెస్‌ను మరింత సీరియస్‌గా తీసుకున్నా. కానీ క్లాసికల్ ఈవెంట్ల కన్నా ర్యాపిడ్, బ్లిట్జ్ ఈవెంట్లకు నేను కాస్త తక్కువ ప్రాధాన్యమిస్తా" అని టోర్నీ ఆరంభానికి ముందు జరిగిన విలేకరుల సమావేశంలో గుకేశ్ చెప్పాడు. "ఈ ఈవెంట్‌పై నాకు పెద్దగా అంచనాలు లేవు. నేను ఇక్కడికి ప్రయోగాలు చేయడానికి, ఆటను ఆస్వాదించడానికి వచ్చా" అని అన్నాడు. భారత్ నుంచి గుకేశ్‌తో పాటు ప్రజ్ఞానంద, అర్జున్, హరికృష్ణ, విదిత్, ఇంకొందరు ఆటగాళ్లు పోటీపడుతున్నారు. మహిళల విభాగంలో హంపి తదితరులు పోటీలో ఉన్నారు. ప్రపంచ ర్యాపిడ్, బ్లిట్జ్ ఛాంపియన్‌షిప్‌లో శుక్రవారం పోటీలు ఆరంభం కానున్నాయి.

గుకేశ్ కుర్రాడు... కార్ల్‌సన్: ప్రపంచ ఛాంపియన్ గుకేశ్ తన దృష్టిలో ఇంకా కుర్రాడేనని అయిదుసార్లు ప్రపంచ ఛాంపియన్ కార్ల్‌సన్ (నార్వే) అన్నాడు. "గుకేశ్ జన్మించేటప్పటికి నేను కనీసం టాప్-5లో ఉన్నా. కాబట్టి నా దృష్టిలో అతడు కుర్రాడే. కుర్రాళ్లతో ఆడడం ఎప్పుడూ ఆసక్తికరంగానే ఉంటుంది. కొందరు కుర్రాళ్లతో కొన్ని నెలలు ఆడకుండా ఉంటే.. వాళ్లు ఎంత బాగా ఆడబోతున్నారు అన్నది తెలియదు" అని చెప్పాడు. కుర్రాళ్లు అభివృద్ధి చెందుతూనే ఉంటారని కార్ల్‌సన్ అన్నాడు. ప్రపంచ ర్యాపిడ్, బ్లిట్జ్‌లో ప్రతిసారీ ఊహించని ఆటగాడు గొప్పగా రాణిస్తాడని చెప్పాడు.

శ్రేయస్ ఆరంభించాడు..


శ్రేయస్ అయ్యర్

ముంబయి: పక్కటెముకల గాయంతో రెండు నెలలు ఆటకు దూరమైన శ్రేయస్ అయ్యర్ కోలుకున్నాడు. తిరిగి టీమ్ ఇండియాకు ఆడే దిశగా సాధన ఆరంభించాడు. ముంబయిలో నెట్స్‌లో దాదాపుగా గంటసేపు అతడు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రాక్టీస్ చేశాడు. ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌లో ఫీల్డింగ్ సందర్భంగా శ్రేయస్ గాయపడిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత అతడు సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 టోర్నీకి.. న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌కు దూరమయ్యాడు. శ్రేయస్ విజయ్ హజారే టోర్నీలో ఆడాలన్న లక్ష్యంతో ఉన్నాడు. బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌కు వెళ్లనున్న అతడు.. కొన్ని రోజుల సాధన అనంతరం ఫిట్‌నెస్ పరీక్ష ఎదుర్కోనున్నాడు. పూర్తి ఫిట్‌గా ఉంటే విజయ్ హజారేలో కొన్ని మ్యాచ్‌లు ఆడే అవకాశముంది.

వసుంధర

vasundhara@eenadu.in

నా విజయం!

తాతలు చెప్పిన మంత్రమిది

మా అబ్బాయి బ్యాంకు ఉద్యోగిగా రిటైర్ అయ్యాడు. అప్పుడు వచ్చిన బెనిఫిట్స్‌లో కొంత మొత్తం పోస్టాఫీసులో నెలవారీగా వడ్డీ వచ్చే స్కీమ్‌లో పెట్టమని చెప్పా. అది ఈ ఏడాదే మెచ్యూర్ అయ్యింది. ఆ వచ్చిన మొత్తాన్ని తిరిగి పోస్టాఫీసులోనే సీనియర్ సిటిజన్ స్కీమ్‌లో జమ చేయమని చెప్పా. దీనిలో ప్రతి మూడు నెలలకోసారి వడ్డీ పొదుపు ఖాతాలో జమ చేస్తారు. ఇక్కడే మా అబ్బాయికి నేను మరో సలహానిచ్చా. ఆ వచ్చే వడ్డీతో ఆర్‌డీ ఖాతా ప్రారంభించమని చెప్పా. దీనివల్ల చక్రవడ్డీ ఫలితం ఉంటుంది. ఇన్ని సలహాలిచ్చిన నేను ఏ ఆర్థికశాస్త్రమూ చదవలేదు. 1954లో నర్సాపురంలోని టేలర్ స్కూల్లో ఎస్ఎస్ఎల్‌సీ మాత్రం చదివాను. అయినా ఈ సలహా ఎలా ఇవ్వగలిగానంటే వయసు రీత్యా వచ్చిన అనుభవంతోనే అని చెబుతాను. దీనికి మూల సూత్రం ఒక్కటే! మన తాత, ముత్తాతల నుంచి చెబుతూ వచ్చిన మంత్రమది. అదేంటంటే... లక్ష్మీదేవి 'నన్ను రూ.99 వరకూ పెంచు. ఆ తరవాత రూ.100 నుంచి నేను పెంచుతా' అనేదట. నేను అనుసరించమందీ అదే!

– శ్రీమతి యెండూరి హనుమావతి, కాకినాడ

మీరూ ఈ ఏడాది ఏదైనా సాధించినా, మార్పు తెచ్చుకోగలిగినా... మాతో పంచుకోండి.

ఇంటిచుట్టూ మొక్కలు పెంచడం అలంకరణ కోసమే కాదు, వాటి నుంచి అంతకుమించి ఎన్నో లాభాలూ ఉన్నాయి. వాటి రంగు, ఆకృతి, ఎదిగే క్రమం మన భావోద్వేగాలపైన ప్రభావం చూపుతాయి.

ఆకుపచ్చని ధ్యానం!



ఆకులూ, పువ్వులతో నిండుగా ఉన్న మొక్కల పక్కన కూర్చున్నా, పార్కుకు వెళ్లిన అనుభూతి కలుగుతుంది. ధ్యానంతో సమానమైన ప్రయోజనం సొంతమవుతుంది. ఇక్కడ ఏదో చేయడం, అమర్చడం, సాధించడం కాదు... ఆ క్షణం ప్రకృతిలో మమేకం కావడమే ప్రధానం. అందుకే దీనికి ప్లాంట్ మెడిటేషన్ అని కూడా పేరు.

- ఎప్పుడూ మన చుట్టూ ఉండే మొక్కలనే కాకుండా వీలున్నప్పుడు రకరకాల మొక్కలుండే ఉద్యానవనాలకు వెళ్లి వాటి పరిమళాల్నీ, అందాల్నీ ఆస్వాదించండి. అక్కడ గడ్డిలోనూ, మట్టిలోనూ నడవండి. వేళ్లతో ఆకుల్ని తాకండి. దీర్ఘంగా శ్వాస తీసుకోండి. ప్రకృతి ఎంత గొప్పదో అర్థమవుతుంది.
- పువ్వులు, కొమ్మలు, చిరుగాలి... ఇవన్నీ మన ఆలోచనల్ని వర్తమానంలోకి తెస్తాయి. కొద్ది నిమిషాల తర్వాత మనకు తెలియకుండానే మనసు తేలికవుతుంది. అందుకే మొక్కలంటే పచ్చదనం, అలంకరణ మాత్రమే కాదు, ప్రశాంతత కూడా. గాలికి కదిలే ఆకుల చప్పుడు వినండి. ప్రకృతి సందేశం విన్నవాళ్లు ప్రకృతికే కాదు, తమకు తాము కూడా మరింత దగ్గరవుతారు.
- రోజులో ఓ 20 నిమిషాలు మొక్కల మధ్యన గడిపితే చాలు... ఒత్తిడి హార్మోన్ల ప్రభావం తగ్గుతుంది. మనసు తేలికపడుతుంది.

'అంద'లం ఎక్కారు..!

అందాల పోటీలు... కేవలం కొలతలకే పరిమితం కాదు. ఆత్మవిశ్వాసం, సమయస్ఫూర్తిని ప్రదర్శించే మార్గం. తమ దేశ సంస్కృతీ సంప్రదాయాలను ప్రపంచానికి పరిచయం చేసే వేదికలు. కాబట్టే వీటిని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటారు. ఆ పోటీల్లో నిలిచి ప్రపంచాన్ని మెప్పించారు వీళ్లు. కిరీటాలనూ గెలుచుకున్నారు. అమ్మాయిలే కాదు... అమ్మలూ ఈసారి చరిత్ర సృష్టించారు. వాళ్ల ప్రయాణమిది...

నాయిక 2025

అమ్మ... అందాల రాణి!



ఆటల పోటీ అయినా... అందాల పోటీ అయినా... నువ్వా నేనా అంటూ సాగే ఫైనల్ సమరంలో విజయం సాధిస్తే వారి ఆనందానికి హద్దులుండవు. '2025 మిసెస్ యూనివర్స్'గా తన పేరు చెప్పినప్పుడు ఇలానే సంబరపడిపోయారు **షెరీ సింగ్**. ఆ సంతోషానికి గెలుపు మాత్రమే కాదు, ఈ పోటీలు మొదలైన 48ఏళ్ల తర్వాత మొదటిసారి మనకి కిరీటం రావడం కూడా కారణమే అంటారీమె. ఫిలిప్పీన్స్ వేదికగా, దాదాపు 120 దేశాలకు చెందిన మహిళలు ఈ పోటీల్లో పాల్గొనగా మిసెస్ యూనివర్స్ కిరీటం షెరీని వరించింది. ఈ పోటీలకి సౌందర్యంతోపాటూ, తెలివి, మానసిక దృఢత్వం, సమాజ సేవ, సానుకూల దృక్పథం... వీటన్నింటిని కొలమానంగా తీసుకుంటే అన్నింటిలోనూ షెరీ తనదైన ప్రతిభను కనబరిచి ఫ్యాషన్ ప్రియుల మెప్పునీ పొందారు. దిల్లీలో పుట్టిపెరిగారీమె. తొమ్మిదేళ్ల క్రితం సికందర్ సింగ్‌ను వివాహమాడి లండన్‌లో స్థిరపడ్డారు. వీరికి ఒక కుమారుడు. చిన్నప్పటి నుంచి బాస్కెట్‌బాల్ ఆడటం ఇష్టం. దాంతో స్కూల్, కాలేజీల్లో, జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని పలు పతకాలూ గెలుచుకున్నారు. ఫ్యాషన్‌పై ఉన్న మక్కువతో అందులో మాస్టర్స్ పూర్తి చేసిన ఈ బ్యూటీ సందర్భానికి తగినట్లుగా ఫ్యాషనబుల్‌గా ముస్తాబై ఆ ఫొటోలను సోషల్ మీడియాలో పంచుకుంటారు. అంతేకాదు లైఫ్‌స్టైల్, పేరెంటింగ్, ఫ్యాషన్ చిట్కాలను పోస్టు చేస్తూ ఈతరం అమ్మాయిల్లో స్ఫూర్తి నింపుతారు షెరీ. అందంలోనే కాదు సేవ చేయడంలోనూ ముందుంటారీమె. చిన్నారుల సంక్షేమం కోసం పలు స్వచ్ఛంద సంస్థలతో కలిసి పనిచేస్తున్నారు. 'ప్రతి ఒక్కరికీ స్నేహితులుంటారు. నా భర్తే నా బెస్ట్ ఫ్రెండ్. నాకు నచ్చిన ప్రతి విషయంలోనూ ప్రోత్సహిస్తారు. మిసెస్ యూనివర్స్ విజయం వెనక తన ప్రోత్సాహం ఎంతో ఉంది' అంటారీమె.

పెళ్లి ముగింపు కాదు... ఆరంభం!



పెళ్లి మన కలలకు ముగింపు కాదు... మరో ఆరంభం అంటారు 'మిసెస్ ఎర్త్ ఇంటర్నేషనల్ 2025' విజేత **విద్యా సంపత్ కర్కేరా**. మంగళూరులోని ఓ సాధారణ కుటుంబంలో పుట్టిపెరిగిన విద్య చిన్నప్పటి నుంచి ఫ్యాషన్ వేదికలపై నడవాలనుకునేవారట. అందమే కాదు... ఆలోచన, వ్యక్తిత్వం, సంస్కృతి కూడా మహిళలకు శక్తే అని నమ్ముతారీమె. అవే ఆమెను పెళ్లి తరవాత ఫ్యాషన్ ప్రపంచం వైపు అడుగులు వేసేలా చేశాయి. 'మిసెస్ ఎర్త్ ఇంటర్నేషనల్' పోటీలో విన్నర్ అవార్డుని అందుకున్న మొదటి మహిళగా చరిత్ర సృష్టించారు. 'చాలామంది మహిళలు పెళ్లి తర్వాత కెరియర్ ఆగిపోతుంది. మన ఆశయాలు, ఇష్టాలు వదులుకోవాలి అనుకుంటారు. కానీ, వయసు, బాధ్యతలు, పరిస్థితులు కలలకు అడ్డంకులు కావు. మనలో ధైర్యం ఉంటే ఈ ప్రపంచం మనదే' అంటారు విద్య. 'మహిళ ఎదగాలంటే ఆమె చుట్టూ ఉండే వారి మద్దతు కూడా ముఖ్యమే' అనే విద్య కుటుంబాన్ని చూసుకుంటూ తన కలను నిజం చేసుకున్నారు. ఈ ఏడాది ఫిలిప్పీన్స్‌లో 22 దేశాల నుంచి పోటీదారులు పాల్గొన్న ఈ పోటీలో మన దేశానికి ప్రాతినిధ్యం వహించి అన్ని రౌండ్లలోనూ తనదైన ప్రతిభను కనబరిచారు. మన దేశ సంస్కృతి ఉట్టిపడేలా జాతీయ చిహ్నాలైన పులి, నెమలి, తామర పువ్వులతో డిజైన్ చేసిన దుస్తులను ధరించి వేదికపై అందరి దృష్టిని ఆకర్షించారు. టాలెంట్ రౌండ్‌లో సంప్రదాయ నృత్యం చేసి విజేతగా నిలిచారు. 'అందం అంటే బాహ్య సౌందర్యమే కాదు మనసు కూడా స్వచ్ఛంగా ఉండాల'నే విద్య తన విజయానికి కారణం తనే భర్తే అంటున్నారు. అంతేనా దృఢ సంకల్పం ఉంటే కలలు సాకారం చేసుకోవడానికి పరిస్థితులు అడ్డుకావని రుజువు చేశారు విద్య.

ఐశ్వర్య... ప్రియాంకలే... స్ఫూర్తి!



కొందరి విజయాలు మరికొందరి కలలకు రెక్కలు తొడిగేలా ఉంటాయి. అలాంటి విజయాన్నే సాధించారు **సుకన్యా సుధాకరన్**. 2025 సంవత్సరానికిగానూ యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కి ప్రాతినిధ్యం వహిస్తూ, 'మిస్ ఇండియా వరల్డ్‌వైడ్' పోటీల్లో పాల్గొన్నారు. విజేతగా నిలిచి ప్రపంచవ్యాప్తంగా భారతీయ మహిళల గౌరవాన్ని పెంచారీమె. ముంబయి వేదికగా జరిగిన ఈ పోటీల్లో దాదాపు 38మంది భారతీయ మూలాలున్న అందాల తారలు పాల్గొన్నారు. 2014లో మిస్ కేరళ పోటీలో 'మిస్ ఫొటోజెనిక్'గా ఎంపికయ్యాక మోడలింగ్ ప్రయాణాన్ని ప్రారంభించారు సుకన్య. అబుదాబిలో పుట్టి పెరిగారీమె. చిన్నప్పటి నుంచి కూచిపూడి, భరతనాట్యం, మోహినీయాట్టం... వంటి నాట్య కళల్ని అభ్యసించడంతోపాటు స్టేజ్ ఆర్టిస్ట్‌గా అనేక షోల్లోనూ పాల్గొన్నారు. అవన్నీ ఫ్యాషన్ ప్రపంచానికి తనని మరింత దగ్గర చేశాయంటారు సుకన్య. 'మిస్ ఇండియా యూఏఈ' పోటీలో గెలిచి మిస్ ఇండియా వరల్డ్‌వైడ్‌కి అర్హత సాధించారు. అంతే కాదు, 2023లో మిస్ ఇండియా వరల్డ్‌వైడ్ పోటీలో సెకండ్ రన్నరప్‌గా నిలిచినా తన ప్రయత్నాన్ని ఆపలేదు. ఆ అనుభవాలే ఇప్పుడు విజయం సాధించడానికి ఉపయోగపడ్డాయట. 'కళా రంగంలో పోటీ ఎక్కువ. ఎవరి నైపుణ్యాలు వారికుంటాయి. మన ప్రతిభ, నమ్మకం, ఆత్మవిశ్వాసం, పోటీ తత్వంతోనే ముందడుగు వేయాలి. మోడల్ కావాలని కలలు కనే ప్రతి అమ్మాయి ఇతరులతో ఎప్పుడూ పోల్చుకోకూడదు. గెలుపోటములతో పని లేకుండా మైదానంలో క్రీడాకారుల్లానే పోటీలో పాల్గొనాలి. అంతేకాదు, వేదికేదైనా విజేతను నేనే అనే సంకల్పంతోనే కష్టపడాలి. ఇలా ఉంటే గెలుపు మనల్ని వెతుక్కుంటూ వస్తుంది' అంటారు సుకన్య. ఇంతకీ తను మోడలింగ్ రంగంలోకి రావడానికి స్ఫూర్తి ఐశ్వర్యరాయ్, ప్రియాంక చోప్రాలేనట. ఈ గుర్తింపుతో సంబంధం లేకుండా హెచ్‌ఆర్ ఎగ్జిక్యూటివ్‌గా విధులు నిర్వర్తిస్తోన్న సుకన్య సింప్లిసిటీ మెచ్చుకోదగ్గ విషయమే కదా!

వధువుల మనసు... పేస్టల్స్ వైపే!

నేటి ఫ్యాషన్

పెళ్లి వేడుకంటే తికమక మొదలయ్యేది... వధువు చీరల విషయంలోనే! కంచి, బనారస్, కోటా, టస్సర్... బోలెడు రకాలు. ఒకరు కాంజీవరం బాగుందంటే మరొకరు ఉప్పాడదే ట్రెండంటారు. తికమక అంతా ఇక్కడే... రంగుల విషయంలో మాత్రం ఈసారి వధువులు చాలా స్పష్టతతో ఉన్నారు. వాళ్ల ఓటు పేస్టల్స్‌కే! కాబట్టే ఈసారి వధువుల ఫ్యాషన్ ట్రెండ్‌లో పేస్టల్ కలర్స్ రాజ్యమేలాయి. ముదురు రంగుల్లో మెరిసిపోతారు, పెళ్లి కళ కొట్టొచ్చినట్టు కనిపిస్తుందన్న మాటల్ని పక్కన పెట్టేసి మరీ వీటినే ఎంచుకున్నారు. వీటిల్లోనూ పౌడర్ బ్లూ, బ్లష్ పింక్, మింట్ గ్రీన్, సాఫ్ట్ ఎల్లోలదే హవా! అందుకు కారణమూ లేకపోలేదు. ఈసారి అమ్మాయిలు జపించిందంతా మినిమలిస్టిక్ మంత్రమే! ఇదైతే సాఫ్ట్, తాజా లుక్‌ని ఇస్తుంది. క్లాస్ లుక్ సంగతైతే చెప్పనక్కర్లేదు. పైగా సంప్రదాయ నగలే వేసినా, స్టైలిష్ జ్యువెలరీనే ఎంచుకున్నా నప్పడం ఖాయం. కాబట్టే, ముచ్చటపడి మరీ మోడరన్ వధువులు పేస్టల్ వైపే మొగ్గు చూపారు. మీరూ ఈ జాబితాలో ఉన్నారా? అయితే మీ మనసు దోచిన రంగేంటి? లేదూ వచ్చే ఏడాది పెళ్లి పీటలు ఎక్కుతున్నారా? రిఫరెన్స్‌గానూ పెట్టేసుకోవచ్చు. ఏమంటారు?



అయినా గర్భం దాల్చట్లేదు!

మాకు ఒక పాప. తను పుట్టిన ఆరు నెలలకే గర్భం వస్తే అబార్షన్ చేయించుకున్నా. తరవాత ప్రెగ్నెన్సీ రాకుండా నాలుగేళ్లు మందులు వాడా. ఇప్పుడు ఇంకో బిడ్డకి జన్మనివ్వాలని ఉంది. అందుకని ఆరునెలలుగా మందులు ఆపేశా. అయినా గర్భం దాల్చట్లేదు. ఏదైనా సమస్యా? – ఓ సోదరి

అబార్షన్ అయ్యాక ప్రెగ్నెన్సీ రాకుండా మందులు వాడారు కదా! ఇవి అండం విడుదల కాకుండా ఆపుతాయి. అదీకాక మీరు ఏకంగా నాలుగేళ్లపాటు ఈ మందులను వాడటం కొనసాగించారు. వాటిని తీసుకోవడం ఆపేశాక రుతుచక్రం తిరిగి మొదలైనా అండోత్సర్గం లేదా అండాలు విడుదలవ్వడానికి సమయం పడుతుంది. ఈ సమయాన్ని పోస్ట్ పిల్ ఎనావ్యులేషన్ అని అంటారు. అంటే... నెలసరి తిరిగి మొదలైనా కానీ... మన శరీరం అండం విడుదల కాకుండా చేయడానికి అలవాటు పడి ఉంటుంది. కాబట్టి, తిరిగి సాధారణ స్థితికి రావడానికి కొన్ని నెలలు పడుతుంది. అందుకే మీకు ప్రెగ్నెన్సీ వెంటనే రావట్లేదు. అది పెద్ద సమస్య కాదు. కొంత ఓపిక పట్టండి. మీకు ఇంకా భయంగా తోస్తే ఓసారి వైద్యులను కలవండి. వాళ్లు అండం విడుదలవుతోందా లేదా అన్నది చెక్ చేసి చెబుతారు. నిజంగానే ఏదైనా సమస్య ఉంటే సంబంధిత మందులు వాడితే సరిపోతుంది. వ్యాయామం, తీసుకునే ఆహారం, బాడీ స్టిమ్యులేషన్ వంటివీ ప్రభావం చూపేవే. హార్మోన్లను ఇప్పటిదాకా మందులతో కట్టడి చేసి ఉంచారు. అవి తిరిగి సాధారణంగా పనిచేయాలి, ఆరోగ్యకరమైన అండం విడుదలవ్వాలంటే ఆరోగ్యకరమైన జీవనశైలి కూడా అవసరమే. వాటిపైనా దృష్టిపెట్టండి.

డియర్ వసుంధర



డా. చీపురుపల్లి వసుంధర
గైనకాలజిస్ట్

మీకు తెలుసా!

కౌమార దశలో అమ్మాయిలకు ఈస్ట్రోజన్ స్థాయిలు అధికంగా ఉంటాయి. దీనివల్ల అమ్మాయిల మెదడు, అబ్బాయిల మెదడు కంటే రెండేళ్లు ముందుగానే పరిపక్వం చెందుతుందని పరిశోధనల సారాంశం.

ఆశయాలకి రెక్కలు తొడిగితే..!

రోడ్ల మీద చెత్త ఏరుతూ... వచ్చిన మొత్తంతోనే కడుపు నింపుకొనేవారు పట్నాకు చెందిన ఓ ముగ్గురు అమ్మాయిలు. వాళ్లని చేరదీసి వసతులు కల్పించిందో సంస్థ. దాని ఆధ్వర్యంలోనే నైపుణ్యాల్ని పుణికిపుచ్చుకున్నారు సీమా, మరియం, రాధిక. ప్రస్తుతం ఓ హోటల్‌లో పనిచేస్తూ చదువుకుంటున్నారు. వీళ్ల గురించి తెలియాలంటే...

ఏది దొరికితే అదే తినేదాన్ని... – సీమా



నిరుపేద కుటుంబం మాది. నాకు ఆరేళ్లు ఉన్నప్పుడే నాన్న చనిపోయారు. తర్వాత అమ్మ కూడా చనిపోయింది. ఒక్కదాన్నే ఒంటరిగా రోడ్ల మీద చెత్త ఏరుకుంటూ వచ్చిన మొత్తంతో గడిపేదాన్ని. వీధుల్లోనే నిద్రపోయేదాన్ని. చెత్తలో దొరికిన ఆహారం తిన్న సందర్భాలూ చాలానే. 2014లో రెయిన్‌బో ఫౌండేషన్ వాళ్లు నా దగ్గరకు వచ్చారు. వివరాలు అడిగారు. తర్వాత స్థానికంగా ఉండే వసతి గృహానికి తరలించారు. పోషకాహారం, పరిశుభ్రత, మంచీచెడులన్నీ నేర్పారు. ఇప్పుడు నేను ఇంటర్ చదువుతున్నా. నా చదువు కోసం ఎవరిపైనా ఆధారపడకూడదని ఉద్యోగంలోనూ చేరాను. ఇక్కడే ఓ హోటల్‌లో కుకింగ్ సెక్షన్లో పనిచేస్తున్నా. హోటల్ మేనేజ్‌మెంట్ చదవాలి అనుకుంటున్నా.

యజమాని కొట్టేవాడు... – మరియం



నాన్న చనిపోయాక బంధువులు ఓ ఇంట్లో పనికి చేర్చారు. యజమాని నాతో చాకిరీ చేయించుకుని జీతం ఇచ్చేవాడు కాదు. తిండీ పెట్టేవాడు కాదు. ఏ చిన్న తప్పు చేసినా తిట్టేవాడు, కొట్టేవాడు. నా పరిస్థితి గమనించిన స్థానికులు కొంతమంది అతనితో గొడవ పడ్డారు. నన్ను తీసుకువచ్చి ఈ వసతి గృహంలో చేర్చారు. ఇప్పుడు నేను ఇంటర్ చదువుతున్నా. మార్షల్ ఆర్ట్స్ నేర్చుకుని, బ్లాక్‌బెల్ట్ సంపాదించా. ఎన్‌సీసీలోనూ ఉన్నా. చిత్రలేఖనం, సంప్రదాయ నృత్య రీతులన్నా చాలా ఇష్టం. నేర్చుకుంటున్నా కూడా. కెరియర్‌లో స్థిరపడాలన్న లక్ష్యం దిశగా అడుగులు వేస్తున్నా.

భిక్షాటన చేస్తూ... – రాధిక



చెత్త సేకరణే మా ఉపాధి. నా చిన్నప్పుడే అమ్మానాన్నలిద్దరూ చనిపోయారు. నేనూ అన్నయ్య బెరూ జైలు పక్కన ఉండే ప్రాంతంలో ఉండేవాళ్లం. భిక్షాటన చేస్తూ పొట్ట నింపుకొనేవాళ్లం. మా పరిస్థితి చూసి రెయిన్‌బో ఫౌండేషన్ వాళ్లు చేరదీశారు. కానీ కొత్తల్లో చాలా భయమేసేది. అందుకే రెండుసార్లు వసతి గృహం నుంచి పారిపోయా. మళ్లీ నన్ను వెతికి పట్టుకుని, నా భయాన్ని పోగొట్టారు సంస్థ సభ్యులు. నాకో కొత్త జీవితాన్ని ఇచ్చారు. ప్రస్తుతం నేను ఇంటర్ చదువుతున్నా. తాజ్ హోటల్‌లో క్లీనింగ్ సెక్షన్‌లో పనిచేస్తున్నా. చదువు పూర్తిచేసుకుని మంచి ఉద్యోగం సంపాదించాలన్నదే నా లక్ష్యం.

పట్నాలో నిరాశ్రయులు, నిస్సహాయులైన ఆడపిల్లల్ని చేరదీస్తుంది మా సంస్థ. ప్రభుత్వ విద్యాశాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్నాం మేము. మురికివాడల్లో, రోడ్లపై చెత్త ఏరుకునేవాళ్లు, లైంగిక వేధింపులు ఎదుర్కొనే వాళ్లు, భిక్షాటన చేసే పిల్లల్ని వసతి గృహాల్లో చేర్పించి విద్యాబుద్ధులు నేర్పిస్తాం. పరిశుభ్రత, పోషకాహార పాఠాలూ చెబుతాం. ప్రాథమిక విద్య వరకూ చదువుకోనిచ్చి... తర్వాత వాళ్ల ఆసక్తులకు అనుగుణంగా ఆయా రంగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాం. ఈ ఆడపిల్లలంతా వాళ్ల కాళ్లమీద వాళ్లు నిలబడేలా చేయాలన్నదే మా లక్ష్యం. ఉన్నత చదువులు చదవాలని కోరుకున్నవాళ్లనీ ఆ దిశగా ప్రోత్సహిస్తున్నాం.

– విశాఖ, రెయిన్‌బో హోమ్ ప్రాజెక్టు ఇన్‌ఛార్జి

స్పీడ్ వాచింగ్ మంచిదేనా?



ఉదయం లేచింది మొదలు ఫోన్‌తోనే మొదలవుతుంది మన రోజు. ఇది ఒక అలవాటుగానూ మారిపోయింది. అంతేనా వాట్సాప్ ఓపెన్ చేస్తాం. ఫ్రెండ్ ఇన్‌స్టా రీల్‌ని స్టేటస్ పెడితే దాన్ని క్లిక్ చేస్తాం. అక్కడితో ఆగుతుందా యూట్యూబ్ వీడియోలూ చూస్తాం. సోషల్ మీడియా పుణ్యమా అని మనకు తెలియకుండానే చాలా సమయం గడిపేస్తున్నాం అంటున్నారు యువతరం అమ్మాయిలు. ఇందుకు వారు ఎంచుకున్న మార్గం 'స్పీడ్ వాచింగ్' తక్కువ సమయంలో ఎక్కువ కంటెంట్ చూడటం. అంటే సాధారణంగా వీడియోలు, రీల్స్ నెమ్మదిగా ప్లే అవుతున్నట్లు అనిపిస్తే దాన్ని 1.5ఎక్స్, 2ఎక్స్ వేగానికి పెంచి చూస్తుంటారు. సోషల్ జ్ఞానాన్ని పెంచుకోవడం మంచిదే కానీ ఈ అలవాటు మంచిది కాదంటున్నాయి అధ్యయనాలు. వాళ్లలోనే కాదు... ప్లేబ్యాక్ వేగం పెంచడం వల్ల అన్ని వయసుల వారిలోనూ జ్ఞాపకశక్తి తగ్గుతుందని ఇవి చెబుతున్నాయి.

- గురుగ్రామ్‌లోని ఫోర్టిస్ హెల్త్‌కేర్‌లో ఇచ్చిన సమాచారం ప్రకారం వేగవంతమైన కంటెంట్‌ను తరచూ చూడటం వల్ల కొన్ని రోజులకి మానసిక అలసట, చికాకు, దృష్టి కేంద్రీకరించలేకపోవడం వంటి ఇబ్బందులకు దారితీస్తుందట. అందుకే ప్రముఖ వెబ్‌సైట్లు తమ వీడియోల వేగాన్ని తగ్గించుకుంటున్నాయట. ఇలా వీడియోని ఫాస్ట్ ఫార్వర్డ్ చేయకుండా చూడటం వల్ల ఎలాంటి ఇబ్బందీ ఉండదు అంటున్నారు నిపుణులు.

రంగవల్లిక


17 చుక్కలు
7 వరుసలు
7 వచ్చేవరకూ





అన్వెయ రౌట్, పుణె


14 చుక్కలు
4 వరుసలు
4 వచ్చేవరకూ





నర్వా శాంతి
సరూర్‌నగర్, హైదరాబాద్

19 చుక్కలు
1 వచ్చే వరకూ





వి. అనిత,
కర్నూలు

మీ ముగ్గులు 9154091911 నంబరుకు వాట్సాప్ చేయొచ్చు.


మా చిరునామా:
వసుంధర, ఈనాడు
ప్రధాన కార్యాలయం,
రామోజీ ఫిల్మ్‌సిటీ,
అనాజ్‌పూర్,
అబ్దుల్లాపూర్‌మెట్
మండలం,
రంగారెడ్డి జిల్లా,
తెలంగాణ - 501 512.
Email:vasundhara@eenadu.in

బంగారం - వెండి



25న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,40,930	1,28,050	2,26,270
విజయవాడ	1,36,965	1,27,850	2,26,000
ప్రొద్దుటూరు	1,40,450	1,29,210	2,26,000
రాజమహేంద్రవరం	1,39,250	1,27,650	2,45,000
విశాఖపట్నం	1,39,250	1,27,650	2,25,000
తమిళనాడు	-----	1,28,200	2,45,000



అటల్ బిహారీ వాజ్‌పేయీ పేరున ప్రత్యేక పోస్టల్ స్టాంప్, కవర్ ఆవిష్కరిస్తున్న కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, సీఎం చంద్రబాబు. వేదికపై రమేశ్‌నాయుడు, తెనాలి శ్రావణ్‌కుమార్, సత్యకుమార్, నారాయణ, భూపతిరాజు శ్రీనివాసవర్మ, పెమ్మసాని చంద్రశేఖర్, పీవీఎన్ మాధవ్, కందుల దుర్గేష్, సీఎం రమేశ్, సోము వీర్రాజు, పాకా వెంకట సత్యనారాయణ



సభకు విచ్చేసిన కూటమి నేతలు, కార్యకర్తలు, అభిమానులు


జన హృదయనేత.. వాజ్‌పేయీ

(మొదటి పేజీ తరువాయి)

పోరాడింది. కాంగ్రెస్ వ్యతిరేక సెంటిమెంట్‌కు ఎన్టీఆర్ బీజం వేశారు. నేషనల్ ఫ్రంట్ ద్వారా కాంగ్రెసేతర పార్టీలను ఏకం చేశారు. ఎన్టీఆర్, వాజ్‌పేయీ చాలా చనువుగా ఉండేవారు. 1984లో ఇందిరాగాంధీ ఎన్టీఆర్ ప్రభుత్వాన్ని రద్దు చేస్తే ఎన్టీఆర్‌కు ఆడ్వాణీ, వాజ్‌పేయీ మద్దతుగా నిలిచారు. అబ్దుల్ కలాంను రాష్ట్రపతి అభ్యర్థిగా వాజ్‌పేయీ ఎంపికచేయడం, అందులో నేనూ భాగస్వామిగా ఉండడం నా అదృష్టం' అని సీఎం అన్నారు.

అప్పట్లో వాజ్‌పేయీ.. ఇప్పుడు మోదీ

'వాజ్‌పేయీ, మోదీ విశిష్ట లక్షణాలున్న నాయకులు. వీరిది చరిత్ర తిరగరాసే నాయకత్వం. అప్పట్లో కార్గిల్ యుద్ధం, ఇప్పుడు ఆపరేషన్ సిందూర్.. రెండూ చరిత్రలో నిలిచిపోయే నిర్ణయాలు. ఎవరైనా మనం దేశం పైకి వస్తే తగిన గుణపాఠం చెప్పే శక్తి భారత్‌కు ఉందని వీరు నిరూపించారు' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. 'గ్వాలియర్‌లో సాధారణ కుటుంబంలో పుట్టిన వాజ్‌పేయీ.. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారు. జన్‌సంఘ్ నుంచి భాజపా ఏర్పాటు వరకు ఆయన ప్రయాణం అత్యంత కీలకం. 10 సార్లు లోక్‌సభకు, రెండుసార్లు రాజ్యసభకు ఎన్నికయ్యారు. మంచి వక్త, కవి, జనహృదయ నేతగా దేశ మౌలిక సదుపాయాలకు బలమైన పునాది వేశారు.



సుపరిపాలనా దినోత్సవ బహిరంగ సభలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

వాజ్‌పేయి చొరవతో గోల్డెన్ క్వాడ్రిలేటర్ రహదారిని తడ-చెన్నైల మధ్య ప్రారంభించాం. ఇప్పుడు 1.46 లక్షల కి.మీ.తో ప్రపంచంలో ఏ దేశంలో లేని రోడ్లు మన దేశంలో వేయగలిగాం' అని సీఎం గుర్తుచేశారు.

ప్రపంచంలో మనం నంబర్ 1 కావాలి

'దేశాభివృద్ధికి వాజ్‌పేయీ గట్టి పునాది వేశారు. తర్వాత వచ్చిన నరేంద్రమోదీ 11వ స్థానంలో ఉన్న ఆర్థికవ్యవస్థను నాలుగో స్థానానికి తెచ్చారు. 2047కి భారతదేశం ప్రపంచంలో నంబర్ 1గా తయారవుతుంది. వాజ్‌పేయీ, ఎన్టీఆర్‌లా.. దేశం కోసం నరేంద్రమోదీ, తెలుగుజాతి కోసం నేను ఆలోచిస్తున్నాం' అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. 'మోదీ దేశాన్ని నంబర్ 1 చేస్తే.. ఏపీని అగ్రభాగాన నిలబెట్టే బాధ్యత నేను తీసుకుంటాను' అని పేర్కొన్నారు.

కూటమి నాయకులంతా ఒక్కతాటిపై..

'ఈ నెల 11 నుంచి అటల్-మోదీ సుపరిపాలన యాత్ర భాజపా ప్రారంభించింది. 26 జిల్లాకేంద్రాల్లో విగ్రహాలు పెడతామని మాధవ్ చెప్పారు. ఎన్డీయేలోని నాయకులంతా కలిసి పనిచేయాలని కోరాను. అన్ని జిల్లాల్లో కూటమి నాయకులంతా ఒక్కతాటిపై నిలిచి పనిచేశారు' అని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు.

చిల్లర వ్యక్తులతో రాజకీయాలు చేయాల్సి వస్తోంది

'కొందరు నాయకులు స్ఫూర్తినిస్తారు. మరికొందరు దేశం కోసం బతుకుతారు. ఇంకొందరు స్వార్థం కోసమే బతుకుతారు' అని జగన్‌ను ఉద్దేశించి చంద్రబాబు వ్యాఖ్యానించారు. 'పీపీపీ విధానంలో ఈ దేశం అభివృద్ధి చెందుతుందని ఆలోచించి.. సంపద సృష్టికి దోహదపడ్డ వ్యక్తి వాజ్‌పేయీ. అలాంటి పీపీపీ ద్వారా 30 ఏళ్లుగా సంపద సృష్టిస్తుంటే.. ఇప్పుడు ఏమీ తెలియని నాయకులు విమర్శిస్తున్నారు. వైద్య కళాశాలలు, ఆసుపత్రులు నిర్మించి మెరుగైన సేవలు అందించాలని, సంపద సృష్టించి, ఉద్యోగాలు కల్పించేందుకు పీపీపీ వయబిలిటీ మోడల్ తెస్తే.. దాన్ని వక్రీకరిస్తూ ప్రైవేటుకు అప్పగిస్తున్నారని ప్రచారం చేస్తున్నారు. మీరు కాలేజీలు కడితే మేము జైల్లో పెడతామని బెదిరిస్తున్నారు. వాజ్‌పేయీ లాంటి ఉన్నత వ్యక్తులతో రాజకీయం చేసిన నేను.. ఇప్పుడు చిల్లర వ్యక్తులతో రాజకీయాలు చేయాల్సి రావడం బాధగా ఉంది. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా ఈ అభివృద్ధి యాత్ర ఆగదు. ప్రజల కోసం అనునిత్యం పనిచేస్తాం. మీ జీవితాలకు వెలుగునిచ్చే విధానాలు తెస్తాం' అని ముఖ్యమంత్రి స్పష్టంచేశారు.


ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వడమే నిజమైన నివాళి

సీఎం ప్రసంగం ముగిసేటప్పుడు ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలనే నినాదాలు వినిపించాయి. దీనిపై చంద్రబాబు స్పందిస్తూ.. 'ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలి. మేమూ ఆ ప్రయత్నాలు చేస్తున్నాం. వస్తుందనే ఆశ నాకూ ఉంది. అదే మన నాయకుడికి నిజమైన నివాళి' అని వ్యాఖ్యానించారు.

ఏపీలో కేంద్ర వ్యవసాయ వర్సిటీ నెలకొల్పండి

- మామిడిబోర్డు ఏర్పాటు చేయండి
- కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్‌కు సీఎం చంద్రబాబు వినతి

ఈనాడు, అమరావతి: విభజన చట్టంలో ఇచ్చిన హామీకి అనుగుణంగా రాష్ట్రంలో కేంద్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్రాన్ని కోరారు. దీనికి సంబంధించి రూ.2,585 కోట్ల అంచనాలతో డీపీఆర్ కూడా వ్యవసాయ పరిశోధన, విద్యా విభాగానికి అందించామని చెప్పారు.



కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఎం చంద్రబాబు

కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ బుధవారం అమరావతిలో సీఎం క్యాంపు కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా కేంద్ర సంస్థలను రాష్ట్రంలో ఏర్పాటు చేయాలని, కేంద్ర ప్రాయోజిత పథకాల కింద అధిక మొత్తంలో నిధులు కేటాయించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆయనకు వినతిపత్రం అందించారు. రాష్ట్రంలో పంచసూత్రాల అమలుతో వ్యవసాయ, అనుబంధ రంగాల్లో 10.70% వృద్ధి నమోదు చేశామని చెప్పారు. నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, ఫుడ్ ప్రాసెసింగ్, అగ్రిటెక్, ప్రభుత్వాల మద్దతుపై ప్రధానంగా దృష్టి సారించామన్నారు. అంతకు ముందు కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ ఉండవల్లి నివాసంలో సీఎం చంద్రబాబుతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. సీఎం ఆయనకు సాదర స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించారు.

సీఎం అందించిన వినతిలో ప్రధానాంశాలివీ..

- రాష్ట్రంలో మామిడి బోర్డు, ఐసీఏఆర్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ ఆంత్రప్రెన్యూర్‌షిప్ అండ్ మేనేజ్‌మెంట్ (ఎన్ఐఎఫ్‌టీఈఎం)ల ప్రాంతీయ కార్యాలయాలు ఏర్పాటు చేయాలి.
- నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డు (ఎన్ఎఫ్‌డీబీ)ని అమరావతికి తరలించాలి.
- అమరావతిలో అఖిల భారత రొయ్యల సమాఖ్య ఏర్పాటు చేయాలి.

కొబ్బరి అభివృద్ధికి రూ.200 కోట్లతో పార్కు

- పీఎంఆర్‌కేవీవై-పీడీఎంసీ పథకం కింద సూక్ష్మసాగునీటి విస్తరణకు అదనంగా రూ.650 కోట్లు ఇవ్వాలి.
- అరటి రవాణాలో నష్టాలు తగ్గించేందుకు, మార్కెట్ యాక్సెస్ పెంచేందుకు రైల్వే వ్యాగన్ల ద్వారా సబ్సిడీపై అనుమతించాలి.
- కొబ్బరి ఆధారిత పరిశ్రమల అభివృద్ధికి రూ.200 కోట్ల అంచనా వ్యయంతో పార్కు ఏర్పాటుకు అనుమతించాలి.
- వీబీ జీ రామ్ జీ పథకం కింద పట్టుపురుగుల పెంపకం షెడ్లకు సాయం అందించాలి. ◆ ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా 20 మిలియన్ కిలోల హెచ్‌డీ బర్లీ పొగాకు సేకరణకు రూ.150 కోట్ల సాయం చేయాలి.

ఏపీని సహజసాగుకు జాతీయ వనరుల రాష్ట్రంగా ప్రకటించాలి

- ఆంధ్రప్రదేశ్‌ను సహజసాగుకు జాతీయ వనరుల రాష్ట్రంగా ప్రకటించాలి.
- 2025-26లో మంజూరైన క్లస్టర్ల నిర్వహణ ఖర్చులు కేంద్రం భరించాలి.
- రాష్ట్రవ్యాప్తంగా సహజ సాగు చేస్తున్న 40 లక్షల మంది రైతులకు వచ్చే ఐదేళ్లలో 20 వేల క్లస్టర్లు కేటాయించాలి. 2026-27 సంవత్సరానికి 10,000 సహజ సాగు క్లస్టర్లకు అనుమతివ్వాలి.
- పీఎం ప్రణామ్ కింద నిధుల విడుదల వేగవంతం చేయాలి.

ఆహారశుద్ధికి ప్రోత్సాహం కల్పించాలి

- విజయవాడ, అమరావతిల్లో అత్యాధునిక ఆక్వా ల్యాబ్ ఏర్పాటు చేయాలి. ◆ పులికాట్ సరస్సు అభివృద్ధి పనులకు నిధులివ్వాలి.
- ఆపరేషన్ గ్రీన్స్ కింద ఆహారశుద్ధి మంత్రిత్వ శాఖ వద్ద పెండింగ్‌లో ఉన్న రూ.19.05 కోట్లు వెంటనే విడుదల చేయాలి.
- ఫుడ్ ప్రాసెసింగ్ ఇంక్యుబేషన్ సెంటర్లకు అనుమతివ్వాలి.

నా కృషిని ప్రశంసించినందుకు ధన్యవాదాలు: చంద్రబాబు

ఈనాడు, అమరావతి: అమరావతిలో త్వరలో ఏర్పాటు చేయనున్న క్వాంటమ్ వ్యాలీ, దాని కోసం తాను చేస్తున్న కృషిని ప్రశంసించిన కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్‌చౌహాన్‌కు సీఎం చంద్రబాబు ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు 'ఎక్స్'లో హిందీలో పోస్టు చేశారు. "మీకు హృదయపూర్వక కృతజ్ఞతలు. అటల్‌జీతో కలిసి పనిచేసే అవకాశం లభించడం జీవితంలో గొప్ప అవకాశంగా భావిస్తున్నాను. మోదీ నాయకత్వంలో, మీ అందరి సహకారంతో అటల్‌జీ వారసత్వాన్ని ముందుకు తీసుకువెళుతున్నందుకు ఎంతో ఆనందంగా ఉంది" అని చంద్రబాబు పేర్కొన్నారు.

ప్రజాక్షేమమే ముందు... రాజకీయాలు తర్వాత..

- వాజ్‌పేయీ మాటలతోనే ఈ ఆలోచనకు వచ్చా
- ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్



ఈనాడు, అమరావతి: 'మాజీ ప్రధాని వాజ్‌పేయీ రాజకీయ నాయకుడు మాత్రమే కాదు.. అసలైన రాజనీతిజ్ఞుడు. ప్రతి నాయకుడూ ఆయన నుంచి స్ఫూర్తి పొందాలి. ఆయన మార్గనిర్దేశకత్వంలోనే ప్రజాక్షేమం ముందు.. రాజకీయాలు ఆ తర్వాతే అని గట్టిగా నమ్ముతున్నా. ఇదే మన ధర్మం' అని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ వాజ్‌పేయీ జన్మదినం సందర్భంగా గురువారం ఎక్స్‌లో పేర్కొన్నారు. 'అధికారం ఆట కొనసాగుతూ ఉంటుందని, పార్టీలు వస్తాయని, పోతాయని, ప్రభుత్వాలు ఏర్పడతాయి, కూలతాయని.. కానీ దేశం ఉండాలని, ఆ దేశంలో ప్రజాస్వామ్యం అమరంగా ఉండి తీరాలని వాజ్‌పేయీ 1996లో పార్లమెంటు ప్రసంగంలో చెప్పిన మాటలు ఎప్పుడూ గుర్తుంటాయి. అవి ప్రజాస్వామ్య విలువల పట్ల మన బాధ్యతను ఎప్పుడూ గుర్తు చేస్తుంటాయి. ఆయన పోఖ్రాన్ అణుపరీక్షలతో భారత్ వ్యూహాత్మక బలాన్ని నొక్కి చెప్పారు. స్వర్ణ చతుర్భుజి, జాతీయ రహదారులతో దేశవ్యాప్తంగా అనుసంధానం పెంచారు. ఆయన ఆదర్శాలు ఇప్పటికీ మార్గనిర్దేశనం చేస్తున్నాయి' అని పవన్ కల్యాణ్ కొనియాడారు.

ఐసిస్ ఉగ్రవాదుల్లా వైకాపా సైకోల తీరు

మాజీ ఎమ్మెల్సీ అశోక్‌బాబు

ఈనాడు, అమరావతి: వైకాపా అధ్యక్షుడు జగన్ పుట్టినరోజు వేడుకల్లో ఆ పార్టీ సైకోల తీరు ఐసిస్ ఉగ్రవాదుల్ని గుర్తుకుతెచ్చిందని మాజీ ఎమ్మెల్సీ, తెదేపా నేత అశోక్‌బాబు మండిపడ్డారు. పుట్టినరోజు నాడు రక్తదానాలు, సేవా కార్యక్రమాలు చేస్తారు. కానీ.. వైకాపా సైకోలు మాత్రం వేటకత్తులు, తల్వార్లతో ప్రదర్శనలు నిర్వహించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నాలుగైదు అడుగుల కత్తులతో కేక్ కటింగ్ చేయడమేంటని ప్రశ్నించారు.

సుపరిపాలనకు ఆయనే స్ఫూర్తి

- విలువల నేత వాజ్‌పేయీ
- కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్
- చంద్రబాబు అప్పుడు ఐటీ మ్యాన్.. ఇప్పుడు ఏఐ మ్యాన్ అని వ్యాఖ్య



ఈనాడు, అమరావతి: 'సుపరిపాలన అంటే ఏమిటో దేశానికి చూపించి, దిశానిర్దేశం చేసిన మహానాయకుడు వాజ్‌పేయీ. ఆయన పాలనలో దేశం కొత్త యుగంలోకి అడుగుపెట్టింది. రహదారులు, టెలికాం, విద్యుత్తు, విమానాశ్రయాలు లాంటి మౌలిక సదుపాయాల అభివృద్ధికి బలమైన పునాది వేశారు. వాజ్‌పేయీ ఆలోచనలు, ఆదర్శాలు మనందరికీ మార్గదర్శకం' అని కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ అన్నారు. అమరావతిలో అటల్ స్మృతివనంలో వాజ్‌పేయీ విగ్రహాన్ని సీఎం చంద్రబాబుతో కలిసి గురువారం ప్రారంభించారు. సుపరిపాలన దినోత్సవ సభలో ప్రసంగించారు. 'ఆంధ్రప్రదేశ్ ప్రజలందరికీ ధన్యవాదాలు (తెలుగులో).. వాజ్‌పేయీ అజాతశత్రువు, రాజనీతిజ్ఞుడు. విలువలతో కూడిన రాజకీయాలు చేసేవారు. అమెరికా ఆంక్షలు పెట్టినా పోఖ్రాన్ అణుపరీక్షల ద్వారా భారత్‌ను అణ్వాయుధ శక్తి ఉన్న దేశంగా నిలబెట్టారు. వాజ్‌పేయీ ప్రారంభించిన అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రధాని మోదీ కొనసాగిస్తున్నారు. మోదీ-చంద్రబాబు కలయిక దేశాన్ని, రాష్ట్రాన్ని నంబర్ 1గా నిలబెడుతుంది. చంద్రబాబు మొదట ఐటీ మ్యాన్‌గా.. ఇప్పుడు ఏఐ మ్యాన్‌గా గుర్తింపు పొందారు. క్వాంటమ్ కంప్యూటింగ్‌కు ప్రాధాన్యం ఇస్తూ అద్భుత రాజధానిని నిర్మిస్తున్నారు' అని చెప్పారు.

అమరావతిలో తొలి విగ్రహం వాజ్‌పేయీదే..

- పీవీఎన్ మాధవ్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు



'అమరేశ్వరుని నిలయం రాజధాని అమరావతిలో మొట్టమొదటి విగ్రహం వాజ్‌పేయీది ఏర్పాటుకావడం.. నాలుగుసార్లు ముఖ్యమంత్రులుగా చేసిన చంద్రబాబు, శివరాజ్‌సింగ్ చౌహాన్‌ల చేతులమీదుగా ఆవిష్కరించడం ఆనందంగా ఉంది. రాష్ట్ర అధ్యక్షుడిగా అటల్‌జీ శతజయంతి నిర్వహించడం సంతోషకరం. అటల్-మోదీ సుపరిపాలన యాత్ర విజయవంతం కావడంలో సీఎం చంద్రబాబు సహకారం మరువలేనిది. 60ఏళ్ల రాజకీయ జీవితంలో అవినీతి మచ్చ, శత్రువులు లేని ఏకైక వ్యక్తి వాజ్‌పేయీ.'

దేశాభివృద్ధే లక్ష్యంగా వాజ్‌పేయీ పాలన

- పెమ్మసాని చంద్రశేఖర్, కేంద్ర సహాయ మంత్రి



'వాజ్‌పేయీ నిజమైన దేశభక్తుడు. అధికారంలో ఉన్నా అహంకారం లేని నేత. 29 పార్టీలను ఏకం చేసి ప్రభుత్వాన్ని నడిపి దేశాభివృద్ధే లక్ష్యంగా పనిచేశారు. ఎమర్జెన్సీ రోజుల్లో 19నెలలు జైలుకు వెళ్లారు. ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్‌ను గుర్తించి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి వాజ్‌పేయీ సహకరించారు.'

అణు పరీక్షలతో దేశం సత్తా చాటారు

- భూపతిరాజు శ్రీనివాసవర్మ, కేంద్ర సహాయమంత్రి



'దేశంలో అనేక సంక్షేమ పథకాలకు ఆద్యుడు వాజ్‌పేయీ. రైలు, పోర్టు, గగనయానాలను ప్రారంభించారు. అణుపరీక్షలతో దేశం సత్తా చాటారు. లాహోర్ బస్సు యాత్ర ద్వారా పాకిస్థాన్‌కు స్నేహహస్తం అందిస్తే.. వారు కుట్రలు చేశారు. కార్గిల్ యుద్ధంలో పాకిస్థాన్‌కు బుద్ధి చెప్పిన ధైర్యశాలి. ఇందిర మరణం తర్వాత భాజపాకు రెండు సీట్లే వచ్చినా.. కష్టసమయంలో కార్యకర్తలకు అండగా నిలిచి భవిష్యత్తులో అధికారం భాజపాదేనని భరోసా ఇచ్చారు. నేడు 21 రాష్ట్రాల్లో అధికారంలో ఉండడానికి వాజ్‌పేయీ చూపిన మార్గమే ఆదర్శం.'

చిరునవ్వుతో సమస్యలకు ఎదురొడ్డారు

- సత్యకుమార్ యాదవ్, వైద్యారోగ్యశాఖ మంత్రి



'సుపరిపాలన, ఇతర నిర్ణయాలతో దేశ చరిత్రను తిరగరాసిన ధీరుడు వాజ్‌పేయీ. ఆయన స్ఫూర్తితోనే ప్రధాని మోదీ దేశాన్ని ముందుకు తీసుకెళ్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా అదే దారిలో నడుస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నారు. వాజ్‌పేయీ, చంద్రబాబు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి చేస్తే.. మోదీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్ కలిసి ఇప్పుడు రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తున్నారు.'

సంస్కరణలతో దేశం దిశ మార్చారు

- కందుల దుర్గేష్, పర్యాటక శాఖ మంత్రి



'దేశ రాజకీయచిత్రంలో అజాతశత్రువు, దేశంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలకు ఆద్యుడు వాజ్‌పేయీ. స్వర్ణ చతుర్భుజి, అంత్యోదయ, మౌలిక సదుపాయాల కల్పన ద్వారా దేశం దిశను మార్చారు. ఆయన స్ఫూర్తితో ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు సుపరిపాలన అందిస్తున్నారు. అనివార్య కారణాల వల్ల ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సభకు రాలేకపోయారు.'

◆ కార్యక్రమంలో ఎంపీ సీఎం రమేష్, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య, పాకా వెంకట సత్యనారాయణ, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యేలు తెనాలి శ్రావణ్‌కుమార్, ఆదినారాయణరెడ్డి, భాజపా రాష్ట్ర సంఘటన ప్రధాన కార్యదర్శి మధుకర్, భాజపా రాష్ట్ర ప్రధానకార్యదర్శులు నాగోతు రమేష్‌నాయుడు, సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, మట్టా ప్రసాద్, సాలిగ్రామ లక్ష్మీప్రసన్న, ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరి జయప్రకాశ్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ పాతూరి నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

లోక్‌భవన్‌లో సుపరిపాలనా దినోత్సవం

వాజ్‌పేయీ చిత్రపటానికి నివాళులర్పించిన గవర్నర్

ఈనాడు, అమరావతి: మాజీ ప్రధాని వాజ్‌పేయీ జయంతి వేడుకలను 'సుపరిపాలనా దినోత్సవం'గా గురువారం లోక్‌భవన్‌లో నిర్వహించారు. వేడుకల్లో గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ పాల్గొని, వాజ్‌పేయీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గవర్నర్ మాట్లాడుతూ.. 'సమాజంలో అణగారిన వర్గాల హక్కుల కోసం పాటుపడిన పరిపాలనాదక్షుడు వాజ్‌పేయీ. గ్రామీణ రహదారులను అనుసంధానించే ప్రధానమంత్రి గ్రామ్ సడక్ యోజన, 4 ప్రధాన మెట్రోపాలిటన్ నగరాలను అనుసంధానించే స్వర్ణ చతుర్భుజి వంటి అనేక ప్రాజెక్టులను వాజ్‌పేయీ దేశానికి అందించారు' అని పేర్కొన్నారు. కార్యక్రమంలో గవర్నర్ సంయుక్త కార్యదర్శి పీఎస్ సూర్యప్రకాష్ ఇతర అధికారులు పాల్గొన్నారు.



మంటల్లో కాలిపోతున్న బస్సు, లారీ



బూడిద కుప్పగా మారిన 'సీబర్డ్' స్లీపర్ బస్సు

కర్ణాటకలో ఘోర ప్రమాదం

- ట్రావెల్స్ బస్సును ఢీకొన్న లారీ
- ఆరుగురి సజీవ దహనం

బెంగళూరు/గ్రామీణం, చిత్రదుర్గ, న్యూస్‌టుడే: ట్రావెల్స్ బస్సును లారీ ఢీకొనడంతో మంటలు చెలరేగి.. ఆరుగురు సజీవ దహనమైన ఘోర రోడ్డు ప్రమాదం కర్ణాటకలో చోటు చేసుకుంది. ప్రమాదంలో మరో 28 మంది గాయపడగా, వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. బెంగళూరు నుంచి గోకర్ణకు వెళ్లే సీబర్డ్ ట్రావెల్స్ స్లీపర్ కోచ్ బస్సులో 31 మంది ప్రయాణికులు ఎక్కారు. డ్రైవరు, సహాయ డ్రైవరు కమ్ కండక్టరుతో కలిపి మొత్తం 33 మంది ఉన్నారు. చాలామంది క్రిస్మస్, కొత్త ఏడాది వేడుకల కోసం సొంతూళ్లకు వెళుతున్నారు. బస్సు బుధవారం అర్ధరాత్రి రెండు గంటలకు చిత్రదుర్గ జిల్లా హిరియూరు తాలూకా గొర్లత్తు క్రాస్ వద్దకు చేరుకోగా.. బెంగళూరు వైపు వస్తున్న లారీ అదుపుతప్పి, రహదారి డివైడర్‌ను దాటి బస్సు డీజిల్ ట్యాంకును బలంగా ఢీకొంది. దీంతో ఒక్కసారిగా మంటలు ఎగసిపడి, రెండు వాహనాలూ అగ్నికీలల్లో చిక్కుకున్నాయి. నిద్రలో ఉన్న ప్రయాణికులు హాహాకారాలు చేశారు. చుట్టూ దట్టమైన పొగలు అలముకోగా.. కొంతమంది అప్రమత్తమై బస్సు కిటికీల అద్దాలు పగలగొట్టారు. వారికి అదే మార్గంలో ప్రయాణిస్తున్న కొంతమంది సాయం చేశారు. దీంతో చాలామంది సురక్షితంగా బయటపడగా, ఐదుగురు మాత్రం అగ్నికీలల్లో చిక్కుకొని సజీవ దహనమయ్యారు. మృతి చెందిన వారిలో రష్మి మహలె, మానస, నవ్య, బిందు, ఆమె కుమార్తె గ్రేయలతో పాటు ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన లారీ డ్రైవరు శ్యామ్‌లాల్ ఉన్నట్లు గుర్తించారు. గాయపడిన 28 మందిని హిరియూరు, శిరా, తుమకూరు ప్రభుత్వ ఆసుపత్రుల్లో చేర్చారు. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం బెంగళూరు తరలించారు. ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రధాని నరేంద్ర మోదీ రూ.రెండు లక్షలు, గాయపడిన వారికి రూ.50 వేల చొప్పున పరిహారం ప్రకటించారు. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు, గాయపడిన వారికి రూ.50 వేలు చొప్పున సాయం ప్రకటించారు. మృతుల కుటుంబాలకు ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, కేంద్ర మంత్రులు హెచ్‌డీ కుమారస్వామి, సోమణ్ణ, శోభా కరంద్లాజె తదితరులు సంతాపం తెలిపారు.



బెంగళూరులో వేర్వేరు సంస్థల్లో ఉద్యోగాలు చేస్తున్న గగన, రష్మి, రక్షిత స్నేహితులు. వీరు గోకర్ణకు బయలుదేరే ముందు 'సీబర్డ్' బస్సు ముందు సెల్ఫీ తీసుకున్నారు. ఈ వాహనం ప్రమాదానికి గురైన వేళ.. అప్రమత్తమై బస్సు కిటికీ అద్దాలు పగలగొట్టి.. అందులోంచి కిందకు దూకి ప్రాణాలు కాపాడుకున్నారు.

సిగ్నల్స్ ఇచ్చే చెట్టు !

ఈత చెట్టులాంటి సెల్ టవర్‌ను తిరుపతి జాతీయ సంస్కృత విద్యాపీఠం ఆవరణలో చూడొచ్చు. ఈత చెట్టులాగే ఉన్నా.. తాటి చెట్టంత ఎత్తు ఉంటుంది. ఇనుప రేకులకు రంగులు వేసి అచ్చం ఈత చెట్టులా కనిపించేలా చేసి వాటిని టవర్ చుట్టూ చుట్టారు. పైభాగంలో కూడా ఈత ఆకుల్లా ఏర్పాట్లు చేశారు. పరిశీలనగా చూస్తే తప్ప అక్కడో టవర్ ఉందని గుర్తించలేరు. ఇటువైపు వచ్చేవారంతా టవర్‌ను చూసి ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

– ఈనాడు, తిరుపతి





తిండిలో కాదు... తీరులో హుందా!



రెస్టారెంట్ల సంస్కృతి పెరిగిపోతున్న ఈ రోజుల్లో అక్కడ ఎలా ప్రవర్తించాలో తెలియక కొందరు అయోమయానికి గురైతే.. మరికొందరు నగుబాటును ఎదుర్కొంటున్నారు. అలా కాకుండా హుందాగా ఉండేందుకు పాటించాల్సిన ప్రాథమిక శిష్టాచారాలేంటో తెలుసుకుందాం..

అడుగు పెట్టగానే..

- ఎందుకు వచ్చామనేది చెప్పాలి.
- తినడానికైతే అక్కడ ఏయే విభాగాలున్నాయనేది అడిగి తెలుసుకోవాలి.
- టేబుల్ వద్దకు చేరుకున్నాక ఫుడ్ గురించి తెలుసుకోవాలి.
- అక్కడ ఉన్న క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే మెనూతోపాటు..ఆయా వంటకాలకు ఉపయోగించిన పదార్థాలనూ తెలుసుకోవచ్చు.

ఆచరిస్తే ఆనందమే...

- కుర్చీలో కూర్చున్నపుడు న్యాప్‌కిన్ ఒడిలో పెట్టుకోవాలి...
- మోచేతులను టేబుల్ మీద పెట్టకూడదు.
- ఫోన్‌ను సైలెంట్‌లో పెట్టుకోవాలి.
- టేబుల్ అంతటా చేయి చాచకూడదు.
- సూప్ తాగేందుకు పెద్ద స్పూన్ తీసుకుని శబ్దం రాకుండా సిప్ చేయాలి.
- మాంసాహారం తినేటపుడు నైఫ్‌లాంటి స్పూన్‌తో చిన్న ముక్కలుగా కట్ చేసి ఫోర్క్‌తో తినాలి.
- చేపలపైనున్నదాన్ని పెన్సిల్ లాంటి నైఫ్ స్పూన్‌తో తొలగించాలి.
- ఆహారాన్ని నెమ్మదిగా శబ్దం రాకుండా నమలాలి.
- సర్వ్ చేసేవారితో మర్యాదగా ప్రవర్తించాలి.
- నోట్లో ఆహారం ఉంచుకుని మాట్లాడకూడదు.
- టేబుల్ మేనర్స్‌ను పాటించాలి. వ్యక్తిగత సంభాషణలను చేయకపోవడమే మంచిది.
- తినడం పూర్తయ్యాక నాప్‌కిన్ టేబుల్‌పైన ప్లేట్‌కి ఎడమవైపున వదిలేయాలి.
- ఫోర్క్, నైఫ్‌లను ప్లేట్ మీద రెస్ట్ లేదా డన్ స్థానంలో ఉంచండి.
- ఎముకలు, ఇతర తినలేని పదార్థాలను టేబుల్‌క్లాత్ మీద వదిలేయకూడదు.
- బిల్ కట్టడానికి పోటీపడటం కన్నా ఎవరు కట్టాలనేది ముందే నిర్ణయించుకోవడం ఉత్తమం.
- చివరగా సర్వ్ చేసినవారికి ధన్యవాదాలు చెప్పాలి.

అందరితో కలిసి..

- హోస్ట్ మీకు ఎక్కడ కూర్చోవాలో చెప్పే వరకు వేచి ఉండండి. మీరే హోస్ట్ అయితే, మీ అతిథులను వారి సీట్లకు మార్గనిర్దేశం చేయండి.
- బ్యాగ్‌లు, పర్సులు బ్రీఫ్‌కేస్‌లను టేబుల్ మీద కాకుండా ఫ్లోర్ మీద, లేదా ప్రత్యేక కుర్చీకి వేలాడదీయండి.
- టేబుల్‌పై నుంచి ఒక ఉపకరణం పడిపోతే, సర్వర్‌కు సిగ్నల్ ఇచ్చి కొత్తది అందించమని అడగండి.
- మీతోపాటు ఉన్న వారితో కలిసి ఆహారం తీసుకోవాలి.
- వారికంటే ముందే తినేయడం, వారిదంతా అయ్యాక కూడా మనం తింటూ ఉండడం సరైన పద్ధతి కాదు.

సంజ్ఞల సంభాషణ..

సర్వర్, ఇతర సిబ్బందికి మాటలతోనే కాకుండా ఫోర్క్, స్పూన్, నైఫ్‌తోనూ మన అభిప్రాయాలు చెప్పవచ్చు.

ఇంకా తింటుంటే: ప్లేట్‌పై పిరమిడ్ లేదా క్రాస్ ఆకారంలో కత్తి ఫోర్క్‌ను ఉంచాలి. ఇలా పెడితే ఇంకా తింటున్నాను, ప్లేట్‌ను క్లియర్ చేయవద్దని అర్థం.

ఆహారం నచ్చిందని చెప్పేందుకు: ఫోర్క్, చెంచాను గడియారంలో 5:55 నిమిషాలను సూచించేలా లేదా వాటి హ్యాండిల్స్‌ను దాదాపు 4గంటలు, టిప్‌ను 10 గంటల స్థానంలో ఉంచాలి.

ఆహారం నచ్చకపోతే: ప్లేట్ మధ్యలో కత్తి ఫోర్క్‌ను క్రాస్ చేస్తే సరిపోతుంది.

తినడం పూర్తయినపుడు: ఫోర్క్, నైఫ్‌ని ప్లేట్‌పై 10:20 పొజిషన్‌లో ఉంచాలి.

- కొన్ని సంస్కృతుల్లో, భోజనం ముగిసిందని ప్లేట్‌ను క్లియర్ చేయవచ్చని సూచించడానికి ప్లేట్‌కి ఎడమ వైపు ఫోర్క్, కుడి వైపు చెంచా ఉంచుతారు.

- ఈనాడు, అమరావతి



విజయవాడ సెయింట్ పాల్స్ చర్చిలో భక్తులకు దివ్య ప్రసాదాన్ని అందజేస్తున్న ఫాదర్ మువ్వల ప్రసాద్

పెన్సిల్ లెడ్‌తో పేరెన్నికగన్న చర్చి!

క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకొని అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం చినదొడ్డిగల్లుకు చెందిన సూక్ష్మ కళాకారుడు గట్టెం వెంకటేష్ చార్‌కోల్ పెన్సిల్ లెడ్‌తో చర్చిని అద్భుతంగా మలిచారు. 5 సెంటీమీటర్ల ఎత్తు, 7 సెం.మీ. పొడవుతో న్యూయార్క్‌లోని సెయింట్ పాట్రిక్స్ చర్చి నమూనాను ఆవిష్కరించారు. ఇందుకు 10 గంటలు పట్టిందని వెంకటేష్ తెలిపారు.

– నక్కపల్లి, న్యూస్‌టుడే



పెన్సిల్ లెడ్‌తో రూపొందించిన చర్చి

క్రిస్మస్ వేడుకల్లో జగన్



మాజీ సీఎం జగన్‌ను ముద్దాడుతున్న తల్లి విజయమ్మ

పులివెందుల, న్యూస్‌టుడే: మాజీ ముఖ్యమంత్రి జగన్ వైఎస్సార్ కడప జిల్లాలోని పులివెందులలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకలకు హాజరయ్యారు. జిల్లాలో మూడు రోజుల పర్యటనలో భాగంగా ఆఖరి రోజు గురువారం ఉదయం 8.30 గంటలకు తన నివాసం నుంచి బయలుదేరి 8.45 గంటలకు పులివెందులలోని సీఎస్ఐ చర్చికి చేరుకుని, ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఆయన వెంట సతీమణి భారతి, తల్లి విజయమ్మ, ఇతర కుటుంబ సభ్యులు ఉన్నారు. చర్చి ఫాదర్ థామస్‌బాబు ఆధ్వర్యంలో క్రిస్మస్ కేకు కోశారు. విజయమ్మ జగన్‌కు కేకు తినిపించి, ముద్దాడి ఆశీర్వదించారు. జగన్ తన పెదనాన్న వైఎస్ ప్రకాష్‌రెడ్డికి కేకు తినిపించారు. అనంతరం జగన్ పులివెందుల నుంచి హెలికాప్టర్‌లో బెంగళూరుకు పయనమయ్యారు.

తపాలా ద్వారా అయోధ్యకు చేరిన వజ్రాల రాముడు

- తంజావూరు శైలిలో తయారుచేసిన బెంగళూరుకు చెందిన జయశ్రీ ఫణీశ్

బెంగళూరు(రాజాజీనగర), న్యూస్‌టుడే: బంగారం, వజ్రాలతో తయారు చేసిన రాముడి విగ్రహాన్ని బెంగళూరు నుంచి అయోధ్యకు తపాలా శాఖ తన లాజిస్టిక్ సేవల ద్వారా తరలించింది. ఈ విగ్రహాన్ని 12 అడుగుల పొడవు, 8 అడుగుల వెడల్పుతో తంజావూరు శైలిలో కళాత్మకంగా రూపొందించారు. బెంగళూరుకు చెందిన జయశ్రీ ఫణీశ్ (50) ఈ విగ్రహాన్ని వెండి, బంగారం, వజ్రాలు, మాణిక్యాలు, ముత్యాలు, కెంపులతో సిద్ధం చేశారు. అయోధ్యకు పంపించేందుకు దీన్ని బెంగళూరులోని తపాలా శాఖలో డిసెంబరు 17న బుక్ చేశారు. అనంతరం ఎర్రచందనంతో చేసిన పెట్టెలో విగ్రహాన్ని ఉంచి సుమారు 1,900 కి.మీ. దూరంలో ఉన్న అయోధ్యకు భారీ భద్రత, నిఘా మధ్య తపాలా శాఖ ఈ నెల 22న చేర్చింది. సుమారు 800 కిలోల తూకం ఉన్న ఈ విగ్రహం, చెక్క పెట్టెను అక్కడి శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ప్రతినిధులకు అందజేశారు. అంగద తీల (తులసీదాసు విగ్రహం) వద్ద డిసెంబరు 29 నుంచి 31 మధ్యలో నిర్వహించే కార్యక్రమంలో దీన్ని ప్రతిష్ఠించనున్నారు. బాల రాముడ్ని పోలినట్లు రూపొందించిన తంజావూరు శైలి విగ్రహం ధర రూ.2 కోట్లు ఉంటుందని తయారీదారు పేర్కొన్నారు.



వజ్రాలు పొదిగిన బంగారు విగ్రహం



ఎర్రచందనంతో చేసిన ఫ్రేం

ఆర్టికల్ 370 గోడను కూల్చేయడం గర్వకారణం

(మొదటి పేజీ తరువాయి)

జయంతి సందర్భంగా గురువారం ఆయన ఉత్తర్ ప్రదేశ్ రాజధాని లఖ్‌నవూలో 'రాష్ట్రీయ ప్రేరణా స్థల్'ను ప్రారంభించారు. 65 ఎకరాల్లో రూ.230 కోట్లతో నిర్మించిన ఈ జాతీయ స్మారకంలో శ్యామా ప్రసాద్ ముఖర్జీ, దీన్‌దయాళ్ ఉపాధ్యాయ, వాజ్‌పేయీల విగ్రహాలను ఆవిష్కరించారు. కమలం ఆకారంలో నిర్మించిన మ్యూజియాన్ని ప్రారంభించి దానిని తిలకించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రసంగించారు.

'ఆర్టికల్ 370 అనే గోడను కూల్చే అవకాశం మా ప్రభుత్వానికి రావడాన్ని భాజపా గర్వకారణంగా భావిస్తోంది. రెండు రాజ్యాంగాలను, రెండు జెండాలను, ఇద్దరు ప్రధాన మంత్రులను శ్యామా ప్రసాద్ ముఖర్జీ వ్యతిరేకించారు. అదే స్ఫూర్తితో మేం ఆర్టికల్ 370ని రద్దు చేయడంవల్ల జమ్మూ కశ్మీర్‌లోనూ భారత రాజ్యాంగం అమలవుతోంది' అని ప్రధాని పేర్కొన్నారు. 'భాజపా నేతృత్వంలోని ఎన్డీయే ఆవిష్కరించిన సుపరిపాలన కేంద్ర, రాష్ట్ర స్థాయుల్లో సరికొత్త శిఖరాలను చేరుకుంది' అని తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత సాధించిన ప్రతి విజయాన్నీ ఒకే కుటుంబానికి ఆపాదిస్తూ వచ్చిన సంస్కృతిని మనం మరిచిపోకూడదని గుర్తు చేశారు. భారత రత్నాలైన వాజ్‌పేయీ, మదన్ మోహన్ మాలవీయలు దేశ అస్తిత్వాన్ని, ఐక్యతను, గౌరవాన్ని కాపాడారని, జాతి నిర్మాణంలో వారు చెరగని ముద్ర వేశారని కొనియాడారు. గురువారం వాజ్‌పేయీ, మాలవీయ, బిజిలీ పసీల జయంతి కావడంతో వారికి ప్రధాని నివాళులర్పించారు.

జాతీయ నేతల ఘన చరిత్రను చెరిపేసే ప్రయత్నం

వారసత్వ రాజకీయాల కారణంగా అనేక మంది జాతీయ నేతల కృషి కనిపించకుండా పోయిందని, నేతాజీ సుభాష్ చంద్రబోస్, డాక్టర్ అంబేడ్కర్‌ల ఘన వారసత్వాన్ని చెరిపేసే ప్రయత్నాలు జరిగాయని కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలనుద్దేశించి వ్యాఖ్యానించారు. అభద్రతా భావంతో రాజకీయ అస్పృశ్యతను కాంగ్రెస్, దాని మిత్ర పక్షాలు పెంచి పోషించాయని, భాజపాను అంటరాని పార్టీగా చూశాయని పేర్కొన్నారు. ఎన్డీయే అన్ని పార్టీలను గౌరవించిందని, కాంగ్రెస్ నేతలైన పీవీ నరసింహారావు, ప్రణబ్ ముఖర్జీలకు భారత రత్న ఇచ్చిందని, ములాయం సింగ్ యాదవ్, తరుణ్ గొగొయ్‌లను అత్యున్నత పురస్కారాలతో గౌరవించిందని తెలిపారు.

■ శ్యామా ప్రసాద్, దీన్ దయాళ్, వాజ్‌పేయీల ఆశయాలు, ఆదర్శాలను ప్రధాని ముందుకు తీసుకెళ్తున్నారని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రశంసించారు. భారత దేశ ప్రతిష్ఠను అంతర్జాతీయంగా ఇనుమడింపజేశారని, ఈ రోజు భారత్ మాట్లాడితే ప్రపంచమంతా వింటోందని పేర్కొన్నారు. మోదీకి 29 దేశాలు తమ అత్యున్నత పౌర అవార్డులనిచ్చి సత్కరించాయని, ఇది అరుదైన గౌరవమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్తర్ ప్రదేశ్ గవర్నర్ ఆనందీబెన్ పటేల్, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఒకప్పటి చెత్త వేసే ప్రాంతం..

ప్రధాని మోదీ ప్రారంభించిన 'రాష్ట్రీయ ప్రేరణా స్థల్' కొంత కాలం కిందటి వరకూ వ్యర్థాల పారబోత ప్రాంతంగా ఉండేది. గోమతీ నదీ తీరంలో ఉన్న ఈ ప్రాంతంలో ఇప్పుడు జాతీయ స్మారకం ఏర్పాటుతో పచ్చదనం వెల్లివిరుస్తోంది. ఇదో ఆహ్లాదకర ప్రదేశంగా, లఖ్‌నవూ నగరంలో మరో ప్రసిద్ధ సందర్శన స్థలంగా మారింది. దాదాపు 50వేల వృక్షాలను మియవాకీ పరిజ్ఞానం సాయంతో ఇక్కడ నాటారు. భాజపా ఆర్‌ఎస్‌ఎస్‌ల సిద్ధాంతకర్తలైన శ్యామా ప్రసాద్ ముఖర్జీ, దీన్‌దయాళ్ ఉపాధ్యాయ, అటల్ బిహారీ వాజ్‌పేయీల భారీ కాంస్య విగ్రహాలను నెలకొల్పారు. ఈ విగ్రహం ఒక్కొక్కటీ 65 అడుగుల ఎత్తు ఉన్నాయి. సందర్శకులకు భాజపా ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతకర్తల జీవిత విశేషాలను తెలిపే డిజిటల్ తెరలను ఇక్కడ ఏర్పాటు చేశారు.

వాజ్‌పేయీకి ప్రధాని నివాళులు

మాజీ ప్రధాని వాజ్‌పేయీ 101వ జయంతి సందర్భంగా ప్రధాని మోదీ, రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ గురువారం దిల్లీలో నివాళులర్పించారు. వాజ్‌పేయీ స్మారక చిహ్నం 'సదైవ్ అటల్' వద్ద ఏర్పాటు చేసిన ప్రార్థనా కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఇంకా కేంద్ర హోం మంత్రి అమిత్ షా, పూర్వ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, మంత్రులు జేపీ నడ్డా, నిర్మలా సీతారామన్, భాజపా కార్యనిర్వాహక అధ్యక్షుడు నితిన్ నబీన్ తదితరులు పాల్గొన్నారు.

■ దేశ రాజధానిలోని 11 ఎకరాల పార్కుకు అటల్ బిహారీ వాజ్‌పేయీ సద్భావనా ఉద్యాన్‌గా పేరు పెట్టారు. దిల్లీలో రూ.5కు భోజనం అందించే అటల్ క్యాంటీన్లను ముఖ్యమంత్రి రేఖా గుప్తా గురువారం ప్రారంభించారు. 100 క్యాంటీన్ల ద్వారా రోజూ లక్ష మందికి భోజనం అందించనున్నట్లు ఆమె తెలిపారు.

■ బనారస్ హిందూ విశ్వవిద్యాలయ వ్యవస్థాపకుడు, విద్యావేత్త మదన్ మోహన్ మాలవీయ జయంతి సందర్భంగా ఆయనకు ప్రధాని నివాళులర్పించారు.



ప్రేరణా స్థల్ వద్ద వాజ్‌పేయీ విగ్రహం ముందు ప్రధాని మోదీ, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తదితరులు

వేడుకలు డూపర్!



క్రిస్మస్ వేడుకల్లో చంద్రబాబు వేషధారి లక్ష్మణ్

పశ్చిమగోదావరి జిల్లా ఆచంటకు చెందిన ఆంద్రు లక్ష్మణ్ తెదేపా వీరాభిమాని. గురువారం ఆచంట పరిసర ప్రాంతాల్లోని చర్చిలకు వెళ్లి.. చంద్రబాబు వేషధారణలో వేడుకల్లో పాల్గొన్నారు. సీఎం చంద్రబాబులా ఉండటంతో ఆయా వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఎన్నికల సమయంలోనూ చంద్రబాబు డూప్‌గా పలు ప్రాంతాల్లో ప్రచారం చేసి అభిమానులను అలరించారు. ఆయన్ను స్థానికులు జూనియర్ చంద్రబాబు అని పిలుస్తుంటారు. – న్యూస్‌టుడే, ఆచంట

పోస్ట్‌మెట్రిక్ ఉపకార వేతనాలకు రూ.100.93 కోట్లు

మంత్రి సంధ్యారాణి

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ఈ ఏడాది (2025-26) ఇప్పటివరకు పోస్ట్‌మెట్రిక్ ఉపకార వేతనాలకు రూ.100.93 కోట్లు విడుదల చేశామని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి తెలిపారు. తద్వారా 59,297 మంది గిరిజన విద్యార్థులకు లబ్ధి చేకూరినట్లు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. '2023-24లో గత ప్రభుత్వం రూ.18.67 కోట్లే విడుదల చేసింది. పెండింగ్‌లో ఉన్న మూడు త్రైమాసికాలకు సంబంధించిన రూ.71.67 కోట్లు కూటమి ప్రభుత్వం ఇచ్చింది. ఆయా మొత్తాలు 69,227 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమయ్యాయి. 2024-25 లోనూ రూ.94.78 కోట్ల మేర మంజూరు చేశాం. దీంతో 42,203 మందికి లబ్ధి చేకూరింది' అని మంత్రి వివరించారు



ఆదాయం మెరుగైనప్పుడు ఇలా చేయండి

- నాణ్యమైన దుస్తులు ధరించండి.
- జంక్ ఫుడ్‌ను పక్కనపెట్టి పోషకాల ఆహారాన్ని తీసుకోండి.
- ఇంటి పనులకు సహాయకులను పెట్టుకుని సమయాన్ని ఆదా చేసుకోండి.
- చక్కటి పరుపును కొనుక్కోండి. దాంతో కలిగే నాణ్యమైన నిద్ర ఎంతో ప్రయోజనకరం.
- మంచి ఆర్థికనిపుణుడి సలహాలు పొందుతుండండి.

– ముద్రిక, వ్యాపారవేత్త

మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు గణేష్ ఎన్‌కౌంటర్

(మొదటి పేజీ తరువాయి)

ఏరియా కమిటీ సభ్యుడు బరి ఎలియాస్ రాకేష్, దళ సభ్యుడు అమృత్‌లు మృతిచెందారని డీజీపీ పేర్కొన్నారు.

మావోయిస్టు రహిత భారతంలో కీలక ముందడుగు: అమిత్ షా

మావోయిస్టు రహిత భారతదేశాన్ని సాధించడంలో ఇదో కీలక ముందడుగని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఎక్స్ వేదికగా స్పందించారు. 2026 మార్చి 31లోపు దేశం నుంచి మావోయిజాన్ని పూర్తిగా తుడిచిపెట్టేందుకు కట్టుబడి ఉన్నామన్నారు.

చదువుకుంటూనే అజ్ఞాతంలోకి...

ఎదురుకాల్పుల్లో మృతిచెందిన పాక హనుమంతుది నల్గొండ జిల్లా. ఆయనపై ఒడిశాలో అత్యధికంగా రూ.1.10 కోట్లు, ఛత్తీస్‌గఢ్‌లో రూ.40 లక్షలు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో రూ.25 లక్షల చొప్పున రివార్డులు ఉన్నాయి. పాక హనుమంతు ఎలియాస్ ఉకే గణేష్, ఎలియాస్ రాజేశ్ తివారి, ఎలియాస్ చర్మ, ఎలియాస్ గణేష్ అన్నగా అతన్ని పిలుస్తారు. నల్గొండ జిల్లా చండూరు మండలం పుల్లెంల గ్రామంలోని పాక చంద్రయ్య, పాపమ్మ దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ముగ్గురు కుమారులు. ఇందులో మొదటి సంతానం హనుమంతు. ఈయన చండూరులో ఇంటర్ వరకు చదివారు. నల్గొండలోని ఎన్జీ కళాశాలలో బీఎస్సీ చదివే సమయంలో కళాశాల రాడికల్ స్టూడెంట్ యూనియన్ (ఆర్‌ఎస్‌యూ) ప్రధాన కార్యదర్శిగా ఉన్నారు. అప్పట్లో ఆర్‌ఎస్‌యూ, ఏబీవీపీ విద్యార్థి సంఘాల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. ఇదే సమయంలో 1982లో ఏబీవీపీ నాయకుడు ఏచూరి శ్రీనివాస్ హత్యకు గురయ్యారు. ఈ హత్యకు కారకుడు హనుమంతేనని పోలీసులు కేసు పెట్టడంతో డిగ్రీ చదువును అర్ధాంతరంగా వదిలేసి అజ్ఞాతంలోకి వెళ్లిపోయినట్లు గ్రామస్థులు చెప్పారు. మూడు సంవత్సరాల క్రితం తల్లిదండ్రులిద్దరూ మృతిచెందినా రాలేదని గ్రామస్థులు చెప్పారు. ఇటీవలి కాలంలో వృద్ధాప్యంలో వచ్చే అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని సమాచారం. పీపుల్స్ వార్ పార్టీ జాతీయ కార్యదర్శి కొండపల్లి సీతారామయ్య పిలుపు మేరకు అజ్ఞాతంలోకి వెళ్లిన హనుమంతు మొదటగా దళ సభ్యుడిగా చేరి కేంద్ర కమిటీ సభ్యుడి స్థాయికి చేరుకున్నారు. ఒడిశా, తెలంగాణ, ఆంధ్రల్లో మావోయిస్టు కార్యకలాపాలకు నాయకత్వం వహించేవారు. ఆయా రాష్ట్రాల్లో పలు హింసాత్మక ఘటనల్లో ఆయన పాల్గొన్నాడు. మావోయిస్టు నేత నంబాల కేశవరావు చనిపోయిన తర్వాత ఒడిశా కేంద్ర కమిటీ సభ్యుడిగా దక్షిణాది రాష్ట్రాలకు ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నారు. పోలీసులకు లొంగిపోవాలని చెప్పేందుకు హనుమంతు బావ, పౌరహక్కుల సంఘ నాయకుడు మాలిక్ ఇటీవల ఒడిశాలోని కంధమాల్‌కు వెళ్లారు. ఆయన ఆచూకీ దొరక్క వెనుదిరిగి వచ్చారు.



మృతిచెందిన మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు గణేశ్ ఉయికే, మరో ఇద్దరు గుర్తుతెలియని మావోయిస్టులు

సంక్రాంతి నాటికి ఆ జిల్లాల్లో గుంతల రోడ్లు ఉండకూడదు

అధికారులకు ఆర్అండ్‌బీ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆదేశం

ఈనాడు, అమరావతి: ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల్లో వర్షాలకు రహదారులు ఎక్కువగా దెబ్బతిన్నాయని, సంక్రాంతి నాటికి వాటిని గుంతల రహితంగా మార్చాలని అధికారులను ఆర్అండ్‌బీ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఆదేశించారు. జనవరి 10 నాటికే ఈ పనులన్నీ పూర్తికావాలని పేర్కొన్నారు. గురువారం మూడు ఉమ్మడి జిల్లాల ఇంజినీర్లు, ఆర్అండ్‌బీ ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంత్రి మాట్లాడారు. "ఈ జిల్లాల్లోని మొత్తం 10,880 కి.మీ. మేర జిల్లా, రాష్ట్ర రహదారులు ఉన్నాయి. ఇవన్నీ గుంతల రహితంగా మారాలి. గతేడాది సంక్రాంతికి పొరుగు రాష్ట్రాల నుంచి ఏపీకి వచ్చినవాళ్లు రోడ్లు బాగుపడటం చూసి ఆనందం వ్యక్తం చేశారు. అయితే ఈసారి వర్షాలకు కూడా మళ్లీ రోడ్లు పాడైనందున.. వాటికి వెంటనే మరమ్మతులు చేయాలి. ఇతర జిల్లాల్లో కూడా ఈ పనులు వేగవంతం కావాలి. మరమ్మతుల పనుల బిల్లులను వచ్చేనెల 26 లోపు అప్‌లోడ్ చేసేలా గుత్తేదార్లకు ఇంజినీర్లు సహకరించాలి" అని చెప్పారు. సమావేశంలో ఈఎన్‌సీ వివేకానందరెడ్డి, రాష్ట్ర హైవేల సీఈ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సంఘం నిధుల వినియోగం ఆపండి

పంచాయతీలకు అధికారుల ఆదేశాలు

ఈనాడు–అమరావతి: తదుపరి ఆదేశాలు వెలువడే వరకు పంచాయతీల్లో 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగం నిలిపివేయాలని పంచాయతీలు, మండల పరిషత్‌లను ఆదేశిస్తూ పలు జిల్లాల్లో అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. వీటిని విధిగా పాటించాలని, విరుద్ధంగా వ్యవహరించే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సర్పంచులు, ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యుల పదవీకాలం మరో మూడు నెలల్లో ముగియనున్న నేపథ్యంలో ఆర్థిక సంఘం నిధులను ఖాళీ చేసేందుకు పంచాయతీల్లో సర్పంచులు యత్నిస్తున్నారు. పాత పనుల బిల్లులు చెల్లించాలని కార్యదర్శులపై కొందరు సర్పంచులు ఒత్తిడి చేస్తున్నారని, చేయని పనులకూ బిల్లులు సృష్టిస్తున్నట్లు వచ్చిన ఫిర్యాదులపై పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ కార్యాలయం అప్రమత్తమైన విషయం తెలిసిందే. జిల్లా పరిషత్ సీఈవోలు, జిల్లా పంచాయతీ అధికారులతో ఇటీవల నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో ఆర్థిక సంఘం నిధుల వినియోగాన్ని తాత్కాలికంగా నిలిపివేయాలని, ఎలాంటి బిల్లులూ చెల్లించవద్దని ఉన్నతాధికారులు ఆదేశించారు. మళ్లీ ఆదేశాలిచ్చే వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోవద్దని సూచించారు.

పెట్టుబడిదారులను భయపెట్టేందుకే మారణాయుధాలతో ప్రదర్శనలు చేయిస్తున్న జగన్

తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

ఈనాడు–అమరావతి, ఏలూరు: వైకాపా అధినేత జగన్ పుట్టిన రోజు సందర్భంగా ఆ పార్టీ నాయకులు మారణాయుధాలతో ప్రదర్శనలు చేయడం, 'రప్పా..రప్పా' నరుకుతామని ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం లాంటి వాటిని ఏమాత్రం ఉపేక్షించకూడదని తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. వైకాపా వారిపై సాయుధ చట్టం కింద కేసులు నమోదు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయం, ఏలూరు (గంగానమ్మ జాతర ఉత్సవంలో పాల్గొన్న అనంతరం)లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'పెట్టుబడిదారులను భయపెట్టడానికే జగన్ ఇలాంటి ప్రదర్శనలు చేయిస్తున్నారు. అభివృద్ధిని అడ్డుకోవాలనే కుట్రలో భాగమే ఇదంతా. ఎవరైనా పుట్టిన రోజును శాంతియుతంగా, ఆనందంగా చేసుకుంటారు. దురదృష్టం..జగన్ పుట్టినరోజు నాడు ఆయన అనుయాయులు కొన్ని చోట్ల గొర్రెలు, పొట్టేళ్లను కోసి రక్తం చిందించారు. కత్తులు చూపించి కేక్‌లు కోశారు. ఇది దేనికి నిదర్శనం? ఇదేం సంస్కృతి? ఇలాంటి చర్యలు రాష్ట్రంపై ప్రతికూల ప్రభావం చూపుతాయి. ఉపాధి, ఉద్యోగ కల్పనలను దెబ్బతీస్తాయి. వైకాపా వారి తాటాకు చప్పుళ్లకు, హింసాత్మక రాజకీయాలకు తెదేపా ఎన్నటికీ భయపడదు. ప్రజలు సైతం జగన్ లాంటి నేరప్రవృత్తి ఉన్న నేతతో అప్రమత్తంగా ఉండాలి' అని పల్లా శ్రీనివాసరావు అన్నారు.

పోతిరెడ్డిపాడు గేట్ల లీకేజీ



పోతిరెడ్డిపాడు గేట్ల నుంచి లీకవుతున్న నీరు

నందికొట్కూరు, న్యూస్‌టుడే: నంద్యాల జిల్లా జూపాడు బంగ్లా మండలం పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ గేట్ల నుంచి నీరు లీకవుతోంది. నూతనంగా నిర్మించిన 10 గేట్ల సముదాయంలో 5, 10 గేట్ల నుంచి భారీగా నీరు లీకేజీ అవుతుండగా.. మిగతా గేట్ల నుంచి కొద్దిగా లీకై ప్రధాన కాలువ గుండా పోతోంది. ఎస్సార్‌ఎంసీ కాలువ ద్వారా 40 వేల క్యూసెక్కుల కృష్ణా మిగులు జలాలను తరలించేందుకు చాబోలు గ్రామ సమీపంలో 10 గేట్లు ఏర్పాటు చేశారు.

అనకాపల్లి రైతు సంఘం నేత అప్పలరాజును విడుదల చేయాలి: వామపక్షాలు

ఈనాడు, అమరావతి: అనకాపల్లి రైతు సంఘం జిల్లా కార్యదర్శి అప్పలరాజుపై పెట్టిన పీడీ చట్టం కేసును ఉపసంహరించాలని వామపక్షాలు డిమాండ్ చేశాయి. ఆయన్ని వెంటనే విడుదల చేయాలని కోరాయి. ఈ మేరకు సీపీఎం, సీపీఐ సహా 10 వామపక్ష పార్టీలు ఉమ్మడి ప్రకటన విడుదల చేశాయి. "ప్రజా సమస్యలపై కృషి చేస్తున్న అప్పలరాజుపై తప్పుడు కేసులు బనాయించి నిర్బంధించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. ప్రజా ప్రయోజనాల కోసం శాంతియుత పద్ధతుల్లో పోరాడుతున్న ప్రజలను భయపెట్టేందుకే అప్పలరాజుపై అక్రమ కేసు నమోదు చేశారు. ఇటీవల కలెక్టర్ల సమావేశంలో భూసేకరణకు అడ్డుపడే వారిపై పీడీచట్టం ప్రయోగించమని సీఎం ఆదేశించారు. ఆ స్ఫూర్తితోనే కలెక్టర్ కనీసం నేర చరిత్రను పరిశీలించకుండానే సంతకం చేసి, ఆర్డర్ జారీ చేయడం అసమంజసం" అని విమర్శించాయి.

గరళకంఠుడి లెక్క..
ఈ నీలకంఠ్ ఆలూ!



సాధారణంగా బంగాళదుంపల్లో పిండి పదార్థాలు అధికమని చాలామంది మితంగా తింటారు. బిహార్‌లోని నలంద జిల్లా మేగి గ్రామరైతు సురేంద్ర రామ్ పండిస్తున్న 'నీలకంఠ్' అనే కొత్త రకం బంగాళదుంప తింటే ఆ సమస్య లేదని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. శివుడు గరళాన్ని తన కంఠంలో నిలుపుకొన్నట్లే ఇది శరీరంలో ఉన్న విష పదార్థాలను (టాక్సిన్స్) తొలగిస్తుంది కాబట్టి, 'నీలకంఠ్' అని పేరు పెట్టారు. నీలం లేదా ఊదా రంగులో ఉండే ఈ ఆలూ శాస్త్రీయనామం కూడా 'కుఫ్రీ నీలకంఠ్'. తొలి రైతు హిమాచల్ ప్రదేశ్ నుంచి తెచ్చిన ఈ పంట విత్తనాలను సాగు విధానం తెలియక అమ్మాలని అనుకోగా.. సురేంద్ర రామ్ వాటిని కొని 2021 నుంచి సాగు కొనసాగిస్తున్నారు. ఇప్పుడు ఉత్తర్‌ప్రదేశ్, ఝార్ఖండ్ రైతులు కూడా తన వద్ద బంగాళ దుంపలను తీసుకెళ్తున్నారని సురేంద్ర వెల్లడించారు. సాధారణ బంగాళ దుంపల సాగులో రసాయనాలు విరివిగా ఉపయోగించడంతో నేల సారాన్ని కోల్పోతుంది. నీలకంఠ్ దుంపలను సహజ పద్ధతిలో పండిస్తుండటంతో ఆ ప్రమాదం లేదని హరసాగర్ ఉద్యాన విశ్వవిద్యాలయం (బీహెచ్‌యూ) శాస్త్రవేత్త కుమారి విజారత్ తెలిపారు.

స్తంభం ఎక్కి..
వైర్లు కత్తిరించిన ఎమ్మెల్యే

- విద్యుత్తు కోతలపై ఆగ్రహం



హరిద్వార్: నిత్యం విద్యుత్తు కోతలతో విసుగు చెందిన ఉత్తరాఖండ్ కాంగ్రెస్ ఎమ్మెల్యే వీరేంద్ర జాతీ అధికారుల తీరుపై మండిపడ్డారు. విద్యుత్తు శాఖకు చెందిన ముగ్గురు ఉన్నతాధికారుల ఇళ్లకు కరెంటు సరఫరా చేసే వైర్లను కత్తిరించారు. హరిద్వార్ జిల్లా ఝబ్రేడా నియోజకవర్గ ఎమ్మెల్యే వీరేంద్ర మంగళవారం తన అనుచరులతో కలిసి బోట్ క్లబ్ ప్రాంతానికి వెళ్లారు. అక్కడ స్వయంగా విద్యుత్తు స్తంభం ఎక్కి విద్యుత్తు శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ వివేక్ రాజ్‌పూత్, చీఫ్ ఇంజినీర్ అనుపమ్ సింగ్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వినోద్ పాండేల ఇళ్లకు కరెంటును నిలిపివేశారు. ఈ సందర్భంగా వీరేంద్ర మాట్లాడుతూ.. తమ ప్రాంతంలో రోజుకు 5-8 గంటల పాటు విద్యుత్తును నిలిపి వేస్తున్నారన్నారు. ఈ సమస్యను 10 రోజులుగా అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నా, ఎవరూ పట్టించుకోలేదన్నారు. ఎమ్మెల్యే చర్యపై విద్యుత్తు శాఖ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.



వెంకయ్యనాయుడితో నితిన్ నబీన్ మర్యాదపూర్వక భేటీ

ఈనాడు, దిల్లీ: భాజపా కార్యనిర్వాహక అధ్యక్షుడు నితిన్ నబీన్ గురువారం ఇక్కడి 1-త్యాగరాజమార్గ్ నివాసంలో పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడిని మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యనిర్వాహక అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి ఆయన వెంకయ్యతో భేటీ అయ్యారు. ఈ భేటీలో పలు అంశాలపై సుదీర్ఘంగా మాట్లాడినట్లు వెంకయ్యనాయుడు 'ఎక్స్'లో పేర్కొన్నారు. "నితిన్ నబీన్‌తో సుదీర్ఘ సంభాషణ జరిగింది. నా సొంత అనుభవాలను, పూర్వ అధ్యక్షుల పార్టీ నెట్‌వర్క్‌ను బలోపేతం చేయడానికి సలహాలు, సూచనలను పంచుకున్నాను. దేశవ్యాప్తంగా విస్తృతంగా పర్యటించాలని సూచించాను. ప్రజలు, పార్టీ శ్రేణుల ఆకాంక్షలను నెరవేర్చేందుకు నిరంతరం కార్యకర్తలతో మమేకమై ఉండటం అత్యవసరం అని చెప్పాను." అని వెంకయ్యనాయుడు పేర్కొన్నారు.

బంగ్లాదేశ్ అందరిదీ..

- హిందువులు, ముస్లింలు, బౌద్ధులు, క్రైస్తవులది..
- ఖాలిదా జియా కుమారుడు రహ్మాన్ స్పష్టీకరణ



మద్దతుదారుల్ని ఉద్దేశించి ప్రసంగిస్తున్న తారిఖ్

ఢాకా: బంగ్లాదేశ్.. హిందువులు, ముస్లింలు, బౌద్ధులు, క్రైస్తవులందరిదని, అన్ని విశ్వాసాల వారికి ఇక్కడ స్థానముందని, కొండ, మైదాన ప్రాంత ప్రజలందరిదీ ఈ నేల అని మాజీ ప్రధాని ఖాలిదా జియా కుమారుడు, బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) తాత్కాలిక అధ్యక్షుడు తారిక్ రహ్మాన్ స్పష్టం చేశారు. ప్రజలంతా ప్రశాంతంగా ఉండాలని, సమ్మిళిత సమాజం కోసం తనవద్ద విజన్ ఉందని పేర్కొన్నారు. 17 ఏళ్ల తర్వాత తన కుటుంబంతో కలిసి గురువారం తారిక్ బంగ్లాదేశ్‌లో అడుగుపెట్టారు. ఢాకా అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగగానే చెప్పులు లేకుండా అడుగుపెట్టి నేలను ముద్దాడారు. ఇంతకాలం లండన్‌లో తలదాచుకున్న 60ఏళ్ల తారిక్.. వచ్చే ఏడాది జరగనున్న ఎన్నికల తర్వాత ప్రధాన మంత్రి పదవికి కీలక పోటీదారుగా భావిస్తున్నారు. విమానాశ్రయం నుంచి ఆయన నేరుగా జులై 36 ఎక్స్‌ప్రెస్‌వేలో ఏర్పాటు చేసిన పార్టీ సభకు హాజరయ్యారు. వేల మంది మద్దతుదారులను ఉద్దేశించి ప్రసంగించారు. '1971లో ఒకసారి. 2024 జులైలో మరోసారి స్వాతంత్ర్యాన్ని సాధించుకున్నాం. మెరుగైన బంగ్లాదేశ్‌ను నిర్మించేందుకు, శాంతిని నెలకొల్పేందుకు బీఎన్‌పీ అవిశ్రాంతంగా పని చేస్తుంది. ఈ ప్రయాణంలో అన్ని వర్గాలను కలుపుకొని వెళ్తాం. మహిళలు, పురుషులు, పిల్లలు ఇంటి నుంచి బయటకు వెళ్లి ప్రశాంతంగా తిరిగివచ్చేలా దేశాన్ని మారుస్తా' అని పేర్కొన్నారు. సభలో పాల్గొన్న అనంతరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తన తల్లి ఖాలిదా జియాను తారిఖ్ పరామర్శించారు.

17 ఏళ్ల తర్వాత స్వదేశానికి..

హసీనా హయాంలో తారిక్‌పై పలు అవినీతి కేసులు నమోదయ్యాయి. 2007లో అరెస్టయ్యారు. జైలులో అనారోగ్యానికి గురయ్యారు. తర్వాత బెయిలుపై బయటకు వచ్చిన ఆయన చికిత్స కోసం లండన్ వెళ్లిపోయారు. 2008 నుంచి అక్కడే ఉండి బీఎన్‌పీ కార్యకలాపాలను పర్యవేక్షిస్తున్నారు. 17 ఏళ్ల తర్వాత స్వదేశానికి వచ్చిన రహ్మాన్‌ను చూడటానికి పార్టీ కార్యకర్తలు భారీగా తరలివచ్చారు.

మరో మైనారిటీ యువకుడి హత్య

ఢాకా: బంగ్లాదేశ్‌లో దీపూ చంద్ర దాస్ హత్యోదంతం మరవక ముందే మరో మైనారిటీ యువకుడిని గ్రామస్థులు కొట్టి చంపారు. రాజ్‌బరి జిల్లా పంగ్షా సర్కిల్‌లో బుధవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుందని స్థానిక మీడియా సంస్థ 'డెయిలీ స్టార్' పేర్కొంది. అయితే అతడో గ్యాంగ్‌స్టర్ అని, డబ్బు వసూళ్లకు పాల్పడటంతో గ్రామస్థులు అతడిపై దాడికి పాల్పడినట్లు పోలీసులు పేర్కొంటున్నారు. అమృత్ మండల్ అలియాస్ సామ్రాట్‌పై (29) బుధవారం రాత్రి గ్రామస్థులు దాడి చేసినట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో వారు ఘటనా స్థలికి చేరుకుని అతడిని ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ గురువారం వేకువజామున 2 గంటల సమయంలో అతడు మృతి చెందాడు. సామ్రాట్ అనుచరుల్లో ఒకడైన సలీమ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

క్రిస్మస్ ప్రార్థనల్లో మోదీ

- దేశ ప్రజలకు ప్రధాని శుభాకాంక్షలు

దిల్లీ: దిల్లీలోని ప్రఖ్యాత క్యాథడ్రల్ చర్చ్ ఆఫ్ రిడెంప్షన్‌లో జరిగిన క్రిస్మస్ ప్రార్థనల్లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్నారు. ఏసుక్రీస్తు జననాన్ని గుర్తు చేసుకుంటూ గురువారం ఉదయం ఈ చర్చిలో నిర్వహించిన ఉదయపు క్రిస్మస్ ప్రార్థనలకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ శ్రేయస్సు కోసం దిల్లీ బిషప్ పాల్ స్వరూప్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ వివరాలను తెలుపుతూ ఎక్స్‌లో ప్రధాని పోస్టు చేశారు. దేశ ప్రజలందరికీ ఆయన క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అందరూ శాంతి, కరుణ, ఆశలతో జీవితాల్లో పురోగమించాలని ఆకాంక్షించారు. ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్, భాజపా అధ్యక్షుడు జేపీ నడ్డా, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీలు క్రిస్మస్ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.



క్రిస్మస్ సందర్భంగా దిల్లీలోని క్యాథడ్రల్ చర్చ్ ఆఫ్ రిడెంప్షన్‌లో మోదీ

క్రీస్తు మార్గంలో

'దేశ ప్రజలందరికీ, ప్రత్యేకించి క్రైస్తవ వర్గం వారికి నా తరఫున క్రిస్మస్ శుభాకాంక్షలు. ఇదొక ఉత్సాహంతో కూడిన గొప్ప వేడుక. ప్రేమ, కరుణ అనే సందేశాలను క్రిస్మస్ ఇస్తుంది. ఏసుక్రీస్తు చూపిన మార్గంలో మనం నడుద్దాం' అని 'ఎక్స్' వేదికగా రాష్ట్రపతి ముర్ము పేర్కొన్నారు.



ప్రొటీన్ అల్పాహారం అత్యుత్తమం

అధిక ప్రొటీన్ గల ఉదయపు అల్పాహారం తీసుకోవడం బరువు తగ్గేందుకు చేసే ఉపవాసం కంటే ఉత్తమం. ఎలా అంటే.. ప్రొటీన్ అల్పాహారంతో శరీరంలో కొవ్వు తగ్గుతుంది. కండరాలు బలోపేతం అవుతాయి. మరింత శక్తి లభిస్తుంది. హార్మోన్లు ఉత్తేజితమవుతాయి. దీర్ఘకాలంలో ఆరోగ్యం మెరుగవుతుంది.

– యాష్లే రిచ్‌మండ్, హెల్త్ కన్సల్టెంట్

సైనికులు ఇన్‌స్టాగ్రామ్ వాడొచ్చు..
పోస్టులు పెట్టొద్దు

దిల్లీ: సైనికులు సామాజిక మాధ్యమాలను వినియోగించడంపై ఇన్నాళ్లూ కఠిన వైఖరి అవలంబిస్తూ వచ్చిన రక్షణశాఖ.. తాజాగా నిబంధనలను కాస్త సడలించింది. జవాన్లు, సైనికాధికారులు ఇన్‌స్టాగ్రామ్‌ను వినియోగించేందుకు అనుమతి కల్పించింది. ఈ మేరకు రక్షణశాఖ వర్గాలు వెల్లడించాయి. అయితే, ఇందుకు కొన్ని షరతులు కూడా విధించింది. ప్రస్తుత డిజిటల్ యుగంలో ఎప్పటికప్పుడు తాజా సమాచారం తెలుసుకోవడం అత్యవసరమని, అందుకు మాత్రమే సైనికులు ఇన్‌స్టాగ్రామ్‌ను ఉపయోగించాలని రక్షణ శాఖ స్పష్టం చేసింది. ఆర్మీ సిబ్బంది పోస్టులు చేయడం, ఇతరుల పోస్టులను లైక్ చేయడం, కామెంట్లు పెట్టడం, షేర్ చేయడం వంటివి చేయకుండా కఠిన ఆంక్షలు అమల్లో ఉంటాయని మార్గదర్శకాల్లో పేర్కొంది. దేశ రక్షణతో పాటు వ్యక్తిగత వివరాల గోప్యత ఉల్లంఘన జరగకుండా ఉండేందుకే ఈ నిబంధనలను అమలు చేస్తున్నట్లు తెలిపింది. ఇవే నిబంధనలు ఫేస్‌బుక్, యూట్యూబ్, ఎక్స్ వంటి ఇతర మాధ్యమాలకు కూడా ప్రస్తుతం కొనసాగుతున్నాయి.

పెంచిన రైలు ఛార్జీలు నేటి నుంచి అమల్లోకి..



దిల్లీ: పెంచిన రైలు ఛార్జీలు శుక్రవారం నుంచి అమల్లోకి రానున్నాయి. ఈ ఛార్జీల పెంపును గురువారం రైల్వేశాఖ నోటిఫై చేసింది. అందులోని వివరాల ప్రకారం.. 215 కిలోమీటర్లు దాటిన ప్రయాణానికి సాధారణ తరగతిలో ప్రతి కిలోమీటరుకు 1 పైసా చొప్పున, మెయిల్/ఎక్స్‌ప్రెస్ రైళ్లలో నాన్ ఏసీ, ఏసీ తరగతుల్లో ప్రతి కిలోమీటరుకు 2 పైసల చొప్పున ఛార్జీలు పెరిగాయి. తాజా పెంపుదలతో ఈ సంవత్సరంలో రైల్వేశాఖ రెండుసార్లు ఛార్జీలను పెంచినట్లయింది. సబర్బన్ సర్వీసులు, సీజనల్ టికెట్ల ఛార్జీల్లో ఎలాంటి మార్పులు లేవు.

చైనాలో భారత ట్రావెల్ వ్లాగర్ నిర్బంధం

ఇంటర్నెట్‌డెస్క్: అరుణాచల్‌ప్రదేశ్ గురించి మాట్లాడినందుకు తనను చైనా అధికారులు నిర్బంధించారని భారత్‌కు చెందిన ట్రావెల్ వ్లాగర్ అనంత్ మిత్తల్ ఆరోపించాడు. ఈనెల 16న జరిగిన ఈ ఘటన గురించి ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియో ద్వారా వెల్లడించాడు. 'ఆన్ రోడ్ ఇండియా' అనే పేరుతో అనంత్ ట్రావెల్ వీడియోలు చేస్తుంటాడు. ఇటీవల తన స్నేహితుడిని కలిసేందుకు చైనా వెళ్లానని, గ్వాంగ్‌జౌ విమానాశ్రయంలో ఇమిగ్రేషన్ ప్రక్రియ జరుగుతోన్న క్రమంలో తనను ఓ సీనియర్ అధికారి పక్కకు తీసుకెళ్లారన్నాడు. దాదాపు 15 గంటలు తనను నిర్బంధించి, విచారించారన్నాడు.. నిర్బంధ సమయంలో తనకు కనీసం ఆహారం అందించలేదని పేర్కొన్నాడు. విచారణ ముగిసిన అనంతరం.. తనను వదిలేశారని, ఈ ఘటన తనను మానసికంగా కుంగదీసిందని వాపోయాడు. అరుణాచల్‌ప్రదేశ్‌లో మూడేళ్లు చదువుకున్నానని, అప్పటి పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేస్తూ అప్పట్లో ఓ వీడియో చేశానన్నాడు. అందువల్లే ఇప్పుడు చైనా అధికారులు తనను నిర్బంధించారని ఆరోపించాడు.

ఆ పానీయాలను టీ అనొద్దు

- ఆహార వాణిజ్య సంస్థలకు ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ హెచ్చరిక

దిల్లీ: ఆహార వాణిజ్య సంస్థలకు ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ) కీలక ఆదేశాలు జారీ చేసింది. మూలికలు, మొక్కల నుంచి సేకరించిన మిశ్రమాలతో తయారుచేసేవాటిని టీ పేరుతో పిలవొద్దని స్పష్టం చేసింది. ఇవేవీ కామెల్లియా సినెన్సిస్ (తేయాకు శాస్త్రీయ నామం) నుంచి సేకరించినవి కావు కాబట్టి టీగా వ్యవహరించొద్దని తెలిపింది. చట్ట ప్రకారం.. ఇది తప్పుడు, తప్పుదోవ పట్టించే ప్రచారం అవుతుందని పేర్కొంది. ఇటీవల కాలంలో రూయిబోస్ టీ, హెర్బల్ టీ, ఫ్లవర్ టీ వంటి పేరుతో విక్రయాలు సాగుతున్న నేపథ్యంలో ఈ ఆదేశాలు జారీ చేసింది. ఇవేవీ తేయాకు మొక్క నుంచి సేకరించినవి కావని స్పష్టం చేసింది. తేయాకు మొక్కల నుంచి సేకరించిన వాటిని మాత్రమే టీగా వ్యవహరించాలని స్పష్టం చేసింది. కాంగ్రా టీ, గ్రీన్ టీ, ఇన్‌స్టంట్ టీ వంటి రకాలను టీగా వ్యవహరించొచ్చని పేర్కొంది.

అంతరిక్ష యాత్ర కోసం
జ్ఞాన దంతాలు తీయించుకున్నా

- వ్యోమగామి శుభాంశు శుక్లా వెల్లడి



ముంబయి: వ్యోమగాములకు దంత ఆరోగ్యం చాలా కీలకమని అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లొచ్చిన తొలి భారతీయుడు, ఐఏఎఫ్ టెస్ట్ పైలట్ శుభాంశు శుక్లా తెలిపారు. తన అంతరిక్ష యాత్ర కోసం శిక్షణ తీసుకున్నప్పుడు రెండు జ్ఞాన దంతాలను తొలగించుకున్నట్లు వెల్లడించారు. గగన్‌యాన్ యాత్రకు ఎంపికైన గ్రూప్ కెప్టెన్లు ప్రశాంత్ నాయర్, అంగద్ ప్రతాప్‌లతో కలిసి బుధవారం ఆయన బొంబాయి ఐఐటీలో మాట్లాడారు. 'వ్యోమనౌకలో ఉన్నప్పుడు ఏవైనా అనారోగ్య, అత్యవసర సమస్యలు తలెత్తితే వాటిని ఎదుర్కొనేలా వ్యోమగాములకు ముందుగానే శిక్షణ ఇస్తారు. అయితే వ్యోమనౌకలో దంత సమస్యలకు శస్త్ర చికిత్సలు చేయడం కుదరదు. అందుకు అనుగుణంగానే అంతరిక్ష యాత్రలో వ్యోమగాములకు ఎలాంటి దంత సమస్యలు రాకుండా ముందే వారిని పరీక్షించి సిద్ధం చేస్తారు. ఇలానే.. నా శిక్షణలో నేను రెండు జ్ఞాన దంతాలు తీయించుకున్నాను. నాయర్‌కు మూడు దంతాలు తీశారు. ప్రతాప్‌కు నాలుగు పళ్లు తొలగించారు. మీరు గనక వ్యోమగాములు కావాలంటే మీ 'జ్ఞానాన్ని' వదులుకోవాల్సిందే' అని శుభాంశు శుక్లా చమత్కరించారు.

ప్రపంచ వ్యాప్తంగా ఘనంగా క్రిస్మస్ వేడుకలు

- గాజా ప్రజల వెతలను స్మరించుకున్న పోప్

వాటికన్: ప్రపంచ వ్యాప్తంగా ఆనందోత్సాహాలతో సాగిన క్రిస్మస్ సంబరాల్లో భాగంగా వాటికన్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న పోప్ లియో-14.. వివిధ దేశాల్లో నెలకొన్న కల్లోలాలు ఉపశమించాలని ఆకాంక్షించారు. లెబనాన్, పాలస్తీనా, ఇజ్రాయెల్, సిరియాల్లో న్యాయం, శాంతి, సుస్థిరతలు పరిఢవిల్లాలని ప్రార్థించారు. ఉక్రెయిన్‌లో ఆయుధాల హోరు నశించి శాంతి పునరుద్ధరణ జరగాలని అభిలషించారు. నిరుపేదల అంతులేని వ్యథను అంతం చేసేందుకు భగవంతుడు తన ప్రతినిధిని పంపుతాడన్న నమ్మకాన్ని పునరుద్ఘాటించారు. పోప్ హోదాలో తొలిసారిగా ప్రసిద్ధ సెయింట్ పీటర్స్ బాసిలికా చర్చిలో జరిగిన అర్ధరాత్రి ప్రార్థన (మిడ్‌నైట్ మాస్) వేడుకల్ని ఉద్దేశించి పోప్ ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన గాజా ప్రజలు అనుభవిస్తున్న తీవ్ర వెతలను స్మరించుకున్నారు. గాజా ప్రజలు గడచిన కొన్ని వారాలుగా ఎడతెగని వాన, చలిగాలుల తాకిడికి గురై అంతులేని బాధలు అనుభవిస్తున్నారని పేర్కొన్నారు. ప్రపంచం ఎదుర్కొంటున్న ఎన్నో సంఘర్షణల్ని కేవలం చర్చల ద్వారా పరిష్కరించుకోగలమని అభిప్రాయపడ్డారు. 'గాజాలో కొన్ని వారాలుగా ఎడతెగని వానలకు, చలిగాలులకు గజగజ వణుకుతున్న గుడారాలను ఎలా మరువగలం. తమ సొంత నగరంలోనే ఇల్లులేని అనాథలుగా తాత్కాలిక షెల్టర్లలో కాలం వెళ్లదీస్తున్న వారిని ఎలా మరువగలం' అని ప్రశ్నించారు. కల్లోలం నుంచి శాంతి ఉద్భవించాలంటే సంప్రదింపులే మార్గమని నొక్కి చెప్పారు. బాసిలికా చర్చిలో పోప్ లియో-14 తొలి క్రిస్మస్ ప్రసంగం వినడానికి వేల మంది గుమిగూడారు.



భక్తులకు అభివాదం చేస్తున్న పోప్ లియో-14

■ క్రీస్తు జన్మస్థలమైన బెత్లెహేంలో వేల మంది క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు. క్యాథలిక్ మతగురువైన కార్డినల్ పియె బటిస్టా.. జెరూసలెం నుంచి బెత్లెహేం వరకూ సాగిన ఊరేగింపును ప్రారంభించి క్రిస్మస్ వేడుకలకు శ్రీకారం చుట్టారు. వేలాదిగా గుమిగూడిన క్రైస్తవులను, ముస్లింలను ఉద్దేశించి ప్రసంగిస్తూ.. 'మనందరం కలిసికట్టుగా ఉందాం. బెత్లెహేం నుంచి వచ్చే వెలుగు ప్రపంచానికి కాంతినివ్వాలి' అని పేర్కొన్నారు.

పాలస్తీనాలోని వెస్ట్‌బ్యాంకు ప్రాంతంలో బెత్లెహేం ఉంది. ఈ నగరంలో అధిక సంఖ్యాకులైన ముస్లింలకు అక్కడికి వచ్చే క్రైస్తవ పర్యాటకులవల్లే ఉపాధి లభిస్తుంది. అయితే యుద్ధం కారణంగా పర్యాటకుల సంఖ్య భారీగా తగ్గిపోవడంతో వారి జీవనోపాధికి ఆటంకం ఏర్పడింది.

బ్రిటన్‌లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. జీవన వ్యయం పెరిగిపోవడంవల్ల తలెత్తిన సంక్షోభ పరిస్థితి నుంచి దేశ ప్రజలకు ఊరట కల్పించేందుకు కృషి చేస్తానని ఈ సందర్భంగా బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ పేర్కొన్నారు.

67 ఇండిగో విమాన సర్వీసుల రద్దు

ప్రతికూల వాతావరణం, నిర్వహణ సంబంధ కారణాలతో..

ముంబయి: ప్రతికూల వాతావరణ అంచనాలు, నిర్వహణ సంబంధ కారణాలతో ఇండిగో సంస్థ గురువారం దేశంలోని వివిధ విమానాశ్రయాల్లో 67 విమాన సేవలను రద్దు చేసింది. నిర్వహణ కారణాల వల్ల రద్దయినవి నాలుగు విమానాలే అని పేర్కొంది. అగర్తల, చండీగఢ్, దెహ్రాదూన్, వారణాసి, బెంగళూరు తదితర నగరాల్లోని ప్రతికూల వాతావరణ అంచనాల కారణంగా మిగిలిన సేవలను రద్దు చేసినట్లు తెలిపింది.

భారత్, పాకిస్థాన్‌లతో దోస్తీపై పెంటగాన్ నివేదికను ఖండించిన చైనా

బీజింగ్: భారత అమెరికా సంబంధాలను నీరుగార్చేందుకు తాను కృషి చేస్తున్నట్టుగా వెలువడిన ఒక నివేదికను చైనా గురువారం ఖండించింది. సరిహద్దు ఉద్రిక్తతలు సడలింపును ఎరగా వేసి భారత్‌తో సత్సంబంధాలను పునరుద్ధరించుకోజూస్తున్న చైనా, అదే సమయంలో పాకిస్థాన్‌తోనూ మైత్రిని నెరపుతోందని అమెరికా రక్షణ విభాగం పెంటగాన్ వెలువరించిన నివేదికపై చైనా స్పందించింది. "పెంటగాన్ నివేదిక చైనా రక్షణ విధానాన్ని వక్రీకరిస్తోంది. చైనాతో ఇతర దేశాల సంబంధాలను దెబ్బతీసేందుకు, అమెరికా సైనిక ఆధిక్యాన్ని కొనసాగించేందుకు ప్రయత్నిస్తోంది" అని చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి లిన్ జియాన్ అన్నారు.

వ్యాపారవేత్త డిజిటల్ అరెస్టు కేసు.. 5 రాష్ట్రాల్లో ఈడీ సోదాలు

దిల్లీ: డిజిటల్ అరెస్టు పేరుతో పంజాబ్‌లోని లుధియానాకు చెందిన ఎస్.పి.ఓస్వాల్ అనే వ్యాపారవేత్త రూ.7కోట్లకు పైగా పోగొట్టుకున్న కేసు దర్యాప్తును ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) వేగవంతం చేసింది. ఐదు రాష్ట్రాల్లోని 11 ప్రాంతాల్లో గురువారం సోదాలు నిర్వహించింది. నగదు అక్రమ చలామణి నిరోధక చట్టం(పీఎంఎల్‌ఏ) కింద పంజాబ్, హరియాణా, రాజస్థాన్, గుజరాత్, అస్సాంలలో ఈ సోదాలు నిర్వహించినట్లు అధికారి ఒకరు వివరించారు. 'ఎస్.పి.ఓస్వాల్‌ను డిజిటల్ అరెస్టు చేసే క్రమంలో నిందితులు నకిలీ పత్రాలను, ఆధారాలను చూపించి తమను తాము సీబీఐ అధికారులుగా చెప్పుకున్నారు. వివిధ ఖాతాల్లోకి రూ.7 కోట్లను బదిలీ చేయించుకున్నారు. వీటిలో రూ.5.24కోట్లను అధికారులు రికవరీ చేయగలిగారు' అని ఈడీ అధికార ప్రతినిధి వెల్లడించారు. మిగతా సొమ్మంతా కూలీలు, డెలివరీ బాయ్‌ల పేర్లతో ఉన్న ఖాతాల్లోకి జమ అయినట్లు గుర్తించామని తెలిపారు.


ఇక జీమెయిల్ యూజర్‌నేమ్ మార్చుకోవచ్చు

- కొత్త ఐచ్ఛికాన్ని అందుబాటులోకి తెచ్చిన గూగుల్

ఇంటర్నెట్ డెస్క్: జీమెయిల్ వినియోగదారులు తమ మెయిల్ ఐడీ (యూజర్‌నేమ్)ని మార్చుకునే ఐచ్ఛికాన్ని గూగుల్ తాజాగా అందుబాటులోకి తీసుకొచ్చింది. అవగాహన లేమి, పేర్లు అందుబాటులో లేకపోవడం వంటి కారణాలతో చాలామంది ఏదో ఒక యూజర్ నేమ్‌తో మెయిల్ ఐడీ క్రియేట్ చేసుకుంటారు. దాన్ని తర్వాత మార్చుకోవాలని భావించినా.. కుదిరేది కాదు. కాబట్టి దాన్ని అలాగే కొనసాగించడమో.. కొత్త మెయిల్ ఐడీ క్రియేట్ చేసుకోవడమో చేయాల్సి వచ్చేది. ఈ నేపథ్యంలో మెయిల్ ఐడీని మార్చుకునే వెసులుబాటును తాజాగా కల్పించారు. గూగుల్‌కు సంబంధించిన సపోర్ట్ పేజీలో ఈ ఆప్షన్ దర్శనమిచ్చింది. దీని ప్రకారం.. కొత్త ఇ-మెయిల్ ఐడీని ఎంచుకున్నప్పటికీ, దాన్ని పాత అకౌంట్‌గానే గూగుల్ పరిగణిస్తుంది. అంటే పేరు మాత్రమే మారుతుందన్నమాట. చివర్లో 'జీమెయిల్.కామ్' అలాగే ఉంటుంది. ఒకసారి ఐడీ మార్చుకున్నాక మళ్లీ ఏడాది వరకూ దాన్ని మార్చుకునే వీలుండదు. మొత్తంగా మూడుసార్లు మాత్రమే ఐడీని మార్చుకోవచ్చు. ప్రస్తుతానికి కొందరికి మాత్రమే ఈ ఐచ్ఛికం అందుబాటులోకి వచ్చినట్లు తెలుస్తోంది.

హమాస్ అగ్రనేత హత్య సమయంలో అక్కడే ఉన్నా...

నితిన్ గడ్కరీ



దిల్లీ: దాదాపు ఏడాదిన్నర క్రితం హమాస్ అగ్రనేత ఇస్మాయిల్ హనియాను ఇజ్రాయెల్ అంతం చేసిన ఘటన యావత్ ప్రపంచాన్ని ఉలికిపాటుకు గురి చేసింది. ఇందుకు సంబంధించి గత సంవత్సరం తన ఇరాన్ పర్యటనలో ఎదురైన వ్యక్తిగత అనుభవాన్ని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ పంచుకున్నారు. ఈ హత్యకు కొన్ని గంటల ముందే తాను హనియాను కలిశానని ఆయన తెలిపారు. "2024లో ఇరాన్ నూతన అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొనేందుకు భారత్‌కు ఆహ్వానం వచ్చింది. నేను ఆ కార్యక్రమానికి హాజరయ్యేందుకు టెహ్రాన్ వెళ్లా. అక్కడం నేను హమాస్ అగ్రనేత హనియాను కలిశా. ఇరాన్ అధ్యక్షుడు, ప్రధాన న్యాయమూర్తి తదితరులతో కలిసి హనియా ప్రమాణస్వీకారానికి వెళ్లడం చూశా. ఈ కార్యక్రమం ముగిసిన తర్వాత నేను హోటల్‌కు తిరిగి వచ్చేశాను. మరుసటి రోజు తెల్లవారుజామున 4 గంటలకు ఇరాన్ రాయబారి నా వద్దకు వచ్చి 'మనం వెంటనే ఇక్కడి నుంచి వెళ్లిపోవాలి' అని చెప్పారు. ఏం జరిగిందని అడిగితే.. 'హమాస్ చీఫ్ హత్య జరిగింది' అని చెప్పారు. నేను షాక్ అయ్యా" అని గడ్కరీ ఒక పుస్తకావిష్కరణ సభలో నాటి సంఘటనను నెమరువేసుకున్నారు.

ఈ డాక్టర్.. బధిర బాలల శాంటా క్లాజ్!

ఈటీవీ భారత్: రాజస్థాన్‌కు చెందిన మనీశ్ గ్రోవర్ అనే వైద్యుడు బధిర బాలల పాలిట ఏడాదంతా శాంటా క్లాజ్‌గా నిలుస్తున్నారు. వారికి వినికిడి శక్తితో పాటు మాట్లాడే సామర్థ్యాన్ని బహుమతిగా ఇస్తున్నారు. మనీశ్ సీనియర్ ఈఎన్‌టీ నిపుణుడు. ప్రస్తుతం రాజస్థాన్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ (ఆర్‌యూహెచ్‌ఎస్) ఆసుపత్రిలో పనిచేస్తున్నారు. వినికిడి లోపమున్న పిల్లలకు శస్త్రచికిత్స ద్వారా కాక్లియర్ ఇంప్లాంట్‌ను ఆయన అమరుస్తున్నారు. ఇది సాధారణ హియరింగ్ ఎయిడ్ కంటే చాలా మెరుగైనది. చెవిలో పనిచేయని భాగాన్ని బైపాస్ చేస్తూ.. ధ్వని సంకేతాలను నేరుగా శ్రవణ నాడికి చేరవేస్తుంది. కాబట్టి పిల్లలకు వినికిడి సామర్థ్యం లభిస్తుంది. పుట్టుకతోనే వినికిడి శక్తి లేని పిల్లలు మూగవారవుతారు. అయితే కాక్లియర్ ఇంప్లాంట్ అమర్చిన తర్వాత శ్రవణ సామర్థ్యం లభించి.. వారు క్రమంగా మాట్లాడటమూ నేర్చుకుంటున్నారు. తాను శస్త్రచికిత్సలు నిర్వహించిన చిన్నారులతో కలిసి మనీశ్ ఏటా క్రిస్మస్ వేడుకలు జరుపుకొంటుంటారు.



ఉత్తర కొరియా పురోగతి
అణుశక్తితో నడిచే జలాంతర్గామి నిర్మాణంలో

సియోల్: అణు శక్తితో నడిచే జలాంతర్గామి నిర్మాణంలో ఉత్తర కొరియా గణనీయమైన పురోగతి సాధించినట్లు తెలుస్తోంది. నిర్మాణంలో ఉన్న ఆ జలాంతర్గామిని ఓ షిప్‌యార్డులో దేశాధినేత కిమ్ జోంగ్ ఉన్ తన కుమార్తెతో కలిసి పరిశీలిస్తున్నట్లు ఉన్న ఫొటోలను ఉత్తర కొరియా ప్రభుత్వరంగ వార్తా సంస్థ 'కొరియన్ సెంట్రల్ న్యూస్ ఏజెన్సీ' గురువారం ప్రచురించింది. 8,700 టన్నుల బరువుండే భారీ అణు జలాంతర్గామి బాహ్య నిర్మాణం దాదాపుగా పూర్తయినట్లు ఆ ఫొటోల్లో కనిపిస్తోంది. కిమ్ ఆ షిప్‌యార్డును ఎప్పుడు సందర్శించారన్న వివరాలను మాత్రం బయటపెట్టలేదు. అణు శక్తితో నడిచే జలాంతర్గామిలో అణ్వస్త్రాలను మోహరించాలని ఉత్తర కొరియా యోచిస్తోంది. సాధారణంగా జలాంతర్గాముల్లో తొలుత అంతర భాగాల నిర్మాణం చేపడతారు. ఆపై బాహ్య నిర్మాణ పనులు పూర్తిచేస్తారు. తాజా ఫొటోల్లో జలాంతర్గామి పైభాగం కనిపిస్తోంది కాబట్టి.. ఇప్పటికే దానిలో ఇంజిన్, రియాక్టర్ వంటివి పొందుపరిచి ఉండొచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.



కిమ్ జోంగ్ పరిశీలించిన అణు జలాంతర్గామి

సిడ్నీలో ఉగ్రవాదుల్ని ఎదుర్కొన్నవారికి సాహస పురస్కారం

- ఆస్ట్రేలియా సర్కారు నిర్ణయం

న్యూకాసిల్: సిడ్నీలోని బోండీ బీచ్‌లో కాల్పులు జరిపిన ఉగ్రవాదులను ఎదుర్కొన్న సామాన్య పౌరులను సాహస పురస్కారంతో సత్కరించాలని ఆస్ట్రేలియా ప్రభుత్వం నిర్ణయించింది. దాడి సమయంలో ఇతరులను రక్షించేందుకు తమను తాము ప్రమాదంలో పడేసుకున్న అహ్మద్ అల్ అహ్మద్‌లాంటి వారి కోసం ప్రత్యేక గౌరవ పురస్కారాలు అందించే యోచనలో ఉన్నట్లు ప్రధాని ఆంథోనీ అల్బనీస్ వెల్లడించారు. క్రిస్మస్ సందర్భంగా సిడ్నీలో గురువారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న తర్వాత విలేకరులతో మాట్లాడుతూ ఈ ప్రకటన చేశారు. ఈ నెల 14న బోండీ బీచ్‌లో హనుక్కా వేడుకల్లో యూదులకు వ్యతిరేకంగా ఉగ్ర దాడి జరిగిన తరువాత జరుపుకొంటున్న ఈ క్రిస్మస్ చాలా భిన్నమైందన్నారు. మరో వైపు- సిడ్నీ ఉగ్రదాడి నేపథ్యంలో తుపాకీ చట్టాలను న్యూ సౌత్‌వేల్స్ కఠినతరం చేసింది. ఓ వ్యక్తి పేరు మీద నాలుగు తుపాకులు మాత్రమే ఉండేలా నిబంధనలను సడలించింది. తుపాకీ లైసెన్సుల కాలపరిమితిని రెండేళ్లకు తగ్గించింది.

ఏపీ ఎన్‌హెచ్ ప్రాజెక్టులకు

మోకాలడ్డుతున్న మోర్త్

పెడన-లక్ష్మీపురం హైవే విస్తరణ వద్దంటూ కొర్రీ

గుడివాడ, గుడ్లవల్లేరుల వద్ద బైపాస్‌లు చాలని మెలిక

దోర్నాల-శ్రీశైలం హైవే విస్తరణలో రాష్ట్ర ప్రభుత్వమూ నిధులు వెచ్చించాలని పట్టు



ఈనాడు - అమరావతి

మన రాష్ట్రానికి చెందిన పలు జాతీయ రహదారుల ప్రాజెక్టుల మంజూరు విషయంలో కేంద్ర రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ (మోర్త్) ఉన్నతాధికారులు పదేపదే కొర్రీలు వేస్తున్నారు. ప్రాజెక్ట్ మంజూరు అయ్యాక డీపీఆర్ సిద్ధంచేసి పంపితే.. అనుమతులు ఇవ్వకుండా మోకాలడ్డుతున్నారు. ఈ ప్రాజెక్టులు వద్దనేలా వ్యవహరిస్తున్నారు. పెడన-లక్ష్మీపురం హైవే, దోర్నాల-శ్రీశైలం హైవేల విస్తరణల విషయంలో ఈ పరిస్థితి నెలకొంది. మోర్త్ ఉన్నతాధికారుల తీరుతో ఆయా హైవేల విస్తరణకు అనుమతిస్తారా అన్నది సందేహంగా మారుతోంది. వీటి విస్తరణకు ఉన్న ఆవశ్యకత, ట్రాఫిక్ వివరాలతో సమగ్ర నివేదికలు ఇచ్చినా.. దిల్లీలోని ఉన్నతాధికారుల తీరులో మార్పురావడంలేదు.

మీరెంత నిధులిస్తారంటూ..

ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీశైలానికి వెళ్లే దోర్నాల-శ్రీశైలం హైవే 765ను విస్తరించనున్నారు. మొత్తం 77 కి.మీ. మేర ఈ హైవేలో ప్రస్తుతం చాలాచోట్ల 5.5 నుంచి 7 మీటర్ల వెడల్పు మాత్రమే ఉంది. దీనిని 10 మీటర్ల వెడల్పుతో విస్తరించేలా డీపీఆర్ సిద్ధం చేస్తున్నారు. ఇదంతా అటవీ ప్రాంతమే. ఇందులో పులుల సంరక్షణ ప్రాంతం కూడా ఉంది. దీంతో దాదాపు 15-20 కి.మీ. మేర ఎలివేటెడ్ వంతెన నిర్మించి, వాహనాలు దానిపై నుంచి వెళ్లేలా ప్రణాళిక రూపొందిస్తున్నారు. ఎలివేటెడ్ వంతెన నిర్మాణానికయ్యే వ్యయంలో ఏపీ ప్రభుత్వం కొంత మేర నిధులను వెచ్చించాలని, ఎంత శాతం ఇస్తారో చెప్పాలంటూ మోర్త్ అధికారులు అడుగుతున్నారు. ఇదే హైవేలో హైదరాబాద్ నుంచి శ్రీశైలం వచ్చే మార్గాన్ని కూడా విస్తరిస్తుండగా, అందులో కూడా కొంతభాగం ఎలివేటెడ్ వంతెన ఉంది. తెలంగాణ ప్రభుత్వం.. ఆ వంతెన వ్యయంలో కొంత వెచ్చించేందుకు సమ్మతించింది. దీంతో ఏపీ ప్రభుత్వం కూడా కొంత నిధులు వెచ్చించాలని మోర్త్ అధికారులు ఒత్తిడి చేస్తున్నారు.

విజయవాడలో ఎలివేటెడ్ వంతెన వద్దని..

విజయవాడ నగరం మీదుగా వెళ్లే చెన్నై-కోల్‌కతా హైవేలో.. మహానాడు కూడలి నుంచి నిడమానూరు వరకు 7 కి.మీ. మేర ఎలివేటెడ్ వంతెన నిర్మాణానికి గతంలో అనుమతించారు. దీనికి రూ.700 కోట్లు వ్యయమవుతుందని అంచనా కూడా వేశారు. ఇందులో కొంత భాగం మెట్రో రైల్ మార్గం ఉండటంతో.. డబుల్‌డెకర్ వంతెన నిర్మించే ప్రతిపాదన ఉంది. ఇంతలో మోర్త్ ఉన్నతాధికారి..ఈ ఎలివేటెడ్ వంతెనే వద్దంటూ మెలిక పెట్టారు. విజయవాడ పశ్చిమ బైపాస్ పూర్తికావడం, అమరావతి ఔటర్ రింగ్ రోడ్ కూడా నిర్మించనుండటంతో. .విజయవాడ నగర పరిధిలో ఎలివేటెడ్ వంతెన అవసరం లేదంటున్నారు. నగరంలో తీవ్రంగా ఉన్న ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ఈ ఎలివేటెడ్ వంతెన ఎంతో కీలకం. అయినా కొర్రీలు వేస్తున్నారు.

ఎంపీలు చొరవ చూపిస్తేనే..

ఈ ప్రాజెక్టులపై రాష్ట్ర ఎంపీలు చొరవ చూపిస్తేనే.. మోర్త్‌లో వాటికి ఆమోదం లభించే అవకాశం ఉంటుంది. రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులతో ఎంపీలు కలిసివెళ్లి దిల్లీలోని మోర్త్ ఉన్నతాధికారులపై ఒత్తిడి తీసుకురావాలనే అభిప్రాయం వినిపిస్తోంది.

డీపీఆర్ పంపాక.. మెలిక

కృష్ణా జిల్లా పెడన నుంచి గుడివాడ, నూజివీడు, విస్సన్నపేట మీదుగా తెలంగాణ సరిహద్దులోని లక్ష్మీపురం వరకు 118 కి.మీ. మేర జాతీయ రహదారి-216 హెచ్‌ను విస్తరించేందుకు ప్రతిపాదించారు. పెడన నుంచి నూజివీడు వరకు నాలుగు వరుసలుగాను, అక్కడి నుంచి లక్ష్మీపురం వరకు రెండు వరుసలుగా విస్తరించేందుకు మొత్తం రూ.4,245 కోట్లు వ్యయమవుతుందని డీపీఆర్ రూపొందించారు. ఇందులో సివిల్ పనుల విలువ రూ.2 వేల కోట్లు, మిగిలినది భూసేకరణ, ఇతర అవసరాలకు అయ్యే వ్యయంగా లెక్కించారు. కొద్దిరోజుల కిందట డీపీఆర్‌ను మోర్త్ ఆమోదం కోసం పంపారు. ఇటీవల దీనిపై జరిగిన సమావేశంలో.. హైవే విస్తరించాల్సిన అవసరం లేదంటూ ఉన్నతాధికారులు పేర్కొన్నారు. అమరావతి ఔటర్ రింగ్‌రోడ్డును నిర్మిస్తుండటంతో, ఈ హైవే విస్తరణ ఎందుకని మెలిక పెట్టారు. కేవలం గుడివాడ, గుడ్లవల్లేరుల వద్ద బైపాస్‌లు నిర్మిస్తేచాలనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ మేరకు ప్రతిపాదనలు రూపొందించి తీసుకురావాలని ఆదేశించారు. దీంతో ఏపీ అధికారులు విస్తుపోయారు.

మూగ జీవాలకు వేదన

300కు పైగా పశు వైద్య పోస్టులు ఖాళీ

మందులూ అందుబాటులో లేక ఇబ్బందులు



రెగ్యులర్ వైద్యుడు లేక నిష్ప్రయోజనంగా మిగిలిన విజయనగరం జిల్లా పెదమానాపురం పశువుల ఆసుపత్రి

ఈనాడు, అమరావతి, ఈనాడు యంత్రాంగం: రాష్ట్రంలోని పశు వైద్యశాలల్లో చాలాచోట్ల వైద్యులు లేరు.. వైద్యులు అందుబాటులో ఉంటే మందులు ఉండడం లేదు. దీంతో మూగజీవాలకు సకాలంలో వైద్యం అందడం లేదు.

ఆ ఐదేళ్ల పాపం

వైకాపా హయాం ఐదేళ్లలో ఒక్క పశువైద్యుడినీ నియమించలేదు. గ్రామ సచివాలయాల్లో 9వేల పశు సంవర్ధక సహాయకుల(ఆహా) పోస్టులను తీసుకువస్తున్నామని, వారితో పశువైద్య వ్యవస్థ రూపురేఖల్నే మార్చేస్తామంటూ బీరాలు పలికారు. ఆ పోస్టుల్లో సుమారు 6వేల మందిని భర్తీ చేశారు. వారికి వైద్యం పట్ల అవగాహన లేదు. 2019-20లో నియమితులైన వీరిలో ఇప్పటికీ 60శాతం మందికి కనీసం సూదిమందు వేయడం కూడా రాదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. మరోవైపు మందులకూ నిధులివ్వక పాడిరైతుల నడ్డి విరిచారు. 2022-24 మూడేళ్లలో రూ.60కోట్లకుపైగా వైకాపా సర్కారు బకాయి పెట్టింది. దీంతో కాంట్రాక్టు సంస్థలు మందులను సరిగా సరఫరా చేయలేదు. ఈ ఏడాది జనవరిలో బకాయిల్లో సుమారు రూ.45కోట్లను కూటమి ప్రభుత్వం చెల్లించింది. మరోవైపు మందులకు సంబంధించి ఇప్పటికీ ఆర్థిక శాఖలో రూ.కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.

■ రాష్ట్రంలో 300కు పైగా వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్(వీఏఎస్) పోస్టులు(శ్రీసత్యసాయి జిల్లాలో 34, నెల్లూరులో 30, పార్వతీపురం మన్యంలో 21, శ్రీకాకుళంలో 20, ప్రకాశంలో 18, అనంతపురంలో 15, విజయనగరంలో 13, చిత్తూరులో 13, మిగిలిన ఖాళీలు ఇతర జిల్లాల్లో ఉన్నాయి)ఖాళీగా ఉన్నాయి. జాతీయ వెటర్నరీ కౌన్సిల్ నిబంధనల ప్రకారం ప్రతీ 5వేల యూనిట్లకు ఒక పశువైద్యుడు ఉండాలి. దీనిప్రకారం రాష్ట్రంలో 3,300కుపైగా వైద్యులుండాలి. కానీ, దాదాపు 1,600మందే ఉన్నారు. వీరిలోనూ సుమారు 400మంది ఏడీలు, డీడీలు, జేడీలుగా పాలనాపరమైన విధుల్లో ఉంటున్నారు. గత సర్కారు ఆహాలనూ పశువైద్యులుగా చూపించి వైద్యుల నియామకాలను పక్కన పెట్టేసింది.

అక్కడి నుంచి ఇక్కడికి వచ్చి..

నంద్యాల జిల్లా ఆత్మకూరులోని ప్రాంతీయ పశువైద్యశాలలో వైద్యుడు లేకపోవడంతో వెలుగోడు పశువైద్యుడిని ఇన్‌ఛార్జిగా పెట్టారు. ఆయన వెలుగోడు పరిధిలోని 15వైద్యశాలలు, 9 సబ్‌సెంటర్లు, ఆత్మకూరు ఆసుపత్రి పరిధిలోని ఏడు వైద్యశాలలనూ పర్యవేక్షించాల్సి వస్తోంది.

■ కర్నూలు జిల్లా కోసిగి ఆసుపత్రిలో మందుల్లేకపోవడంతో వైద్యులు బయటకు రాస్తున్నారు. ఆ ప్రాంతంలో మందులు దొరక్క.. రైతులు మంత్రాలయం/మాధవరం లేదా కర్ణాటకలోని రాయచూరు వెళ్లి తెచ్చుకోవాల్సి వస్తోంది. చిత్తూరు, ప్రకాశం, అన్నమయ్య, నెల్లూరు, ఎన్టీఆర్, గుంటూరు, కాకినాడ జిల్లాల్లోని చాలా ఆసుపత్రుల్లో మందులు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

5 పశువైద్యశాలలకు ఒక్కరే

శ్రీసత్యసాయి జిల్లా ముదిగుబ్బ మండలంలోని ఐదు పశువైద్యశాలలకు ఒక్క వైద్యుడే ఉన్నారు. ముదిగుబ్బలోని వెటర్నరీ డిస్పెన్సరీతో పాటు మల్లేపల్లి, బుక్కపట్నం, కృష్ణాపురం, పాముదుర్తి ఆసుపత్రులకు ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నారు. ముదిగుబ్బ మండలంలో ఆవులు, గేదెలు 15,186, జీవాలు 1,90,000 ఉన్నాయి.



వైద్యుడు తప్ప ఏ ఇతర సిబ్బందీ లేని గుంటూరు జిల్లా సుదురుపాడు పశువైద్యశాల

■ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని పి.గన్నవరం పశువుల ఆసుపత్రికి వైద్యుడు లేక 2023 జనవరి నుంచి అమలాపురం ఏడీనే ఇక్కడ ఇన్‌ఛార్జిగా పెట్టారు. ఏలూరు జిల్లా కలిదిండి మండలం సానారుద్రవరం ఆసుపత్రిలో నాలుగేళ్ల నుంచి వైద్యుడు లేరు.

■ అనకాపల్లి జిల్లా మాడుగుల మండలంలోని కస్పాజగన్నాథపురంలో పశువైద్యశాలలో పశువైద్యుడు, వెటర్నరీ అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేట్ పోస్టులు రెండేళ్ల నుంచి ఖాళీ ఉన్నాయి. ఆసుపత్రి తెరిచేవారూ లేరు.

■ వడ్డాది కూడలిలో ప్రాంతీయ పశువైద్యాలయంలో పశువైద్యాధికారి, వెటర్నరీ అసిస్టెంట్ రెండేళ్ల నుంచి లేరు.

■ అనంతపురం జిల్లా ఉరవకొండ డివిజన్‌లోనే 12 వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

మందులు ఆర్డర్ పెట్టాం

'ఎక్కువ పశుసంపద ఉన్నచోట మందులు అయిపోయాయి.. తక్కువున్న చోట ఉన్నాయి.. అక్కడ నుంచి సర్దుబాటు చేసుకుంటే నెలన్నర పాటు సరిపోతాయి. అలా సర్దుబాటు చేసుకోవాలని ఇప్పటికే సూచించాం. కొత్తగా మందుల సరఫరాకు ఆర్డర్ పెట్టాం. వచ్చే నెలలో వస్తాయి.'

-డాక్టర్ టి.దామోదర్ నాయుడు, పశు సంవర్ధక శాఖ సంచాలకుడు



చెరకు గడతో బాళప్ప, వ్యవసాయ శాస్త్రవేత్తలు, స్థానిక యువత

రైతు పంటపండింది!

ఎకరాకు 130 టన్నుల చెరకు దిగుబడి



డ్రిప్ ట్యాంకులు చూపుతున్న రైతు బాళప్ప

సాధారణంగా చెరకు ఒక ఎకరానికి 40 నుంచి 60 టన్నుల దిగుబడి వస్తుంది. కర్ణాటకలోని బెళగావి జిల్లా కల్లోళి గ్రామానికి చెందిన అభ్యుదయ రైతు బాళప్ప బసప్ప బెళకోడ (72) ఎకరానికి ఏకంగా 130 టన్నులు దిగుబడి తీశారు. మూడెకరాల్లో పండిన మొత్తం 391 టన్నుల చెరకును మిల్లుకు తరలించి రూ.12,90,300 బిల్లును పొందారు. గతేడాది కూడా ఆయన ఎకరానికి 125 టన్నుల దిగుబడి సాధించారు. 'సీఓ 86032' రకం చెరకును నాటుకున్నారు. 'నాటే ముందు చాలా సార్లు మట్టి పరీక్షలు చేయించా. ఫలితాల ఆధారంగా భూమికి అవసరమైన పోషకాల కోసం సేంద్రియ, పరిమితంగా రసాయనిక ఎరువులను డ్రిప్‌తో తోటకు అందించా. ఎకరానికి రూ.65 వేల చొప్పున ఖర్చు వచ్చింది. చెరకు ఎదిగే వరకూ అంతర్ పంటగా మినుము, సెనగ, టమాటా, ఉల్లి పండించా. వాటి ఫలసాయం అందాక ఆ మొక్కలను తోటలోనే తొక్కి, ఎరువుగా మార్చా. జీవామృతం, సేంద్రియ ఎరువులు, వర్మీ కంపోస్టును స్వయంగా చేసుకుంటున్నా. సాగు విధానాలు తెలుసుకునేందుకు చైనా, ఇజ్రాయెల్, జపాన్‌లకు వెళ్లి వచ్చా. ఎకరానికి 200 టన్నుల దిగుబడి సాధించే దిశగా ఈ సారి ఐదెకరాల్లో చెరకు సాగు చేయాలనుకుంటున్నా' అని బాళప్ప వివరించారు.

- న్యూస్‌టుడే, బెళగావి

ఫోర్జరీకి పాల్పడిన ఐదుగురు కబడ్డీ క్రీడాకారులపై కేసు

సహకరించిన కార్యదర్శి శ్రీకాంత్, కోచ్ శ్రీధర్‌లపైనా నమోదు

విజయవాడ (పటమట), న్యూస్‌టుడే: క్రీడాకారుల వయసు ధ్రువీకరణ పత్రాలను ఫోర్జరీ చేసి పోటీలకు ఎంపిక చేశారు. ఏకంగా ఏడేళ్లకు పైగా వయసు తక్కువగా చూపారు. బాధిత క్రీడాకారుల ఫిర్యాదు మేరకు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) అధికారులు విచారణ జరపగా అసలు విషయం బయటపడింది. దీంతో శాప్ ఇన్‌సెంటివ్స్ ఇన్‌ఛార్జి అధికారి రమణ మాచవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విచారించి ఐదుగురు క్రీడాకారులతో పాటు వారికి సహకరించిన ఆంధ్రా కబడ్డీ సంఘం కార్యదర్శి యలమంచిలి శ్రీకాంత్, కోచ్ శ్రీధర్‌లపై మాచవరం పోలీసులు గురువారం ఫోర్జరీ కేసు నమోదు చేశారు.

వయసు తారుమారు చేసి..

ఈ ఏడాది ఆగస్టు 15 నుంచి 25 వరకు విజయవాడ పటమటలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో ఆంధ్రా కబడ్డీ సంఘం ఆధ్వర్యంలో కబడ్డీ యువ లీగ్ పోటీలు నిర్వహించారు. శ్రీకాంత్‌తో పాటు కొంతమంది కోచ్‌లు తమకు అనుకూలమైన క్రీడాకారుల వయసు ధ్రువీకరణ పత్రాల్లో, ఆధార్ కార్డుల్లో వయసు మార్పులు చేసి వారిని పోటీలకు ఎంపిక చేశారు. ఈ వ్యవహారంపై శాప్‌కు వచ్చిన ఫిర్యాదులపై దర్యాప్తు జరిపిన అధికారులు.. ఐదుగురు క్రీడాకారుల వయసును ఆరు నుంచి ఏడేళ్ల వరకు తక్కువగా చూపినట్లు గుర్తించారు. ఆకెం వెంకటగోపి 2002లో జన్మిస్తే 2009లో పుట్టినట్లు ఫోర్జరీ చేశారు. వెంకట సుమంత్‌కు 7, రామ్మోహన్‌రావుకు 6, మణికంఠకు 6, బడ్డి సంతోష్ వయసు ఏడేళ్లు తక్కువ వయసు చూపించారు.

శ్రీకాంత్‌పై మరో కేసు

ఆంధ్రా కబడ్డీ సంఘం కార్యదర్శి శ్రీకాంత్ తన పదవిని అడ్డం పెట్టుకుని మ్యాచ్ ఫిక్సింగ్‌లతో పాటు అనేక అక్రమాలకు పాల్పడ్డారని సంఘం మాజీ కార్యదర్శి కొడాలి పిచ్చేశ్వరరావు పటమట పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఈ నెల 8న శ్రీకాంత్‌తో పాటు అతని అనుచరుడు కొట్ల గోపి, మరికొంతమందిపై కేసు నమోదు చేశారు.



రాఫ్ట్ ఫౌండేషన్ పనులు ప్రారంభిస్తున్న మంత్రి నారాయణ

హైకోర్టు నిర్మాణ పనుల పునఃప్రారంభం

- రాజధానిలో మరో కీలక ఘట్టం

తుళ్లూరు, న్యూస్‌టుడే: రాజధాని అమరావతి నిర్మాణంలో మరో కీలక అడుగు పడింది. గతంలో నిలిచిపోయిన హైకోర్టు నిర్మాణ పనులు పట్టాలెక్కాయి. రాయపూడి సమీపంలో నిర్మిస్తున్న హైకోర్టు భవన నిర్మాణంలో భాగంగా రాఫ్ట్ ఫౌండేషన్ పనులను పురపాలకశాఖ మంత్రి నారాయణ గురువారం పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. 'నార్మన్ ఫోస్టర్స్ అండ్ పార్టనర్స్ ఇచ్చిన డిజైన్ మేరకు హైకోర్టు పనులు పునఃప్రారంభించాం. మొత్తం 21 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో 52 కోర్టు హాల్స్‌తో హైకోర్టు నిర్మాణం జరుగుతుంది. 2, 4, 6వ అంతస్తుల్లో కోర్టు హాల్స్ ఉంటాయి. 8వ అంతస్తులో ప్రధాన న్యాయమూర్తి కోర్టు ఉంటుంది. 2027 చివరి నాటికి హైకోర్టు నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యం పెట్టుకున్నాం. వైకాపా ప్రభుత్వ కక్షపూరిత చర్యలతోనే అమరావతి పనుల్లో జాప్యం జరిగింది. సచివాలయం ఐకానిక్ టవర్లు, అసెంబ్లీ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి' అని మంత్రి పేర్కొన్నారు. 2014-2019 మధ్య తెదేపా ప్రభుత్వంలో ఈ నిర్మాణాలకు కొంతమేర రాఫ్ట్ ఫౌండేషన్ పనులు జరిగాయి. వైకాపా ప్రభుత్వం అమరావతి పనులు నిలిపివేయటంతో ఈ నిర్మాణం నిలిచిపోయింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో తిరిగి హైకోర్టు నిర్మాణ పనులు పట్టాలెక్కాయి.

'ఉపాధి' భారం ఏడాదికి రూ.4,259 కోట్లు!

రాష్ట్ర ప్రభుత్వం తాజా అంచనాలు

వేతనాలు, మెటీరియల్, పరిపాలన ఖర్చుల్లోనూ రాష్ట్ర వాటా 40%



శ్రామికులకు ఉపాధి

ప్రస్తుతం: పనులకు హాజరయ్యే శ్రామికులకు చెల్లించే వేతనాలు కేంద్ర ప్రభుత్వమే భరిస్తోంది. రాష్ట్రంలో 80 లక్షల మందికి పైగా శ్రామికులకు వేతనాల కింద ఏటా రూ.6 వేల కోట్లకుపైగా చెల్లిస్తోంది.

కొత్త విధానం: శ్రామికులకు చెల్లించే వేతనాల మొత్తం బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం 60 శాతమే చెల్లిస్తుంది. మిగిలిన 40% నిధులు రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చాలి.

ఈనాడు, అమరావతి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు మార్చి చట్ట సవరణ చేసిన నేపథ్యంలో పథకాన్ని కొత్త విధానంలో అమలు చేయాలంటే రాష్ట్రంపై ఏటా రూ.4,259 కోట్ల భారం పడనుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ తాజాగా అంచనాలు వేసింది. ఈ మేరకు ప్రభుత్వానికి నివేదిక అందజేసింది. శ్రామికులకు వేతనాలు, మెటీరియల్ నిధులతో చేపట్టే పనులకు, పరిపాలన ఖర్చులకు కొత్త విధానంలో రాష్ట్రవాటా కింద 40% వెచ్చించాలి. రాష్ట్రంలో ఇప్పటివరకు ఏటా రూ.10,649 కోట్లు ఖర్చుచేస్తున్నారు. ఇందులో రూ.9,640 కోట్లు (90%) కేంద్రం అందిస్తోంది. మిగిలిన రూ.1,009 కోట్లు (10%) రాష్ట్రవాటాగా సమకూర్చుతున్నారు. కొత్త విధానంలో మొత్తం ఖర్చులో కేంద్రం 60% అందించనుంది. మిగతా 40% రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చాలి. కేంద్రం కేటాయించిన వాటికి మించి నిధులు ఖర్చు చేస్తే అదనపు భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని కూడా కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ స్పష్టం చేసింది.

'మెటీరియల్ కాంపొనెంట్' పనులు

ప్రస్తుతం: మెటీరియల్ కాంపొనెంట్ నిధులు కేంద్రం ఇస్తోంది. దీనికి 25% రాష్ట్రవాటా చేర్చి గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు.

కొత్త విధానం: కేంద్రం ఇచ్చిన మెటీరియల్ నిధులకు రాష్ట్రవాటా 40% నిధులు సమకూర్చాలి.

పరిపాలన ఖర్చులు

ప్రస్తుతం: వేతనాలు, మెటీరియల్ కాంపొనెంట్ కింద కేటాయించిన మొత్తం నిధుల్లో నుంచి 6% పరిపాలన ఖర్చుల కింద కేంద్రం కేటాయిస్తోంది.

కొత్త విధానం: పరిపాలన ఖర్చు విషయంలో స్పష్టత ఇవ్వలేదు.

రాష్ట్రంలో 2024-25లో ఉపాధి హామీ పథకం చేసిన వ్యయం ఇలా... (రూ.కోట్లలో)

- ఏడాదిలో మొత్తం వ్యయం: 10,649
- ఇందులో వేతనాలు: 6,217 (100% కేంద్రం వాటా)
- మెటీరియల్ నిధులు: 4,038 (కేంద్రం 75%, రాష్ట్రం 25%)
- పరిపాలన ఖర్చులు: 394 (100% కేంద్రం వాటా)

కొత్త విధానంలో... (రూ.కోట్లలో)

కేటగిరీ	మొత్తం నిధులు	కేంద్రం వాటా (60%)	రాష్ట్ర వాటా (40%)
వేతనాలు	6,217	3,730.20	2,486.80
మెటీరియల్ నిధులు	4,038	2,422.80	1,615.20
పరిపాలన ఖర్చులు	394	236.40	157.60

వంశ'ధార'కు అవకాశమివ్వండి

ట్రైబ్యునల్ తీర్పు గెజిట్ ప్రచురణకు ఏపీ ప్రభుత్వం పట్టు

వరుసగా లేఖలు.. తాజాగా సీఎం వినతి ● నేరడి బ్యారేజి నిర్మిస్తే దశాబ్దాల కల సాకారం

ఈనాడు, అమరావతి: వంశధార నదిపై నేరడి బ్యారేజి నిర్మించుకునేందుకు అనుమతిస్తూ ట్రైబ్యునల్ 2021లోనే తుది తీర్పిచ్చినా అది ఇంతవరకు గెజిట్‌లో ప్రచురించలేదు. దీనిపై తగు చర్యలు తీసుకోవాలని కూటమి ప్రభుత్వం కేంద్ర జల్‌శక్తి శాఖ కార్యదర్శికి 2024 అక్టోబరులో, 2025 ఫిబ్రవరిలో లేఖలు రాసింది. తాజాగా ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర జలవనరుల శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌ను కలిసి ఈ విషయాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. వంశధార ట్రైబ్యునల్ తీర్పుపై సుప్రీంకోర్టులో ఒడిశా స్పెషల్ లీవ్ పిటిషన్లు దాఖలు చేసింది. కావేరి ట్రైబ్యునల్‌కు సంబంధించి ఇలా పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నా తీర్పు గెజిట్‌లో ప్రచురించారు. అదే తరహాలో వంశధార ట్రైబ్యునల్ తీర్పునూ ప్రచురించాలని కోరుతున్నారు. 2021 జూన్‌లో తుది తీర్పు వెలువడింది.

ప్రయోజనాలివీ: ఈ తీర్పు ప్రచురిస్తే ఆరు దశాబ్దాలకు పైగా ప్రతిపాదనల్లోనే ఉన్న నేరడి బ్యారేజి నిర్మాణానికి వెంటనే ఏర్పాట్లు చేసుకోవచ్చు. ■ 75% విశ్వసనీయత వద్ద 52.5 టీఎంసీల నీటిని రాష్ట్రం ఉపయోగించుకోవచ్చు. ■ ప్రస్తుతం వంశధార ప్రాజెక్టు తొలిదశలో ఖరీఫ్‌లోనే చివర్లో నీళ్లు ఇవ్వలేకపోతున్నారు. నేరడి బ్యారేజి పూర్తి చేస్తే రెండు దశల్లోనూ రబీకి నీళ్లు ఇవ్వవచ్చు.

అసలుకు తీసిపోని రీతిలో తయారీ

● నకిలీ బ్యాంకింగ్ యాప్‌లతో మోసాలు

● ఎస్ఎంఎస్‌ల ద్వారా లింకులు, ఏపీకే ఫైళ్లు పంపుతూ బురిడీ

ఈనాడు, అమరావతి: నకిలీ బ్యాంకింగ్ యాప్‌ల ద్వారా సైబర్ నేరగాళ్లు కీలక సమాచారాన్ని సేకరించి.. వాటి ద్వారా కష్టార్జితాన్ని దోచుకుంటున్నారు. వీటిని నిజమైనవిగా భ్రమపడుతూ డౌన్‌లోడ్ చేసుకుంటే ఖాతాలు ఖాళీ చేస్తున్నారు. ఇటీవల ఈ తరహా మోసాలు పెరిగాయి. లోగో మొదలు రంగు, ఇంటర్‌ఫేస్ వరకు అసలు యాప్స్‌లాగే ఉండేలా చూసుకుని వలవేస్తున్నారు.



అసలైనవిగా టోకరా వేసి..

● ఓ ప్రైవేటు ఉద్యోగి వాట్సప్‌కు కొత్త వెర్షన్ బ్యాంకింగ్ యాప్ అంటూ లింకు రావడంతో దాన్ని ఇన్‌స్టాల్ చేసుకున్నాడు. యాప్‌లోకి లాగిన్ అయ్యి బ్యాంకింగ్ వివరాలు నమోదు చేశాడు. బ్యాంకు ఖాతా మోసగాళ్ల చేతిలోకి వెళ్లిపోయింది. అరగంటలోనే ఖాతాలోని రూ.8.40 లక్షలను ఖాళీ చేసేశారు.

● విజయవాడకు చెందిన మహిళకు ఓ ఎస్ఎంఎస్ వచ్చింది. మొబైల్ బ్యాంకింగ్ యాప్ అప్‌డేట్ చేశామని, దీన్ని డౌన్‌లోడ్ చేసుకోవాలని అందులో ఉంది. అప్పటివరకు వాడుతున్న యాప్‌ను అన్ ఇన్‌స్టాల్ చేశారు. ఎస్ఎంఎస్‌లో వచ్చిన లింక్‌పై క్లిక్ చేసి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, అందులో లాగిన్ అయ్యారు. కొద్దిసేపటికే ఖాతా నుంచి రూ.2 లక్షలు వేరే వాళ్లకు వెళ్లిపోయినట్లు మెసేజ్‌లు వచ్చాయి.



నేరగాళ్ల గుప్పిట్లోకి కీలక సమాచారం

అసలైన బ్యాంకింగ్ యాప్స్‌ను పోలి ఉండేలా నకిలీలను తయారుచేస్తున్నారు. వీటిద్వారా లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్ వివరాలను చోరీ చేస్తున్నారు. ఇవి అసలు యాప్‌లకు ఏమాత్రం తీసిపోవు. లింకులు, ఏపీకే ఫైళ్లపై క్లిక్ చేసి వీటిని ఇన్‌స్టాల్ చేసుకుంటే కోరి కష్టాలు తెచ్చుకున్నట్లే.

ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

- గూగుల్ ప్లేస్టోర్, యాపిల్ యాప్ స్టోర్, సంబంధిత బ్యాంకు వెబ్‌సైట్ నుంచే బ్యాంకింగ్ యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవాలి.
- గుర్తుతెలియని వ్యక్తులు పంపే లింక్‌లపై క్లిక్ చేయకూడదు. డౌన్‌లోడ్ చేసుకునే ముందు యాప్ డెవలపర్, సంస్థ పేర్లు, రివ్యూలను పరిశీలించాలి.
- ఇన్‌స్టాల్ చేసుకునే ప్రతి యాప్‌నకు సంబంధించి ఏమేం రిక్వెస్ట్‌లకు మనం అనుమతులు ఇస్తున్నామో పరిశీలించాలి. వ్యక్తిగత వివరాలను యాక్సెస్ చేసుకునేందుకు అనుమతి ఇవ్వకూడదు.
- తరచూ ఖాతా స్టేట్‌మెంట్లు పరిశీలిస్తుండాలి. లావాదేవీలు జరిగితే ఎస్ఎంఎస్ వచ్చేలా సెట్టింగ్‌లు మార్చుకోవాలి. దీనివల్ల ఏవైనా అనధికారిక లావాదేవీలు జరిగితే వెంటనే అప్రమత్తం అవ్వచ్చు.

మోసం బారిన పడితే..

- వెంటనే యాప్‌ను అన్‌ఇన్‌స్టాల్ చేసుకోవాలి.
- మొబైల్ డేటా, వై-ఫై ఆఫ్ చేయాలి.
- అన్ని బ్యాంకింగ్ యాప్స్ పాస్‌వర్డ్‌లను మార్చుకోవాలి.
- వెంటనే బ్యాంకు కస్టమర్ కేర్‌ను సంప్రదించాలి.

ఆరోగ్య సేవల రంగంలో పీపీపీ ప్రాజెక్టులకు 40% వరకు కేంద్ర ఆర్థికసాయం

- అది వైద్య కళాశాలలకూ వర్తిస్తుంది
- పెద్ద ఎత్తున పీపీపీ ప్రాజెక్టుల్ని ప్రోత్సహించండి
- రాష్ట్రప్రభుత్వానికి కేంద్రమంత్రి జేపీ నడ్డా లేఖ

ఈనాడు, అమరావతి: వైద్య కళాశాలలు, ఆరోగ్య సేవల రంగంలో ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్య (పీపీపీ) విధానంలో చేపట్టే ప్రాజెక్టులకు కేంద్రం మూలధన వ్యయంలో 30-40%, నిర్వహణ వ్యయంలో 25% వరకు గ్రాంటుగా అందిస్తుందని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ మంత్రి జేపీ నడ్డా పేర్కొన్నారు. కొత్త వైద్య కళాశాలల నిర్మాణం, ఇప్పటికే ఉన్నవాటి ఆధునికీకరణ సహా ఆరోగ్యరంగ మౌలిక వసతుల అభివృద్ధికి.. వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (వీజీఎఫ్) కింద ఈ ఏడాది అక్టోబరు నుంచి ఇప్పటివరకు రూ.2వేల కోట్ల విలువైన ప్రాజెక్టులను కేంద్రం సూత్రప్రాయంగా ఆమోదించినట్లు ఆయన తెలిపారు. ఈ రంగంలో పీపీపీ విధానాన్ని కేంద్రం ప్రోత్సహిస్తోందని, రాష్ట్రప్రభుత్వాలూ దీన్ని అందిపుచ్చుకోవాలని ఆయన సూచించారు. వైద్యరంగంలో పీపీపీ విధానం ప్రాధాన్యాన్ని, కేంద్రం అమలుచేస్తున్న పథకాల్ని వివరిస్తూ రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు ఆయన ఇటీవల ఒక లేఖ రాశారు. అందులోని ముఖ్యాంశాలను వైద్య, ఆరోగ్యశాఖ గురువారం మీడియాకు విడుదల చేసింది.

పీపీపీని ప్రోత్సహించేందుకు 2 కేంద్ర పథకాలు

వైద్య, ఆరోగ్యరంగంలో పీపీపీని ప్రోత్సహించేందుకు ప్రస్తుతం రెండు కేంద్ర పథకాలున్నాయని నడ్డా తెలిపారు. ఆరోగ్యరంగంలో మౌలిక వసతుల అభివృద్ధికి సబ్ స్కీం-1 కింద మూలధన వ్యయంలో 80% గ్రాంట్ (కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు చెరో 40%), మొదటి ఐదేళ్ల నిర్వహణ వ్యయంలో 50% (కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరో 25%) గ్రాంట్‌గా అందజేస్తున్నట్లు నడ్డా పేర్కొన్నారు. ఇండియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్ట్ డెవలప్‌మెంట్ ఫండ్ (ఐఐపీడీఎఫ్) కింద ప్రాజెక్ట్ డెవలప్‌మెంట్, టెక్నికల్ ఎడ్వైజరీ సర్వీసెస్ నిమిత్తం ఒక్కో ప్రాజెక్టుకు రూ.5 కోట్ల వరకు అందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కేంద్ర వైద్య, కుటుంబసంక్షేమ శాఖలో ప్రత్యేకంగా పీపీపీ సెల్ ఏర్పాటుచేశామని, రాష్ట్రప్రభుత్వం కూడా ఇలాంటి సెల్ ఏర్పాటుచేయాలని, పీపీపీ ప్రాజెక్టుల రూపకల్పన, అమలు, పర్యవేక్షణకు అది నోడల్ పాయింట్‌గా వ్యవహరించాలని ఆయన తెలిపారు.

పీపీపీనే శరణ్యం

"దేశవ్యాప్తంగా మౌలికవసతుల అభివృద్ధిలో 2000 సంవత్సరం నుంచి పీపీపీ విధానం కీలక భూమిక పోషిస్తోంది. రహదారులు, ఓడరేవులు, విమానాశ్రయాలు, ఇంధనం, పట్టణ మౌలిక వసతుల్లాంటి రంగాల్లో పీపీపీ విధానంలో అనేక ప్రాజెక్టులు అమలయ్యాయి. అక్కడ విజయవంతమైన పీపీపీ విధానాల్ని ఆరోగ్యం, విద్య లాంటి సామాజిక రంగాల్లోను అమలుచేయాలి" అని ఆయన పేర్కొన్నారు. "ఇటీవల పీపీపీ విధానంతో ఆరోగ్య రంగం చాలా లబ్ధి పొందింది. ప్రాథమిక, సెకండరీ, టెర్షియరీ ఆరోగ్యసేవల్లో విప్లవాత్మక మార్పులు వచ్చాయి" అని నడ్డా పేర్కొన్నారు.

ఇప్పటివరకు తీసుకున్న చొరవ

- దేశంలో ఇప్పటివరకు రూ.2వేల కోట్లతో ప్రాజెక్టులు వీజీఎఫ్ కింద ఆమోదించాం.
- వైద్య కళాశాలల నిర్మాణం, ఆసుపత్రుల అభివృద్ధి, రోగనిర్ధారణ సేవలు, సంచార వైద్యం, డయాలసిస్‌లను పీపీపీ విధానంలో ప్రారంభించాం.
- 20 రాష్ట్రాల్లో 919 డయాలసిస్ సెంటర్లు పీపీపీ పద్ధతిలో నడుస్తున్నాయి. ◆ పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా వైద్య కళాశాలల నిర్మాణం, ఆసుపత్రుల ఆధునికీకరణ, ఇతర మౌలిక సదుపాయాల కల్పనతో పాటు నాణ్యమైన క్లినికల్, నాన్-క్లినికల్ సేవలు అందించాం.
- సాంకేతికత ఆధారంగా వైద్య సమస్యలకు పరిష్కారాలు చూపాం.

పీపీపీతో ప్రయోజనాలెన్నో

వైద్య విద్య, సేవలరంగంలో పీపీపీ విధానంతో చేకూరే ప్రయోజనాల్ని నడ్డా తన లేఖలో వివరించారు. అవి..

1. ప్రైవేటు భాగస్వామ్యంతో ప్రభుత్వ రంగానికి వచ్చే నైపుణ్యం, సృజనాత్మకత, నిధుల సమీకరణ వల్ల విస్తృత ప్రయోజనాలు కలుగుతాయి.
2. బాధ్యతలు, లాభ-నష్టాలు పంచుకుంటారు.
3. దీంతో ప్రాజెక్టుల స్థిరాభివృద్ధి సాధ్యమవుతుంది. జవాబుదారీతనం, పారదర్శకత పెరుగుతాయి.
4. ప్రభుత్వ-ప్రైవేటు పెట్టుబడులతో ఆరోగ్యరంగంలో మౌలిక వసతులు విస్తరిస్తాయి. సేవల్లో నాణ్యత పెరుగుతుంది.
5. సృజనాత్మకతకు లభించే తోడ్పాటుతో పాటు.. ప్రస్తుతం ఉన్న సదుపాయాలను సమర్థంగా వినియోగించుకోవచ్చు.
6. మౌలికవసతులు, సేవల్లో నాణ్యత మెరుగుపడుతుంది.
7. మెరుగైన వైద్యసేవలు ప్రజలకు అందుబాటులోకి వస్తాయి.

పదునెక్కుతున్న కోడి కత్తులు!



పందేలకు ఉపయోగించే కోడికత్తులు ★ కోడికి కత్తి కడుతూ..

కోడి కత్తులకు పదునే కాదు.. తయారీ కథ కూడా ఎక్కువే ఉంది. ఎంతో శ్రద్ధతో చేయించి, ఒడుపుగా కడితే తప్ప ఎదుటి పుంజును పడగొట్టలేవని నిపుణులు అంటున్నారు. భారీ వాహన చక్రాల బేరింగులకు వాడే స్టీలుతో ఈ కత్తులు తయారు చేస్తారు. ఆ తర్వాత 6 అంచెల సాన పెడతారు. అంటే.. వేడి చేయడం, మొన తీయడం, చన్నీటిలో పెట్టడం.. ఇలా ఆరు సార్లు చేస్తారు. ఇలాంటి ఒక్కో కత్తి ధర రూ.800 ఉంటుంది. ఇంత చేసీ దాన్ని కేవలం ఒక పందెం కోసమే వినియోగిస్తారు. పైగా కత్తిని కోడి కాలికి కట్టేందుకు నిపుణులూ ఉంటారు. వారి హస్తవాసి మంచిదైతే పందెంలో పైచేయి ఖాయం అనే నమ్మకమూ ఎక్కువే. అందుకే.. పందేలు ఎక్కువ సాగే సంక్రాంతి సీజన్‌లో వీరికి రోజుకు రూ.10 వేల నుంచి రూ.25 వేల వరకూ డిమాండు ఉంటుంది. – న్యూస్‌టుడే, తోట్లవల్లూరు

భీమవరం డీఎస్పీ జయసూర్యపై బదిలీ వేటు

ఆయనపై వచ్చిన ఫిర్యాదులను విచారించాలని గతంలో ఎస్పీకి పవన్‌కల్యాణ్ ఆదేశం

ఈనాడు, అమరావతి, ఈనాడు డిజిటల్-భీమవరం: పశ్చిమగోదావరి జిల్లా భీమవరం డీఎస్పీ ఆర్‌జీ జయసూర్యపై బదిలీ వేటు పడింది. ఆయనకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వకుండా డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. జయసూర్య స్థానంలో రఘువీర్ విష్ణును భీమవరం డీఎస్పీగా నియమించింది. ఈ మేరకు డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. డీఎస్పీ జయసూర్యపై పలు ఫిర్యాదులు వస్తున్నాయని, వాటిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని అక్టోబరు 21న ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పశ్చిమగోదావరి జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మీకి ఫోన్ చేసి ఆదేశించారు. "భీమవరం సబ్‌డివిజన్ పరిధిలో జూద శిబిరాలు బాగా పెరిగిపోయాయి. జయసూర్య సివిల్ వివాదాల్లో జోక్యం చేసుకుంటున్నారనే ఫిర్యాదులూ ఉన్నాయి. కొందరి పట్ల పక్షపాతం చూపిస్తున్నారని, కూటమి నేతల పేర్లు వాడుతున్నారని చెబుతున్నారు. ఈ తరహా వ్యవహారాలను ఉపేక్షించొద్దు'' అని ఎస్పీకి పవన్‌కల్యాణ్ సూచించారు. ఈ నేపథ్యంలో జయసూర్యపై విచారణ జరిపి బదిలీ వేటు వేసినట్లు సమాచారం.

వర్సిటీల్లో గాడితప్పుతున్న పరీక్షల విభాగాలు

- ఉమ్మడి ఎకడమిక్ క్యాలండర్ పట్టించుకోకుండా పరీక్షలు
- ఫలితాల విడుదలలోనూ ఒక్కోచోట ఒక్కో విధానం
- పునర్‌మూల్యాంకనంలో మారిపోతున్న మార్కులు

ఈనాడు, అమరావతి: విశ్వవిద్యాలయాల్లో పరీక్షల నిర్వహణ, మూల్యాంకనం గాడితప్పుతోంది. ఉమ్మడి ఎకడమిక్ క్యాలండర్ ఇస్తున్నా పరీక్షల నిర్వహణలో కొన్ని వర్సిటీలు దీన్ని అనుసరించడం లేదు. అన్ని వర్సిటీల్లోనూ ఏకీకృత విధానం ఉండడం లేదు. పునర్‌మూల్యాంకనం సైతం పక్కాగా ఉండడం లేదనే ఆరోపణలున్నాయి. పరీక్షల విభాగాల డిజిటలైజేషన్‌ను కొన్ని వర్సిటీలు సరిగా అమలు చేయకపోగా.. మరికొన్ని పాటించడం లేదు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి ర్యాంకులు సాధించాల్సిన వర్సిటీలు పరీక్షల నిర్వహణలో లోపాలతో అప్రతిష్ఠ పాలవుతున్నాయి. ఇటీవల నాగార్జున విశ్వవిద్యాలయం ఎమ్మెస్సీ ఫుడ్ అండ్ న్యూట్రిషన్ సైన్సు కోర్సులో చేతిరాతతో ఉన్న ప్రశ్నపత్రాన్ని ఇవ్వగా.. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో దూరవిద్య హిందీ పరీక్షలో చేతిరాత ప్రశ్నపత్రాలు ఇచ్చింది. సాధారణంగా పరీక్షల విభాగాలు రెండు, మూడు సెట్ల ప్రశ్నపత్రాలను ముందుగానే సిద్ధం చేసుకోవాలి.. ప్రశ్నపత్రం తయారు చేసే వారు టైప్ చేసినవే పంపిస్తారు. లేదంటే వర్సిటీలో దాన్ని కంప్యూటర్‌లో ఎంట్రీ చేసి ఇవ్వాల్సి ఉంటుంది. కానీ, చేతిరాత ప్రశ్నపత్రం ఇవ్వడంపై అభ్యర్థుల నుంచి వ్యతిరేకత వ్యక్తమైంది. నాగార్జునలో ఒకే ప్రశ్నను మూడు సార్లు ఇచ్చిన ఘటన వెలుగు చూసింది.

పరీక్షల నిర్వహణలోనూ..

ఉన్నత విద్యాశాఖ ప్రతి ఏటా ఉమ్మడి ఎకడమిక్ క్యాలండర్‌ను విడుదల చేస్తోంది. దీని ప్రకారమే పరీక్షలు నిర్వహించాల్సి ఉండగా.. బీఈడీ పరీక్షలను ఆచార్య నాగార్జున, ఆంధ్రకేసరి వర్సిటీలు ముందుగానే పూర్తి చేస్తున్నాయి. మిగతా వర్సిటీల్లో ఆలస్యంగా జరుగుతున్నాయి. ఎన్‌సీటీఈ నిబంధనల ప్రకారం సెమిస్టర్‌కు కనీసం 90 రోజులు తరగతులు నిర్వహించాలి. వంద రోజుల తర్వాతనే పరీక్షలు పెట్టాలి. కానీ, కొన్ని వర్సిటీలు దీన్ని పట్టించుకోవడం లేదు. ప్రవేశాలు అన్నింటికీ ఒకేసారి జరిగినా ఎకడమిక్ సంవత్సరం పూర్తి చేయడంలో ఎవరికి ఇష్టం వచ్చినట్లు వాళ్లు వ్యవహరిస్తున్నారు.

- డిగ్రీ పరీక్షలు, ఫలితాల విడుదలలోనూ ఒకే విధానం ఉండడం లేదు. డిగ్రీ ఫలితాలు సకాలంలో రాకపోవడంతో పీజీ సెట్, లాసెట్, ఎడ్‌సెట్ లాంటి కౌన్సెలింగ్‌ల్లో జాప్యం జరుగుతోంది. కొన్ని వర్సిటీలు డిగ్రీ ఫలితాల విడుదలలో జాప్యం చేస్తున్నాయి. ఉమ్మడి క్యాలండర్‌ను పాటించకపోవడంతోనే ఈ సమస్యలు ఏర్పడుతున్నాయి.
- రూసా నిబంధనల ప్రకారం విశ్వవిద్యాలయానికి వందకు మించి అనుబంధ కళాశాలలు ఉండకూడదు. కానీ, కొన్ని ప్రధాన సంప్రదాయ వర్సిటీలకు అనుబంధ కళాశాలల సంఖ్య వందకంటే పైగానే ఉన్నాయి.

గతంలో కాగ్ హెచ్చరించినా..

పరీక్షల మూల్యాంకనం విధానం బాగోలేదని కాగ్ సైతం గతంలో పేర్కొంది. మొదట ఫెయిలైన వారు పునర్‌మూల్యాంకనానికి దరఖాస్తు చేస్తే ఉత్తీర్ణులైనట్లు కాగ్ వెల్లడించింది. సున్నా మార్కులు వచ్చిన వారికి సైతం ఆ తర్వాత ఎక్కువ మార్కులు వేశారు.

- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో గతంలో బీఈడీలో 52 మంది పునర్‌మూల్యాంకనానికి దరఖాస్తు చేస్తే 30 మంది మార్కుల్లో మార్పు చోటుచేసుకుంది. పీజీలో ఒక కోర్సుకు 80 మంది పునర్‌మూల్యాంకనానికి దరఖాస్తు చేస్తే 52 మందికి మార్కులు పెరిగాయి.
- గతంలో జేఎన్‌టీయూ, అనంతపురంలో ఖాళీ పట్టాలు కొన్ని కనిపించకుండా పోయాయి. కొన్ని వర్సిటీల్లో ఎకడమిక్, పరీక్షల విభాగాలకు సమన్వయం ఉండడం లేదు. అనుబంధ కళాశాలల ఫీజులు భారీగా పెండింగ్‌లో ఉన్నా పరీక్షల విభాగం హాల్ టికెట్లు జారీ చేసి, పరీక్షలు పెట్టేస్తోంది.

మద్యం మత్తులో రోడ్డుపై ఏఎస్సై వీరంగం

సీఐ, పోలీసులతో వాగ్వాదం



సీఐ, పోలీసులతో వాగ్వాదానికి దిగిన ఏఎస్సై (రౌండ్ నెక్ టీషర్ట్)


చీరాల అర్బన్, న్యూస్‌టుడే: మద్యం మత్తులో రోడ్డుపై వీరంగం సృష్టించారో ఏఎస్సై. సీఐ, ఇతర పోలీసు సిబ్బందితో వాగ్వాదానికి దిగడంతో పాటు వారిని తోసేశారు. దీనికి సంబంధించిన వీడియోలు గురువారం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. బాపట్ల జిల్లా వేటపాలెం పోలీసు స్టేషన్‌లో ఏఎస్సైగా పిల్లి రవికుమార్ పనిచేస్తున్నారు. ప్రస్తుతం చీరాల గ్రామీణ సీఐ కార్యాలయంలో ఆయన విధుల్లో ఉన్నారు. క్రిస్మస్‌ను పురస్కరించుకుని తెల్లవారుజామున చీరాల పట్టణంలోని సెయింట్ మార్క్ సెంటరీన్ లూథరన్ చర్చిలో ప్రార్థనలు జరుగుతున్నాయి. ఏఎస్సై తన కారులో ఆ ప్రాంతానికి చేరుకున్నప్పుడు పోలీస్ రక్షక్ జీపునకు ఆయన వాహనం తగిలింది. ఆ వాహనం డ్రైవర్ ఏఎస్సైను ప్రశ్నించడంతో వాగ్వాదం చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న ఒకటో పట్టణ సీఐ సుబ్బారావు అక్కడికి చేరుకుని, ఏఎస్సైకి సర్దిచెప్పబోయారు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న ఏఎస్సై హంగామా చేయడంతో పాటు సీఐ, సిబ్బందిని తోసేశారు. పోలీసులు అక్కడ నుంచి ఏఎస్సైను కొంతదూరం లాక్కెళ్లి వదిలేశారు. ఘటనపై జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్ ఏఎస్సైను వీఆర్‌కు పంపారు. విచారణ చేయాలని చీరాల డీఎస్పీ మొహ్మద్ మొయిన్‌ని ఆదేశించారు.

సెప్టిక్ ట్యాంక్‌లో పడి బాలిక మృతి


ఆనందపురం, న్యూస్‌టుడే: విశాఖలోని ఆనందపురం మండలం ముచ్చర్ల గ్రామంలో మూడేళ్ల వయసున్న బాలిక ఆడుకుంటుండగా.. సెప్టిక్ ట్యాంక్‌లో పడి గురువారం మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన లెంక గణేష్.. భార్య జగదీశ్వరితో కలిసి వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి డిల్లీశ్వరి (3), చాణక్య (1.6) సంతానం. డిల్లీశ్వరి రోజూ మాదిరిగానే ఆడుకోవడానికి బయటకు వెళ్లింది. మధ్యాహ్నం పొలం నుంచి ఇంటికి వచ్చిన తల్లిదండ్రులకు పాప కనిపించకపోవడంతో అంతా వెతికారు. ఈ క్రమంలో నిర్మాణంలో ఉన్న ఓ ఇంటి సెప్టిక్ ట్యాంక్‌లో కనిపించింది. కొనఊపిరితో ఉండటంతో వైద్యశాలకు తరలించే లోపు మృతిచెందింది.



శ్రీనివాస సుబ్రహ్మణ్య శర్మ నివాసంలో తిరుమల శోభ ప్రతిబింబించేలా వేసిన పెయింటింగ్



శ్రీనివాస సుబ్రహ్మణ్య శర్మ



చిత్రకారుడు వెంకట హనుమంతు

ఇల్లే తిరుమల.. మనసే కోవెల!

ఇంటిలోని గోడలపై తిరుమల కొండను ఆవిష్కరించేలా పెయింటింగ్

ఈనాడు, విశాఖపట్నం: ఆ ఇంట్లోకి అడుగు పెట్టగానే తిరుమల కొండపైకి వచ్చామా.. అన్న భావన కలిగించేలా తిరుమల వైభవం గోడలపై ఆకట్టుకుంటుంది. ఏడు కొండల్లో చెట్ల చాటుగా కనిపించే గోపురాలు, మబ్బుల్లో మునిగిన కొండ మార్గాలు, జాలువారే జలపాతాలు. . వాటి మధ్యలో దేదీప్యమానంగా వెలిగిపోయే ప్రధాన ఆలయాన్ని చూడగానే వేంకన్న సన్నిధిలోకి చేరినట్లు మనసు ఆధ్యాత్మికతతో నిండిపోతుంది. విశాఖపట్నం సీతమ్మధారలో నివాసం ఉంటున్న మంగిడి శ్రీనివాస సుబ్రహ్మణ్య శర్మ తన ఇంటి లివింగ్ రూం గోడలపై రంగులతో ఆవిష్కరించుకున్న ఈ అద్భుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. కోనసీమ జిల్లా కొత్తపేట నరేంద్రపురానికి చెందిన శ్రీనివాస సుబ్రహ్మణ్య శర్మ ఆర్సెలార్ మిత్తల్ నిప్పాన్ స్టీల్‌లో జనరల్ మేనేజర్‌గా పని చేస్తున్నారు. ఏటా రెండుసార్లు తిరుమలకు వెళ్లి స్వామివారిని దర్శించుకోవడం ఆనవాయితీ. కొవిడ్ సమయంలో భార్య మరణించడంతో ఏటా ఒక్కసారి మాత్రమే వెళుతున్నారు. ఈ ఏడాది అక్టోబరులో తిరుపతి వెళ్లిన శర్మకు ప్రతి రోజూ ఇంట్లో తిరుమల-తిరుపతి వైభవాన్ని చూడాలన్న ఆలోచన వచ్చింది. దీంతో అక్కడి వాతావరణం, ఆలయ ప్రాంగణం తనకు ఎలా కావాలో? ఫొటోలు తీసి పెట్టుకున్నారు. వాల్ పెయింటింగ్‌లో రాణిస్తున్న వెంకట హనుమంతు బృందంతో అచ్చం అలాగే పెయింటింగ్ వేయించారు.

- 'సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో బంధువులు, స్నేహితులు, చాలా మంది చూడటానికి వస్తున్నారు. చాలా సంతోషంగా ఉంది. ఇంట్లోనే తిరుమల అనుభూతి పొందుతున్నా'. – సుబ్రహ్మణ్య శర్మ
- 'కాన్వాస్‌లపై ఉపయోగించే వాటర్ బేస్డ్ రంగులను వాడాం. తిరుమల-తిరుపతి దేవస్థానం వైబ్ వచ్చేలా ఎంతో శ్రద్ధతో చిత్రాన్ని పూర్తిచేశాము'. – వెంకట హనుమంతు

గంజాయి కింగ్‌పిన్ అలీపై ఎన్‌డీపీఎస్ చట్టం ప్రయోగం

విశాఖలోని కేంద్ర కారాగారానికి నిందితుడి తరలింపు

ఈనాడు, విజయనగరం: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తూ.. సమాజానికి ప్రమాదకరంగా మారి.. రాష్ట్రంలో గంజాయి అక్రమ రవాణాలో డ్రగ్‌లార్డ్‌గా, కింగ్‌పిన్(కీలక వ్యక్తి)గా వ్యవహరిస్తున్న పఠాన్ బాషా అలీ(31)ని అరెస్టు చేసినట్లు విజయనగరం జిల్లా ఎస్పీ ఏఆర్.దామోదర్ గురువారం తెలిపారు. పలు కేసుల్లో ఇతడు ప్రధాన నిందితుడిగా ఉండడంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు కఠినమైన ఎన్‌డీపీఎస్(నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్) చట్టాన్ని ప్రయోగించామని చెప్పారు. ఇప్పటికే ఇతడిపై విజయనగరంలోని రెండో పట్టణ పోలీసు స్టేషన్‌లో సస్పెక్ట్ షీట్ తెరిచామని పేర్కొన్నారు. ముందస్తు నేర నియంత్రణ చర్యల్లో భాగంగా అరెస్టు చేసి, విశాఖలోని కేంద్ర కారాగారానికి తరలించామని వెల్లడించారు. శ్రీకాకుళం జిల్లా ఆమదాలవలసలోని కొత్తవీధికి చెందిన అలీ ప్రస్తుతం విజయనగరం జిల్లా కేంద్రంలోని ఫూల్‌బాగ్‌లో నివాసం ఉంటున్నాడు. వ్యసనాలకు అలవాటుపడిన ఇతడు.. సులభంగా డబ్బు సంపాదించాలనే దురాశతో గంజాయి అక్రమ రవాణాకు పాల్పడుతున్నాడు. ఎన్ని కేసులు నమోదైనా బెయిల్‌పై బయటకు వచ్చేవాడు. 8 మంది ముఠాతో 2021లో గంట్యాడలో 1,596 కిలోల గంజాయితో పట్టుబడడంతో తెరపైకి వచ్చాడు.

'సిమ్ బాక్స్'తో అంతర్జాతీయ ఫోన్‌కాల్స్ రూటింగ్

- వాటిని అడ్డుపెట్టుకుని సైబర్ మోసాలు
- దేశవ్యాప్తంగా ఏపీ సీఐడీ దాడులు
- వియత్నాం దేశీయుడితో పాటు మరికొందరి అరెస్ట్

ఈనాడు, అమరావతి: 'సిమ్ బాక్స్' అనే ప్రత్యేక పరికరం ద్వారా అంతర్జాతీయ ఫోన్‌కాల్స్‌ను లోకల్ కాల్స్‌గా రూటింగ్ చేసి, పెద్ద ఎత్తున సైబర్ నేరాలకు పాల్పడుతున్న అంతర్జాతీయ ముఠా గుట్టు రట్టయ్యింది. ఏపీ సీఐడీలోని సైబర్ నేరాల పోలీస్‌స్టేషన్‌లో నమోదైన ఓ కేసు దర్యాప్తులో భాగంగా సీఐడీ ఇటీవల దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో దాడులు చేపట్టి, ఈ నేర నెట్‌వర్క్‌ను ఛేదించింది. ఈ ముఠాలో కీలకమైన వియత్నాం దేశీయుడితో పాటు మరికొందర్ని అరెస్టు చేసింది. పెద్ద ఎత్తున సిమ్ బాక్సులు, వేల సిమ్ కార్డులు స్వాధీనం చేసుకుంది. ఈ తరహా మోసం ద్వారా సైబర్ నేరాలకు పాల్పడి భారీ మొత్తాల్లో సొత్తు కొల్లగొట్టడమే కాకుండా, కాల్స్ రూటింగ్ ద్వారా టెలికం కంపెనీలకు పెద్ద ఎత్తున నష్టం కలిగించినట్లు సీఐడీ దర్యాప్తులో తేల్చింది. కాంబోడియా కేంద్రంగా సైబర్ నేరాలకు పాల్పడే ముఠా దీని వెనక ఉన్నట్లు గుర్తించింది. ఈ నేరానికి సంబంధించిన వివరాలను సీఐడీ విభాగాధిపతి రవిశంకర్ అయ్యన్నార్ శుక్రవారం వెల్లడించనున్నారు.

నేరానికి పాల్పడ్డారిలా...

- వాయిస్ ఓవర్ ఇంటర్నెట్ ప్రొటోకాల్ (వీవోఐపీ)ను ఉపయోగించుకుని ఇంటర్నేషనల్ కాల్స్‌ను 'సిమ్ బాక్స్' అనే పరికరంలోకి పంపిస్తారు.
- ఒక్కో సిమ్ బాక్స్‌లో భారతదేశానికి సంబంధించిన వందల సిమ్‌లు ఉంటాయి. ఇవన్నీ ఈ ముఠాలు నకిలీ చిరునామాలు, గుర్తింపు కార్డుల వివరాలతో సేకరించినవే.
- ఈ సిమ్ బాక్సుల ద్వారా అంతర్జాతీయ కాల్స్ అన్నీ లోకల్ సిమ్ నుంచి బయటకు వెళ్తాయి.
- కాంబోడియా, చైనా సహా పలు దేశాల్లో పాగా వేసిన అంతర్జాతీయ సైబర్ నేర ముఠాలు అక్కడి నుంచి మన దేశంలోని అనేక మందికి ఫోన్ కాల్స్ చేసి సైబర్ మోసాలకు పాల్పడుతున్నాయి. డిజిటల్ అరెస్టుల పేరిట బెదిరింపులు సహా ఇతరత్రా నేరాలు చేస్తున్నాయి. సిమ్‌బాక్సుల వల్ల సైబర్ నేరగాళ్లు విదేశాల నుంచే కాల్స్ చేసినప్పటికీ మన దేశంలోని బాధితులకు అవి స్థానిక ఫోన్ నంబర్లలానే కనిపిస్తాయి.
- దీని వల్ల అసలైన నేరగాళ్లు దర్యాప్తు సంస్థలకు చిక్కకుండా మోసగిస్తున్నారు.

EENADU Vol: 52, Issue: 136
Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00.
Founder Ramoji Rao



బరువు తగ్గించే మందులకు ఇంత గిరాకీయా!

జనరిక్‌లోనూ విడుదలకు స్థానిక కంపెనీల సన్నాహాలు

దేశీయ ఫార్మా పరిశ్రమకు 4-5% వృద్ధి అవకాశం

ఊబకాయం పెద్ద సమస్య. ఎంత ప్రయత్నించినా బరువు తగ్గడం కష్టం. అధికస్థూల మీద కొంత మంది మాత్రమే ఈ సమస్య నుంచి బయటపడతారు. ఇందుకోసం ఆహారం మీద శ్రద్ధతో పాటు బాగా శరీర శ్రమ, కసరత్తు చేయాల్సి వస్తుంది. ఎంత చేసినా కొంతమందిలో ఫలితం కనిపించదు. అటువంటి వారికి వైద్యమే పరిష్కారం. కానీ ప్రత్యేకంగా బరువు తగ్గించే మందులు ఇటీవలే అందుబాటులోకి వచ్చాయి. అవి కూడా విదేశీ కంపెనీల నుంచి. ఇందులో ఒకటి ఎలీ లిల్లీ కంపెనీకి చెందిన టిర్జెపటైడ్ మందు కాగా, మరొకటి నోవో నార్డిస్క్‌కు చెందిన సెమాగ్లుటైడ్ ఔషధం. ఈ మందులను జీఎల్‌పీ-1 తరగతికి చెందినవిగా పరిగణిస్తున్నారు. టిర్జెపటైడ్ మందును మౌంజారో, జెప్‌బౌండ్ అనే బ్రాండ్లతో ఎలీ లిల్లీ విక్రయిస్తోంది. సెమాగ్లుటైడ్‌ను నోవో నార్డిస్క్, ఒజెంపిక్, వెగోవీ అనే బ్రాండ్ పేర్లతో మార్కెట్ చేస్తోంది. మధుమేహ వ్యాధి చికిత్సలోనూ ఈ మందులను వినియోగించే అవకాశం ఉండటం అదనపు ఆకర్షణ. వెగోవీ, జెప్‌బౌండ్ బ్రాండ్లు ఊబకాయం సమస్యకు, ఒజెంపిక్, మౌంజారో బ్రాండ్ మందులను మధుమేహ వ్యాధికి సిఫారసు చేస్తున్నారు. ఈ రెండు మందులు అందుబాటులోకి వచ్చిన తక్కువ సమయంలోనే భారీ అమ్మకాలు నమోదు చేస్తున్నాయి.



పోటాపోటీగా: బరువు తగ్గించే మందులకు ప్రస్తుతం పేటెంట్ ఉంది. పేటెంట్ గడువు తీరగానే, జనరిక్ మందులు ఉత్పత్తి చేసి, అందుబాటు ధరల్లో అందించడానికి దేశీయ దిగ్గజ ఫార్మా కంపెనీలు సన్నాహాలు చేస్తున్నాయి. ముఖ్యంగా సెమాగ్లుటైడ్ మందుపై ఎక్కువ కంపెనీలు దృష్టి సారించాయి. కొన్ని కంపెనీలు ఇప్పుడే సెమాగ్లుటైడ్‌ను ఉత్పత్తి చేసి, పేటెంట్ రక్షణ లేని ఇతర దేశాలకు సరఫరా చేయబోతున్నాయి. డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్, సన్ ఫార్మా, జైడస్ వెల్నెస్, టొరెంట్ ఫార్మా ఇందులో ఉన్నాయి. వీటికి అవకాశం ఇవ్వకూడదని భావిస్తే, నోవో నార్డిస్క్, ఎలీ లిల్లీ కంపెనీలు దేశంలోని కొన్ని ఫార్మా కంపెనీలతో లైసెన్సింగ్ ఒప్పందాలు కుదుర్చుకుంటున్నాయి. ఎమ్‌క్యూర్ ఫార్మాతో నోవో నార్డిస్క్, సిప్లాతో ఎలీ లిల్లీ ఇప్పటికే ఒప్పందాలు చేసుకున్నాయి. మొత్తం మీద జీఎల్‌పీ- 1 ఔషధాల మార్కెట్ వేడెక్కుతోంది.

అమెరికా విపణి కోసం తెలుగు రాష్ట్రాల నుంచి కంపెనీలు

జీఎల్‌పీ-1 మందుల వల్ల దేశీయ ఫార్మా పరిశ్రమ 4-5% వృద్ధి సాధిస్తుందని ఎల్లారా క్యాపిటల్ తాజా నివేదికలో పేర్కొంది. ఇప్పటికే షుగర్ మందుల విభాగంలో కార్యకలాపాలు సాగిస్తున్న కంపెనీలకు మేలు జరుగుతుందని అంచనా వేసింది. సెమాగ్లుటైడ్ మందుకు భారతదేశంతో పాటు కెనడా, బ్రెజిల్, టర్కీయే దేశాల్లో 2026 మార్చిలో పేటెంట్ గడువు తీరిపోతోంది. పలు దేశాల్లో 2026- 32 మధ్య ఆ తర్వాత అమెరికాలోనూ ఈ మందుకు పేటెంట్ గడువు పూర్తవుతుంది. వెంటనే ఈ మార్కెట్లో జనరిక్ మందులు అప్పుడు ప్రవేశిస్తాయి. దీన్ని సొమ్ము చేసుకునేందుకు భారతీయ ఫార్మా కంపెనీలు సన్నాహాలు చేస్తున్నాయి. జనరిక్ సెమాగ్లుటైడ్ (ఒజెంపిక్) మందుకు అమెరికా మార్కెట్లో అనుమతి కోసం తెలుగు రాష్ట్రాల కంపెనీలైన నాట్కో ఫార్మా, డాక్టర్ రెడ్డీస్, అరబిందో ఫార్మాతో పాటు జైడస్ లైఫ్, సన్ ఫార్మా దరఖాస్తు చేశాయి. వెగోవీ జనరిక్ మందుకు 'ఫస్ట్-టు-ఫైల్' హోదాతో నాట్కో ఫార్మా, మయలాన్‌తో కలిసి అమెరికాలో దరఖాస్తు చేసింది. టిర్జెపటైడ్ మందుకు వివిధ దేశాల్లో 2030 నుంచి పేటెంట్ గడువు తీరనుంది.

ఈనాడు బిజినెస్

దేశంలో 20 కోట్ల మందికి ఊబకాయం

ప్రపంచ వ్యాప్తంగా ఔషధ మార్కెట్ 1.7 ట్రిలియన్ డాలర్ల (సుమారు రూ.153 లక్షల కోట్లు) స్థాయిలో ఉంది. ఇందులో మధుమేహ మందుల వాటా 130 బిలియన్ డాలర్లు (సుమారు రూ.11.7 లక్షల కోట్లు) కావడం గమనార్హం. ఊబకాయం మందులు 10 బిలియన్ డాలర్ల (సుమారు రూ.90,000 కోట్లు) అమ్మకాలు నమోదు చేస్తున్నాయి. జీఎల్‌పీ- 1 మందులు వచ్చే వరకు ఊబకాయం సమస్యకు గొప్ప మందులు లేవు. జీఎల్‌పీ- 1 తరగతి ఔషధాలైన సెమాగ్లుటైడ్, టిర్జెపటైడ్ దాదాపు 70 బిలియన్ డాలర్ల (సుమారు రూ.6.30 లక్షల కోట్లు) అమ్మకాలు సాధిస్తున్నాయి. ఈ రెండు మందులతో షుగర్, ఊబకాయం మందుల మార్కెట్ 50% విస్తరించింది. మనదేశంలో సెమాగ్లుటైడ్, టిర్జెపటైడ్ మందుల ప్రయాణం మొదలై ఏడాదే. అయినా వేగంగా అమ్మకాలు పెరుగుతున్నాయి. ఊబకాయం సమస్యతో మనదేశంలో 20 కోట్ల మంది బాధపడుతున్నారు. షుగర్ బాధితులు ఇంకా అధికంగా ఉంటారు. అందువల్ల ఈ మందుల అమ్మకాలు ఇంకా ఎన్నో రెట్లు పెరుగుతాయనేది అంచనా. తద్వారా దేశీయ ఫార్మా కంపెనీలకు ఆదాయాలు, లాభాలు పెరిగే అవకాశం కనిపిస్తోంది.

- ఈనాడు హైదరాబాద్, బిజినెస్ బ్యూరో

ఏఐ వల్ల ఉద్యోగ కోతలు మనదేశంలో తక్కువే

ఐటీ కార్యదర్శి ఎస్ కృష్ణన్

దిల్లీ: పాశ్చాత్య దేశాలతో పోలిస్తే మనదేశంలో కృత్రిమ మేధ(ఏఐ) సాంకేతికత వల్ల ఉద్యోగాలు పోయే అవకాశం తక్కువగానే ఉందని ఐటీ కార్యదర్శి ఎస్ కృష్ణన్ అభిప్రాయపడ్డారు. 'మన దగ్గర వైట్ కాలర్ (వృత్తినిపుణుల) ఉద్యోగాల సంఖ్య తక్కువే. అందువల్ల భిన్న రంగాల్లో ఏఐ ప్రవేశపెట్టడం వల్ల ఉద్యోగాలు కోల్పోవడం ఇతర దేశాలతో పోలిస్తే మన దగ్గర తక్కువే. మనదగ్గర చాలా వరకు వైట్‌కాలర్ ఉద్యోగాలు స్టెమ్ (సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మాథ్స్) విభాగంలో ఉన్నవే. కాబట్టి మనకు కొత్త ఉద్యోగావకాశాలు వస్తాయని' అన్నారు. 'గతంలోనూ పారిశ్రామిక, ఇతర విప్లవాల సందర్భంలో కార్మికుల స్థానంలో మెషీన్లు వస్తాయని అనుకున్నారు. ఇపుడు కూడా ఏఐ వల్ల ఉద్యోగాలు పోతాయని కొంత మంది భావిస్తున్నారు. కానీ అలా ఏమీ కాదు. ఏఐ కేవలం మానవ సామర్థ్యాన్ని పెంచేందుకే ఉంది. మరింత ఉత్పాదకతతో మనం పనిచేయగలమ'ని ఆయన తెలిపారు.

కోడి గుడ్లు

26న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	675
వరంగల్	677
విజయవాడ	700
తూ/ప గోదావరి	665
విశాఖపట్నం	670
చిత్తూరు	703

మార్కెట్లు పనిచేయలేదు: క్రిస్మస్ సందర్భంగా బీఎస్‌ఈ, ఎన్‌ఎస్‌ఈ గురువారం పనిచేయలేదు. కమొడిటీస్, కరెన్సీ మార్కెట్లకూ సెలవే.

పెద్ద షేర్ల ముందు చిన్నబోయాయి

- ఈ ఏడాది బ్లూచిప్‌దే హవా
- ఆకట్టుకోని మధ్య, చిన్నస్థాయి షేర్లు
- గత రెండేళ్ల ర్యాలీ వల్ల లాభాల స్వీకరణే కారణం

ఈ ఏడాది పెద్ద కంపెనీల (బ్లూచిప్) షేర్లే అధికంగా రాణించాయి. వీటి ముందు చిన్న, మధ్య తరహా కంపెనీల షేర్ల పనితీరు చిన్నబోయింది. ఇంతకుముందు రెండేళ్లలో బ్లూచిప్ షేర్లుండే సెన్సెక్స్‌కు మించి స్మాల్‌క్యాప్, మిడ్‌క్యాప్ సూచీలు ప్రతిఫలాన్ని పంచాయి. ఈ సారి మిడ్‌క్యాప్ సూచీ ఓ మోస్తరుగా పెరగ్గా, స్మాల్‌క్యాప్ సూచీ నష్టాల్లోకి వెళ్లింది.



ఇదీ కారణం.. : 2023, 2024 సంవత్సరాల్లో ఆకర్షణీయ ప్రతిఫలాన్ని పంచడంతో చిన్న, మధ్య తరహా కంపెనీల షేర్ల విలువలు బాగా పెరిగాయి. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి అమెరికా- భారత్ వాణిజ్య ఒప్పందంపై అనిశ్చితులు కొనసాగడం, సంవత్సరం చివర్లో డాలర్‌తో పోలిస్తే రూపాయి బలహీనపడటం లాంటి పరిణామాల వల్ల, చిన్న-మధ్యతరహా షేర్లలో మదుపర్లు లాభాల స్వీకరణకు దిగారు. ఫలితంగా ఈ రెండు సూచీలు దిద్దుబాటుకు గురయ్యాయి. విదేశీ సంస్థాగత మదుపర్ల అమ్మకాలు కూడా ఇందుకు ఆజ్యం పోశాయి. సాధారణంగా ఎఫ్‌ఐఐలు బ్లూచిప్ షేర్ల కొనుగోలుకే ప్రాధాన్యం ఇస్తుంటారు.

ముున్ముందు ఇలా.. : 2025లో దిద్దుబాటు తర్వాత, నాణ్యమైన మధ్య తరహా కంపెనీల షేర్ల విలువలు వాటి జీవనకాల గరిష్ఠ స్థాయిలతో పోలిస్తే సహేతుక స్థాయిలోనే ఉన్నాయని విశ్లేషకులు చెబుతున్నారు. అయితే కంపెనీల ఆదాయ వృద్ధి ఆశించిన స్థాయిలో మెరుగు పడకపోతే, మార్కెట్‌వ్యాప్తంగా ర్యాలీకి అవకాశం ఉండకపోవచ్చని విశ్లేషిస్తున్నారు. రూపాయిలో స్థిరత్వం చోటుచేసుకుంటే, షేర్ల విలువలపై ఒత్తిడి తగ్గుముఖం పడుతుందని అంటున్నారు. చిన్న, మధ్య తరహా కంపెనీల షేర్ల ట్రేడింగ్ విషయంలో అప్రమత్తతతో కూడిన ఆశావహ వైఖరి అవలంబించాలని సూచిస్తున్నారు.

- ఈ ఏడాది నవంబరు 18న బీఎస్‌ఈ మిడ్‌క్యాప్ సూచీ 47,549.40 పాయింట్ల వద్ద 52 వారాల గరిష్ఠాన్ని తాకింది. స్మాల్‌క్యాప్ సూచీకి 52 వారాల గరిష్ఠ స్థాయి 56,497.39 కాగా, జనవరి 3న ఈ స్థాయిని చేరింది. ఏప్రిల్ 7న 41,013.68 వద్ద 52 వారాల కనిష్ఠాన్ని నమోదు చేసింది.

ఈ ఏడాదిలో సూచీల పనితీరు (డిసెంబరు 24 వరకు)

సూచీ	పాయింట్లు
బీఎస్‌ఈ సెన్సెక్స్	+7,269.69 (9.3%)
బీఎస్‌ఈ మిడ్‌క్యాప్	+360.25 (0.77%)
బీఎస్‌ఈ స్మాల్‌క్యాప్	-3,686.98 (-6.68%)

	2024లో	2023లో	2022లో
సెన్సెక్స్	+5,899 (8.16%)	+11,400 (18.73%)	+2,587 (4.44%)
మిడ్‌క్యాప్	+9,605 (26.07%)	+11,525 (45.52%)	+344 (1.37%)
స్మాల్‌క్యాప్	+12,507 (29.30%)	+13,747 (47.52%)	-531 (-1.8%)

30 కంపెనీల షేర్ల రికవరీ భళా..

నిఫ్టీ 500 సూచీలోని కంపెనీల్లో 30 కంపెనీల షేర్లు 52 వారాల కనిష్ఠాల నుంచి గణనీయంగా పుంజుకున్నాయి. వీటిల్లో ముఖ్యంగా చెప్పుకోవల్సింది ఫోర్స్‌మోటార్స్. ఈ కంపెనీ షేరు ఈ ఏడాది ప్రారంభంలో రూ.6,128 వద్ద 52 వారాల కనిష్ఠానికి పడింది. అక్కడ నుంచి 200% పెరిగి ప్రస్తుతం రూ.18,353కు చేరింది. 2010 తర్వాత ఒక ఏడాదిలో అత్యధికంగా పుంజుకున్న కంపెనీ షేరుగానూ ఇది నిలిచింది.

52 వారాల కనిష్ఠం నుంచి అత్యధికంగా పుంజుకున్న 10 కంపెనీల షేర్లు (%లో)

ఫోర్స్ మోటార్స్	200
నెట్‌వెబ్ టెక్నాలజీస్	155
జీఈ వెర్నోవా టీఅండ్‌డీ	152
ఏథర్ ఎనర్జీ	151
ఎంసీఎక్స్	145
జీఎండీసీ	141
హిందుస్థాన్ కాపర్	137
ఎల్అండ్‌టీ ఫైనాన్స్	135
ఆదిత్య బిర్లా కేపిటల్	133
కిర్లోస్కర్ ఆయిల్ ఇంజిన్స్	132



ఇన్ఫీలో ప్రారంభ వేతనం రూ.21 లక్షలు!

- ఐటీ కంపెనీల్లో అత్యధిక ఎంట్రీ లెవెల్ జీతం ఇదే
- ప్రత్యేక టెక్నాలజీ హోదాలకే ఈ ఆఫర్

భారత ఐటీ కంపెనీల్లో ఇన్ఫోసిస్ అత్యధిక ప్రారంభ స్థాయి వేతనాన్ని ప్రకటించింది. కృత్రిమ మేధ(ఏఐ) సామర్థ్యాన్ని పెంచుకోవడానికి, డిజిటల్ నైపుణ్యం ఎక్కువగా ఉన్నవారిని ఆకర్షించడం కోసం ఈ నిర్ణయం తీసుకుంది. ప్రత్యేక టెక్నాలజీ ఉద్యోగాలకు మాత్రమే వర్తించే ఈ వార్షిక వేతనం రూ.21 లక్షల వరకు ఉండనుంది. ఇతర ఐటీ కంపెనీల్లోని స్పెషలైజ్డ్ రోల్స్‌తో పోల్చినా ఇది అధికం కావడం గమనార్హం.


ఆఫ్‌క్యాంపస్ ఎంపికలు త్వరలో: స్పెషలైజ్డ్ టెక్నాలజీ ఉద్యోగుల ఎంపిక కోసం ఇంజినీరింగ్, కంప్యూటర్ గ్రాడ్యుయేట్లకు ఇన్ఫోసిస్ త్వరలోనే ఆఫ్ క్యాంపస్ డ్రైవ్ ప్రారంభించనుందని, వీరి వార్షిక పారితోషికం రూ.7-21 లక్షల వరకు ఉంటుందని ఆంగ్ల వార్తా సంస్థలు పేర్కొన్నాయి.

ఇవీ ఉద్యోగాలు: స్పెషలిస్ట్ ప్రోగ్రామర్(ఎల్1 - ఎల్3), డిజిటల్ స్పెషలిస్ట్ ఇంజినీర్(ట్రెయినీ) వంటి ఉద్యోగాలు ఉండనున్నాయి. బీఈ, బీటెక్, ఎమ్‌ఈ, ఎంటెక్, ఎమ్‌సీఏ, ఇంటిగ్రేటెడ్ ఎమ్‌ఎస్సీ(కంప్యూటర్‌సైన్స్) గ్రాడ్యుయేట్లు ఇందుకు అర్హులు. స్పెషలిస్ట్ ప్రోగ్రామర్ ఎల్3 (ట్రెయినీ)కి రూ.21 లక్షలు, ఎల్2 ట్రెయినీకి రూ.16 లక్షలు, ఎల్1 ట్రెయినీకి రూ.11 లక్షలు, డిజిటల్ స్పెషలిస్ట్ ఇంజినీర్ (ట్రెయినీ)కి రూ.7 లక్షల చొప్పున వార్షిక వేతనం ఇవ్వనున్నారు.

ఇప్పటిదాకా తక్కువే: భారత ఐటీ దిగ్గజాలు గత దశాబ్ద కాలంగా ప్రారంభ స్థాయి వేతనాలను పెద్దగా పెంచడం లేదు. ఫ్రెషర్ల సగటు వేతనం రూ.2.45 లక్షల నుంచి 3.55 లక్షలకు మాత్రమే పెరిగింది. అదే సీఈఓల సగటు వార్షిక వేతనం 2011-12 నాటి రూ.3.37 కోట్ల నుంచి 835% పెరిగి రూ.31.5 కోట్ల (2021-22)కు చేరింది. ప్రత్యేక నైపుణ్యం ఉన్న ఫ్రెషర్లకు డిజిటల్, ప్రైమ్ ఎలైట్ కింద రూ.7 లక్షలు, రూ.11 లక్షల చొప్పున వార్షిక వేతనాలను టీసీఎస్ అందిస్తోంది. విప్రో కూడా స్పెషలైజ్డ్ ప్రోగ్రామ్స్ (టర్బో/ డబ్ల్యూఐఎల్‌పీ) కింద రూ.6.5 లక్షల వరకు ఇస్తోంది.

సెమీకండక్టర్ల ఎగమతులూ చేస్తాం

హోంమంత్రి అమిత్ షా



దిల్లీ: సెమీకండక్టర్ రంగంలోకి భారత్ ఆలస్యంగా అడుగు పెట్టినా, శరవేగంగా అభివృద్ధి చెందుతోందని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా తెలిపారు. ఈ రంగంలో త్వరలోనే స్వయం సమృద్ధి సాధించడంతో పాటు, విదేశాలకు ఎగుమతులు కూడా చేస్తామనే విశ్వాసాన్ని ఆయన వ్యక్తం చేశారు. 'అభ్యుదయ మధ్యప్రదేశ్ గ్రోత్ సమ్మిట్' కార్యక్రమంలో రూ.2 లక్షల కోట్ల విలువైన పరిశ్రమలకు శంకుస్థాపన చేసిన అనంతరం అమిత్‌షా ఈ వ్యాఖ్యలు చేశారు. దేశంలోని 50% అంకుర సంస్థలను మహిళలే నిర్వహిస్తున్నారని మంత్రి ప్రశంసించారు. 204-25లో అంతర్జాతీయ డిజిటల్ ఆర్థిక లావాదేవీల్లో మనదేశ వాటా 46 శాతమని పేర్కొన్నారు.

4 రోడ్డు ప్రాజెక్టుల నుంచి తప్పుకోనున్న కేఎన్‌ఆర్ కన్‌స్ట్రక్షన్స్

దిల్లీ: దేశంలోని 4 జాతీయ రహదారుల ప్రాజెక్టుల నుంచి తప్పుకుంటున్నట్లు కేఎన్‌ఆర్ కన్‌స్ట్రక్షన్స్ తెలిపింది. ఆయా ప్రాజెక్టుల్లో తమ 100% వాటా విక్రయించేందుకు ఇండస్ ఇన్‌ఫ్రా ట్రస్ట్‌తో ఒప్పందం చేసుకున్నట్లు వెల్లడించింది. ఈ ప్రాజెక్టులపై రూ.566.83 కోట్లు వెచ్చించగా, విక్రయంపై రూ.1543.19 కోట్లు ఆర్జించగలమని అంచనా వేస్తున్నట్లు వివరించింది. ఈ రోడ్డు ప్రాజెక్టుల్లో కేఎన్‌ఆర్ పళని ఇన్‌ఫ్రా, కేఎన్ ఆర్ రామగిరి ఇన్‌ఫ్రా, కేఎన్‌ఆర్ గురువాయూర్ ఇన్‌ఫ్రా, కేఎన్‌ఆర్ రమనత్తుకర ఇన్‌ఫ్రా ఉన్నాయి.

అదానీ.. 3 ఏళ్లలో 33 కొనుగోళ్లు

మొత్తం లావాదేవీల విలువ రూ.80,000 కోట్లు



అదానీ గ్రూప్ అకౌంటింగ్‌లో అవకతవకలకు పాల్పడిందని, గ్రూప్ కంపెనీల షేర్ల విలువలను కృత్రిమంగా పెంచే చర్యలు తీసుకుందని అమెరికా షార్ట్ సెల్లింగ్ సంస్థ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ 2023 ప్రారంభంలో ఆరోపించినప్పుడు, అదానీ గ్రూప్ మార్కెట్ విలువ 150 బిలియన్ డాలర్ల (సుమారు రూ.13.50 లక్షల కోట్ల) మేర హరించుకుపోయింది. ఆ ఆరోపణలను తోసిపుచ్చుకుంటూ వస్తూనే.. తన ప్రధాన వ్యాపారాల విస్తరణ కోసం వివిధ కంపెనీలను కొనుగోలు చేయడం ద్వారా మూలధన లభ్యత విషయంలో తమకు ఎలాంటి ఇబ్బంది లేదనే సంకేతాలను అదానీ గ్రూపు పంపించింది. తద్వారా మదుపర్లలో గ్రూపుపై విశ్వాసాన్ని నిలబెట్టుకునేందుకు ప్రయత్నించింది. 2023 జనవరి నుంచి అదానీ గ్రూపు వివిధ రంగాల్లో 33 కొనుగోళ్లను చేపట్టింది. ఈ మొత్తం లావాదేవీల విలువ సుమారు రూ.80,000 కోట్లు (9.6 బిలియన్ డాలర్లు).

భారీ లావాదేవీ ఇది

ఈ ఏడాది ఏప్రిల్‌లో ఆస్ట్రేలియాకు చెందిన నార్త్ క్వీన్స్‌ల్యాండ్ ఎక్స్‌పోర్ట్ టర్మినల్ (ఎన్‌క్యూఎక్స్‌టీ)ను అదానీ పోర్ట్స్ రూ.21,700 కోట్లకు కొనుగోలు చేసింది. గత మూడేళ్ల సంస్థ కొనుగోళ్లలో ఇదే భారీ లావాదేవీ.

ఆయా రంగాల్లో కొనుగోళ్లు (రూ.కోట్లలో)

ఓడరేవులు	28,145
సిమెంటు	24,710
విద్యుత్	12,251
కొత్త తరం వ్యాపారాలు	3,927
పంపిణీ, సరఫరా	2,544

(ఇవే కాకుండా దివాలా ప్రక్రియ ద్వారా జేపీ గ్రూపును రూ.13,500 కోట్లకు కొనుగోలు చేయాలని అనుకుంటోంది. ఈ లావాదేవీ ఇంకా పూర్తి కాలేదు. మరిన్ని కంపెనీల కొనుగోళ్ల కోసమూ అదానీ గ్రూప్ చర్చలు జరుపుతోంది)

అత్యధికం సిమెంటు రంగంలో

సిమెంటు రంగంలో అత్యధిక కొనుగోళ్లను చేపట్టడం ద్వారా, దేశీయ అగ్రగామి సంస్థతో పోటీపడే స్థాయికి అదానీ గ్రూప్ చేరింది.

- 2023 ఆగస్టులో సంఘీ ఇండస్ట్రీస్‌లో 56.74% వాటాను రవి సంఘీ కుటుంబం నుంచి రూ.5,000 కోట్లకు అంబుజా సిమెంట్స్ కొనుగోలు చేసింది.
- 2024 జనవరిలో ఏషియన్ కాంక్రీట్స్ అండ్ సిమెంట్స్‌ను రూ.775 కోట్లకు, ఏప్రిల్‌లో తమిళనాడులో మై హోమ్ గ్రూపునకు చెందిన ట్యుటికారన్ గ్రైండింగ్ యూనిట్‌ను రూ.413.75 కోట్లకు సొంతం చేసుకుంది.
- 2024 జూన్‌లో పెన్నా సిమెంట్‌ను రూ.10,422 కోట్లకు; అక్టోబరులో ఓరియంట్ సిమెంట్‌ను రూ.8,100 కోట్లకు చేజిక్కించుకుంది.
- ఈ ఏడాది ఏప్రిల్‌లో ఐటీడీ సిమెంటేషన్‌లో 46.64% వాటాను రూ.3,204 కోట్లకు, మరో 26% వాటాను ప్రజల నుంచి కొనుగోలు చేయడం ద్వారా ఆ సంస్థ యాజమాన్య నియంత్రణను తన చేతిలోకి తెచ్చుకుంది. ఈ మొత్తం లావాదేవీ విలువ రూ.5,757 కోట్లు.

మిగతా రంగాల్లో ఇవి..

- ఓడరేవుల రంగంలో.. రూ.1,485 కోట్లకు కరైకల్ పోర్ట్‌ను (2023 ఏప్రిల్‌లో); రూ.3,080 కోట్లకు గోపాల్‌పుర్ పోర్ట్‌ను (2024 మార్చిలో); రూ..1,550 కోట్లకు ఆస్ట్రో ఆఫ్‌షోర్‌ను (2024 ఆగస్టులో) కొనుగోలు చేసింది. 2024 మేలో టాంజానియాలోని దార్ ఎస్ సలామ్ పోర్ట్‌ను రూ.330 కోట్లకు సొంతం చేసుకుంది.
- విద్యుత్ రంగంలో.. ల్యాంకో అమర్‌కంటక్‌ను రూ.4,101 కోట్లకు; విదర్భ ఇండస్ట్రీస్‌ను రూ.4,000 కోట్లకు; కోస్టల్ ఎనర్జెన్ ప్రైవేట్ లిమిటెడ్‌ను రూ.3,335 కోట్లకు దక్కించుకుంది.
- డేటా సెంటర్ వ్యాపారాలు, విద్యుత్ పంపిణీ, రోడ్లు, స్థిరాస్తి రంగాల్లోను పలు కొనుగోళ్లను ఈ మూడేళ్ల కాలంలో అదానీ గ్రూపు పూర్తి చేసింది.

అయిదేళ్లలో రూ.10 లక్షల కోట్ల మూలధన వ్యయ ప్రణాళిక

రాబోయే అయిదేళ్లలో మూలధన వ్యయాల కింద సుమారు రూ.10 లక్షల కోట్లు వెచ్చించాలని అదానీ గ్రూపు భావిస్తోంది. మౌలిక, ఇంధనం, లాజిస్టిక్స్ రంగాల్లో కంపెనీల కొనుగోళ్లు చేపడుతూనే.. పాత, కొత్త ప్రాజెక్టులను అభివృద్ధి చేయడం ద్వారా మరింత వృద్ధిని సాధించే దిశగా అడుగులు వేయాలని అనుకుంటోంది.



నవీ ముంబయి అంతర్జాతీయ విమానాశ్రయంలో, విమానాల వాణిజ్య కార్యకలాపాలు గురువారం ప్రారంభమయ్యాయి. బెంగళూరు నుంచి ఇండిగో విమానం ఉదయం 8 గంటలకు ఇక్కడ ల్యాండ్ అవ్వగా, సంప్రదాయబద్ధంగా వాటర్ క్యానన్ సెల్యూట్ కార్యక్రమం నిర్వహించారు.

ఎన్‌విడియా చేతికి గ్రోక్ ఏఐ ఆస్తులు

విలువ రూ.1.8 లక్షల కోట్లు



అధునాతన ఏఐ (కృత్రిమమేధ) యాక్సెలరేటర్ చిప్‌లను డిజైన్ చేసే అంకుర సంస్థ గ్రోక్ నుంచి కీలక ఆస్తులను కొనుగోలు చేయాలని అమెరికా టెక్ దిగ్గజం ఎన్‌విడియా నిర్ణయించింది. ఈ ఒప్పందం వల్ల కంపెనీ ఏఐ ఉత్పత్తులు మరింత బలోపేతం అవుతాయని ఎన్‌విడియా చీఫ్ ఎగ్జిక్యూటివ్ జెన్సన్ హ్యావాంగ్ పేర్కొన్నారు. 20 బి. డాలర్ల (దాదాపు రూ.1.8 లక్షల కోట్లు) నగదుతో ఈ కొనుగోలు జరగనుందని ఆంగ్ల వార్తా సంస్థ సీఎన్‌బీసీ వెల్లడించింది. ఈ విక్రయ విషయంలో గ్రోక్ చురుగ్గా లేకపోయినప్పటికీ, ఒప్పందం వేగంగానే కుదిరిందని డిస్ట్రప్టివ్ సీఈఓ అలెక్స్ డేవిస్ తెలిపారు. గ్రోక్‌లో డిస్ట్రప్టివ్‌కి 500 మి. డాలర్లకు పైగా పెట్టుబడులున్నాయి. మూడు నెలల కిందట సంస్థ ఎంటర్‌ప్రైజ్ విలువను 6.9 బి. డాలర్లుగా పరిగణిస్తూ, 750 మి. డాలర్లను గ్రోక్ సమీకరించింది. బ్లాక్‌రాక్, శాంసంగ్, సిస్కో, ఆల్టిమీటర్, డొనాల్డ్ ట్రంప్ జూనియర్ భాగస్వామిగా ఉన్న 1789 క్యాపిటల్ ఈ పెట్టుబడుల్లో పాల్గొన్నాయి.

- గ్రోక్‌కు చెందిన క్లౌడ్ వ్యాపారం మినహా మిగతా అన్ని ఆస్తులనూ ఎన్‌విడియా కొనుగోలు చేయనుందని డేవిస్ తెలిపారు.
- గతంలో ఎన్‌విడియా చేసిన అతిపెద్ద కొనుగోళ్లను పరిశీలిస్తే, 2019లో మెలనాక్స్‌ను 7 బి. డాలర్లతో సొంతం చేసుకుంది.

శాంసంగ్ ఇండియా ఐపీఓ లేనట్లే

- ఎలక్ట్రానిక్స్‌కూ వడ్డీలేని రుణాలు
- మొబైల్ డిస్‌ప్లే తయారీకి సన్నాహాలు



దక్షిణ కొరియా ఎలక్ట్రానిక్స్ దిగ్గజ సంస్థ, శాంసంగ్ ఎలక్ట్రానిక్స్ తన భారత వ్యాపారాన్ని స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు చేసే ఆలోచన ప్రస్తుతానికైతే లేదని స్పష్టం చేసింది. తన అన్ని ఉత్పత్తుల్లో కృత్రిమ మేధ (ఏఐ)ను అందిపుచ్చుకోవడంతో పాటు, విక్రయాలు పెంచుకునేందుకు వినియోగదారు రుణ విభాగాన్ని మరింత విస్తరించాలని భావిస్తున్నట్లు తెలిపింది. శాంసంగ్ ఆగ్నేయాసియా ప్రెసిడెంట్, సీఈఓ జేబీ పార్క్ మాట్లాడుతూ 'భారత్‌లో తయారీని మరింత విస్తృతం చేయాలనుకుంటున్నాం. ఇక్కడ మొబైల్ ఫోన్ డిస్‌ప్లే తయారీ నిమిత్తం ,ఉత్పత్తి అనుసంధానిత ప్రోత్సాహక (పీఎల్ఐ) పథకానికి దరఖాస్తు చేసుకున్నామ'ని తెలిపారు. భారత విభాగాన్ని పబ్లిక్ ఇష్యూకు తెచ్చే అవకాశాలపై ప్రశ్నించగా..'లేదు. ఇప్పటికైతే అటువంటి ప్రణాళికలేమీ లేవు' అని స్పష్టం చేశారు. కార్పొరేట్ బాండ్లు, సంస్థాగత రుణాల ద్వారా నిధులు సమీకరిస్తామని అన్నారు.

40% స్మార్ట్‌ఫోన్ కొనుగోళ్లు రుణంపైనే

వడ్డీలేని రుణాలను గృహోపకరణాలకూ అందించాలని శాంసంగ్ భావిస్తున్నట్లు పార్క్ తెలిపారు. ప్రస్తుతం స్మార్ట్‌ఫోన్లను వడ్డీ రహిత నెలవారీ సులభ వాయిదాల్లో కొనుగోలు చేసుకునే అవకాశాన్ని సంస్థ కల్పిస్తోంది. మొత్తం స్మార్ట్‌ఫోన్ల విక్రయాల్లో 40 శాతానికి పైగా రుణం పైనే కొంటున్నారని పార్క్ తెలిపారు. ఇకపై ఎల్ఈడీలు, వాషింగ్ మెషీన్లు, రిఫ్రిజిరేటర్ల వంటి వాటికీ ఈ సదుపాయాన్ని కల్పించాలనుకుంటున్నట్లు వివరించారు.

ఏఐ ఉత్పత్తులను జనవరిలో పరిచయం చేస్తాం

తమ ఉత్పత్తుల్లో ఏఐ (కృత్రిమమేధ) వినియోగాన్ని మరింత పెంచుతామని పార్క్ వివరించారు. ఏఐతో పనిచేసే ఎయిర్‌డ్రెసర్, లాండ్రీ కాంబో, విండ్‌ఫ్రీ ప్రో ఎయిర్ కండీషనర్, జెట్ బాట్‌స్టీమ్ అల్ట్రా రోబో వాక్యూమ్‌లను జనవరి 4న లాస్ వేగాస్‌లో ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. టీవీ టెక్నాలజీలోనే వినూత్నలను అదేరోజు ప్రదర్శిస్తామన్నారు. ఏఐ ఆవిష్కరణల కోసం భారత్‌లోని 3 పరిశోధనా కేంద్రాల్లో 10,000 మంది ఇంజినీర్లను శాంసంగ్ నియమించుకుందని.. వీరు భారత్-అంతర్జాతీయ విపణులకు సొల్యూషన్లు అందిస్తున్నారని తెలిపారు.

దేశంలో లక్షకు మించి పెట్రోల్ పంపులు

ప్రపంచంలోనే మనకు మూడో స్థానం



దేశీయంగా పెట్రోల్, డీజిల్ వినియోగానికి తగినట్లుగా, వాటి విక్రయ కేంద్రాల సంఖ్య అధికమవుతోంది. గత దశాబ్దకాలంలోనే దేశంలోని పెట్రోల్ పంపుల సంఖ్య రెట్టింపైందని చమురు మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ ఏడాది నవంబరు చివరికి 1,00,266 పెట్రోల్ పంపులున్నాయని.. 2015లో ఈ సంఖ్య 50,451 మాత్రమేనని వెల్లడించింది. వాహన కొనుగోళ్లు భారీగా పెరిగినందున, గ్రామీణ ప్రాంతాలతో పాటు జాతీయ రహదారుల వెంబడి పెట్రోల్ పంపుల విస్తరణ అధికమవుతోంది.

అమెరికా, చైనా తరవాత మనదేశమే

అధికంగా పెట్రోల్ పంపులను కలిగిన దేశాల్లో అమెరికా (1,96,643), చైనా (1,15,228) తర్వాత మన దేశమే ఉంది.

- దేశీయంగా ప్రభుత్వరంగ సంస్థలైన ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ), భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్), హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్) ఆధ్వర్యంలోనే 90% పైగా పెట్రోల్ పంపులున్నాయి. ప్రైవేట్ రంగ సంస్థల్లో రష్యాకు చెందిన రాస్‌నెఫ్ట్ అనుబంధ సంస్థ నయారా ఎనర్జీ లిమిటెడ్ 6,921, రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ - బీపీ సంయుక్తంగా 2,114, షెల్ 346 పెట్రోల్ పంపులను నిర్వహిస్తున్నాయి.
- 2003-04లో 27 పెట్రోల్ పంపులతో మనదేశంలో ప్రైవేట్ సంస్థల కార్యకలాపాలు ఆరంభమయ్యాయి. 2015లో మొత్తం 50,451 పెట్రోల్ పంపుల్లో ప్రైవేటువి 2,967 (5.9%), కాగా.. ప్రస్తుతం వాటి వాటా 9.3 శాతానికి పెరిగింది.

దేశంలో ఐఓసీకే అధిక పంపులు

మన దేశంలో అత్యధికంగా 41,664 పెట్రోల్ పంపులను ఐఓసీ, 24,605 కేంద్రాలను బీపీసీఎల్, 24,418 పంపులను హెచ్‌పీసీఎల్ నిర్వహిస్తున్నాయి.

- మొత్తం పంపుల్లో గ్రామీణ ప్రాంతాల వాటా దశాబ్దం క్రితం 22% కాగా.. ఇప్పుడు 29 శాతానికి పెరిగింది. ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా పెట్రోల్, డీజిల్‌తో పాటు సీఎన్‌జీ, ఈవీ ఛార్జింగ్ సదుపాయాలను కూడా ఈ కేంద్రాల్లో ఏర్పాటు చేస్తున్నారు.

ట్రాక్టర్.. హుషారు

- జోరుగా అమ్మకాలు
- అధిక వర్షాలు, జీఎస్‌టీ రేట్ల సవరణతో..



ఈనాడు, హైదరాబాద్: ట్రాక్టర్ల తయారీ కంపెనీల్లో అమ్మకాల కళ కనిపిస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్- నవంబరులో ట్రాక్టర్ల టోకు అమ్మకాల్లో 19.2% వృద్ధి సాధ్యమైంది. ఇదే విభాగంలో 2024 నవంబరుతో పోల్చితే, గత నెలలో ట్రాక్టర్ల అమ్మకాలు 30.1% పెరగడం ఆసక్తికర విషయం. రిటెయిల్ విభాగంలో ఇంకా అధికంగా 56.5% పెరుగుదల కనిపిస్తోంది. రుతుపవనాలు ఆశావహంగా ఉండటం, అధిక సాగు విస్తీర్ణం, ఆకర్షణీయ పంట దిగుబడులు.. ట్రాక్టర్ల అమ్మకాలు పెరగడానికి వీలుకల్పించినట్లు తెలుస్తోంది ఈ ఏడాది నైరుతీ రుతుపవనాల వల్ల సాధారణ స్థాయి కంటే 108% అధికంగా వర్షాలు పడ్డాయి. అంతేగాకుండా జీఎస్‌టీ రేట్లు సవరించడం కూడా దీనికి మరొక కారణంగా చెబుతున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి నవంబరు నెలాఖరు వరకూ దేశీయంగా 8,19,998 ట్రాక్టర్ల అమ్మకాలు నమోదయ్యాయి. ఎంతో అధికంగా అక్టోబరు నెలలో 1,66,145 ట్రాక్టర్ల విక్రయాలు జరిగాయి. జూన్, సెప్టెంబరు మాసాల్లో అమ్మకాలు లక్షకు మించాయి. నవంబరులో ఆకర్షణీయంగా 92,745 ట్రాక్టర్ల విక్రయాలు నమోదయ్యాయి.

పిల్లల కలలకు భరోసా



'మా పిల్లల చదువు కోసం మేము ఎంతైనా కష్టపడతాం'.. అని తల్లిదండ్రులు మనస్ఫూర్తిగా చెబుతుంటారు. కేవలం ఇలా ఆలోచిస్తేనే సరిపోతుందా? దీనికోసం ఏం చేయాలి? అనేదీ ముఖ్యమే కదా.. దీనికి బీమా రక్షణా తోడవ్వాలి. సాధారణంగా మ్యూచువల్ ఫండ్లు, స్థిరాస్తి, పీఎఫ్ వంటి సంప్రదాయ పెట్టుబడులు సంపదను పెంచేందుకు తోడ్పడతాయి. కానీ, ఇవి పెట్టుబడి పెట్టే వ్యక్తి జీవించి ఉన్నంత కాలమే కొనసాగుతాయి. ఒకవేళ తల్లిదండ్రులకు అనుకోనిదేమైనా జరిగితే, ఆ పెట్టుబడులు నిలిచిపోయి పిల్లల కలలు ఆగిపోయే ప్రమాదం ఉంది. మరి దీనికి పరిష్కారం ఏమిటి?

జీవితంలో అనిశ్చితి ఎప్పుడూ వెంటాడుతూనే ఉంటుంది. దీన్ని తట్టుకునేందుకు తగిన రక్షణను ఏర్పాటు చేసుకోవడమే మనం చేయాల్సిన పని. ఇలాంటి పరిస్థితులను ఎదుర్కొనేందుకు పిల్లల బీమా పాలసీలు ఒక చక్కని పరిష్కారంగా చెప్పొచ్చు. ఇది సాధారణ బీమా పథకాలకు భిన్నమైంది. పాలసీదారుడు (తల్లిదండ్రులు) లేకపోయినా, పిల్లల కోసం నిర్దేశించిన పొదుపు లక్ష్యం దెబ్బతినకుండా బీమా కంపెనీయే బాధ్యత తీసుకుంటుంది.

పిల్లల ఉన్నత చదువులు, పెళ్లి, వారు సొంతంగా వ్యాపారం ప్రారంభించుకునేందుకు అవసరమైన ఆర్థిక అవసరాల కోసం ఈ పథకాలను బీమా సంస్థలు ప్రత్యేకంగా రూపొందించాయి. తల్లిదండ్రులు పొదుపు చేసేందుకు వీలు కల్పించడంతోపాటు, లైఫ్ కవర్‌నూ అందిస్తాయి. ఒకవేళ బీమా చేసిన వ్యక్తి మరణిస్తే, తక్షణమే నిర్ణీత మొత్తాన్ని (సమ్ అష్యూర్డ్) నామినీకి అందిస్తారు. ఈ పాలసీ ఇక్కడితో ముగిసిపోదు. బీమా సంస్థే మిగిలిన ప్రీమియాలను చెల్లిస్తూ, ఆ పాలసీని కొనసాగిస్తుంది. దీనివల్ల పాలసీ వ్యవధి తీరిన తర్వాత నామినీగా ఉన్న పిల్లలకు మరోసారి పెద్ద మొత్తంలో నిధులు అందుతాయి. జీవితంలో కీలక దశల్లో పిల్లలకు అవసరమైనప్పుడు డబ్బు అందుబాటులో ఉంటుంది.

✦ పాలసీదారుడు, పాలసీ తీసుకునేటప్పుడే డబ్బు ఎప్పుడు అందాలి అనేది నిర్ణయించుకోవచ్చు. అమ్మాయి/అబ్బాయికి 15 ఏళ్లు వచ్చినప్పుడు కొంత, 18 ఏళ్లప్పుడు మరికొంత, 21 ఏళ్లకు చేరాక నిధులు అందేలా ఏర్పాటు చేసుకోవచ్చు. ఈ పాలసీల్లో 'ప్రీమియం రద్దు' అనేది అత్యంత ముఖ్యం. ఈ రైడర్ ఉంటే పాలసీదారుడు మరణించిన సందర్భంలో సంస్థే భవిష్యత్తు ప్రీమియాలను చెల్లిస్తూ, పిల్లల భవిష్యత్తుకు భరోసా కల్పిస్తుంది.

రెండు రకాలుగా..

✦ సంప్రదాయ ఎండోమెంట్ తరహాలో ఉండే పథకాల్లో రాబడి స్థిరంగా ఉంటుంది. సురక్షిత సాధనాల్లో మదుపు చేస్తాయి కాబట్టి, మార్కెట్ నష్ట భయం లేకుండా స్థిరమైన వృద్ధిని కోరుకునే వారికి ఇవి అనువైనవి.

✦ స్టాక్ మార్కెట్ ఆధారంగా పనిచేసే యూనిట్ లింక్డ్ ఇన్సూరెన్స్ ప్లాన్లు (యులిప్)లు దీర్ఘకాలం కోసం ఎంచుకోవచ్చు. కనీసం 10-15 ఏళ్ల వ్యవధి ఉన్నప్పుడు ఇవి మంచి రాబడిని అందిస్తాయి. పాలసీ వ్యవధి తీరే కొన్నేళ్ల ముందు ఇందులోనే ఉండే డెట్ ఫండ్లలోకి ఆ మొత్తాన్ని మార్చుకోవడం ద్వారా లాభాలను కాపాడుకోవచ్చు. ఏ రకం పాలసీ తీసుకున్నా, ప్రీమియం రద్దు సౌకర్యం ఉండేలా చూసుకోవడం తప్పనిసరి.

ఎప్పుడు తీసుకోవాలి?

పెరుగుతున్న విద్యా ఖర్చుల నేపథ్యంలో.. బిడ్డ పుట్టిన వెంటనే పిల్లల బీమా పాలసీని తీసుకోవడం శ్రేయస్కరం. తొందరగా ప్రారంభిస్తే, తక్కువ ప్రీమియంతో ఎక్కువ నిధిని జమ చేయొచ్చు. ప్రస్తుతం దేశంలో విద్యా ద్రవ్యోల్బణం ఏటా 10-12 శాతం వరకూ ఉంటోంది. ఇలా పెరుగుతున్న వ్యయాలను భరించాలంటే క్రమానుగతంగా, క్రమశిక్షణతో మదుపు చేయడం ఎంతో అవసరం. ఇది తల్లిదండ్రులను విద్యా రుణాల భారం నుంచి కాపాడుతుంది.

టర్మ్.. సరిపోదా?

అనుకోనిదేమైనా జరిగినప్పుడు పరిహారం ఇచ్చే టర్మ్ ఇన్సూరెన్స్ కుటుంబ పెద్ద పేరుమీద ఉండాల్సిందే. దీనికి తోడుగా మ్యూచువల్ ఫండ్లలో మదుపు చేయడమూ అవసరం. ఇవన్నీ ఉన్నప్పటికీ.. పిల్లల చదువులకు ఒక నమ్మకమైన భద్రతను కల్పించాలి. చైల్డ్ ఇన్సూరెన్స్ పాలసీల్లో నుంచి నగదును దశల వారీగా తీసుకోగలం. ఈ క్రమశిక్షణ వల్లే ఇవి భరోసా కల్పించే పథకాలుగా పేరు తెచ్చుకున్నాయి. సాధారణ పాలసీలతో పోలిస్తే, వీటికి ప్రీమియం కాస్త అధికమే. కానీ, ఎలాంటి పరిస్థితులు వచ్చినా, మీ పిల్లల ఆర్థిక అవసరాలకు ఇబ్బంది లేదు అనే నిశ్చింతను కలిగిస్తాయి.

సిరి

siri@eenadu.net

క్రెడిట్ స్కోరు లేదు.. రుణం ఇస్తారా?

నేను ప్రభుత్వ ఉపాధ్యాయుడిని. నా వయసు 56. నేను ఇప్పుడు టర్మ్ పాలసీ తీసుకునేందుకు వీలుందా? ఆరోగ్య బీమా ఇస్తారా? ఎలాంటి పాలసీలు తీసుకోవాలి? - సోమేశ్వర రావు

మీరు ఇప్పుడూ టర్మ్ పాలసీ, ఆరోగ్య బీమా తీసుకునేందుకు వీలుంది. పాలసీ ఇచ్చేముందు బీమా సంస్థలు వైద్య పరీక్షలు చేస్తాయి. వీటి ఆధారంగానే పాలసీ ఇవ్వాలా? వద్దా? అనేది కంపెనీలు నిర్ణయిస్తాయి. జీవిత బీమా పాలసీని కనీసం 10 ఏళ్ల వ్యవధికి తీసుకోండి. రూ.10 లక్షల వరకూ ఆరోగ్య బీమా పాలసీని ఎంచుకోండి.

నేను ప్రభుత్వ ఉద్యోగిని. ఇప్పటి వరకూ ఎలాంటి క్రెడిట్ కార్డు, రుణాలూ తీసుకోలేదు. కాబట్టి, సిబిల్ స్కోరు లేదు. ఇప్పుడు ఇంటి రుణం తీసుకోవాలని అనుకుంటున్నాను. ఏమైనా ఇబ్బందులు వస్తాయా? - ఎం.ప్రవీణ్ కుమార్

రుణాలు లేనప్పుడు క్రెడిట్ స్కోరు ఉండే అవకాశం ఉండకపోవచ్చు. కానీ, దీనివల్ల పెద్దగా ఇబ్బందేమీ లేదు. మీరు కొనే ఇంటి విలువలో 80-85 శాతం వరకూ రుణం వచ్చే అవకాశం ఉంది. కొన్ని బ్యాంకులు అధికంగానూ ఇచ్చేందుకు వీలుంది. మీ నికర ఆదాయంలో 35 శాతానికి మించి నెలవారీ వాయిదాలు లేకుండా చూసుకోండి.

నేను అమెరికాలో ఉంటున్నాను. నాకు ఇప్పటికే డీమ్యాట్ ఖాతా ఉంది. అందులోనే నా పెట్టుబడులు కొనసాగించేందుకు వీలుందా? - వాసు

మీరు డీమ్యాట్ ఇక్కడ ఉన్నప్పుడే తీసుకున్నారనుకోండి. అప్పుడు రెసిడెంట్ కేవైసీ ద్వారా ఖాతా ప్రారంభం అవుతుంది. ఇప్పుడు అమెరికాలో ఉంటున్నారు కాబట్టి, ఎన్ఆర్ఐ కిందకు మారుతుంది. మీరు నాన్ రెసిడెంట్ కింద కేవైసీ చేయాల్సి ఉంటుంది. అప్పుడే డీమ్యాట్ ఖాతా ద్వారా లావాదేవీలు చేసుకోవచ్చు. మీరు పెట్టిన పెట్టుబడులను తిరిగి అమెరికా తీసుకెళ్లాలి అంటే, ఎన్ఆర్ఈ ఖాతా ద్వారా, లేదనుకుంటే, ఎన్ఆర్ఓ ఖాతా నుంచి పెట్టుబడులు పెట్టాలి.

- తుమ్మ బాల్‌రాజ్, సర్టిఫైడ్ ఫైనాన్షియల్ ప్లానర్

సరిహద్దులు లేకుండా సంపద సృష్టి

మనం ఉదయం నుంచి రాత్రి వరకూ అనేక రకాల ఉత్పత్తులు, సేవలను వినియోగిస్తుంటాం. ఇందులో కొన్ని బహుళ జాతి సంస్థలవీ ఉంటాయి. మన జేబు నుంచి డబ్బులు ఖర్చు చేసి, ఈ కంపెనీల ఆదాయన్ని పెంచుతున్నాం సరే. మరి వాటిలో లాభాలు ఎందుకు తీసుకోవద్దు? కేవలం భారతీయ మార్కెట్లకే పరిమితం కాకుండా, భౌగోళిక సరిహద్దులకు అవతల పెట్టుబడి పెట్టేందుకు అందుబాటులో ఉన్న మార్గమే అంతర్జాతీయ ఈటీఎఫ్ (ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్)లు. వీటి గురించి తెలుసుకుందామా..

అంతర్జాతీయ ఈటీఎఫ్‌లలో మరో ప్రత్యేకత ఉంది. సాధారణంగా దీర్ఘకాలంలో డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ క్షీణిస్తూ వస్తోంది. ఉదాహరణకు అమెరికా ఆధారిత ఈటీఎఫ్‌లో మదుపు చేశారనుకుందాం. ఒకవేళ స్టాక్ విలువ పెద్దగా పెరగకపోయినా, డాలర్ విలువ పెరిగితే, రూపాయి రూపంలో మీ పెట్టుబడి వృద్ధి చెందినట్లే. ఇలా స్టాక్ మార్కెట్ లాభాలతోపాటు, మారకం విలువలోని వ్యత్యాసం నుంచీ అదనపు రాబడిని అందుకునే అవకాశం ఉంది.

విదేశీ షేర్లలో పెట్టుబడి అంటే, విదేశీ బ్రోకరేజీ ఖాతా ప్రారంభించాలి, డాలర్లలో డబ్బులు పంపాలి అనే భయం అవసరం లేదు. మన దేశంలో ఉన్న సాధారణ డీమ్యాట్ ఖాతా ద్వారానే, దేశీయ కంపెనీల షేర్లను, ఈటీఎఫ్‌లను కొన్నంత సులభంగా వాటిలోనూ పెట్టుబడి పెట్టొచ్చు.



పెట్టుబడి సూత్రాల్లో ప్రధానమైనది ఒకే చోట మొత్తం డబ్బు మదుపు చేయొద్దు.. అంటే మన పెట్టుబడిని వివిధ పథకాలు, రకాలుగా విస్తరించాలి. చాలా మంది మదుపరులు తమ డబ్బును కేవలం భారతీయ స్టాక్ మార్కెట్లోనే పెడుతుంటారు. ఇది మంచిదే. కానీ, విదేశీ మార్కెట్లు మనకన్నా కొన్నిసార్లు బాగా రాణించే అవకాశం ఉంది. ఇలాంటప్పుడు మీ పోర్ట్‌ఫోలియోలో కొంత భాగం విదేశీ ఈటీఎఫ్‌లలో ఉంటే, అక్కడి లాభాలనూ సొంతం చేసుకునే వీలుంటుంది.

భారతీయ స్టాక్ మార్కెట్లో అనేక బలమైన రంగాలున్నాయి. కానీ, కృత్రిమ మేధ (ఏఐ), సెమీ కండక్టర్లు, విద్యుత్ కార్లు, వినోదం, సామాజిక వేదికలు తదితర అధునాతన రంగాల్లో అగ్రగామిగా ఉన్న సంస్థలు ఎక్కువగా అమెరికా, తైవాన్ వంటి దేశాల్లో ఉన్నాయి. భవిష్యత్తులో ఇలాంటి సాంకేతికతలదే హవా కాబట్టి, ఆయా రంగాల వృద్ధి ఫలాలను అందుకోవాలంటే ఇంటర్నేషనల్ ఈటీఎఫ్‌లనూ పరిశీలించాల్సిన అవసరం ఉంది.

జాగ్రత్తగా ఉండాలి..

అంతర్జాతీయ మార్కెట్లో పెట్టుబడి ఆకర్షణీయంగా ఉన్నప్పటికీ, ఇందులో కొన్ని సవాళ్లూ ఉంటాయి.

▸ ఏప్రిల్ 1, 2023 తర్వాత కొనుగోలు చేసిన ఇంటర్నేషనల్ ఈటీఎఫ్‌లను పన్ను పరంగా డెట్ ఫండ్లుగా పరిగణిస్తున్నారు. అంటే, మీకు వచ్చిన లాభం ఎంతైనా సరే, అది మీ వార్షికాదాయానికి కలిపి చూపించాలి. మీరు ఉన్న ఆదాయపు పన్ను శ్లాబు ప్రకారం పన్ను చెల్లించాల్సి వస్తుంది.

▸ డాలరు విలువ పెరిగితే లాభం అని అనుకున్నాం కదా! భారత ఆర్థిక వ్యవస్థ బలపడి, రూపాయి విలువ పెరిగితే, మీ విదేశీ పెట్టుబడి తగ్గే అవకాశం లేకపోలేదు.


▸ దేశీయ ఈటీఎఫ్‌లతో పోలిస్తే, ఇంటర్నేషనల్ ఈటీఎఫ్‌లలో ట్రేడింగ్ అంత చురుగ్గా ఉండకపోవచ్చు. మార్కెట్ పడుతున్నప్పుడు వెంటనే వీటిని విక్రయించాలంటే, సరైన ధరకు కొనుగోలుదారులు దొరక్కపోవచ్చు.

▸ అమెరికా మార్కెట్లు మన రాత్రి వేళలో పనిచేస్తాయి. దీనివల్ల మన మార్కెట్ వేళలో చూపించే ఈటీఎఫ్ ధరకూ, దాని వాస్తవ విలువకు మధ్య చిన్నపాటి తేడాలుండే అవకాశం ఉంది.

ప్రపంచం కుగ్రామంగా మారుతున్న తరుణంలో పెట్టుబడులనూ విస్తరించాలి. మీ మొత్తం పెట్టుబడిలో కనీసం 10-15 శాతం వరకూ అంతర్జాతీయ ఈటీఎఫ్‌లకు కేటాయించొచ్చని ఆర్థిక నిపుణులూ సూచిస్తున్నారు. కనీసం 5 ఏళ్లకు మించి పెట్టుబడిని కొనసాగించాలనే లక్ష్యం ఉన్నప్పుడే వాటిలో మదుపు చేయాలి.

'తర్వాత చూద్దాం'.. ఈ మాట మనం చాలా సందర్భాల్లో వాడుతూనే ఉంటాం. మిగతా విషయాల్లో ఎలా ఉన్నా.. ఆర్థిక ప్రణాళికల విషయంలో ఇది ఎంతమాత్రం సరికాదు. పెట్టుబడులు పెట్టడం, బీమా పాలసీలు తీసుకోవడం ఇలాంటి పనులు చూద్దాం అని వాయిదా వేస్తే, దీర్ఘకాలంలో పెద్ద మొత్తంలో ఆర్థిక నష్టాలను ఎదుర్కోవాల్సి వస్తుంది.

వాయిదా వేయొద్దు



ఆర్థిక పరమైన నిర్ణయాలను సకాలంలో తీసుకోకపోవడం అంటే, మీ సంపదను హరించే శత్రువుతో సహవాసం చేస్తున్నట్లే. పదవీ విరమణ ప్రణాళిక, జీవిత, ఆరోగ్య బీమా పాలసీలను తీసుకోవడం వంటి కీలక పనులను వాయిదా వేయడం వల్ల మీ భవిష్యత్తుకు భరోసా తగ్గుతుంది. క్రెడిట్ కార్డు బిల్లులు, ఫోన్ బిల్లులు లేదా నెలవారీ వాయిదాలు సకాలంలో చెల్లించకపోవడం వల్ల అపరాధ రుసుములు చెల్లించాల్సి వస్తుంది. అంతేకాకుండా, మీ క్రెడిట్ స్కోరూ దెబ్బతింటుంది. వాయిదా అనే అలవాటును అధిగమించినప్పుడే ఆర్థిక క్రమశిక్షణ పెరుగుతుంది.

సాధారణంగా ఆర్థిక పనులను వాయిదా వేసేందుకు అనేక కారణాలుంటాయి. సరైన ఆర్థిక ఉత్పత్తులను ఎంచుకోవడంలో అవగాహన లేకపోవడం, ఖర్చులపై నియంత్రణ ఉండకపోవడం, సమయం విలువను గుర్తించకపోవడం లాంటివి మనల్ని అడుగు ముందుకు వేయనివ్వవు.

పెట్టుబడులను వాయిదా వేయడం వల్ల ప్రధాన నష్టం ఏమిటో తెలుసా? చక్రవడ్డీ ప్రయోజనాన్ని కోల్పోవడం. చిన్న వయసు నుంచే పెట్టుబడులను ప్రారంభించి, వీలైనంత ఎక్కువ కాలం కొనసాగిస్తే.. లాభాలు ఎంతో బాగుంటాయి.

ఉదాహరణకు.. 25 ఏళ్ల వ్యక్తి నెలకు రూ.10వేలు మదుపు చేయడం ప్రారంభించాడనుకుందాం. 12 శాతం సగటు వార్షిక రాబడి అంచనాతో అతనికి 50 ఏళ్లు వచ్చే నాటికి చేతిలో రూ.1.88 కోట్లు ఉంటాయి. అదే మరో వ్యక్తి 35 ఏళ్ల నుంచి అంతే మొత్తం పెట్టుబడి పెట్టడం మొదలు పెట్టారనుకోండి.. 50 ఏళ్లు వచ్చే నాటికి రూ.49.96 లక్షలే చేతికి వస్తాయి. అంటే, పదేళ్ల ఆలస్యం విలువ దాదాపు రూ.1.38 కోట్లు. కాబట్టి, ఖర్చులను వాయిదా వేయడం వల్ల పెద్ద నష్టమేమీ ఉండదు. మదుపును ఆలస్యం చేస్తే, అనర్థం ఎక్కువగానే ఉంటుంది.

గతంలో మీరు ఏయే సందర్భాల్లో ఆర్థిక విషయాలను ఆలస్యం చేశారు, వాయిదా వేశారో ఒక జాబితా రాసుకోండి. దానివల్ల ఇప్పుడు ఎంత నష్టం ఎదురయ్యిందనేది లెక్క తీయండి. మీ కష్టార్జితం వృథా కాకుండా ఉండాలంటే, ప్రతి రూపాయి విలువనూ గుర్తించి, క్రమశిక్షణతో ప్రణాళికలు రచించుకోవాలి.

✦ బీమా పాలసీలు ముఖ్యంగా టర్మ్, ఆరోగ్య బీమా పాలసీలను చిన్న వయసులో, పూర్తి ఆరోగ్యంతో ఉన్నప్పుడే తీసుకోవడం మేలు. వయసు పెరుగుతున్న కొద్దీ ప్రీమియం భారం అవుతుంది. ఒక్కసారి అనారోగ్యం వస్తే, ఆరోగ్య బీమా పాలసీ ఇచ్చేందుకు బీమా సంస్థలు అనేక షరతులు విధిస్తాయి.

✦ బిల్లుల చెల్లింపులన్నింటినీ 'ఆటోమేట్' చేయండి. బ్యాంకు ఖాతా నుంచి నేరుగా డబ్బులు వెళ్లిపోతాయి కాబట్టి, గడువు మర్చిపోతామనే భయం ఉండదు. ఆ తేదీల్లో మీ ఖాతాలో తగినంత సొమ్ము ఉండేలా చూసుకోవడం తప్పనిసరి.

దీర్ఘ కాలిక పెట్టుబడి కోసం

డీఎస్‌పీ మ్యూచువల్ ఫండ్ కొత్తగా రెండు పథకాలను ఆవిష్కరించింది. ఈ రెండూ నిఫ్టీ పథకాలే కావడం గమనార్హం. ఇందులో ఒకటి డీఎస్‌పీ నిఫ్టీ 500 ఇండెక్స్ ఫండ్, మరోటి డీఎస్‌పీ నిఫ్టీ నెక్ట్స్ 50 ఈటీఎఫ్ పథకం. ఈ రెండూ పాసివ్ పెట్టుబడి విధాన పథకాలు కావడం ప్రత్యేకత. ఈ పథకాల ఎన్ఎఫ్ఓ ముగింపు తేదీ ఈ నెల 30. డీఎస్‌పీ నిఫ్టీ 500 ఇండెక్స్ ఫండ్ ఎన్ఎఫ్ఓలో కనీసం రూ.100 పెట్టుబడి పెట్టాలి. ఇది నిఫ్టీ 500 ఇండెక్స్‌లోని లార్జ్, మిడ్, స్మాల్ క్యాప్ తరగతులకు చెందిన షేర్లను పెట్టుబడి కోసం ఎంచుకుంటుంది. డీఎస్‌పీ నిఫ్టీ నెక్ట్స్ 50 ఈటీఎఫ్ పథకంలో కనీస పెట్టుబడి రూ.5,000. దీన్ని నిఫ్టీ నెక్ట్స్ 50 ఈటీఎఫ్ సూచీ ఆధారంగా నిర్వహిస్తారు. నిఫ్టీ 100లోని 51 నుంచి 100 వరకూ ఉన్న షేర్లు ఈ సూచీలో ఉంటాయి. ఈ రెండు పథకాలూ దీర్ఘకాలిక మదుపరులకు అనువుగా ఉంటాయి. డీఎస్‌పీ నిఫ్టీ నెక్ట్స్ 50 ఈటీఎఫ్‌లో హెచ్చుతగ్గులు కొంత అధికంగా ఉండవచ్చు. మదుపరులు దీనికి సిద్ధపడాలి.

రాబడి రక్షణ 2026లో ఎటువైపు?



కాలచక్రంలో మరో ఏడాది కరిగిపోతోంది. త్వరలోనే 2026లోకి అడుగుపెట్టబోతున్నాం. సాధారణంగా ఈ సమయంలో అందరూ అడిగే ప్రశ్న ఒకటే.. ఏ మ్యూచువల్ ఫండ్‌లో మదుపు చేయాలి? ఏ షేర్లు కొంటే లాభం వస్తుంది? అని. కానీ, ఆర్థిక నిపుణుల సూచన ఏమిటంటే.. పెట్టుబడి ఎక్కడ పెట్టాలి అనేదానికన్నా, ముందుగా మీ నష్టభయం భరించే సామర్థ్యం గురించి తెలుసుకోవడం ముఖ్యం. ఈ కింది 10 ప్రశ్నలకు ముందుగా సమాధానాలు ఎంచుకోండి.. ఆ తర్వాత మీకు ఎలాంటి పెట్టుబడి పథకాలు నప్పుతాయన్నది తెలుసుకోవచ్చు.

1) మీ వయసు?

ఎ) 50 ఏళ్ల పైన.
బి) 35-50 మధ్య.
సి) 25-35 ఏళ్ల లోపు.

2) మీ కుటుంబ బాధ్యతలు?

ఎ) నామీద ఆధారపడిన వారు చాలా ఎక్కువ (జీవిత భాగస్వామి, పిల్లలు, తల్లిదండ్రులు). నా ఆదాయమే ముఖ్యం.
బి) కొంతమందే ఉన్నారు (జీవిత భాగస్వామి, పిల్లలు).
సి) నా మీద ఎవరూ ఆధారపడి లేరు (జీవిత భాగస్వామి, పిల్లలూ సంపాదిస్తున్నారు).

3) మీ పెట్టుబడి కాలపరిమితి?

ఎ) వచ్చే 1-2 ఏళ్లలోనే డబ్బు తిరిగి కావాలి.
బి) 3-5 ఏళ్ల వరకూ అవసరం లేదు.
సి) 7-10 ఏళ్లపైన కొనసాగిస్తాను.

4) మార్కెట్ పతనం సందర్భాల్లో మీ స్పందన?

ఎ) నా పెట్టుబడి విలువ 10 శాతం తగ్గితే ఆందోళన చెందుతా.
బి) ఆందోళన ఉంటుంది. కానీ, నిపుణుల సహాయం తీసుకుంటా.
సి) మార్కెట్ పడినప్పుడు, కొనుగోలుకు మంచి అవకాశంగా భావిస్తా.

5) మీ ప్రస్తుత ఆర్థిక పరిస్థితి?

ఎ) ఎలాంటి అత్యవసర నిధి లేదు. ఉద్యోగం పోతే ఇబ్బందే.
బి) 3 నెలల ఖర్చులకు సరిపోయే డబ్బుంది.
సి) 6 నెలలకు పైగా అత్యవసర నిధి, సొంతంగా ఆరోగ్య బీమా ఉంది.

6) పెట్టుబడి పథకాలపై మీ అవగాహన?

ఎ) ఫిక్స్‌డ్ డిపాజిట్లు, బంగారం తప్ప వేరేవి తెలియవు.
బి) మ్యూచువల్ ఫండ్లు, సిప్ గురించి ప్రాథమిక అవగాహన ఉంది.
సి) స్టాక్ మార్కెట్, ఈక్విటీ, బాండ్ల గురించి పూర్తిగా తెలుసు.

7) మీ ప్రాధాన్యం ఏమిటి?

ఎ) రాబడి తక్కువైనా పర్లేదు. నా అసలు డబ్బు సురక్షితంగా ఉండాలి.
బి) ద్రవ్యోల్బణాన్ని జయించే రాబడి వస్తే చాలు.
సి) నాకు గరిష్ఠ రాబడి రావాలి. నష్టం వచ్చినా తట్టుకుంటాను.

8) మీ ఆదాయంలో మిగులు ఎంత?

ఎ) నెలాఖరుకు జీతం మొత్తం ఖర్చయిపోతుంది. పొదుపు చేయడం కష్టం.
బి) ఖర్చులు పోను నెలకు 10-20 శాతం పక్కకు పెట్టగలను.
సి) నా అవసరాల కంటే నా ఆదాయం చాలా ఎక్కువ. 30శాతం పైనే పొదుపు చేయగలను.

9) గత అనుభవాలు?

ఎ) గతంలో షేర్ మార్కెట్లో డబ్బు పోగొట్టుకున్నాను లేదా ఎప్పుడూ పెట్టలేదు.
బి) మ్యూచువల్ ఫండ్లలో కొంచెం పెట్టుబడి పెట్టాను. బాగానే ఉందనిపించింది.
సి) ఎన్నో ఏళ్లుగా మార్కెట్లో మదుపు చేస్తున్నాను. లాభనష్టాలు చూశాను.

10) ప్రస్తుత అప్పులు?

ఎ) అప్పులు ఎక్కువ. జీతంలో సగం వాయిదాలకే పోతోంది.
బి) గృహరుణం ఉంది. ఇబ్బందేమీ లేదు.
సి) ఎలాంటి అప్పులూ లేవు.

మీరు ఎంచుకున్న సమాధానాలను బట్టి, 2026లో మీ వ్యూహం ఇలా ఉండాలి..

సమాధానాల్లో ఎక్కువగా 'ఎ' ఉంటే..

మీరు రక్షణాత్మక విధానంలో మదుపు చేయాలి. మీకు ఆర్థిక ప్రశాంతత ముఖ్యం. నష్టభయం ఉన్న పథకాలకు దూరంగా ఉండాలి.

✦ ఫిక్స్‌డ్ డిపాజిట్లు, ప్రజా భవిష్య నిధి (పీపీఎఫ్), వీపీఎఫ్, కొంత మేరకు బాండ్లకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఈక్విటీల జోలికి వెళ్లకండి.

'బి'లు ఎక్కువగా ఉంటే.. అప్పుడు

మీరు సమతుల్య మదుపరి. అతిగా ఆశపడరు. అలాగని తక్కువ రాబడి ఇష్టముండదు.

✦ హైబ్రిడ్ ఫండ్లు, లార్జ్ క్యాప్ ఫండ్లలో మదుపు చేయొచ్చు. నష్టభయం, రాబడిని సమతుల్యం చేసుకోవడం ముఖ్యం.

అధికంగా 'సి'లు ఉంటే...

మీరు దూకుడు స్వభావం గల పెట్టుబడిదారులు. నష్టం భరించేందుకూ సిద్ధం. దీర్ఘకాలిక సంపద మీ లక్ష్యం.

✦ మిడ్ క్యాప్, స్మాల్ క్యాప్ ఫండ్లను ఎంచుకోవచ్చు. కొంత మొత్తాన్ని నేరుగా మంచి పనితీరున్న షేర్లలోనూ మదుపు చేయొచ్చు. మార్కెట్ పతనాన్ని తట్టుకోగలరు. కాబట్టి, ఆందోళన చెందరు.

2026లో మీ ఆర్థిక ప్రయాణం విజయవంతంగా సాగాలని 'సిరి' కోరుకుంటోంది.

అనుకోని అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరినప్పుడు, ఆరోగ్య బీమా పాలసీ ఉంటే ఆందోళన ఉండదు. ఈ పాలసీ ఉన్నప్పటికీ, ఆసుపత్రి నగదు రహిత చికిత్సకు నిరాకరిస్తే.. ఏం చేయాలి? బీమా సంస్థ నుంచి చికిత్స మొత్తాన్ని ఎలా రాబట్టుకోవాలి తెలుసుకుందాం..

నగదు రహిత చికిత్సకు నిరాకరిస్తే..



బీమా సంస్థలు, ఆసుపత్రుల మధ్య నెలకొన్న కొన్ని వివాదాల నేపథ్యంలో కొన్నిచోట్ల నగదు రహిత చికిత్సకు ఇబ్బందులు ఎదురయ్యాయి. బీమా సంస్థలు ఇప్పటికే సమస్యను పరిష్కరించినట్లు చెబుతున్నాయి. ఎప్పుడైనా ఇలాంటి పరిస్థితి ఎదురైతే చికిత్స ఖర్చును చెల్లించడం రోగులకు పెద్ద సవాలే. సాధారణంగా నగదు రహిత చికిత్స కింద నెట్‌వర్క్ ఆసుపత్రులలో చేరినప్పుడు బీమా సంస్థలే నేరుగా బిల్లులను చెల్లిస్తాయి. ఇది పాలసీదారులకు పెద్ద ఉపశమనం.

భారతీయ బీమా నియంత్రణ, అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఐఆర్‌డీఏఐ) 'క్యాష్‌లెస్ ఎవ్రీవేర్' అనే పథకాన్ని రెండేళ్ల క్రితమే ప్రారంభించింది. నెట్‌వర్క్ ఆసుపత్రి కాకపోయినా నగదు రహిత చికిత్సకు అవకాశం కల్పించడమే దీని లక్ష్యం. అయినప్పటికీ, కొన్నిసార్లు ఇది అమలు జరగడం లేదు.

అత్యవసర సమయంలో క్యాష్‌లెస్ సదుపాయం లేకపోయినా వైద్యం నిరాకరించేందుకు వీల్లేదు. కానీ, బిల్లు చెల్లించి, ఆ మొత్తాన్ని బీమా సంస్థ నుంచి తిరిగి పొందాల్సి ఉంటుంది.

క్యాష్‌లెస్ చికిత్సకు అంగీకరించకపోతే

● ఆసుపత్రిలోని టీపీఏ డెస్క్ వద్ద నగదు రహిత చికిత్స నిరాకరణకు గల కారణాలను లిఖితపూర్వకంగా లేదా ఇ-మెయిల్ ద్వారా ఇవ్వాల్సిందిగా కోరండి.

● బీమా సంస్థ లేదా టీపీఏ సేవా కేంద్రానికి ఫోన్ చేయండి. ఏం చేయాలన్నది వారు సూచనలు ఇస్తారు.

● చికిత్స ఇంకా ప్రారంభం కాకపోతే, వేచి చూసేందుకు వీలుంటే, బీమా సంస్థ నెట్‌వర్క్ ఆసుపత్రికి వెళ్లేందుకు ప్రయత్నించండి.

ఇలా చేయొచ్చు...

తప్పనిసరి పరిస్థితుల్లో బిల్లు చెల్లించాల్సి వస్తే, మీ పొదుపు మొత్తాన్ని లేదా అత్యవసర నిధిని వాడుకోండి. క్రెడిట్ కార్డుల ద్వారా బిల్లు చెల్లించి, దాన్ని ఈఎంఐగా మార్చుకోవచ్చు. కొన్ని ఆసుపత్రులతో బ్యాంకింగేతర రుణ సంస్థలు ప్రత్యేక ఒప్పందాన్ని కుదుర్చుకొని, అక్కడే రుణాలను అందిస్తున్నాయి. ఇలాంటి వాటినీ పరిశీలించవచ్చు. ఇందులో సున్నా శాతం వడ్డీకి అప్పులిచ్చే సంస్థలూ ఉంటాయి.

● ఇంటికి వచ్చిన వెంటనే క్లెయిం దాఖలు చేయండి. ఐఆర్‌డీఏఐ నిబంధనల ప్రకారం, బీమా సంస్థలు ఇలాంటి క్లెయింలను 30 రోజుల్లోగా పరిష్కరించాలి. క్లెయింతోపాటు వైద్య పరీక్షల నివేదికలు, డిశ్చార్జి నివేదిక, మందుల వివరాలు.. ఇలా ప్రతి పత్రాన్నీ అందించాలి. వాటి నకళ్లను మీ వద్ద జాగ్రత్తగా పెట్టుకోండి.

● బీమా సంస్థ ఏదైనా వివరణ కోరితే, 48-72 గంటల్లోగా లిఖితపూర్వకంగా సమాధానం ఇవ్వండి.

క్లెయిం రాకపోతే..

● ముందుగా బీమా సంస్థ ఫిర్యాదుల పరిష్కార విభాగాన్ని సంప్రదించండి. వారు 15 రోజుల్లోగా పరిష్కారం చూపాలి.

● బీమా సంస్థ మీ క్లెయింను 30 రోజుల్లోగా పరిష్కరించకపోయినా, తిరస్కరించినా, బీమా అంబుడ్స్‌మన్‌ను సంప్రదించవచ్చు.

● అవసరాన్ని బట్టి, వినియోగదారుల కోర్టులను ఆశ్రయించేందుకు వీలుంటుంది.

వైద్య అత్యవసర సమయాల్లో ఆందోళన చెందకూడదు. ముందస్తు ఆర్థిక సన్నద్ధత, బీమా పాలసీలపై సరైన అవగాహన కలిగి ఉండటమే మిమ్మల్ని ఆదుకుంటుంది.

ఈనాడు సినిమా


ప్రభాస్

రాజే యువరాజే..

'ది రాజాసాబ్' చిత్రంతో సంక్రాంతికి వినోదాలు పంచనున్నారు ప్రభాస్. ఆయన హీరోగా నటించిన ఈ పాన్ ఇండియా సినిమాని మారుతి తెరకెక్కించారు. టీజీ విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించారు. నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ కథానాయికలు. సంజయ్ దత్ ముఖ్య పాత్ర పోషించారు. ఈ సినిమా జనవరి 9న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలోనే గురువారం క్రిస్మస్ సందర్భంగా ఈ చిత్రం నుంచి "రాజే యువరాజే.. కొలిచేటి తొలి ప్రేమికుడే" అనే పాట ప్రోమోను విడుదల చేశారు. దీనికి సంబంధించిన పూర్తి పాటను త్వరలో విడుదల చేయనున్నారు. హారర్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా ముస్తాబైన ఈ సినిమాలో ప్రభాస్ రెండు భిన్న గెటప్పుల్లో అలరించనున్నారు. ఈ సినిమాకి సంగీతం: తమన్, ఛాయాగ్రహణం: కార్తీక్ పళని.

కడుపుబ్బా నవ్వులతో..



'మత్తు వదలరా 2' విజయం తర్వాత నటుడు సత్య. . దర్శకుడు రితేశ్ రానా కలయికలో రూపొందుతున్న కొత్త చిత్రం 'జెట్లీ'. మైత్రీ మూవీ మేకర్స్ సమర్పణలో చిరంజీవి, హేమలత పెద్దమల్లు నిర్మిస్తున్నారు. రియా సింఘా కథానాయిక. ఈ సినిమాలో వెన్నెల కిశోర్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఆయన పాత్రకు సంబంధించిన ఫస్ట్‌లుక్‌ను గురువారం విడుదల చేశారు. అందులో తను విమానం విండో సీట్ దగ్గర కూర్చొని స్టైలిష్ హెయిర్ స్టైల్‌తో.. చేతిలో సినిమా సుడోకు అనే పుస్తకంతో ఫన్నీగా కనిపించారు. "ఇది వినూత్నమైన కథ.. రితేశ్ మార్క్ వినోదంతో నిండి ఉన్న చిత్రంగా ముస్తాబవుతోంది. తప్పకుండా ప్రేక్షకుల్ని కడుపుబ్బా నవ్విస్తుంది" అని చిత్ర బృందం తెలిపింది. ఈ సినిమాకి సంగీతం: కాల భైరవ, ఛాయాగ్రహణం: సురేశ్ సారంగం.

దక్షిణాదిలో నటించడం ఓ వరంలా భావిస్తా

ప్రేక్షకుల దృష్టిలో ఉండటం వృత్తిలో ఒక భాగం.. అది ఆ ఉద్యోగ స్వభావమని అంటోంది అందాల తార మృణాల్ ఠాకూర్. పాత్రల ఎంపికలో ప్రత్యేకత.. సహజమైన నటనతో అభిమానుల్ని మెప్పించే కథానాయికీమె. ఇటీవలే అజయ్ దేవగణ్‌తో కలిసి 'సన్ ఆఫ్ సర్దార్ 2' చిత్రంతో ప్రేక్షకుల్ని పలకరించింది. ప్రస్తుతం భాషతో సంబంధం లేకుండా వరుస ప్రాజెక్టులతో బిజీగా గడుపుతోన్న మృణాల్.. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొని తన సినీప్రయాణం గురించి కొన్ని ఆసక్తికర సంగతుల్ని పంచుకుంది.


మృణాల్ ఠాకూర్

"ఈ మధ్య నేను దేని గురించి పెద్దగా ఆలోచించడం లేదు. నా వృత్తే నా లోకం. పనిపై మాత్రమే దృష్టి పెడుతున్నా. సినిమాలకు ఒకే చెప్తున్నా.. డబ్బింగ్ పూర్తి చేస్తున్నా. ఇదే నా ప్రపంచం. మరికొద్ది రోజుల్లో కొత్త ఏడాదికి స్వాగతం చెప్పబోతున్నాం. 2025 నాకు ప్రయోగాత్మక సంవత్సరం. యాక్షన్ థ్రిల్లర్ నేపథ్యంలోని 'డెకాయిట్', రొమాంటిక్ జానర్‌లో రూపొందిన 'హై జవానీ తో ఇష్క్ హోనా' లాంటి పలు వైవిధ్యమైన జానర్లను ప్రయత్నించాను. సినిమా సెట్స్‌లో ఉండడం నాకు బాధ్యతలా అనిపిస్తుంది. నువ్వు ఏ దశలో ఉన్నావని మీరు అడిగితే.. ఇప్పుడిప్పుడే ఒకొక్క అడుగు వేస్తూ ముందుకు వెళ్తున్నానని చెప్తా".

కేవలం భాషా వ్యత్యాసమే


"కొన్నేళ్లుగా దక్షిణాదిలో, బాలీవుడ్‌లో మంచి అవకాశాలను అందుకుంటున్నా. ఈ రెండు ప్రపంచాల మధ్య ఉత్తమమైన వాటిని ఆస్వాదిస్తాను.. తప్పా సరిహద్దుల గురించి పట్టించుకో. కేవలం ఇదొక భాషా వ్యత్యాసం మాత్రమే. చిత్రీకరణ కొంచెం భిన్నంగా ఉంది. రెండు పరిశ్రమల్లో షూటింగ్ చేయగలగడం.. ఎక్కువ మంది ప్రేక్షకులకు మంచి చిత్రాల్ని అందించడం నాకు సంతోషంగా ఉంది. తెలుగు ప్రేక్షకులు నాపై చూపించే ప్రేమాభిమానాలకు నేను ఎప్పుడూ రుణపడి ఉంటాను. అయితే దక్షిణాది చిత్రాల్లో నటించడమనేది నా ప్రణాళికలో లేదు. కనీసం ఎప్పుడూ అనుకోని విషయం ఇది. కానీ ఈ అవకాశాన్ని ఒక వరంలా భావిస్తాను".

ఇతరుల కోసం పోస్ట్ చేయను

"సాధారణంగా నటీనటులందరూ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు, ఫొటోలు పెట్టడానికి ప్రత్యేక టీమ్‌ను పెట్టుకుంటారు. నేను అలా కాదు. అలాగే ఎప్పుడు కూడా నా ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను పోస్టులతో ప్రజాదరణ పొందడానికి, లైక్‌లు, ఫాలోయింగ్ పెంచుకోవడానికి ఒక సాధనంగా పరిగణించలేదు. ఇతరుల కోసం పోస్ట్ చేయను. నా కోసం నేను పోస్ట్ చేస్తాను. ప్రేక్షకులకు దగ్గరగా ఉండే మార్గాల్లో ఇదీ ఒకటి. ఇది నాకు ఒక జ్ఞాపకాల మ్యూజియం లాంటిది. నా ప్రొఫైల్‌ను చూసే అభిమానులు నన్ను నిజమైన వ్యక్తిగా చూడాలని కోరుకుంటున్నా. ఇతరులు ఏమనుకుంటున్నారో పట్టించుకోకుండా.. మన పనిని కొనసాగించాలనే సూత్రాన్ని అనుసరిస్తాను".

భర్త మహాశయులారా..

రవితేజ కథానాయకుడిగా కిశోర్ తిరుమల తెరకెక్కించిన చిత్రం 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'. సుధాకర్ చెరుకూరి నిర్మించారు. ఆషికా రంగనాథ్, డింపుల్ హయాతి కథానాయికలు. ఈ సినిమా సంక్రాంతి సందర్భంగా జనవరి 13న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే గురువారం క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ చిత్రం నుంచి కొత్త లుక్‌ను విడుదల చేశారు. అందులో రవితేజ శాంటా క్యాప్ ధరించి చిరునవ్వులు చిందిస్తూ కనిపించారు. ఇది వినోదం నిండిన కుటుంబ కథా చిత్రంగా ముస్తాబైంది. ఈ సినిమాకి సంగీతం: భీమ్స్ సిసిరోలియో, ఛాయాగ్రహణం: ప్రసాద్ మూరెళ్ల.


రవితేజ

'గత వైభవం' చూసేది ఆరోజే


ఆషిక, దుష్యంత్

ఆషికా రంగనాథ్, ఎస్ఎస్ దుష్యంత్ జంటగా సునీ తెరకెక్కించిన చిత్రం 'గత వైభవం'. ఇది ప్రైమ్ షో ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ ద్వారా జనవరి 1న ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు గురువారం ప్రకటించారు. 'పురాణం, చరిత్ర, ప్రేమ, పునర్జన్మ లాంటి అంశాలతో మిళితమైన ఫాంటసీ చిత్రమిది. ఈ కథ నాలుగు భిన్న కాలాల్లో సాగుతుంటుంది. ఇప్పటికే కన్నడలో విడుదలై ఆదరణ దక్కించుకున్న ఈ సినిమా తెలుగు ప్రేక్షకుల్ని అలరిస్తుందని నమ్మకముంది" అని చిత్ర వర్గాలు తెలిపాయి. ఈ సినిమాకి సంగీతం: జుడా శాండీ, ఛాయాగ్రహణం: విలియం జె.డేవిడ్.

ఈషా లక్ష్యంగా వ్యతిరేక ప్రచారం

- ఆవేదన వ్యక్తం చేసిన చిత్రబృందం


తమ 'ఈషా' సినిమాను లక్ష్యంగా చేసుకుని సామాజిక మాధ్యమాల్లో కొంతమంది వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేశారు చిత్ర సమర్పకుడు కె.ఎల్.దామోదర్ ప్రసాద్. త్రిగుణ్, అఖిల్‌రాజ్, హెబ్బా పటేల్, సిరి హనుమంతు ప్రధాన పాత్రధారులుగా... శ్రీనివాస్ మన్నె దర్శకత్వంలో తెరకెక్కిన 'ఈషా' గురువారమే ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఆన్‌లైన్ టికెట్ విక్రయ వేదికతోపాటు, ఇతర సామాజిక మాధ్యమాల్లోనూ కొంతమంది సినిమాపై వ్యతిరేక ప్రచారం చేస్తున్నారని ఆరోపిస్తూ చిత్రబృందం విలేకర్ల సమావేశాన్ని నిర్వహించింది. సినిమాని విడుదల చేసిన వంశీ నందిపాటి మాట్లాడుతూ "ఒక మంచి సినిమాని ఇలా దెబ్బ తీయాలనుకోవడం దారుణం. సినిమాకు మంచి వసూళ్లు దక్కుతున్నాయి. అయినా సరే, కొంతమంది డబ్బు ఖర్చు చేసి మరీ వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నారు. కొంతమంది సినిమాని చూడకుండానే సామాజిక మాధ్యమాల్లో వ్యతిరేక అభిప్రాయాల్ని వెలిబుచ్చుతున్నారు. ఎవరెన్ని చేసినా మా సినిమా విజయాన్ని అడ్డుకోలేరు" అన్నారు. కేఎల్ దామోదర్‌ప్రసాద్ మాట్లాడుతూ "సామాజిక మాధ్యమాల్లో ఇలాంటి మాఫియా ఎదగడం చిత్ర పరిశ్రమలో ఎవరికీ మంచిది కాదు. కావాలని సినిమాని కిందకు లాగుతున్న ఎవ్వరినీ వదిలిపెట్టం. ఒక చిన్న చిత్రానికి ఇలాంటి వసూళ్లు మాకెంతో సంతోషాన్నిస్తోంది" అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మాత బన్నీ వాస్, చిత్ర నిర్మాత హేమ వెంకటేశ్వరరావుతోపాటు ఇతర చిత్రబృందం పాల్గొంది.



బన్నీ వాస్, వంశీ నందిపాటి, కె.ఎల్.దామోదర్‌ప్రసాద్, శ్రీనివాస్ మన్నె, హేమ వెంకటేశ్వరరావు

'జైలర్ 2'లో షారుక్ ఖాన్

మాఫియా, ప్రతీకార నేపథ్యం, కుటుంబ అంశాల మేళవింపుగా రూపొంది ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకున్న చిత్రం 'జైలర్'. దీనికి కొనసాగింపుగా 'జైలర్ 2' వస్తోన్న సంగతి తెలిసిందే. అగ్రహీరో రజనీకాంత్ ప్రధాన పాత్రలో నెల్సన్ దిలీప్ కుమార్ తెరకెక్కిస్తున్నారు. ఇందులో బాలీవుడ్ కథానాయకుడు షారుక్ ఖాన్ అతిథి పాత్రలో మెరవనున్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. ఇప్పుడు వీటన్నింటినీ ధృవీకరిస్తూ.. ఈ సినిమా గురించి మాట్లాడారు సీనియర్ నటుడు మిథున్ చక్రవర్తి. "జైలర్ 2' భారీ స్థాయిలో రానుంది. ఇందులో షారుక్ ఖాన్, మోహన్‌లాల్, రమ్యకృష్ణ, శివ రాజ్‌కుమార్ అతిథి పాత్రల్లో కనిపించనున్నార"ని అన్నారు. ప్రస్తుతం 'కింగ్' సినిమా చిత్రీకరణలో బిజీగా ఉన్నారు షారుక్ ఖాన్.


షారుక్ ఖాన్

టైగర్ వర్సెస్ లక్ష్య


టైగర్ ష్రాఫ్


లక్ష్య


బాలీవుడ్ యాక్షన్ హీరో టైగర్ ష్రాఫ్, యువ కథానాయకుడు లక్ష్య ముఖాముఖీ యుద్ధానికి సన్నద్ధమవుతున్నారు. వీరిద్దరూ ప్రధాన పాత్రల్లో 'లగ్ జా గేల్' అనే చిత్రంలో నటిస్తున్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. రాజ్‌మెహతా దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఇందులోని ఓ పాటను 100మందికి పైగా ప్రొఫెషనల్ డ్యాన్సర్లతో చిత్రీకరిస్తున్నట్లు సమాచారం. "ఈ రివేంజ్ యాక్షన్ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలవనుందీ గీతం. ఇటీవలే ఈ పాట చిత్రీకరణ కూడా ప్రారంభించారు. గణేశ్ ఆచార్య నృత్య దర్శకత్వం వహిస్తున్న ఈ పాటలో టైగర్, లక్ష్య మధ్య డ్యాన్స్ తెరపై అదరగొట్టేలా ఉంటుంది. రెండు పాత్రల మధ్య పోటీ కేవలం స్టంట్స్ ద్వారానే కాకుండా డ్యాన్స్ నంబర్‌లో కూడా చూపించొచ్చని నిరూపిస్తుందీ గీతం" అని టైగర్ సన్నిహిత వర్గాలు తెలిపాయి.

యాక్షన్‌కు రెడీ


హవీశ్

హవీశ్ కథానాయకుడిగా... త్రినాథరావు నక్కిన దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'నేను రెడీ'. కావ్య థాపర్ కథానాయిక. నిఖిల కోనేరు నిర్మాత. ఒకపక్క చిత్రీకరణ, మరోవైపు నిర్మాణానంతర పనుల్ని సమాంతరంగా చేసుకొంటున్న ఈ సినిమాలోని కథానాయకుడి యాక్షన్ అవతారంలోని పోస్టర్‌ని గురువారం విడుదల చేసింది చిత్రబృందం. నవ్వుల్ని కురిపించే చిత్రాల్ని తీయడంలో పేరున్న త్రినాథరావు నక్కిన... భిన్న కోణాలున్న పాత్రలో హవీశ్‌ని చూపిస్తున్నారని సినీ వర్గాలు తెలిపాయి. నవ్వించే పాత్రలో హవీశ్ చేసే సందడి ఇంటిల్లిపాదికీ నచ్చేలా ఉంటుందని స్పష్టం చేశాయి. బ్రహ్మానందం, శ్రీలక్ష్మి, వెన్నెల కిశోర్, మురళీశర్మ, వీటీవీ గణేశ్, గోపరాజు రమణ, హరితేజ, మహతి తదితరులు నటిస్తున్నారు.

2026లో రెట్టింపు నవ్వులు


అక్షయ్

బాలీవుడ్ అగ్రహీరో అక్షయ్ కుమార్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'వెల్‌కమ్ టు ది జంగిల్'. అహ్మద్ ఖాన్ తెరకెక్కిస్తున్నారు. దిశా పటానీ, జాక్వెలిన్ ఫెర్నాండెజ్, రవీనా టాండన్, సంజయ్ దత్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుతూ.. తాజాగా ఈ సినిమా నుంచి ఇన్‌స్టా వేదికగా ఓ వీడియోను పంచుకున్నారు అక్షయ్. "నేను ఇంత భారీ ప్రాజెక్టులో ఎప్పుడూ భాగం కాలేదు. అద్భుతమైన బహుమతిని మీకు అందించడానికి ఆసక్తిగా ఎదురుచూస్తున్నాం. షూటింగ్ పూర్తయింది. 2026లో థియేటర్లలో రెట్టింపు నవ్వులు పంచడానికి రాబోతున్నామ"నే వ్యాఖ్యల్ని జోడించారు.

కొత్త ఏడాదిలో ప్రేమ ముచ్చట్లు


అలియా భట్

వైవిధ్యమైన కథలతో ప్రేక్షకుల్ని అలరిస్తుంటుంది అందాల తార అలియా భట్. ప్రస్తుతం ఆమె ఖాతాలో 'లవ్ అండ్ వార్' సినిమా ఉన్న సంగతి తెలిసిందే. ఆమె, రణ్‌బీర్ కపూర్ జంటగా నటిస్తున్న చిత్రమిది. ప్రముఖ దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వం వహిస్తున్నారు. విక్కీ కౌశల్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుగుతోన్న సంగతి తెలిసిందే. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్‌లుక్‌ను జనవరిలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. "కొత్త సంవత్సరం సందర్భంగా ప్రేక్షకులకు అలియా ప్రేమ ప్రపంచాన్ని పరిచయం చేయాలనే ఆలోచనలో ఉంది చిత్రబృందం. త్వరలో చివరి షెడ్యూల్ చిత్రీకరణ ప్రారంభం కానుంద"ని చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి. రొమాంటిక్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమా వచ్చే ఏడాది థియేటర్లలోకి రానుంది.

మీ కోసమే ఈ ట్రెండ్ మామ


'హ్యాపీ పటేల్: ఖతర్నాక్ జాసూస్'

బాలీవుడ్ అగ్రహీరో ఆమిర్ ఖాన్ నిర్మాణంలో రూపొందుతున్న చిత్రం 'హ్యాపీ పటేల్: ఖతర్నాక్ జాసూస్'. వీర్‌దాస్ హీరోగా నటిస్తూ.. దర్శకత్వం వహిస్తున్నారు. జనవరి 16న రానుందీ సినిమా. ఈ నేపథ్యంలోనే ప్రచార కార్యక్రమాల్ని పరుగులు పెట్టిస్తోంది చిత్రబృందం. ఇందులో భాగంగానే తాజాగా ఈ సినిమా నుంచి 'బందా తేరే లియే..' అంటూ సాగే ప్రత్యేక గీతాన్ని సామాజిక మాధ్యమాల వేదికగా విడుదల చేసింది చిత్రబృందం. ఇందులో వీర్‌దాస్ తన ప్రియురాలిని మెప్పించడానికి హుక్ స్టెప్పులు వేస్తూ సినీప్రియుల్ని ఆకట్టుకుంటున్నారు. 'ఈ రోజు నేను మీ కోసం కొత్త ట్రెండ్‌ను సెట్ చేశాను మామ..' అంటూ సాగుతున్న ఈ గీతంలో వీర్‌దాస్ సరసన మిథిలా పాల్కర్ మెరిసింది. ఈ స్పై యాక్షన్ కామెడీలో ఆమిర్ ఖాన్ అతిథి పాత్రలో మెరవనున్నారు.

ప్రాక్టీస్ బిట్స్ — చరిత్ర

1. ఆంధ్రలో స్వదేశీ ఉద్యమం వ్యాప్తి చేసింది ఎవరు?
 1) గాడిచర్ల హరిసర్వోత్తమ రావు 2) గొల్లపూడి సీతారామారావు 3) అయ్యదేవర కాళేశ్వరరావు 4) పైవారంతా
2. స్వదేశీ ఉద్యమం సమయంలో ఆంధ్రలో పర్యటించినవారు?
 1) బాలగంగాధర్ తిలక్ 2) బిపిన్ చంద్రపాల్ 3) అరవింద ఘోష్ 4) లాలా లజపతిరాయ్
3. స్వదేశీ ఉద్యమ సమయంలో రవీంద్రనాథ్ ఠాగూర్ రాసిన గేయం?
 1) జనగణమన 2) వందేమాతరం 3) అమర్ సోనార్ బంగ్లా 4) పైవన్నీ
4. పుణెకు చెందిన గోపాలరావు దేశ్‌ముఖ్ ఎలా వ్యవహరించేవారు?
 1) లోకహితవాది 2) లోక రక్షకుడు 3) లోకమాన్య 4) పైవన్నీ
5. స్వదేశీ ఉద్యమాన్ని మహారాష్ట్రలో నిర్వహించినవారు?
 1) తిలక్ 2) బిపిన్ చంద్రపాల్ 3) 1, 2 4) గోఖలే
6. 'విదేశీ వస్తు బహిష్కరణ ద్వారా చైనా, అమెరికన్ ప్రభుత్వాన్ని కళ్లు తెరిపించిన దృష్టాంతం చరిత్రలో కనిపిస్తుంది కదా'... అనే వాక్యాన్ని ప్రచురించిన పత్రిక ఏది?
 1) మరాఠా పత్రిక 2) కేసరి పత్రిక 3) నవజీవన్ పత్రిక 4) సంజీవని పత్రిక

సమాధానాలు: 1-4; 2-2; 3-3; 4-1; 5-1; 6-2.

దరఖాస్తు చేశారా?
- యూసీఐఎల్‌లో 107 పోస్టులు — చివరి తేదీ: 31.12.2025
- ఎన్‌ఐఐఎస్‌టీలో సైంటిస్ట్ ఖాళీలు — చివరి తేదీ: 28.12.2025

హక్కుల రక్షణకు అత్యున్నత వేదిక!

జనరల్ స్టడీస్ — ఇండియన్ పాలిటీ

ధర్మం ఎక్కడ ఉంటే విజయం అక్కడ ఉంటుంది అనే వాక్యానికి అసలైన అర్థంగా భారత సుప్రీంకోర్టు తన అధికారాలను, విధులను నిర్వర్తిస్తోంది. దేశ ప్రజాస్వామ్య భవనానికి న్యాయవ్యవస్థ పటిష్ఠమైన పునాది అయితే, ఆ వ్యవస్థకు కిరీటం ఈ అత్యున్నత న్యాయస్థానం. చట్టాల అన్వయాన్ని పరిశీలించే వేదికగా మాత్రమే కాకుండా, రాజ్యాంగ సంరక్షణలో, ప్రాథమిక హక్కుల కాపలాలో శిఖరాగ్ర సంస్థగా వ్యవహరిస్తోంది. ఏకీకృత న్యాయవ్యవస్థలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య తలెత్తే వివాదాలను పరిష్కరిస్తోంది. రాజ్యాంగ వివరణలో తుది నిర్ణయాన్ని ప్రకటిస్తోంది. దశాబ్దాల కాలంలో ఎన్నో సంచలనాత్మక తీర్పుల ద్వారా దేశ సామాజిక, రాజకీయ ముఖచిత్రాన్ని ప్రభావితం చేసింది. కార్యనిర్వాహక, శాసన వ్యవస్థలు తమ పరిధిని అతిక్రమిస్తే అప్రమత్తమైన నియంత్రణదారుగా, బలహీనులకు అన్యాయం జరిగినప్పుడు ఆశాకిరణంగా నిలుస్తోంది. దేశ పరిపాలన చట్టబద్ధంగా, రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా జరిగే విధంగా చేస్తున్న ఆ విశిష్ట ధర్మపీఠం అధికారాలు, విధుల గురించి పోటీ పరీక్షార్థులు సమగ్రంగా తెలుసుకోవాలి. వివిధ రకాల రిట్ల జారీ, న్యాయసమీక్ష తదితర మార్గాలతో ప్రభుత్వాన్ని, యంత్రాంగాన్ని అదుపు చేసే విధానం, పలు సందర్భాల్లో వెలువడిన తీర్పులపై అవగాహన కలిగి ఉండాలి.



సుప్రీంకోర్టు - అధికారాలు, విధులు

భారతదేశంలో సర్వోన్నత న్యాయస్థానం 'సుప్రీంకోర్టు'. రాజ్యాంగం ప్రకారం ఏర్పాటై, స్వయంప్రతిపత్తితో వ్యవహరిస్తూ దేశ పరిపాలన రాజ్యాంగబద్ధంగా కొనసాగడంలో కీలకపాత్ర పోషిస్తుంది. పౌరుల స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, న్యాయం తదితర ప్రజాస్వామ్య విలువల పరిరక్షణలో విస్తృత అధికారాలను కలిగి, విధులను నిర్వహిస్తుంది.

1) ప్రారంభ విచారణాధికార పరిధి (ఆర్టికల్-131)

ఏదైనా ఒక వివాదానికి సంబంధించి అప్పీళ్ల ద్వారా కాకుండా నేరుగా విచారణ జరిపే అధికారాన్ని 'ప్రారంభ విచారణాధికార పరిధి' అంటారు. సుప్రీంకోర్టు మాత్రమే నేరుగా కొన్ని వివాదాలపై విచారణ నిర్వహిస్తుంది. రాజ్యాంగబద్ధతను నిర్ణయించే అంశాలు అందులో ఉంటాయి. ◆ భారత ప్రభుత్వం 1957లో రూపొందించిన 'బొగ్గు గనుల ప్రాంతాల అభివృద్ధి చట్టం'ను వ్యతిరేకిస్తూ పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ అంశంలో కేంద్రం నిర్ణయాన్ని సమర్థిస్తూ సుప్రీంకోర్టు తొలిసారిగా తన ప్రారంభ విచారణాధికార పరిధిని వినియోగించింది.

2) అప్పీళ్ల విచారణాధికార పరిధి

దేశంలో అత్యున్నత అప్పీళ్ల కోర్టు సుప్రీంకోర్టు. హైకోర్టులు ఇచ్చిన తీర్పుల పట్ల అసంతృప్తి చెందినవారు సుప్రీంకోర్టులో అప్పీల్ చేసుకోవచ్చు. అందుకు సంబంధిత హైకోర్టు అనుమతి అవసరం.

ఎ) రాజ్యాంగపరమైన అప్పీళ్లు: వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు రూపొందించిన చట్టాలు రాజ్యాంగబద్ధతను ప్రశ్నించే విధంగా ఉన్నప్పుడు, రాజ్యాంగాన్ని మరింత లోతుగా వ్యాఖ్యానించాల్సి ఉందనుకున్నప్పుడు ఆర్టికల్ 132 ప్రకారం సుప్రీంకోర్టులో అప్పీల్ చేసుకోవచ్చు. **ఉదా:** ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం రూపొందించిన 'మదర్సా బోర్డు విద్యాచట్టం, 2004' రాజ్యాంగబద్ధమేనని 2024, నవంబరు 5న సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది.



బి) సివిల్ అప్పీళ్లు (ఆర్టికల్-133): ఆస్తికి సంబంధించిన సివిల్ వివాదంలో హైకోర్టు ఇచ్చిన తీర్పులో చట్టానికి సంబంధించిన లోతైన విషయాలు ఇమిడి ఉన్నాయని భావించినప్పుడు సుప్రీంకోర్టులో అప్పీల్ చేసుకోవచ్చు. **ఉదా:** బుల్డోజర్ న్యాయం పేరుతో ప్రభుత్వాలు నిందితుల కట్టడాలను కూల్చివేయడాన్ని సుప్రీంకోర్టు వ్యతిరేకించింది.

సి) క్రిమినల్ అప్పీళ్లు (ఆర్టికల్-134): వివిధ క్రిమినల్ కేసుల్లో హైకోర్టులు ఇచ్చిన తీర్పులపై సుప్రీంకోర్టులో అప్పీల్ చేసుకోవచ్చు. ❖ క్రిమినల్ కేసులో అభియోగాలు ఎదుర్కొంటున్న ఒక మైనర్‌కు బెయిల్ నిరాకరిస్తూ రాజస్థాన్ హైకోర్టు ఇచ్చిన తీర్పును 2024, ఆగస్టు 16న సుప్రీంకోర్టు రద్దు చేసింది.

డి) ప్రత్యేకమైన అప్పీళ్లు (స్పెషల్ లీవ్ పిటిషన్స్) (ఆర్టికల్-136): వివిధ కేసుల్లో హైకోర్టు ఇచ్చిన తీర్పులపై సుప్రీంకోర్టులో అప్పీల్ చేసుకోవడానికి సంబంధిత హైకోర్టు తిరస్కరిస్తే, ప్రత్యేకమైన అప్పీళ్లకు అవకాశం ఇస్తారు. హైకోర్టు ఏదైనా అంశాన్ని పరిగణనలోకి తీసుకోలేదని భావించిన సందర్భంలో సుప్రీంకోర్టులో అప్పీల్ చేయవచ్చు.

3) కోర్ట్ ఆఫ్ రికార్డ్ (ఆర్టికల్ 129)

సుప్రీంకోర్టు వివిధ కేసుల్లో ఇచ్చిన తీర్పులను రికార్డుల రూపంలో భద్రపరుస్తుంది. 'కోర్ట్ ఆఫ్ రికార్డ్'నే అనుపూర్వికాలు అని కూడా అంటారు. భవిష్యత్తులో కోర్టులు ఇచ్చే తీర్పులకు, పార్లమెంటు చేసే చట్టాలకు ఇవి మార్గదర్శకంగా ఉంటాయి. దీనిని దేశంలోని ఇతర న్యాయస్థానాలన్నీ సాక్ష్యాలుగా, ఆధారాలుగా పరిగణించాల్సి ఉంటుంది. 'కోర్ట్ ఆఫ్ రికార్డ్'ను ఉల్లంఘిస్తే కోర్టు ధిక్కార నేరంగా పరిగణిస్తారు.



4) తీర్పుల పునఃసమీక్ష అధికారం (ఆర్టికల్-137)

సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను పునఃసమీక్ష చేసుకునే అధికారం ఉంటుంది. గతంలో తాను వెలువరించిన తీర్పులకు, అభిప్రాయాలకు భిన్నంగా తీర్పులను వెలువరించవచ్చు. ✦ 1960లో బెరుబరి వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసు ✦ 1973లో కేశవానంద భారతి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ కేసు ✦ 1967లో గోలక్‌నాథ్ వర్సెస్ స్టేట్ ఆఫ్ పంజాబ్ కేసు ✦ 1973లో కేశవానంద భారతి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ కేసు. వీటిలో భిన్నమైన తీర్పులు వెలువడ్డాయి.

5) రిట్స్ జారీ అధికారం (ఆర్టికల్-32)

పౌరుల ప్రాథమిక హక్కుల పరిరక్షణ కోసం సుప్రీంకోర్టు 5 రకాల రిట్స్‌ను జారీచేస్తుంది. 1) హెబియస్ కార్పస్ 2) మాండమస్ 3) ప్రొహిబిషన్ 4) సెర్షియోరరీ 5) కోవారెంటో.

6) న్యాయ సమీక్షాధికారం

పార్లమెంటు, రాష్ట్రాల శాసనసభలు రూపొందించే చట్టాలు, ప్రభుత్వాలు జారీ చేసే ఆదేశాలు రాజ్యాంగ నియమాలకు లోబడి ఉన్నాయా? లేదా? అని 'న్యాయ సమీక్షాధికారం' ద్వారా సుప్రీంకోర్టు ప్రకటిస్తుంది. ✦ ఇందిరాగాంధీ ప్రభుత్వం 42వ రాజ్యాంగ సవరణ చట్టం-1976 ద్వారా న్యాయస్థానాలకు న్యాయ సమీక్షాధికారాన్ని పరిమితం చేసింది. మొరార్జీదేశాయ్ నేతృత్వంలోని జనతా ప్రభుత్వం 43వ రాజ్యాంగ సవరణ చట్టం-1977 ద్వారా న్యాయసమీక్షాధికారాన్ని పునరుద్ధరించింది.

7) సలహాపూర్వక అధికార పరిధి (ఆర్టికల్-143)

దీని ప్రకారం రాష్ట్రపతి రెండు సందర్భాల్లో సుప్రీంకోర్టు నుంచి న్యాయసలహా కోరవచ్చు. ఎ) చట్టానికి సంబంధించిన వివాదం లేదా ప్రజాప్రాముఖ్యం ఉన్న అంశం. బి) రాజ్యాంగం అమల్లోకి రాకముందు కుదిరిన ఒప్పందాలకు సంబంధించిన వివాదాలు.

8) రాజ్యాంగాన్ని వ్యాఖ్యానించే అధికారం

సుప్రీంకోర్టు రాజ్యాంగ అత్యున్నత వ్యాఖ్యాత. సంరక్షకురాలిగా వ్యవహరిస్తూ, రాజ్యాంగాన్ని వ్యాఖ్యానించే క్రమంలో అందులోని నిబంధనలకు తుది రూపాన్ని ఇస్తుంది.

9) ఇతర అధికారాలు, విధులు

సుప్రీంకోర్టులో ఒకేఅంశానికి సంబంధించినవి, రాష్ట్ర హైకోర్టుల్లోని ఒకే అంశానికి చెందిన వివిధ కేసులన్నింటినీ సమీకృతంచేసి విచారించవచ్చు. సుప్రీం ప్రకటించిన అంశాలు మిగిలిన కోర్టులకు శిరోధార్యం.



రచయిత: బంగారు సత్యనారాయణ

TENTH Social (Geography) — Resources and Development

1 Mark — Final Exams-2026 IMPORTANT Q & A

1. **Find the odd one out..**
 A) Wind B) Water C) Solar Energy D) Metal
 A: D) Metal (Wind, Water, and Solar Energy are renewable energy sources, while Metal is not renewable).
2. **Where was the First International Earth Summit held?**
 A: Rio de Janeiro (Brazil) in 1992.
3. **On the basis of exhaustibility, resources can be classified as**
 A) Biotic and Abiotic
 B) Renewable and Non Renewable
 C) Potential and Developed D) None of the Above
 A: B) Renewable and Non-Renewable
4. **Which type of soil is ideal for growing cotton?**
 A: Black soil (It is also known as regur soil).
5. **What should be the percentage of forest in geographical area?**
 A: 33%
6. **How did Gandhiji voice his concern about resource conservation?**
 A: Gandhiji said that the world has enough for everyone's need, but not for anyone's greed meaning resources must be used wisely and not wasted.
7. **What is the total geographical area of India?**
 A: 3.28 million sq. km (or 32.8 lakh sq. km)
8. **Expand the word UNCED**
 A: United Nations Conference on Environment and Development
9. **According to the National Forest Policy 1952, how much geographical area is desired as forest area?**
 A: 33 % of the total geographical area
10. **Find out the odd one...**
 A) Deforestation B) Over grazing
 C) Mining D) Afforestation
 A: D) Afforestation
11. **Alluvial Soils : Paddy. Black soil :: ...?**
 A: Cotton
12. **In which of the following states black soil is predominantly found?**
 A) Uttar Pradesh
 B) Rajasthan
 C) Maharashtra
 D) Jharkhand
 A: C) Maharashtra

For more IMP Q & A



Writer: KSV Krishna Reddy

ఈత చెట్టు దేవుడికి సాహిత్య అకాడమీ పురస్కారం!


ఆస్కార్ సంబరంతో మొదలైన గత మార్చి నెల భూకంప బాధిత మయన్మార్‌కు అండగా భారత్ చేపట్టిన 'ఆపరేషన్ బ్రహ్మ'తో ముగిసింది. ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ విజేతగా టీమిండియా నిలిచింది. మారిషస్, బార్బడోస్ దేశాల ప్రతిష్ఠాత్మక పురస్కారాలను ప్రధాని మోదీ అందుకున్నారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ పేరును బెంగళూరు నగర యూనివర్సిటీకి పెట్టారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రారంభించడంతో పాటు మూడు లక్షల కోట్ల రూపాయలకు పైగా అంచనాతో పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. విశాఖపట్నంలో దివ్యాంగుల జాతీయ క్రీడా సెంటర్‌ను ఏర్పాటు చేయాలని కేంద్రం నిర్ణయించింది. దివంగత చిత్రకారుడు ఎం.ఎఫ్.హుసేన్ గీసిన ఒక కళాఖండం న్యూయార్క్‌లో ఏకంగా వంద కోట్ల రూపాయలకు పైగా ధర పలికింది. అత్యంత విలువైన ఉక్కు కంపెనీగా జేఎస్‌డబ్ల్యూ ఘనత సాధించింది. ఈ విధంగా భిన్న రంగాలకు చెందిన ప్రధాన వార్తాంశాలు, ముఖ్య పరిణామాలు, వార్తల్లో నిలిచిన వ్యక్తులు, ప్రఖ్యాత అవార్డుల గ్రహీతలు, క్రీడల విజేతల వివరాలన్నింటినీ పోటీ పరీక్షార్థులు ఇంకోసారి గుర్తు చేసుకోవాలి.



ముఖ్యాంశాలు

◆ సీనియర్ న్యాయవాది మనన్ కుమార్ మిశ్రా వరుసగా ఏడోసారి బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) ఛైర్మన్‌గా ఎన్నికై వార్తల్లో నిలిచారు. మిశ్రా బిహార్ నుంచి రాజ్యసభ బీజేపీ ఎంపీగా ఉన్నారు.

◆ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇంగ్లిష్‌ను యునైటెడ్ స్టేట్స్ అధికార భాషగా చేస్తూ కార్యనిర్వాహక ఉత్తర్వుపై సంతకం చేశారు. అమెరికా చరిత్రలో ఫెడరల్ ప్రభుత్వం ఓ జాతీయ భాషను ప్రకటించడం ఇదే తొలిసారి.



అడ్రియన్ బ్రాడీ

మార్చి 3న లాస్ ఏంజెలెస్‌లోని డాల్బీ థియేటర్‌లో 97వ ఆస్కార్ అవార్డులను ప్రదానం చేశారు. 'అనోరా' చిత్రం ఉత్తమ చిత్రం, ఉత్తమ దర్శకుడు, ఉత్తమ నటి, స్క్రీన్‌ప్లే, ఎడిటింగ్ విభాగాల్లో పురస్కారాలను గెలుచుకుంది. 'ది బ్రూటలిస్ట్'లో నటనకు అడ్రియన్ బ్రాడీ ఉత్తమ నటుడిగా, 'అనోరా'లో నటనకు మైకీ మ్యాడిసన్ ఉత్తమ నటిగా పురస్కారాలు పొందారు.

◆ హరియాణాలోని గురుగ్రామ్‌లో దేశంలోనే మొదటి ప్రపంచ శాంతి కేంద్రాన్ని ప్రారంభించారు. జైన ఆచార్య లోకేష్ మార్గదర్శకత్వంలో అహింస విశ్వభారతి ఈ కేంద్రాన్ని స్థాపించింది.

◆ దివ్యాంగుల జాతీయ క్రీడా కేంద్రాన్ని (స్పోర్ట్స్ సెంటర్) విశాఖపట్నంలో ఏర్పాటు చేయాలని కేంద్రం నిర్ణయించింది.

◆ మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు నివాళిగా బెంగళూరు నగర విశ్వవిద్యాలయం పేరును డాక్టర్ మన్మోహన్ సింగ్ బెంగళూరు విశ్వవిద్యాలయంగా మార్చనున్నట్లు కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రకటించారు.

◆ ఉద్యోగినులకు వేతనంతో కూడిన ఒకరోజు నెలసరి సెలవు ఇవ్వనున్నట్లు ఎల్ అండ్ టీ ప్రకటించింది. దేశంలో ఇలాంటి సెలవును దిగ్గజ కార్పొరేట్ సంస్థ ప్రకటించడం ఇదే తొలిసారి.

◆ కొవిడ్ కాలంలో అత్యుత్తమ సేవలు, సమర్థ నాయకత్వం అందించినందుకు ప్రధాని నరేంద్ర మోదీకి బార్బడోస్ దేశం ప్రతిష్ఠాత్మకమైన 'ఆనరరీ ఆర్డర్ ఆఫ్ ఫ్రీడం ఆఫ్ బార్బడోస్' పురస్కారాన్ని ప్రకటించింది.

◆ బెంగళూరుకు చెందిన ప్రణవ్ వెంకటేష్ ప్రపంచ జూనియర్ చెస్ ఛాంపియన్‌షిప్ (అండర్ - 20) విజేతగా నిలిచాడు.

◆ మాజీ బ్యాంకర్ మార్క్ కార్నీ కెనడా తదుపరి ప్రధానమంత్రిగా ఎన్నికయ్యారు. అధికార లిబరల్ పార్టీ సమావేశంలో ప్రస్తుత ప్రధాని జస్టిన్ ట్రూడో వారసుడిగా ఈయన్ని ఎన్నుకున్నారు.

◆ విఖ్యాత సంగీత విద్వాంసులు గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ (76) మార్చి 9న తిరుపతిలో మరణించారు. రాజమండ్రిలో జన్మించిన ఈయన వెయ్యికి పైగా అన్నమయ్య కీర్తనలు స్వరపరచి ఆలపించారు.



ప్రముఖ తెలుగు రచయిత్రి తుర్లపాటి రాజేశ్వరికి 2024 సంవత్సరానికి సాహిత్య అకాడమీ అనువాద పురస్కారం లభించింది. గోపీనాథ్ మహంతి రచించిన ఒడియా నవల 'దాది బుడా'ను 'ఈత చెట్టు దేవుడు' పేరుతో తెలుగులోకి అనువదించినందుకు రాజేశ్వరికి ఈ పురస్కారం దక్కింది.

◆ బెంగళూరులో ఉన్న ఇండియన్ ఎయిర్ ఫోర్స్ (ఐఏఎఫ్) ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఏరోస్పేస్ మెడిసిన్ (ఐఏఎం)ను సందర్శించిన తొలి రక్షణ మంత్రిగా రాజ్‌నాథ్ సింగ్ నిలిచారు.

◆ ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ విజేతగా టీమిండియా నిలిచింది. మార్చి 9న దుబాయ్‌లో జరిగిన ఫైనల్లో 4 వికెట్ల తేడాతో న్యూజిలాండ్‌పై టీమిండియా నెగ్గి మూడోసారి ఛాంపియన్స్ ట్రోఫీ విజేతగా నిలిచింది.

◆ కామన్వెల్త్ గేమ్స్ ఫెడరేషన్ (సీజీఎఫ్) పేరును కామన్వెల్త్ స్పోర్ట్స్‌గా మార్చారు. మార్చి 10న కామన్వెల్త్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ ప్రకటన వెలువడింది.

◆ భారత్ టీ-72 యుద్ధ ట్యాంకుల కోసం అధునాతన 1000 హార్స్ పవర్ ఇంజిన్ల కొనుగోలుకు రష్యాకు చెందిన రోసోబోరో నెక్స్‌పోర్ట్‌తో 248 మిలియన్ డాలర్ల ఒప్పందాన్ని కుదుర్చుకుంది.

◆ హైదరాబాద్ బల్కంపేట రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో ప్రసాద్ (పీఆర్ఏఎస్ఏడీ - పిలిగ్రిమేజ్ రెజువెనేషన్ అండ్ స్పిరిచ్యువల్ ఆగ్మెంటేషన్ డ్రైవ్) పథకం కింద అభివృద్ధి పనులు చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

◆ గతంలో ఎన్నడూ లేనంత సమగ్రంగా, స్పష్టంగా మొత్తం ఖగోళ సమాచారాన్ని, చిత్రాలను మానవాళికి అందించేందుకు స్ఫియరెక్స్ టెలిస్కోప్ అబ్జర్వేటరీని నాసా మార్చి 11న అంతరిక్షంలోకి పంపింది. ఈ అబ్జర్వేటరీతో పాటు మరో నాలుగు ఉపగ్రహాలను నాసా అంతరిక్షంలోకి పంపింది. ఇవి సూర్యుడి ఉపరితల వాతావరణాన్ని అధ్యయనం చేస్తాయి.

◆ మార్చి 11న నేషనల్ ఆర్కైవ్స్ ఆఫ్ ఇండియా (ఎన్ఏఐ) 135వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భారత్ విస్తారమైన జ్ఞాన భాండాగారాన్ని విస్తరించే లక్ష్యంతో 'జ్ఞాన భారతం మిషన్'ను ప్రారంభించింది.

◆ ఇంటర్నేషనల్ ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్ (ఐఫా)లో 'లాపతా లేడీస్' చిత్రం మొత్తం 10 విభాగాల్లో పురస్కారాలు గెలుచుకుంది. ఈ చిత్ర దర్శకురాలు కిరణ్ రావు. ఉత్తమ నటిగా నితాన్షి గోయల్ (లాపతా లేడీస్), ఉత్తమ నటుడిగా కార్తిక్ ఆర్యన్ (భూల్ భులయ్యా 3) పురస్కారాలు గెలుచుకున్నారు.

◆ హైదరాబాద్ దిగ్గజ క్రికెటర్ అబిద్ అలీ మార్చి 12న మరణించారు.

◆ ఆర్థిక అవగాహన, సమ్మిళితత్వాన్ని ప్రోత్సహించడానికి ఆర్‌బీఐ, నేషనల్ సెంటర్ ఫర్ ఫైనాన్షియల్ ఎడ్యుకేషన్ (ఎన్‌సీఎఫ్ఈ) దేశవ్యాప్తంగా ఆర్థిక అక్షరాస్యత ప్రచారాలను ప్రారంభించాయి.

◆ కేంద్ర ఉన్నత విద్యా మంత్రిత్వ శాఖ పీఎం - యువ 3.0 (ప్రైమ్ మినిస్టర్స్ స్కీమ్ ఫర్ మానిటరింగ్ యంగ్ ఆథర్స్) పథకాన్ని ప్రారంభించింది. 30 సంవత్సరాల్లోపు యువ, వర్ధమాన రచయితలకు శిక్షణ ఇవ్వడం, పుస్తక సంస్కృతిని ప్రోత్సహించడం, ప్రపంచ వేదికపై భారతీయ సాహిత్యాన్ని ప్రదర్శించడం లక్ష్యాలుగా ఈ పథకాన్ని ప్రారంభించారు.



◆ ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) - 2025 విజేతగా ముంబయి ఇండియన్స్ నిలిచింది. ఫైనల్‌లో దిల్లీ క్యాపిటల్స్‌ను 8 పరుగుల తేడాతో ఓడించి రెండోసారి డబ్ల్యూపీఎల్ విజేతగా నిలిచింది.

◆ అంతరిక్షంలో రెండు ఉపగ్రహాల డాకింగ్, అన్‌డాకింగ్ సాంకేతికతలను మదింపు చేయడానికి ఇస్రో ప్రయోగించిన స్పేస్ డాకింగ్ ఎక్స్‌పరిమెంట్ (స్పేడెక్స్) విజయవంతమైంది. జనవరి 16న ఛేజర్ (ఎస్‌డీఎక్స్ 01), టార్గెట్ (ఎస్‌డీఎక్స్ 02)లను డాకింగ్ (అనుసంధానం) చేసిన ఇస్రో, 56 రోజుల తర్వాత మార్చి 13న వాటిని అన్‌డాకింగ్ (విడగొట్టడం) చేసింది. 2024, డిసెంబరు 30న ఇస్రో స్పేడెక్స్ మిషన్‌ను చేపట్టింది.

◆ హాకీ ఇండియా - 2024 అవార్డుల్లో భారత హాకీ జట్టు కెప్టెన్ హర్మన్ ప్రీత్ సింగ్ (పురుషుల విభాగం), మహిళల జట్టు గోల్ కీపర్ సవిత పూనియా(మహిళల విభాగం)లు ఉత్తమ ప్లేయర్లుగా పురస్కారాలు గెలుచుకున్నారు.

◆ 2015 నుంచి 2024 మధ్య 34 దేశాలకు చెందిన 393 విదేశీ ఉపగ్రహాలను ప్రయోగించడం ద్వారా భారత్ 143 మిలియన్ డాలర్ల విదేశీమారక ద్రవ్యం ఆర్జించినట్లు అధికారిక గణాంకాలు వెల్లడించాయి.

◆ 15వ హాకీ ఇండియా సీనియర్ ఉమెన్ నేషనల్ ఛాంపియన్‌షిప్-2025 విజేతగా హాకీ ఝార్ఖండ్ జట్టు నిలిచింది. హరియాణాలోని పంచకులలో జరిగిన ఫైనల్‌లో హాకీ హరియాణా జట్టుపై పెనాల్టీ షూటౌట్‌లో 4-3తో విజయం సాధించి హాకీ ఝార్ఖండ్ తొలిసారిగా జాతీయ ఛాంపియన్‌గా నిలిచింది.

◆ చంద్రుని ఉపరితలాన్ని మరింత లోతుగా అధ్యయనం చేయడానికి ఉద్దేశించిన చంద్రయాన్-5 మిషన్‌ను భారత ప్రభుత్వం అధికారికంగా ఆమోదించింది. జపాన్ అంతరిక్ష సంస్థ (జక్సా- జేఏఎక్స్ఏ) సహకారంతో ఈ మిషన్‌ను అమలు చేయనున్నట్లు ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్ మార్చి 16న ప్రకటించారు.

◆ నాగోర్నో - కరాబాఖ్ ప్రాంతంలో దాదాపు నాలుగు దశాబ్దాలుగా కొనసాగుతున్న సంఘర్షణకు ముగింపు పలికే లక్ష్యంతో అర్మేనియా, అజర్ బైజాన్‌లు చారిత్రాత్మక శాంతి ఒప్పందం కుదుర్చుకున్నాయి.

◆ 2028 నాటికి భారతదేశ జీడీపీ 5.7 ట్రిలియన్ డాలర్లకు పెరుగుతుందని, జర్మనీ, జపాన్‌లను అధిగమించి ప్రపంచ వ్యాప్తంగా మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారుతుందని మోర్గాన్ స్టాన్లీ అంచనా వేసింది. ప్రస్తుతం అయిదో స్థానంలో ఉన్న భారత్, 2026 నాటికి జపాన్‌ను అధిగమించి నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని పేర్కొంది.

◆ స్వయంఉపాధి, ఆర్థిక అభివృద్ధిని ప్రోత్సహించేందుకు తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తెలంగాణ శాసనసభ ఆవరణలో 'రాజీవ్ యువ వికాసం' పథకాన్ని ప్రారంభించారు.



మారిషస్ పర్యటనలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మార్చి 12న మారిషస్ అత్యున్నత పురస్కారం 'ద గ్రాండ్ కమాండ్ ఆఫ్ ద ఆర్డర్ ఆఫ్ ద స్టార్ అండ్ కీ ఆఫ్ ద ఇండియన్ ఓషన్'ను ఆ దేశ అధ్యక్షుడు ధరమ్ గోకుల్ చేతుల మీదుగా అందుకున్నారు.



న్యూదిల్లీలో జరిగిన ప్రపంచ పారా అథ్లెటిక్స్ గ్రాండ్ ప్రిక్స్ 2025లో భారత్ 45 స్వర్ణాలు, 40 రజతాలు, 49 కాంస్యాలతో కలిపి మొత్తం 134 పతకాలు గెలుచుకుంది. పతకాల పట్టికలో అగ్ర స్థానంలో నిలిచింది.

◆ దేశంలో నివారించదగిన అంధత్వాన్ని తొలగించే లక్ష్యంతో చేపట్టిన విజన్ 2020 ఇండియాకు భారత మాజీ క్రికెట్ కెప్టెన్ కృష్ణమాచారి శ్రీకాంత్ గుడ్‌విల్ అంబాసిడర్‌గా నియమితులయ్యారు.


◆ ప్రపంచంలోనే అత్యంత విలువైన ఉక్కు కంపెనీగా సజ్జన్ జిందాల్ నేతృత్వంలోని జేఎస్‌డబ్ల్యూ స్టీల్ నిలిచింది. ఈ కంపెనీ మార్కెట్ విలువ రూ.2.58 లక్షల కోట్లు(30 బి.డాలర్లు).

◆ వివిధ రంగాల్లో నిష్ణాతులైన నలుగురిని ఏపీ ప్రభుత్వం గౌరవ సలహాదారులుగా నియమించింది. ఏరోస్పేస్, డిఫెన్స్ మ్యాన్యుఫ్యాక్చరింగ్ హబ్‌కు కేంద్ర రక్షణశాఖ సలహాదారు సతీష్ రెడ్డి; చేనేత, హస్తకళల అభివృద్ధికి ప్రముఖ పారిశ్రామికవేత్త, భారత్ బయోటెక్ సంస్థ ఎండీ సుచిత్ర ఎల్ల; స్పేస్ టెక్నాలజీకి ఇస్రో మాజీ ఛైర్మన్ శ్రీధర్ పణిక్కర్ సోమనాథ్; ఫోరెన్సిక్ సైన్స్ రంగానికి ప్రముఖ ఫోరెన్సిక్ శాస్త్రవేత్త కేపీసీ గాంధీలను కేబినెట్ హోదాతో గౌరవ సలహాదారులుగా నియమించింది. వీరు రెండేళ్లు ఈ పదవుల్లో ఉంటారు.


◆ ప్రసిద్ధ చిత్రకారుడు ఎం.ఎఫ్.హుసేన్ 1950లో గీసిన 'గ్రామ యాత్ర' చిత్రం న్యూయార్క్‌లోని క్రిస్టీలో జరిగిన వేలం పాటలో రూ.118 కోట్ల ధర పలికింది. ఆధునిక భారతీయ చిత్రకళలో అతి ఖరీదైన కళాఖండంగా ఈ చిత్రం రికార్డు సృష్టించింది.

◆ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం తొలిసారి పూర్తి 12 నెలల ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌ను మార్చి 19న శాసనసభలో ప్రవేశపెట్టింది. రాష్ట్ర ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క రూ.3,04,965 కోట్లతో బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు.

◆ భూకంపాలతో కుదేలైన మయన్మార్‌కు అండగా భారత్ 'ఆపరేషన్ బ్రహ్మ' పేరుతో సైనిక రవాణా విమానంలో 15 టన్నుల సహాయక సామగ్రిని పంపించింది.



రచయిత: సీహెచ్. కృష్ణప్రసాద్





ప్రపంచంలోని పలు స్పేస్ సంస్థలతో పోటీపడుతూ భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) దూసుకెళ్తోంది. కమ్యూనికేషన్లు, నావిగేషన్, వాతావరణ అధ్యయనం లాంటి రంగాల్లో ఉపగ్రహాలు ప్రముఖపాత్ర వహిస్తాయి. అంతరిక్ష రంగంలో చోటుచేసుకుంటున్న మార్పులకు అనుగుణంగా ఇస్రో అడుగులు వేస్తోంది. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని అవసరమైన లాంచ్ ప్యాడ్‌లను తయారు చేసుకుంటోంది. గగన్‌యాన్ యాత్రకు సంసిద్ధం అవుతోంది. ఇటీవలి కాలంలో డాకింగ్, అన్‌డాకింగ్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసి అగ్రరాజ్యం, రష్యా, చైనాల సరసన నిలిచి రికార్డు సృష్టించింది.

Word of the Day 872

Negotiation

Telugu meaning: సంధి చేసుకోవడం, మాట్లాడుకోవడం

English meaning: The word negotiation (నెగోషియేషన్) is a noun that refers to a formal discussion between two or more parties in order to reach an agreement.

Synonyms: Discussion, Bargaining

Antonyms: Disagreement, Conflict

Usage: **1.** Successful negotiation between the employer and employees prevented a major strike.

2. Diplomatic negotiation played a crucial role in resolving the long-standing border issue.

అంతరిక్ష రంగ పరిశోధనలు

భద్రతా ప్రమాణాలకు దీటుగా..
ఉపగ్రహ కార్యాచరణకు అనువుగా!

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
సైన్స్ అండ్ టెక్నాలజీ

ఇస్రో మూడో ప్రయోగ వేదిక

భారత ప్రభుత్వం శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్‌లో మూడో లాంచ్ ప్యాడ్‌ను ప్రారంభించడానికి ఆమోదం తెలిపింది. దీన్ని రానున్న నాలుగేళ్లలో అభివృద్ధి చేయనున్నారు. ఇప్పటివరకు ఇస్రో ఆధ్వర్యంలో శ్రీహరికోటలోని మొదటి లాంచ్ ప్యాడ్ ద్వారా పోలార్ శాటిలైట్ లాంచింగ్ వెహికల్ (PSLV), స్మాల్ శాటిలైట్ లాంచింగ్ వెహికల్ (SSLV)లను ప్రయోగిస్తున్నారు. తమిళనాడులోని కులశేఖర పట్టణంలో సెకండ్ లాంచ్ ప్యాడ్‌ను ఏర్పాటు చేస్తున్నారు.

- భారత కేబినెట్ ఆమోదించిన మూడో లాంచ్ ప్యాడ్ ద్వారా భూ దిగువ కక్ష్యలోకి అత్యంత అధిక బరువు కలిగిన (3 వేల టన్నులు) ఉపగ్రహాలను ప్రయోగించనున్నారు. ఈ ప్రయోగ వేదిక ద్వారా న్యూ జనరేషన్ లాంచింగ్ వెహికల్ (NGLV)ను, సెమీ క్రయోజెనిక్ వ్యవస్థ కలిగిన LVM3 వెహికల్స్‌ను ప్రయోగించడానికి సిద్ధంగా ఉన్నారు.
- ఈ లాంచ్ ప్యాడ్ శ్రీహరికోటలోని తూర్పు కోస్తా తీరంలో, భూమధ్య రేఖకు దగ్గరగా, జనావాసాలకు దూరంగా ఉండటం వల్ల ఇంధన వనరుల సంరక్షణ, మానవ వనరుల భద్రత ప్రమాణాలను పరిరక్షించవచ్చు.
- భారత్ భవిష్యత్తు ప్రయోగాలైన భారత్ అంతరిక్ష స్టేషన్ (BAS2035), మానవ సహిత చంద్రగ్రహ ప్రయోగాలు (2040) మొదలైనవి ప్రస్తుత లాంచ్ ప్యాడ్‌ల ద్వారా ప్రయోగించడం సాధ్యం కాదు. కాబట్టి భవిష్యత్తు ఉపగ్రహ కార్యాచరణకు అనువుగా మూడో లాంచ్ ప్యాడ్ సన్నాహాలు ప్రారంభించారు.

SPaDex

భారతీయ అంతరిక్ష పరిశోధన సంస్థ ఒక ఆర్బిట్‌లో ఉన్న రెండు చిన్న ఉపగ్రహాల మధ్య డాకింగ్, అన్ డాకింగ్ ప్రక్రియలను విజయవంతంగా చేపట్టింది. ఈ ప్రక్రియ ద్వారా రెండు స్పేస్ క్రాఫ్టులు అనుసంధానితమై ఒకే యూనిట్‌గా పనిచేస్తాయి. దీనిద్వారా అంతరిక్షంలో కష్టతరంగా భావించే రీఫ్యూయలింగ్, రిపేర్, సిబ్బంది రవాణా లాంటి కార్యక్రమాలను నిర్వహిస్తారు. ఈ ప్రయోగం విజయవంతం కావడం భారతదేశ భవిష్య ప్రణాళికలైన భారత అంతరిక్ష స్టేషన్, చంద్రయాన్ ప్రయోగాలు, శాటిలైట్ సర్వీసింగ్, మెయింటెనెన్స్ వ్యవస్థలు, ఇన్‌స్పేస్ రోబోటిక్స్ రిసోర్స్ మానిటరింగ్ లాంటి వ్యవస్థలకు మొదటి కార్యాచరణగా భావించవచ్చు.

- ప్రపంచంలోనే అమెరికా సంయుక్త రాష్ట్రాలు, రష్యా, చైనా తర్వాత ఈ ప్రయోగాన్ని విజయవంతంగా చేపట్టిన 4వ దేశంగా భారత్ రికార్డు సృష్టించింది.
- సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి ఈ ప్రయోగం చేపట్టారు. ఈ ప్రయోగం భారతదేశ స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో ఇంటర్ శాటిలైట్ కమ్యూనికేషన్ వ్యవస్థ, GNSS బేస్డ్ రిలేటివ్ ఆర్బిట్ డిటర్మినేషన్ అండ్ ప్రాపగేషన్ (RODP), డాకింగ్ మెకానిజం సెన్సార్ వ్యవస్థలను అభివృద్ధి పరిచింది.

MACE (Major Atmospheric Cherenkov Experiment):

డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ ఆధ్వర్యంలో లద్దాఖ్‌లోని హన్లీ ప్రాంతంలో ఈ అబ్జర్వేటరీని అభివృద్ధి చేయనున్నారు.

- అంగారక గ్రహం, చంద్రగ్రహ పరిశోధనా కార్యక్రమాలకు హన్లీ ప్రాంతం అనువైందిగా గుర్తించడంతో, ఇక్కడ 33 అనలాగ్ రిసెర్చ్ స్టేషన్స్‌ను స్థాపించారు.
- దీన్ని దేశంలోనే అత్యంత పెద్దదైన ఇమేజింగ్ టెలిస్కోప్‌గా భావిస్తారు. ఈ అబ్జర్వేటరీ ద్వారా అత్యంత శక్తిమంతమైన గామా కిరణాలు, బ్లాక్ హోల్స్, సూపర్ నోవాలను అధ్యయనం చేస్తారు.
- హన్లీ లోయ ప్రాంతం అత్యల్ప మానవ జనాభా, అతిశీతల పొడి వాతావరణం కలిగిన ఎడారి. ఈ ప్రాంత భూస్వరూపాలు వాతావరణం మార్స్, చంద్రుడి ఉపరితలానికి దగ్గరగా ఉంటాయి.

హైపర్ స్పెక్ట్రల్ ఇమేజింగ్ శాటిలైట్స్ (HSI)

భారతదేశంలో పిక్సెల్స్ అనే ప్రైవేట్ అంతరిక్ష కంపెనీ ఫైర్‌ఫ్లై (Firefly) పేరుతో మొట్టమొదటిసారిగా అత్యధిక రెజల్యూషన్ కలిగిన 6 వాణిజ్య హైపర్ స్పెక్ట్రల్ శాటిలైట్స్‌ను ప్రయోగించింది. ఈ ఉపగ్రహాలు కాంతి పటలాన్ని విస్తరింపజేసి, ప్రాథమిక రంగులకు అనుసంధానంగా ప్రభావవంతమైన హైపర్ స్పెక్ట్రల్ ఫింగర్ ప్రింటింగ్ ద్వారా భూ చిత్రాలను చిత్రీకరిస్తాయి. అంతరిక్షంలో ఉండే ఈ హైపర్ స్పెక్ట్రల్ ఇమేజింగ్ HSIలు భూమిపై ఉన్న అరణ్యాలను అత్యంత సమర్థవంతంగా గుర్తిస్తాయి. ఈ వ్యవస్థ వృక్షాల స్థితి, విడివిడిగా ప్రతి చెట్టు పరిస్థితి, ఆరోగ్యాన్ని అంచనా వేస్తుంది.

శాటిలైట్ ఇంటర్నెట్ సర్వీసెస్

భారత అంతరిక్ష రంగానికి చెందిన ఇన్‌స్పేస్ (IN-SPACe) సంస్థ అమెరికాకు చెందిన స్పేస్ ఎక్స్ సంస్థ నిర్వహిస్తున్న స్టార్ లింక్ సంస్థకు ఇంటర్నెట్ సర్వీసులను వాణిజ్యపరంగా అందించేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. ఈ లైసెన్స్ 2025 నుంచి రానున్న అయిదేళ్ల కాలానికి వర్తించనుంది. ఈ అనుమతితో భారతదేశంలో ఉన్న డిజిటల్ డివైడ్‌ను ఛేదించి ప్రకృతి విపత్తుల సమయంలో కావాల్సిన సహకారం, డిజిటల్ ఎకానమీకి చేయూత, రక్షణ రంగానికి అవసరమైన కనెక్టివిటీని మరింత బలంగా అందించేందుకు అనువుగా మారనుంది.

- ఉపగ్రహ ఆధారిత ఇంటర్నెట్ వ్యవస్థ లేదా శాటిలైట్ బ్రాడ్‌బ్యాండ్ అనేది వైర్‌లెస్ ఇంటర్నెట్ కనెక్షన్లను కలిగి ఉండి అత్యంత సమర్థవంతమైన ఇంటర్నెట్ కనెక్టివిటీని అందిస్తుంది. ఈ వ్యవస్థ అంతరిక్షంలోని ఉపగ్రహాలకు స్పేస్ సెగ్మెంట్‌గా, భూమిపై వాటికి అనుసంధానంగా ఉండే గేట్‌వే స్టేషన్లు, కంట్రోల్ నెట్‌వర్క్‌లకు గ్రౌండ్ సెగ్మెంట్‌గా, వినియోగదారులు ఉపయోగించుకునే కమ్యూనికేషన్ టెర్మినల్స్ యూజర్ సెగ్మెంట్‌గా ఉంటుంది. ఈ శాటిలైట్ బ్రాడ్‌బ్యాండ్ వ్యవస్థతో మనదేశంలోని పలు ప్రైవేట్ నెట్‌వర్కింగ్ వ్యవస్థలు ఒప్పందం కుదుర్చుకున్నాయి.

నావిక్

భారత అంతరిక్ష సంస్థ ఈ నావిగేషన్ వ్యవస్థను అభివృద్ధి చేసింది. ఆపరేషన్ సిందూర్ సమయంలో ఈ వ్యవస్థను అత్యంత సమర్థవంతంగా వినియోగించారు. భారత సరిహద్దులకు అవతల 1500 కిలోమీటర్ల పరిధి కలిగిన ఈ వ్యవస్థతో క్షిపణులకు కావాల్సిన మార్గదర్శకత్వాన్ని (మిస్సైల్ గైడెన్స్), డ్రోన్ నావిగేషన్‌ను అందించారు. ఇండియన్ రీజినల్ నావిగేషన్ సిస్టం (IRNSS)గా పిలిచే ఈ ఉపగ్రహ వ్యవస్థలో ఏడు ఉపగ్రహాలు ఉన్నాయి. వీటిలో మూడు ఉపగ్రహాలు జియో స్టేషనరీ ఆర్బిట్లలో, నాలుగు ఉపగ్రహాలు జియో సింక్రోనస్ ఆర్బిట్లలో ఉన్నాయి. భారత స్వదేశీ నావిగేషన్ వ్యవస్థ ద్వారా పౌరుల కోసం స్టాండర్డ్ పొజిషన్ సర్వీస్ (SPS), వ్యూహాత్మక వినియోగానికి రిస్ట్రిక్ట్ సర్వీసెస్ (RS) వినియోగంలో ఉన్నాయి. ఈ వ్యవస్థ భారత రక్షణ రంగంలో 'హైపర్ సోనిక్ ఇంటిగ్రేషన్ అండ్ స్పేస్ కమాండ్ నెట్‌వర్క్' వ్యవస్థను మరింత బలోపేతం చేయనుంది.

అంతరిక్ష వ్యర్థాలు

అంతరిక్ష వ్యర్థాలు అంటే అంతరిక్షంలో నిష్క్రియాత్మకంగా ఉండే ఉపగ్రహ వ్యర్థాలు, ప్రయోగించి విఫలమైన ప్రయోగ వస్తువులు, ముక్కలు మొదలైనవి. ఇవి తర్వాతి కాలంలో భూకక్ష్యలోకి, భూ వాతావరణంలోకి తిరిగి వస్తాయి.

- సాధారణంగా ఈ వ్యర్థాలు శాటిలైట్ ప్రయోగాలు విఫలమైనప్పుడు, కక్ష్యల్లో ఉండే ఉపగ్రహాలు ఒకదానికొకటి ఢీకొన్నప్పుడు ఉత్పన్నమవుతాయి. ఈ వ్యర్థాల వల్ల కెస్లర్స్ సిండ్రోమ్, అంతరిక్ష అన్వేషణలో అవరోధాలు, కక్ష్యల్లో ఉన్న ఉపగ్రహాల నిర్వహణలో అంతరాయం ఏర్పడతాయి.


రచయిత
రేమల్లి సౌజన్య
విషయ నిపుణులు

నోటిఫికేషన్స్

ఏపీ మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖలో ఉద్యోగాలు

ఆంధ్రప్రదేశ్ మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ (ఏపీ డబ్ల్యూసీడీ) అనంతపురం జిల్లా ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో అంగన్‌వాడీ వర్కర్, హెల్పర్ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. మొత్తం పోస్టుల సంఖ్య 92. అర్హులైన అభ్యర్థులు 2025, డిసెంబరు 31లోగా ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

బీఈసీఐఎల్‌లో ఉద్యోగాలు

నోయిడాలోని బ్రాడ్‌కాస్ట్ ఇంజినీరింగ్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్ (బీఈసీఐఎల్) ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో డేటా ఎంట్రీ ఆపరేటర్, పేషంట్ కేర్ మేనేజర్, మల్టీ టాస్కింగ్ స్టాఫ్ తదితర ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. మొత్తం పోస్టుల సంఖ్య 76. దరఖాస్తు ఫీజు రూ.295. ఆఫ్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ 2026 జనవరి 2.

బిట్‌శాట్-2026

రాజస్థాన్, పిలానీలోని బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (బిట్స్) - బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ అడ్మిషన్ టెస్ట్ (బిట్‌శాట్) - 2026 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ప్రవేశ పరీక్ష ద్వారా ఇంటిగ్రేటెడ్ ఫస్ట్ డిగ్రీ ప్రోగ్రామ్‌ల్లో ప్రవేశాలు ఉంటాయి. దరఖాస్తు రుసుము రూ.5400. అర్హులైన అభ్యర్థులు 2026, మార్చి 16లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

దరఖాస్తు చేశారా..?

కింది ఉద్యోగాలకు నేడే (డిసెంబరు 26) చివరి తేదీ

- ఎన్‌ఐఈపీఎండీలో 25 కన్సల్టెంట్ పోస్టులు. డిగ్రీ, పీజీ, ఎంఈడీ, ఎంఫిల్, పీహెచ్‌డీలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉన్నవారు అర్హులు.
- సెంట్రల్ డ్రగ్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో 44 టెక్నీషియన్ పోస్టులు. టెన్త్, ఐటీఐ, డిప్లొమా, బీఎస్సీ ఉత్తీర్ణులు అర్హులు.
- ఇండియా ఆప్టెల్ లిమిటెడ్‌లో 149 టెక్నీషియన్ ఉద్యోగాలు. టెన్త్ ఉత్తీర్ణులు అర్హులు.

పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

చార్లెస్ బాబేజ్


శాస్త్రవేత్తలు విశేషాలు

ఈయన ఇంగ్లండ్‌కు చెందిన ప్రముఖ గణిత శాస్త్రవేత్త, ఆవిష్కర్త. మొదటి ఆటోమేటిక్ డిజిటల్ కంప్యూటర్‌ను రూపొందించారు. చార్లెస్ కృషి ఫలితంగా మానవ అవసరం లేకుండా లెక్కించగల యంత్రాల రూపకల్పనకు పునాది ఏర్పడింది. ఆయన పూర్తి స్థాయి యంత్రాల కోసం కాకుండా కంప్యూటింగ్ ప్రయోజనాల కోసం డిజైన్లు రూపొందించారు. ప్రస్తుతం మనం ఉపయోగిస్తోన్న కంప్యూటర్ల పరిణామక్రమానికి మూలం బాబేజే. అందుకే ఈయన్ను 'ఫాదర్ ఆఫ్ కంప్యూటర్'గా పేర్కొంటారు. డిసెంబరు 26న చార్లెస్ జయంతి సందర్భంగా ఆయన జీవితంలోని ముఖ్య విషయాల గురించి తెలుసుకుందాం..!

బాల్యం – వృత్తి జీవితం

చార్లెస్ బాబేజ్ 1791, డిసెంబరు 26న వాల్‌వర్త్, లండన్‌లో జన్మించారు.


- చిన్నతనంలో అనారోగ్య సమస్యల కారణంగా ఇంటి వద్దే ట్యూటర్ల సాయంతో విద్యను అభ్యసించారు. తర్వాత ఎన్‌ఫీల్డ్‌లోని హోమ్‌వుడ్ అకాడమీలో చేరారు. అక్కడ ఆయనకు గణితం పట్ల ఆసక్తి కలిగింది. 1810లో ఆయన గణిత అధ్యయనం కోసం కేంబ్రిడ్జ్‌లోని ట్రినిటీ కాలేజ్‌లో చేరారు.
- కేంబ్రిడ్జ్‌లోని గణిత పాఠ్యాంశాలను ఆధునికీకరించి, సమకాలీన గణిత అభ్యాసాలను బోధించేలా చర్యలు చేపట్టాలని చార్లెస్ భావించారు. ఇందుకు అనుగుణంగా తన స్నేహితులైన జాన్ హెర్షెల్, జార్జ్ పీపాక్‌తో కలిసి 1812లో అనలిటికల్ సొసైటీని స్థాపించారు. ఇందులో ఖండాంతర గణిత సంజ్ఞామానం (modern continental mathematical notation) పద్ధతులను అధ్యయనం చేసేవారు. 1814లో పట్టభద్రుడయ్యారు. 1817లో ఎంఏ పట్టా పొందారు.



కంప్యూటర్ రూపకల్పన, చార్లెస్ బాబేజ్ పొందిన అవార్డులు - గౌరవాలు, గత పరీక్షల్లో అడిగిన ప్రశ్నల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - బయాలజీ

క్లోరోప్లాస్ట్



క్లోరోప్లాస్ట్‌లు మొక్కల కణాల్లో కనిపించే ముఖ్యమైన కణాంగాలు. ఇవి మొక్కల జీవక్రియలో ప్రధానమైన కిరణజన్య సంయోగక్రియను నిర్వహిస్తాయి. కిరణజన్య సంయోగక్రియ అనేది కాంతి శక్తిని రసాయన శక్తిగా మార్చే ప్రక్రియ. క్లోరోప్లాస్ట్‌లు విస్తరిత కణాంగాలు. మొక్కలు ఆక్సిజన్, గ్లూకోజ్‌ను ఉత్పత్తి చేయడంలో ఇవి ముఖ్యపాత్ర పోషిస్తాయి. తద్వారా భూమిపై ఉన్న జీవుల మనుగడకు ఇది ఎంతగానో ఉపయోగపడుతోంది. క్లోరోప్లాస్ట్ నిర్మాణం, విధులు, ప్లాస్టిడ్స్ మొదలైనవాటిపై పోటీపరీక్షార్థికి అవగాహన ఉండాలి.

నిర్మాణం

- బాహ్య త్వచం (ఔటర్ మెంబ్రేన్)
- అంతర త్వచం (ఇన్నర్ మెంబ్రేన్)
- త్వచాంతర అవకాశిక (ఇంటర్ మెంబ్రేన్ స్పేస్)
- ఆవర్ణిక (స్ట్రోమా)

థైలకాయిడ్ నిర్మాణాలు

గ్రానాను ఏర్పర్చడానికి పేర్చిన చదునైన, డిస్క్ లాంటి నిర్మాణాల శ్రేణి లేదా వరుసను థైలకాయిడ్ అంటారు. ప్రతి థైలకాయిడ్‌లో కాంతి శక్తిని గ్రహించే క్లోరోఫిల్, ఇతర వర్ణద్రవ్యాలు ఉంటాయి.

కీలక వర్ణాలు

క్లోరోప్లాస్ట్‌లు కిరణజన్య సంయోగక్రియలో ముఖ్యమైన పాత్రను పోషించే అనేక కీలక వర్ణాలను కలిగి ఉంటాయి. వాటిలో ముఖ్యమైనవి:

1. క్లోరోఫిల్ ఎ
2. క్లోరోఫిల్ బి
3. కెరోటినాయిడ్స్

క్లోరోప్లాస్ట్‌లోని గాఢమైన ద్రవంలో ఉండేవి, క్లోరోప్లాస్ట్ విధులు, గ్రానా, లామెల్లె, వర్ణకాలు లేదా పిగ్మెంట్లు, లక్షణాలు మొదలైన అంశాలతోపాటు మాదిరి ప్రశ్నలతో సహా పూర్తి సమాచారం ఈ-బుక్ రూపంలో 'ఈనాడు ఈప్రతిభ' వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Current Affairs

1. India recently achieved a significant milestone in clean transportation with the launch of its first fully indigenous hydrogen fuel cell passenger vessel. Where did this launch take place?
A) Kochi B) Varanasi
C) Goa D) Vishakhapatnam

2. During a recent diplomatic engagement, Prime Minister Narendra Modi received Ethiopia's highest civilian honour. Which prestigious award was conferred upon him by Ethiopian Prime Minister Abiy Ahmed Ali?
A) Order of the Blue Nile
B) The Great Honour Nishan of Ethiopia
C) Order of Menelik II
D) Star of Honour of Ethiopia

3. Which Indian state is set to create history by establishing the country's first dedicated forest university, aimed at boosting education and research in forestry, wildlife, and environmental sciences?
A) Madhya Pradesh B) Uttarakhand
C) Uttar Pradesh D) Chhattisgarh

4. Which Indian IAS officer from Tamil Nadu was recently honoured with the UN Environment Programme's 2025 Champions of the Earth Award?
A) Supriya Sahu B) Pooja Jain
C) V. Irai Anbu D) Smita Sabharwal

5. India recently added two new Ramsar Sites, Siliserh Lake and Kopra Jalashay, to its list of protected wetlands. With this, how many total Ramsar Sites does India now have?
A) 85 B) 90 C) 96 D) 100

Mrichchhakatika was translated into English by...

SSC Exams Special

General Awareness

History

6. Aralaguppe, known for its Hoysala architectural heritage, contains a temple dedicated to Lord Channakeshava (Vishnu).
Statement I: The Channakeshava Temple at Aralaguppe was built during the rule of Hoysala king Vira Someshwara.
Statement II: The temple reflects the classic star-shaped plan and ornate sculptures typical of Hoysala temple architecture.
A) Both statements I and II are true, and Statement II is the correct explanation of I
B) Both statements I and II are true, but Statement II is not the correct explanation of I
C) Statement I is true, but Statement II is false
D) Statement I is false, but Statement II is true

7. Statement I: The Sanskrit play Mrichchhakatika was translated into English by Arthur W. Ryder in 1905 under the title "The Little Clay Cart".
Statement II: Shudraka, the author of Mrichchhakatika, also wrote works such as Vinavasavadatta, Padmaprabhritaka, and a one-act bhana.
A) Both statements I and II are true, and Statement II is the correct explanation of I
B) Both statements I and II are true, but Statement II is not the correct explanation of I
C) Statement I is true, but Statement II is false
D) Statement I is false, but Statement II is true

8. Statement I: Ravikirti, a Jain poet, served as the court poet of Pulakeshin II, the early Chalukya ruler of Vatapi.
Statement II: Ravikirti composed the Aihole inscription in honour of Pulakeshin II, which is engraved in the Meguti Jain temple at Aihole.
A) Both statements I and II are true, and Statement II is the correct explanation of I
B) Both statements I and II are true, but Statement II is not the correct explanation of I
C) Statement I is true, but Statement II is false
D) Statement I is false, but Statement II is true

Geography

9. Statement I: The Gulf of Mannar lies along the Coromandel Coast region in southeastern India.
Statement II: The Gulf of Mannar is directly connected to the Bay of Bengal without any separation.
A) Both statements I and II are true
B) Both statements I and II are false
C) Statement I is true but Statement II is false
D) Statement I is false but Statement II is true

10. Statement I: Tectonic earthquakes are the most common type of earthquakes and occur due to movement along fault planes.
Statement II: Reservoir-induced earthquakes are caused by underground mining collapses in regions with heavy extraction activity.
A) Both statements I and II are true
B) Both statements I and II are false
C) Statement I is true but Statement II is false
D) Statement I is false but Statement II is true


11. Statement I: Charles Elton introduced the concepts of food web, food chain, and ecological niche in his 1927 work "Animal Ecology".
Statement II: Edward O. Wilson coined the term 'Ecology' in 1866.
A) Both statements I and II are true
B) Both statements I and II are false
C) Statement I is true but Statement II is false
D) Statement I is false but Statement II is true

Scan the QR code for Key

These model questions were prepared by subject experts.

చెడు శాంటాలను

అమెరికాలోకి రానీయకండి: ట్రంప్



వెస్ట్ పామ్ బీచ్: క్రిస్మస్ సందర్భంగా దేశ ప్రజలకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ శుభాకాంక్షలు తెలియజేశారు. చిన్న పిల్లలతో ఫోన్ ద్వారా మాట్లాడిన ఆయన.. వారు ఎలాంటి బహుమతులు పొందాలనుకుంటున్నారో అడిగి తెలుసుకున్నారు. శాంటా మంచి వాడని పేర్కొన్నారు. అమెరికాలోకి చెడు శాంటాలను చొరబడకుండా అడ్డుకుంటామని వాగ్దానం చేయాల్సిందిగా వారిని కోరారు.





అశ్వనీకుమార్ పాధి ✦ శ్రీధర్ పాత్రా

అంధుల కోసం

9వ తరగతి విద్యార్థుల స్మార్ట్ ఆవిష్కరణలు!

ఈటీవీ భారత్: ఎదురుగా ఉన్న అడ్డంకుల గురించి అంధులను అప్రమత్తం చేసే స్మార్ట్ కర్ర, స్మార్ట్ కళ్లద్దాలను ఒడిశాకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థులు తాజాగా ఆవిష్కరించారు. ఒడిశాలో పలు ప్రభుత్వ పాఠశాలలు 'ప్రధానమంత్రి శ్రీ' పథకం పరిధిలో ఉన్నాయి. వాటిలో ఏర్పాటుచేసిన అటల్ టింకరింగ్ ల్యాబ్ (ఏటీఎల్)లలో విద్యార్థులకు కోడింగ్, సమస్య పరిష్కార నైపుణ్యాలను నేర్పిస్తున్నారు. ఇలా నేర్చుకున్న నైపుణ్యాలతో.. గంజాం జిల్లాలోని రెండు వేర్వేరు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న తొమ్మిదో తరగతి విద్యార్థులు శ్రీధర్ పాత్రా, అశ్వనీకుమార్ పాధి అంధులకు ఉపయోగపడే ఆవిష్కరణలు చేశారు. స్మార్ట్ కర్రతో అనుసంధానమై ఉండే స్మార్ట్ కళ్లద్దాలను శ్రీధర్ పాత్రా తయారుచేశాడు. స్మార్ట్ స్టిక్‌లోని సెన్సర్లు ఎదుట ఉన్న అడ్డంకులను గుర్తించి, వెంటనే కళ్లద్దాల్లోని బజర్‌ను మోగించడం ద్వారా అంధులను అప్రమత్తం చేస్తాయి. అల్ట్రాసోనిక్ సెన్సర్‌తో పనిచేసే స్మార్ట్ బ్లైండ్ స్టిక్‌ను అశ్వనీకుమార్ పాధి తయారుచేశాడు. అంధులు ఈ స్టిక్‌ను పట్టుకొని నడిస్తే, ఎదుట ఉన్న అడ్డంకులను అల్ట్రాసోనిక్ సెన్సర్ వేగంగా గుర్తిస్తుంది. ఆ వెంటనే స్టిక్‌లోని అలారం మోగుతుంది.

కిలిమంజారోపై కుప్పకూలిన హెలికాప్టర్

- ఐదుగురి మృతి

దారెసలామ్: ఆఫ్రికా ఖండంలోని ఎత్తైన పర్వతం కిలిమంజారోపై హెలికాప్టర్ ప్రమాదం చోటుచేసుకుంది. అస్వస్థతకు గురైన ఇద్దరు విదేశీయులను చికిత్స కోసం తరలిస్తున్న సమయంలో హెలికాప్టర్ కుప్పకూలింది. దీంతో వారితో పాటు హెలికాప్టర్‌లో ఉన్న ఓ వైద్యుడు, టూరిస్టు గైడ్, పైలట్ ప్రాణాలు కోల్పోయినట్లు టాంజానియా పౌర విమానయానశాఖ ఓ ప్రకటనలో తెలిపింది.

55 మంది మానసిక రోగులను గుర్తించి వైద్యం

- మనోబంధు ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ రామకృష్ణంరాజు

ఈనాడు, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా అక్టోబరు 23 నుంచి డిసెంబరు 22 వరకు నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమం ద్వారా వీధుల్లో నిరాశ్రయులుగా ఉన్న 55 మంది మానసిక రోగులను విశాఖపట్నం, కడప మానసిక వైద్యశాలల్లో చికిత్స కోసం చేర్పించినట్లు మనోబంధు ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ భూపతిరాజు రామకృష్ణంరాజు తెలిపారు. చికిత్స అనంతరం కోలుకున్న వారిని కుటుంబ సభ్యులతో మళ్లీ కలిపే ప్రయత్నం చేస్తున్నామని గురువారం వెల్లడించారు. వీరిలో కొందరు తెలుగేతరులు ఉన్నారని తెలిపారు. రెడ్‌క్రాస్ సొసైటీ ఏపీ శాఖ సహకారం, రాష్ట్ర హోం, మున్సిపల్, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖల ముఖ్య కార్యదర్శుల తోడ్పాటు నిరాశ్రయుల గుర్తింపు కార్యక్రమం విజయవంతానికి ఎంతో దోహదం చేసిందని రామకృష్ణంరాజు తెలిపారు.

పాములు, తేళ్లను పారదోలే ప్రత్యేక కర్ర!



భావ్‌నగర్: పొలాల్లో పంటకోత వేళ పగలనక రేయనక వట్టి కాళ్లతో బురద, గడ్డిలో దిగే రైతులకు పాముకాట్లు, తేలుకాట్ల బెడద ఎక్కువ. ఈ విషపురుగులను పారదోలే ప్రత్యేక కర్రను గుజరాత్‌లోని సర్ భావ్‌సింహ్‌జీ పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన మెకానికల్ ఇంజినీరింగ్ విద్యార్థి క్రిష్ దోడియా, అతడి మిత్రుడు కలిసి రూపొందించారు. ఈ కర్ర మూడున్నర మీటర్ల పీవీసీ పైపులో మూడున్నర మీటర్ల వైరు, ఒక స్ప్రింగు, ఒక డీసీ మోటార్, రెండు లిథియం బ్యాటరీలు, ఒక బ్యాటరీ కేస్, టీ జాయింట్, ఒక క్యాప్‌తో రూపొందింది. దీన్ని నేలకు తాకిస్తే ప్రకంపనలు వచ్చి పాములు, తేళ్లను పారదోలతాయి. ఈ కర్ర తయారీకి అయిన ఖర్చు కేవలం రూ.410. దీనికి ఎల్ఈడీ బల్బులు అమర్చవచ్చు. రైతు పాము కాటుకు గురైతే పక్కవారిని హెచ్చరించడానికి బజర్‌నూ ఏర్పాటు చేసుకోవచ్చు. అలాగే కర్రకు ప్రాథమిక చికిత్స సాధనాలతో చిన్న సంచిని అమర్చవచ్చు. బాధితుడిని ఆస్పత్రికి తీసుకెళ్లేలోపల పాము, తేలు విషం వ్యాప్తిని నిదానింపజేసే మాత్రలనూ ఆ సంచిలో అందించవచ్చు.

జనగణన తొలి విడతకు రంగం సిద్ధం

- ఏప్రిల్ నుంచి ఇళ్ల వివరాల సేకరణ

ఈటీవీ భారత్: దేశంలో తొలిసారిగా డిజిటల్ విధానంలో జరగనున్న జనగణనకు రంగం సిద్ధమైంది. జనాభా లెక్కింపునకు సంబంధించిన ప్రీ-టెస్ట్ ప్రక్రియ ముగిసింది. జనగణన తొలి విడతలో భాగంగా 2026 ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు దేశంలోని ఇళ్ల వివరాలను సేకరించనున్నారు. దీన్ని 'గృహాల లిస్టింగ్, గణన' ప్రక్రియ అంటారు. యావత్ దేశంలోని ఇళ్ల వివరాలను ఎలా సేకరించాలి? ఇందుకోసం ఏ విధమైన మార్గదర్శకాలను అనుసరించాలి? మానవ వనరులను ఎలా మోహరించాలి? అనే దానిపై ప్రీ-టెస్ట్‌లో ముమ్మర కసరత్తు చేశారు. పారదర్శకంగా ఇళ్ల వివరాల సేకరణకు అనుసరించాల్సిన మార్గాలపై అన్ని రాష్ట్రాలు, జిల్లాలు, ఉప జిల్లాల స్థాయిలోని అధికార వర్గాలతో లోతుగా చర్చించారు. ఇళ్ల సమాచారాన్ని సేకరించడానికి లక్షలాది మానవ వనరులను మోహరించడంపైనా సమగ్ర ప్రణాళికను సిద్ధం చేశామని అధికార వర్గాలు వెల్లడించాయి. డిసెంబరు ప్రారంభంలోనే ప్రీ-టెస్ట్ ముగిసిందని తెలిపాయి. దీన్ని విజయవంతం చేసిన ప్రతీ ఒక్కరినీ



భారతదేశ రిజిస్ట్రార్ జనరల్ అండ్ సెన్సస్ కమిషనర్ మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ అభినందించారని పేర్కొన్నాయి.

తొలి విడతకు కార్యాచరణ ప్రణాళిక

'గృహాల లిస్టింగ్, గణన' కోసం ఏప్రిల్ నుంచి దేశంలోని ప్రతీ ఇంటిని క్షేత్రస్థాయి సిబ్బంది ఎలా చేరుకోవాలి? ఇంటి యజమానులను ఏయే ప్రశ్నలు అడిగి, ఎలాంటి సమాచారం సేకరించాలి? మొబైల్ యాప్‌ను ఎలా వాడాలి? డిజిటల్‌గా సమాచారాన్ని నమోదు చేసే క్రమంలో దోహదపడే భద్రతా ఫీచర్లు ఏమిటి? సిబ్బందిని రాష్ట్ర, జిల్లా, ఉప జిల్లా స్థాయుల్లో ఎలా వినియోగించాలి? అధికారులు ఎలా సమన్వయం చేసుకోవాలి? అనే అంశాలపై స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకోవడానికి ఇటీవలే జరిగిన ప్రీ-టెస్ట్ ప్రక్రియ దోహదపడిందని అధికార వర్గాలు తెలిపాయి.

ఫీడ్‌బ్యాక్ ఆధారంగా ఆర్‌జీఐ కీలక నిర్ణయాలు

ప్రీ-టెస్ట్ సందర్భంగా చాలా అంశాలపై ఫీడ్‌బ్యాక్‌ను సేకరించారు. అన్ని స్థాయిల అధికారులు తమ ఫీడ్‌బ్యాక్‌ను ఇచ్చారు. వాటన్నింటిపై అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల సెన్సస్ డైరెక్టర్ల సమక్షంలోనే సమీక్ష జరిగింది. అందరి నుంచి సలహాలు, సూచనలను స్వీకరించారు. 'గృహాల లిస్టింగ్, గణన' ముగిశాక రెండో విడత జనగణన మొదలవుతుంది. ఇందులో భాగంగా మనదేశంలోని మంచుమయ ప్రాంతాల్లో జనాభా లెక్కల ప్రక్రియను 2026 సెప్టెంబరు నుంచి అక్టోబరు 1 వరకు నిర్వహిస్తారు. మంచుమయ ప్రాంతాల జాబితాలో జమ్మూకశ్మీర్, లద్దాఖ్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్ ఉన్నాయి. దేశంలోని అన్ని ఇతర ప్రాంతాల్లో జనగణన 2027 ఫిబ్రవరి నుంచి మార్చి 1 వరకు జరుగుతుంది.



సంథాలీ భాషలో రాజ్యాంగాన్ని ఆవిష్కరించిన రాష్ట్రపతి ముర్ము

దిల్లీ: దేశరాజధాని దిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో గురువారం జరిగిన ఓ కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సంథాలీ భాషలో భారత రాజ్యాంగాన్ని ఆవిష్కరించారు. దేశంలో మనుగడలో ఉన్న అత్యంత ప్రాచీన భాషల్లో ఒకటైన సంథాలీని 2003లో 92వ రాజ్యాంగ సవరణ ద్వారా ఎనిమిదో షెడ్యూల్‌లో చేర్చారు. ఝార్ఖండ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్, బిహార్ రాష్ట్రాల్లో పెద్ద సంఖ్యలో గిరిజనులు ఈ భాషను మాట్లాడతారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ.. 'ఓల్ చికీ లిపిలో రాజ్యాంగం అందుబాటులోకి రావడం సంథాలీ ప్రజలకు గర్వకారణం. ఇది తమ మాతృభాషలో రాజ్యాంగాన్ని చదివి అర్థం చేసుకునే అవకాశం కల్పిస్తుంది' అని పేర్కొన్నారు. సంథాలీ భాషలో రాజ్యాంగాన్ని తీసుకొచ్చేందుకు కృషి చేసిన కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్ బృందాన్ని రాష్ట్రపతి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.

విజన్ ఐఏఎస్ సంస్థకు రూ.11 లక్షల జరిమానా

- సీసీపీఏ నిర్ణయం

ఈనాడు, దిల్లీ: యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ పరీక్షల ఫలితాలపై తప్పుదోవ పట్టించే ప్రకటనలు ఇచ్చినందుకు కేంద్ర వినియోగదారుల హక్కుల రక్షణ ప్రాధికార సంస్థ (సీసీపీఏ) విజన్ ఐఏఎస్ (అజయ్ విజన్ ఎడ్యుకేషన్ ప్రైవేట్ లిమిటెడ్) సంస్థకు రూ.11 లక్షల జరిమానా విధించింది. 2023 సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో తమ సంస్థ నుంచి టాప్ 10లో 7, టాప్ 100లో 79, 2022 పరీక్షల్లో టాప్ 50లో 39 మంది ఉన్నట్లు పేర్లు, ఫొటోలు, ర్యాంకులు ప్రకటించడాన్ని సీసీపీఏ తప్పుబట్టింది. ఉద్దేశపూర్వకంగా వాస్తవాలను దాచిపెట్టి ప్రకటన జారీచేసినట్లు పేర్కొంది. 2022, 2023 సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో తమ సంస్థ నుంచి మొత్తం 119 మంది అభ్యర్థులు విజయం సాధించినట్లు ఈ సంస్థ పేర్కొన్నప్పటికీ అందులో ముగ్గురు మాత్రమే ఇందులో ఫౌండేషన్ కోర్సులో చేరారని, మిగిలిన 116 మంది ప్రాథమిక, మెయిన్స్ పరీక్షలకోసం టెస్ట్ సిరీస్, వన్‌టైం టెస్ట్, మాక్ ఇంటర్వ్యూ ప్రోగ్రాం సేవలను మాత్రమే పొందినట్లు వెల్లడించింది. అలాగే ఆ సంస్థ అధికారిక వెబ్‌సైట్‌లో ప్రకటించుకున్న క్లెయిమ్‌లు కూడా తప్పుదోవ పట్టించేలా ఉన్నట్లు తెలిపింది. ఈ ప్రకటనలు వినియోగదారుల హక్కుల రక్షణ చట్టం 2019లోని సెక్షన్ 2(28)ని ఉల్లంఘించిన కారణంగా జరిమానా విధించినట్లు సీసీపీఏ స్పష్టంచేసింది. విద్యార్థులను తప్పుదోవపట్టించేలా ప్రకటనలు ఇచ్చి, అవాంఛనీయ వాణిజ్య విధానాలు పాటించిన కోచింగ్ సంస్థలకు ఇప్పటివరకూ 57 నోటీసులు జారీచేయడంతోపాటు, 28 సంస్థలపై రూ.1.09 కోట్ల జరిమానా విధించినట్లు తెలిపింది. ఇకపై కోచింగ్ సంస్థలు అన్ని వివరాలనూ పారదర్శకంగా ప్రకటిస్తూ నిజాయితీగా ప్రకటనలు ఇవ్వాలని స్పష్టంచేసింది. దానివల్ల విద్యార్థులు తమ అవసరాలకు తగ్గట్టు కచ్చితమైన నిర్ణయాలు తీసుకోవడానికి వీలవుతుందని పేర్కొంది.

నేపాల్‌లో డ్రగ్స్ రవాణా.. ఇద్దరు భారతీయుల అరెస్టు

కాఠ్‌మాండూ: నేపాల్‌లో మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు పాల్పడిన ఇద్దరు భారతీయులను పోలీసులు అరెస్టు చేశారు. వీరితో పాటు థాయ్‌లాండ్‌కు చెందిన మరో మహిళనూ అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి మొత్తం 4.3 కిలోల కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నారు. భారత్‌కు చెందిన జేవియర్ మాథ్యూ థాలియాచెరి(55), ముర్షలేన్ హుస్సేన్(21)లను సినామంగళ్ ప్రాంతంలో అరెస్టు చేశారు. వీరి వద్ద 3.750 కిలోల కొకైన్ దొరికింది. మరొక ఘటనలో థాయ్‌కి చెందిన రుసనీ కామా వద్ద 550 గ్రాముల కొకైన్‌ను గుర్తించారు. ఆమె హోటల్ గదిలో 12 డ్రగ్స్ క్యాప్సుల్స్ దొరకగా, మరో 29 క్యాప్సుల్స్‌ను ఆమె మింగినట్లు తేలింది. ఆమెను ఆసుపత్రికి తరలించి వాటిని వెలికితీశారు.

రష్యన్లు మా హృదయాలను జయించలేరు



- క్రిస్మస్ సందేశంలో జెలెన్‌స్కీ

ఇంటర్నెట్ డెస్క్: ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తన క్రిస్మస్ సందేశంలో పరోక్షంగా రష్యా అధినేత వ్లాదిమిర్ పుతిన్‌ను ప్రస్తావించారు. పుతిన్ నాశనం కావాలని ఉక్రెయిన్ ప్రజలందరూ కోరుకుంటున్నారని అన్యాపదేశంగా వ్యాఖ్యానించారు. "రష్యా ఎన్ని బాధలు పెట్టినా మా మనసుల్ని, అందులోని స్ఫూర్తిని జయించలేదు. ఉక్రెయిన్ హృదయాన్ని ఆక్రమించలేదు. ఈ రోజు మనమందరిది ఒకటే కల. అందరికీ ఒకే కోరిక. అతడి వినాశనమే అందరి ఆకాంక్ష. కానీ మనం ఆ దేవుణ్ని అంతకంటే గొప్ప విషయాన్ని కోరుకుందాం. ఉక్రెయిన్‌కు శాంతి కావాలని అడుగుదాం" అని జెలెన్‌స్కీ అన్నారు. క్రిస్మస్ సందర్భంగా రష్యన్లు తమ నిజస్వరూపాన్ని చూపుతూ భారీ షెల్లింగ్‌తోపాటు వందలాది బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్‌తో దాడులకు పాల్పడ్డారని గుర్తు చేశారు. రష్యా నిరంతరం దాడులు చేస్తున్నా, ఈ క్రిస్మస్ సమయంలో ఉక్రెయిన్ ప్రజలందరూ ఐక్యంగా ఉన్నారని అన్నారు.

అవామీ లీగ్ పార్టీపై నిషేధం

- షేక్ హసీనాకు షాక్

ఢాకా, దిల్లీ: షేక్ హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్ పార్టీపై బంగ్లాదేశ్ సర్కారు తాత్కాలిక నిషేధం విధించింది. దీంతో వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరగనున్న ఎన్నికల్లో ఆ పార్టీ పోటీ చేయడానికి అవకాశం లేదు. బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ ప్రధాన సలహాదారు యూనస్ మీడియా కార్యదర్శి షఫీకుల్ ఆలం ఈ మేరకు ఓ ప్రకటన చేశారు. అవామీ లీగ్ రాజకీయ కార్యకలాపాలను ప్రభుత్వం ఇప్పటికే నిషేధించింది. ఎన్నికల కమిషన్ ఆ పార్టీ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయడంతో రాబోయే ఎన్నికల్లో పోటీ చేసే అర్హతను ఆ పార్టీ కోల్పోయింది. అవామీ లీగ్ నాయకులపై ప్రస్తుతం అంతర్జాతీయ నేరాల ట్రైబ్యునల్‌లో విచారణ జరుగుతోంది. ఈ విచారణలు పూర్తయ్యే వరకూ ఆ పార్టీపై నిషేధం కొనసాగుతుందని ప్రభుత్వం జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్‌లో వెల్లడించింది.

హసీనా స్థానంలో హిందూ నేత పోటీ



ఇంటర్నెట్ డెస్క్: బంగ్లాదేశ్‌లో మాజీ ప్రధాని షేక్ హసీనా ప్రాతినిధ్యం వహించిన గోపాల్‌గంజ్-3 స్థానం నుంచి ఓ హిందూ నేత పోటీకి సన్నద్ధమవుతున్నారు. న్యాయవాది అయిన గోవింద చంద్ర ప్రామాణిక్ స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగనున్నారు. అక్కడ మైనారిటీలపై దాడులు జరుగుతున్న వేళ కీలక స్థానం నుంచి హిందూ వ్యక్తి పోటీలో దిగుతుండటం గమనార్హం. బంగ్లాదేశ్ జాతీయ హిందూ మొహజోతేలో (హిందూ మహాకూటమి) కీలక సభ్యుడిగా ఉన్న గోవింద ప్రామాణిక్.. తాను సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేయనున్నట్లు ప్రకటించారు. అయితే తనకు ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేదని, స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగనున్నట్లు చెప్పారు. పార్టీల ఆదేశాలకు కట్టుబడి కొన్ని ప్రజా సమస్యలను ఎంపీలు లేవనెత్తలేరని, అటువంటి ఇబ్బందులు లేకుండా ప్రజల తరఫున గళాన్ని వినిపించేందుకు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని పేర్కొన్నారు.

దేశంలో ప్రస్తుతం హిందూ జనాభా సుమారు 10 శాతం ఉంటుందని.. మత మార్పిడులు, విదేశాలకు వలస వెళ్లడంతో ఈ జనాభా తగ్గిందని ప్రామాణిక్ చెబుతున్నారు. హిందువులపై పలు సందర్భాల్లో దాడులు జరిగాయని, అయినప్పటికీ సురక్షితంగానే ఉన్నారని చెప్పారు. బంగ్లాదేశ్‌లో ఫిబ్రవరి 12న సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి.

ముస్లిమేతరులపై దారుణాలు: హసీనా



బంగ్లాదేశ్‌లో ముస్లిమేతరులపై యూనస్ ప్రభుత్వం చెప్పుకోలేని దారుణాలకు పాల్పడుతోందని ఆ దేశ మాజీ ప్రధాని, భారత్‌లో ఆశ్రయం పొందిన షేక్ హసీనా ఆరోపించారు. అక్రమంగా అధికారాన్ని చేజిక్కించుకున్న ఈ గ్రూపు.. మైనారిటీలను మంటల్లో కాల్చి చంపుతోందని విమర్శించారు. ఇలాంటి పోకడలను బంగ్లాదేశ్ ప్రజలు ఎంతో కాలం కొనసాగనివ్వబోరని స్పష్టం చేశారు. క్రిస్మస్ సందర్భంగా గురువారం ఆమె ఓ సందేశాన్ని విడుదల చేశారు. అన్ని మతాల స్వాతంత్ర్యాల్లో యూనస్ ప్రభుత్వం జోక్యం చేసుకుంటోందని ఆరోపించారు. బంగ్లాదేశ్‌లో క్రైస్తవులు, ఇతర మతాలవారి మధ్య సుహృద్భావ వాతావరణాన్ని ఈ క్రిస్మస్ బలోపేతం చేస్తుందన్న ఆశాభావాన్ని ఆమె వ్యక్తం చేశారు.

భూమ్మీద నూకలు ఉండటమంటే ఇదే..



ఇంటర్నెట్ డెస్క్: గుజరాత్‌లోని సూరత్‌లో ఓ వ్యక్తి పదో అంతస్తు నుంచి జారిపడి అనూహ్యంగా ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నాడు. నగరంలోని జహంగీర్‌పురాకు చెందిన నితిన్‌భాయ్ (57) గురువారం ఉదయం అపార్టుమెంటులోని పదో అంతస్తులో కిటికీ పక్కన కునుకు తీస్తున్నాడు. ఆ క్రమంలో ప్రమాదవశాత్తు కిందకు జారిపడిపోగా.. ఎనిమిదో అంతస్తులోని కిటికీలో ఆయన కాలు చిక్కుకుపోయింది. దీంతో తలకిందులుగా వేలాడుతున్న నితిన్‌ను గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. రంగంలోకి దిగిన సహాయక బృందాలు తాళ్లు, సేఫ్టీ బెల్టు సాయంతో ఆయనను రక్షించాయి. ముందు జాగ్రత్తగా కింది భాగాన సేఫ్టీ నెట్ కూడా సిద్ధం చేశారు. మొత్తానికి కిటికీ గ్రిల్స్ నుంచి నితిన్‌ను సురక్షితంగా బయటకు తీయడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

తల్లిదండ్రుల బాగు కోసం..

120 కి.మీ. సాష్టాంగ దండాలు



ఈటీవీ భారత్: ఒడిశాలోని నయాగఢ్ జిల్లాకు చెందిన సుశీల్ కుమార్ తన తల్లిదండ్రుల గౌరవార్థం వారి చిరకాల కోరిక మేరకు పూరీ జగన్నాథ క్షేత్రానికి సాష్టాంగ దండాలతో యాత్ర మొదలుపెట్టారు. గోపాల్‌పుర్ గ్రామానికి చెందిన సుశీల్ ఐటీఐలో డిప్లొమా చేస్తూ.. యూట్యూబరుగా తల్లిదండ్రులు, పిల్లల అనుబంధాలపై ఎక్కువ వీడియోలు చేస్తుంటారు. సుశీల్ పుట్టాక పాదయాత్రతో పూరీకి వస్తానని మొక్కుకొన్న ఆయన తండ్రి సురేంద్ర కొన్ని కారణాల వల్ల ఆ మొక్కును చెల్లించలేకపోయారు. దీంతో ఈ బాధ్యతను తలకెత్తుకొన్న కుమారుడు 120 కి.మీ.ల దూరాన ఉన్న పూరీకి సాష్టాంగ దండాలతో ముందుకు సాగుతున్నారు. నయాగఢ్ జగన్నాథ మందిరంలో పూజలు చేసి ప్రారంభించిన ఈ యాత్ర ఖర్దా, పిప్లీ మీదుగా నెలన్నర తర్వాత పూరీకి చేరుకోనుంది. ఈ యాత్రలో తల్లిదండ్రులు కూడా సుశీల్ వెంట నడుస్తున్నారు.

హిందువులపై దాడులు చేసిన వారి సమాచారమిస్తే బహుమతి

- బంగ్లాదేశ్ పోలీసుల ప్రకటన

ఢాకా, దిల్లీ: బంగ్లాదేశ్‌లోని తీర నగరం చట్టోగ్రామ్‌లో హిందూ కుటుంబానికి చెందిన ఇంటిని తగులబెట్టిన వారి సమాచారం ఇస్తే బహుమతి ఇస్తామని పోలీసులు ప్రకటించారు. బుధవారం రాత్రి ఆ ఇంటిని చట్టోగ్రామ్ రేంజ్ పోలీసు చీఫ్ అహ్సాన్ హబీబ్ సందర్శించారు. ఈ సందర్భంగా రివార్డు ప్రకటించారు. నగర శివార్లలో ఉన్న శుఖ్ షిల్, అనిల్ షిల్‌ల ఇంటిని మంగళవారం రాత్రి దుండగులు తగులబెట్టారు. వెంటనే మేల్కొన్న కుటుంబ సభ్యులు బయటకు పరుగెత్తడంతో ప్రాణాపాయం తప్పింది. దీనిపై భారత్ నుంచి తీవ్ర అభ్యంతరంతోపాటు హిందువుల భద్రతపై ఆందోళన వ్యక్తం కావడంతో బంగ్లాదేశ్ పోలీసులు స్పందించారు.

టెక్సాస్ పోషకాహార సలహా కమిటీలో పద్మజ పటేల్

హ్యూస్టన్: అమెరికాలోని టెక్సాస్ పోషకాహార సలహా కమిటీ సభ్యురాలిగా భారత సంతతికి చెందిన వైద్యురాలు పద్మజ పటేల్‌ను ఆ రాష్ట్ర గవర్నర్ గ్రెగ్ అబాట్ నియమించారు. మిడ్‌లాండ్‌కు చెందిన ఆమె 2029 సెప్టెంబరు 1 వరకు ఆ పదవిలో కొనసాగనున్నారు. ఈ కమిటీ ఆహారం, పోషకాహారం అంశాల్లో ప్రభుత్వానికి సలహాలిస్తూ, దీర్ఘకాలిక వ్యాధుల నివారణకు కృషి చేస్తుంది. భారత్‌లో జన్మించిన పటేల్.. బరోడా మెడికల్ కళాశాల నుంచి వైద్య డిగ్రీ పొందారు. అనంతరం అమెరికాలో వైద్య శిక్షణ పూర్తి చేశారు. ఆమె నర్డ్ హెల్త్‌లో చీఫ్ మెడికల్ ఆఫీసర్‌గా పని చేస్తున్నారు. అమెరికన్ కాలేజ్ ఆఫ్ లైఫ్‌స్టైల్ మెడిసిన్‌కు అధ్యక్షురాలిగా ఉన్నారు. మిడ్‌లాండ్ క్వాలిటీ ఎలయన్స్, హెల్తీ సిటీ మిడ్‌లాండ్, టెక్సాస్ మెడికల్ అసోసియేషన్, అమెరికన్ మెడికల్ అసోసియేషన్, అమెరికన్ కాలేజ్ ఆఫ్ ఫిజీషియన్స్ సంస్థల్లో వివిధ నాయకత్వ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

'ఉన్నావ్' నిందితుడి శిక్ష సస్పెన్షన్‌పై అప్పీలు

- హైకోర్టు తీర్పును తప్పుబట్టిన న్యాయవాదులు


దిల్లీ: సంచలన ఉన్నావ్ సామూహిక అత్యాచారం కేసులో బహిష్కృత భాజపా నేత కుల్దీప్ సింగ్ సెంగర్ జైలు శిక్షను సస్పెండు చేస్తూ దిల్లీ హైకోర్టు వెలువరించిన ఆదేశాలను సవాలు చేస్తూ సుప్రీం కోర్టులో అప్పీలు దాఖలైంది. హైకోర్టు ఆదేశాల అమలును నిలువరిస్తూ స్టే ఇవ్వాల్సిందిగా బాధితురాలి తరఫున పిటిషన్ దాఖలు చేసిన న్యాయవాదులు అంజలీ పటేల్, పూజా శిల్పకర్‌లు కోర్టును అభ్యర్థించారు. సెంగర్ మిగిలిన జీవిత కాలమంతా జైల్లోనే గడపాలని ట్రయల్ కోర్టు వెలువరించిన తీర్పును దిల్లీ హైకోర్టు పరిగణనలోకి తీసుకోలేదని వారు పేర్కొన్నారు. తీవ్ర నేరాలకు పాల్పడిన గత చరిత్ర కలిగిన సెంగర్‌కు విధించిన శిక్షను సస్పెండు చేయడం ద్వారా హైకోర్టు న్యాయపరంగా పొరపాటు చేసిందని న్యాయవాదులు పేర్కొన్నారు. 'నిందితుని క్రూర రీతుల్ని బహిర్గతంచేసే కీలక సాక్ష్యాల ఆధారంగా ప్రాసిక్యూషన్ ఈ కేసును నిరూపించింది. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకోవడంలో దిల్లీ హైకోర్టు విఫలమైంది. నిందితుడు కండబలాన్ని, ఆర్థిక బలాన్ని ఉపయోగించి నేరాలకు పాల్పడే ప్రవృత్తి కలిగినవాడు. బాధితురాలి తండ్రి జ్యుడీషియల్ కస్టడీలో ఉండగా అతణ్ని హతమార్చి బాధిత కుటుంబం నోరు మూయించే ప్రయత్నం చేశాడు' అని న్యాయవాదులు తమ పిటిషన్‌లో పేర్కొన్నారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఉన్నావ్ జిల్లాలో 2017లో 17 సంవత్సరాల బాలికపై సామూహిక అత్యాచారం జరిగింది. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన అప్పటి భాజపా నేత కుల్దీప్ సెంగర్ ఆ కేసులో ప్రధాన నిందితుడు. అతడిపై ఫిర్యాదు చేసిన బాలిక తండ్రిపైనే ఉత్తర్‌ప్రదేశ్ పోలీసులు కేసు పెట్టి నిర్బంధించారు. ఆయన పోలీసు నిర్బంధంలోనే మరణించారు. మృతుడు చిత్రహింసలకు గురైనట్లు పోస్టుమార్టం నివేదిక పేర్కొంది. ఈ నేపథ్యంలో కేసు జాతీయ స్థాయిలో సంచలనమైంది.

న్యాయపరిభాష కక్షిదారుకు అర్థంకావాలి: అఖిలేశ్

మరోవైపు కోర్టు విచారణ ఆంగ్లంలో జరగడంవల్ల తనకేమీ అర్థం కాలేదంటూ ఉన్నావ్ అత్యాచార బాధితురాలు వాపోవడంపై సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ ఆందోళన వ్యక్తం చేశారు. న్యాయ పరిభాష కక్షిదారుడికి అర్థమైనప్పుడే న్యాయం జరుగుతుందని స్పష్టం చేశారు.

'రామచరిత మానస్'కు బుందేలీ భాషలో లాల్‌ఖాన్ అనువాదం

ఈటీవీ భారత్: సంస్కృతంలోని వాల్మీకి రామాయణం స్ఫూర్తితో తులసీదాస్ అవధీ భాషలో 'రామచరిత మానస్' రాయగా.. దీనిని ముస్లిం సామాజిక వర్గానికి చెందిన లాల్‌ఖాన్ బుందేలీ భాషలోకి అనువదించారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఝాన్సీ జిల్లా బిజ్నా గ్రామానికి చెందిన లాల్‌ఖాన్ 'ఈటీవీ భారత్'తో మాట్లాడారు. "బాల్యం నుంచే రామాయణం నా జీవితంలో భాగమైపోయింది. హిందు, ముస్లిం తేడాలు నాకు తెలియదు. రామచరిత మానస్‌ను స్థానిక భాషలోకి అనువదిస్తే ఎక్కువమంది చదువుతారన్న గురువు ఆజ్ఞతో ఈ పనిని పూర్తి చేశాను. దీనికి మూడేళ్లు పట్టింది. మనమందరం సామరస్యంగా బతకడం పూర్వీకులు నేర్పారు. దీన్ని ముందు తరాలకు అందించాలి" అన్నారు. రామాయణ పారాయణం, రామ్‌లీలా ప్రదర్శన, భజనలు పాడటం తన తల్లిదండ్రుల నుంచి వారసత్వంగా వచ్చిందని అంటారాయన. ఓ ప్రయివేటు కంపెనీలో పనిచేస్తున్న లాల్‌ఖాన్ తన బాల్యంలో వినోబాభావే భూదాన్ ఉద్యమంలోనూ పాల్గొని పాటలు పాడారు.





వరదల కారణంగా రహదారిపై బురద పేరుకుపోవడంతో కూరుకుపోయిన కారు

కాలిఫోర్నియాను ముంచెత్తిన వరదలు

లాస్ ఏంజెలెస్: అమెరికాలోని కాలిఫోర్నియా రాష్ట్రాన్ని తుపాను వణికిస్తోంది. ముఖ్యంగా దక్షిణ భాగంలో బలమైన ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలు కురవడంతో వరదలు ముంచెత్తాయి. దీంతో లోతట్టు ప్రాంతాలు నీటమునిగాయి. లాస్ ఏంజెలెస్‌కు ఈశాన్యంగా 80 మైళ్ల దూరంలో ఉన్న శాన్ గాబ్రియేల్ పర్వత ప్రాంతంలోని రైట్‌వుడ్‌లోకి వెళ్లే రోడ్లు బురదమయం అయ్యాయి. అందులో వాహనాలు చిక్కుకుపోయాయి. అక్కడి వారిని రక్షించి సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు అధికారులు తెలిపారు. ప్రజలు ఇళ్లను ఖాళీ చేయాలని ఆదేశించారు. పలు కౌంటీల్లో మట్టి చరియలు విరిగిపడటంతో ప్రధాన రహదారులను మూసివేశారు. సుమారు లక్ష ఇళ్లకు విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. వరద సంబంధ ఘటనలతో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు.